www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

శుక్రవారం | 5-1-2018 | పేజీలు: 18 + 20 | వెల: రూ.5.00 | సంపుటి: 14 సంచిక: 175 | శ్రీహేవళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: చవితి రా. 7.00 వరకు తదుపరి పంచమి; నక్షత్రం:మఖ రా.2.16 వరకు తదుపరి పుబ్బ; వర్జ్యం: మ.3.05-4.34; దుర్ముహూర్తం: ఉ.9.03-9.47, మ.12.43-1.27; అమృతఘడియలు: రా.12.01-1.31; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 5.51 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

ఇసుక మాఫియా
మారణకాండ

అక్రమ రవాణాను అడ్డుకున్న వీఆర్‌ఏను ట్రాక్టర్‌తో తొక్కించారు

చూస్తుండగానే హత్య చేశారు

ప్రత్యక్ష సాక్షుల కథనం

కామారెడ్డి జిల్లా కారేగాంలో ఘోరం

రెండున్నర లక్షలిస్తాం.. నోరు తెరవొద్దు

వీఆర్‌ఏ ప్రాణానికి వెలకట్టిన ఇసుకాసురులు

కుటుంబసభ్యులతో టీఆర్‌ఎస్ నేతల చర్చలు!

కేసును పక్కదోవ పట్టించేందుకు ప్రయత్నాలు

ఇటుక ట్రాక్టర్ ఢీకొట్టిందంటున్న పోలీసులు

దందాను ఆపాలంటూ కేటీఆర్ ఆదేశాలు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కామారెడ్డి/నిజామాబాద్/బాన్సువాడ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఇసుకాసురులు బరి తెగించారు! తమ అక్రమాన్ని అడ్డుకున్న గ్రామ కాందార్ (విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్-వీఆర్‌ఏ)ను ఇసుక ట్రాక్టర్‌తో గుద్దించి చంపేశారు. కామారెడ్డి జిల్లా పిట్లం మండలం కారేగాం శివార్లలో జరిగిందీ ఘోరం. కారేగాం గ్రామానికి చెందిన బోయిని సాయిలు (36) మార్తాండ గ్రామానికి కాందార్‌గా పనిచేస్తున్నారు. మండలంలో స్థానికంగా ఉండే కొందరు కారేగాం శివారులో గల కాకి వాగులోంచి ట్రాక్టర్లద్వారా కొన్నిరోజులుగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఈ విషయం తెలిసిన కాందార్ సాయిలు బుధవారం అర్ధరాత్రి అక్కడికి చేరుకుని.. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. వారు ట్రాక్టర్‌ను ఆపకుండా ఆయన మీదకు పోనివ్వడంతో సాయిలు అక్కడికక్కడే మృతి చెందారని

మిగతా 8వ పేజీలో...


ఇసుక లారీలపై కొరడా

భూపాలపల్లి జిల్లాలో ఓవర్‌లోడ్‌తో

వెళ్తున్న 15 ఇసుక లారీల పట్టివేత

వరంగల్‌జిల్లా వర్ధన్నపేట మండలంలో

12 ట్రాక్టర్లు సీజ్ 8



లావాదేవీలు 9

భద్రమేనా?

232 బ్యాంకింగ్ యాప్స్‌పై మాల్‌వేర్ దాడి

స్టేట్ బ్యాంక్, ఐసీఐసీఐ యాప్‌లకు కూడా..

ఫేక్ ఫ్లాష్ ప్లేయర్ యాప్ ద్వారా హ్యాకింగ్

వణికిస్తున్న సీపీయూ బగ్స్

ఇంటెల్, ఏఎండీ, ఏఆర్ఎం చిప్‌లో దోషాలు!

కోట్లాది పీసీలు, స్మార్ట్‌ఫోన్లపై ప్రభావం 14

పాస్‌వర్డ్‌లు, బ్యాంకు డేటా ఈజీగా హ్యాక్!



12

ఆధార్ డేటా ఖరీదు రూ.500!

అందుబాటులో లక్షలాది మంది వివరాలు

300కు నకిలీ ఆధార్ తయారీ సాఫ్ట్‌వేర్

ఆంగ్ల పత్రిక పరిశోధనలో బట్టబయలు

డేటా లీక్ కట్టు కథ: యూఐడీఏఐ



సహాయకుడితో కలిసి గురువారం ఉదయం వాకింగ్ చేస్తున్న జన్నత్ హుస్సేన్

• అదో లోకం.. అదే స్వర్గం

మేధస్సుకు విశ్రాంతి

జ్ఞాపకశక్తి కోల్పోయిన జన్నత్ హుస్సేన్

40 ఏళ్ల సేవల్ని మరచిపోయిన ఐఏఎస్

సూళ్లూరుపేట/నెల్లూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సుమారు వారం రోజుల క్రితం... నెల్లూరు జిల్లా ఏఎస్‌పేట రహ్మతాబాద్ దర్గాకు హైదరాబాద్‌కు చెందిన ముస్లిం ఉన్నతాధికారి ఒకరు వెళ్లారు! దర్గా దర్శనానికి వెళ్లిన ఆయనకు ఒక వ్యక్తి, పక్కనే తన సహాయకుడితో కలిసి కనిపించారు. ఆయనను చూడగానే... ముస్లిం ఉన్నతాధికారి ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. 'సలాం అలేకుమ్...

మిగతా 8వ పేజీలో...

10 మంది పాక్ 14

జవాన్లు హతం!

పాకిస్థాన్‌పై బీఎస్ఎఫ్ ప్రతీకారం

రెండు సైనిక శిబిరాల ధ్వంసం

ప్రయోగాలు.. పైసా వసూల్



ఇంటర్ ప్రాక్టికల్స్‌లో భారీ దందా

విద్యార్థులకు రికార్డులేవ్వు.. వైవా ఉండదు

పర్యవేక్షకులకు కాలేజీల మామూళ్లు

ఏటా 7-8 కోట్ల రూపాయల దందా

కార్పొరేట్ కాలేజీల్లో బోనస్‌గా మందు

'వసూళ్ల' భారమంతా విద్యార్థులపైనే

అన్నీ తెలిసి కూడా ఇంటర్ బోర్డు మౌనం

హైదరాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): జూనియర్ కాలేజీల్లో ప్రాక్టికల్స్ అనే పదం కనిపించేది అకడమిక్ కేలండర్‌లో మాత్రమే! విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహణ, రికార్డుల పరిశీలన ఉండదు. అసలు వైవానే ఉండదు. క్లాసుల నుంచి రికార్డుల నిర్వహణ, పరీక్షల్లో మార్కుల దాకా అంతా కాలేజీ యాజమాన్యాలు, పర్యవేక్షకులే చూసుకుంటారు! యాజమాన్యం విద్యార్థులకు మార్కులు వేస్తే.. గుడ్డిగా సంతకం చేయడమే పర్యవేక్షుల విధిగా మారిపోయింది. ఇదంతా ఉత్త పుణ్యానికే జరుగుతుందనుకుంటే పొరపాటే. ఇంటర్ విద్యలో ప్రాక్టికల్స్.. అధికారులు, అధ్యాపకులకు కాసుల వర్షం కురిపించే వ్యవస్థగా మారింది. ప్రాక్టికల్స్ పేరిట ఏటా భారీ దందా సాగుతోంది. ప్రయోగ పరీక్షలకు

మిగతా 11వ పేజీలో...

ఫీజులు పెంచొద్దు

ఈ విద్యాసంవత్సరం ఫీజులే వచ్చేసారి కూడా

తదుపరి ఉత్తర్వులు వచ్చే దాకా అమలు

ప్రైవేటు పాఠశాలలకు సర్కారు ఆదేశం 11

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

స్థిరాస్తుల 11

తనఖా చెల్లదు!

నగదు డిపాజిట్ చేయాల్సిందే

రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ ఆదేశం

చిట్‌ఫండ్ కంపెనీలకు షాక్

ఆర్టీసీ ఆధిపత్యానికి

చుక్కెదురు!

గుదిబండగా కేంద్ర రవాణా చట్టం

రూట్ల వేలంలో ప్రైవేటుతోపాటు పాల్గొనాల్సిందే

పొరుగు రాష్ట్రాలతో ఒప్పందాలకు చెల్లుచీటీ

ఆల్ ఇండియా పర్మిట్‌తో అదనపు వాయింపు

ఆటోలు, క్యాబ్‌ల దందా ఇక అధికారికం

నేడు ఆర్టీసీ యూనియన్ల నిరసనలు



హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే లోక్‌సభ ఆమోదం పొందిన 'మోటారు వాహన చట్టం (సవరణ) బిల్లు-2017'ను కేంద్ర ప్రభుత్వం రాజ్యసభలో ప్రవేశపెట్టింది. పెద్దల సభలో గట్టెక్కితే ఇది చట్టం రూపంలో అమల్లోకి రానుంది. ఇది ఆర్టీసీకి గుదిబండగా మారనుంది. రవాణా శాఖ ఉసురు తీయనుంది. ప్రయాణికుల తాట తీయనుంది. రాష్ట్రాల ఆదాయానికి గండి పెట్టనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఆర్టీసీ తనకు అవసరమైన రూట్లను ఎంపిక చేసుకుని బస్సులను నడుపుతోంది. రవాణా శాఖ కార్యాలయం నుంచి అవసరమైన పర్మిట్లను సునాయాసంగా పొందుతోంది. ప్రైవేటు ఆపరేటర్లకు ఈ విషయంలో ఎలాంటి హక్కులూ ఉండవు. కేంద్ర చట్టంతో ఆర్టీసీ తన ఏకచ్ఛత్రాధిపత్యాన్ని కోల్పోనుంది. దీని ప్రకారం.. ఏదేని రూట్‌లో అనుమతి పొందాలంటే ప్రైవేటు ఆపరేటర్లతో ఆర్టీసీ కూడా పోటీ పడాలి. వేలం పాటల్లో పాల్గొనాలి. ఎవరు ఎక్కువ పాట పాడి రూట్‌ను దక్కించుకుంటే.. వారికే ఆ రూట్‌లో బస్సులను నడిపే హక్కులుంటాయి. ఇది ఆర్టీసీకి ఆర్థిక భారంగా పరిణమించనుంది. ప్రైవేటు ఆపరేటర్లతో పోటీ పడి రూట్లను దక్కించుకోవడం ఆర్టీసీకి కష్టమే. ఇక, ప్రైవేటు ఆపరేటర్లు తమ బస్సులకు 'ఆల్ ఇండియా పర్మిట్లు' పొంది దేశవ్యాప్తంగా

మిగతా 11వ పేజీలో...

'సహకార' మార్పులు

ఎన్నికలకు కొత్త నియమావళి 8

ఫొటోలతో ఓటర్ల జాబితా

అభ్యర్థుల ఆధార్, పాన్ తప్పనిసరి

ఎస్సీ/ఎస్టీ, మహిళలకు రిజర్వేషన్లు

విచ్చలవిడి ఖర్చుకు ఇక చెల్లు



పట్టపగలే దారి దోపిడీ

కత్తితో బెదిరించి బైక్ చోరీ 2

జూబ్లీహిల్స్‌లో దుండగుల అరాచకం

బలి వందనం.. భగవంతునికి బంధనం





దేవ దానవ సంగ్రామంలో బలి మరణించాడు. దైత్య గురువు శుక్రుడు మృతసంజీవని విద్యతో అతన్ని బ్రతికించాడు. బలి గురువుని త్రికరణ శుద్ధిగా సేవించాడు. శిష్యుని గురుభక్తికి మెచ్చి శుక్రుడు అతనిచే విశ్వజిత్ యాగం చేయించాడు. తత్ఫలితంగా బలికి అనేక దివ్యశక్తులు లభించాయి. శక్తులు, సిద్ధులు ఉన్నవారు ఖాళీగా కూర్చోలేరు. వాటి ప్రదర్శనకు, ప్రయోగానికి తహతహలాడతారు. అలా బలికి స్వర్గం మీద ఆశ పుట్టింది. రాగల సావర్ణి మన్వంతరంలో ఇంద్రుడు కావాల్సిన బలి.. శుక్రబలంతో గర్వించి ముందుగానే స్వర్గాన్ని ఆక్రమించాడు. అధార్మికులు, దుష్టులు, ప్రాణి ద్రోహులు, రహస్యంగా అపకారం చేసేవారు, గర్విష్టులు, కాముకులు, లోభులు- ఈ ఏడు దోషాలు లేనివారే స్వర్గలోకం పొందగలరు. బలి చేరగలిగాడంటే ఈ దోషాలు లేనట్లేగా! బలి సజ్జనుడు, గురుభక్తుడు, సత్యసంధుడు, ధార్మికుడు, అన్నిటినీ మించి గొప్పదాత. కానీ సంపద, సామ్రాజ్యం బలికి అహంకార కారణమైంది. బలి దురభిమానాన్ని తొలగించడమే 'త్రివిక్రమ' లీలా పరమార్థం. నవవిధ భక్తులలో చివరిది 'ఆత్మనివేదన' భక్తి. దీనికి దృష్టాంతం బలి గాథ. బలి 3 అడుగుల దాన సంకల్పం చెయ్యగానే వామనుడు విశ్వరూపుడయ్యాడు. ఒక పాదంతో భూమిని కొలిచాడు. రెండవ పాదం సత్యలోకం చేరింది. 3వ పాదం ఉంచడానికి బలి దంటూ ఏమీ మిగల్లేదు. బలికి భగవల్లీలా పరమార్థం తెల్సింది. 'స్వామీ! నా ఇహ-పరాల పుణ్యఫలాలు అర్పించాను. కాని, నా 'అహం' ఇంకా నా వద్దే, నాతోనే ఉంది. అదే నాకు బంధన కారణమైంది. దాన్ని కూడా అర్పిస్తేగాని నా దానం, సమర్పణ సంపూర్ణం కాదు. పూర్ణాహుతి కాదు. కాన, మీ మూడవ పాదం నా తలపై పెట్టండి" అని ప్రార్థించి తల వంచి వందనం చేశాడు! ఇదే ఆత్మనివేదనం. దీంతో.. బలిని మోసగించాలని వచ్చి భగవంతుడు అజేయమైన వైష్ణవ మాయను జయించాడని బలిని కీర్తించాడు. ఇంద్రునికి స్వర్గ రాజ్యమిచ్చి బలికి తనను తానే ఇచ్చుకొన్నాడు. సుతల లోకంలో బలి భవనానికి ద్వారపాలకుడై శాశ్వతంగా బద్ధుడయ్యాడు! భగవంతుణ్ని, భక్తుణ్ని (ప్రహ్లాదుని)- ఇద్దరినీ తన వద్దకు చేర్చుకున్న బలి భాగ్యమే భాగ్యం! స్వామి (యాచకుడు) బ్రహ్మాండమంతా ఆక్రమించినా బలి మహాదాతగా అంతకన్నా రెండంగుళాలు అధికంగానే మనకు దర్శనమిస్తాడు.

-తంగిరాల రాజేంద్ర ప్రసాద శర్మ

Paramjyothi పరంజ్యోతి

అనంతుడి సేవలో జడ్జిల భార్యలు



వికారాబాద్ జిల్లా అనంతగిరిలో కొలువైన శ్రీ అనంత పద్మనాభ స్వామిని గురువారం ఉమ్మడి రాష్ట్రాల హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రమేశ్ రంగనాథన్ సతీమణి కల్పన దర్శించుకున్నారు. ఆమెతో పాటు హైకోర్టులో పనిచేసే పలువురు ఇతర న్యాయమూర్తుల సతీమణులు కూడా స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు, అధికారులు వారికి స్వాగతం పలికారు.

-అనంతగిరి

పట్టపగలే దారి దోపిడీ

- కత్తితో బెదిరించి బైక్ చోరీ
- జూబ్లీహిల్స్‌లో దుండగుల అరాచకం

బంజారాహిల్స్/హైదరాబాద్, జనవరి 4: అది జూబ్లీ హిల్స్ రోడ్డు నంబరు 10. బుధవారం ఉదయం 11.45 గంటల సమయం. వాహనాల రద్దీ భారీగానే ఉంది. అప్పుడే ఒక యువకుడు తన స్నేహితుడితో కలిసి బైక్‌పై వచ్చి రోడ్డు పక్కన ఆపాడు. స్నేహితుడిని అక్కడే ఉంచి పనికోసం ఆఫీసులోకి వెళ్లాడు. వెంటనే ముగ్గురు దుండగులు అక్కడికి వచ్చి అతడి స్నేహితుడిని నెట్టేసి బైక్‌తో ఉడాయించారు. బేగంపేటలో నివసించే యాదగిరి బంజారాహిల్స్ రోడ్డు నం.12 లోని బాలాజీ డిస్ట్రిబ్యూటర్స్‌లో ఆఫీసుబాయ్‌గా పనిచేస్తున్నాడు. ప్రతిరోజూ ఆఫీసుకు సంబంధించిన చెక్కులు, ఇతర ఫైల్స్‌ను జూబ్లీహిల్స్ రోడ్డు నం.10లోని సాగర్ సిమెంట్స్‌కు చేరవేస్తూ ఉంటాడు. రోజూలాగే బుధవారం ఆఫీసు నుంచి సాగర్ సిమెంట్స్‌కు తన ఎఫ్‌జడ్(టీఎస్09ఈడబ్ల్యు 8970)పై వచ్చాడు. మధ్యలో స్నేహితుడు రాజేంద్రమిశ్రాను ఎక్కించుకున్నాడు. వాహనాన్ని సాగర్ సిమెంట్స్ ఎదురు రోడ్డులో నిలిపాడు. స్నేహితుడిని వాహనం వద్దే ఉంచి కార్యాలయంలోకి వెళ్లాడు. బయటకొచ్చేప్పుడు దుండగులు తన వాహనాన్ని తీసుకెళ్లేందుకు యత్నిస్తున్నట్టు గమనించాడు. పరుగులు పెడుతూ వాహనం వద్దకు వచ్చి దుండగులను ఎదురించాడు. ఓ దుండగుడు కత్తి చూపించి చంపేస్తానని బెదిరించాడు. హెల్మెట్‌ను రక్షణ కవచంగా చేసుకొని వారిని అడ్డగించే ప్రయత్నం చేశాడు. కానీ, దుండగులు జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు మీదుగా సికింద్రాబాద్ వైపు పారిపోయినట్లు సీసీ ఫుటేజీ ద్వారా తెలిసింది. బాధితుడి ఫిర్యాదుతో జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. రాజేంద్రను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.



దొంగిలించిన వాహనంపై పారిపోతున్న దుండగులు





యాదగిరి(ఎర్ర రంగు చొక్కా)ని బెదిరిస్తున్న దుండగుడు, వాహనాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్న యాదగిరి

గజల్ శ్రీనివాస్ బెయిల్ పిటిషన్ కొట్టివేత

- పోలీసుల కస్టడీ పిటిషనూ డిస్మిస్

హైదరాబాద్ సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపుల కేసులో అరెస్టయి చంచల్‌గూడ జైల్లో ఉన్న గజల్ శ్రీనివాస్‌కు కోర్టులో చుక్కెదురయ్యింది. ఆయన బెయిల్ పిటిషన్‌ను నాంపల్లి కోర్టు గురువారం తిరస్కరించింది. దీంతో మరో సీనియర్ న్యాయవాది ద్వారా గజల్ శ్రీనివాస్ శుక్రవారం కోర్టులో బెయిల్ పిటిషన్‌ను వేయనున్నట్లు సమాచారం. మరోవైపు పంజగుట్ట పోలీసులు విచారణ నిమిత్తం నిందితుడిని పోలీస్ కస్టడీకి ఇవ్వాలంటూ కోర్టులో వేసిన కస్టడీ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. వీడియోలతో సహా అన్ని ఆధారాలుండగా మళ్లీ కస్టడీ అవసరమేంటని కోర్టు పోలీసులను ప్రశ్నించింది. విచారణకు సంబంధించిన విషయాలన్నీ రిమాండ్ రిపోర్టులో వివరించిన తర్వాత... రికవరీ లాంటి ఎలాంటి అవసరం లేనప్పుడు కస్టడీ ఎందుకని న్యాయమూర్తి ప్రశ్నించారు. కస్టడీ పిటిషన్‌ను కోర్టు డిస్మిస్ చేసినట్లు పంజగుట్ట ఏసీపీ తెలిపారు. ఈ కేసులో రెండో ముద్దాయిగా ఉన్న పార్వతిని ఇంకా అరెస్టు చేయలేదని, విచారణ నిమిత్తం ఆమెకు నోటీసులు జారీ చేయడానికి ప్రయత్నించినా స్వీకరించడానికి ఆమె అందుబాటులో లేరని ఏసీపీ తెలిపారు. గజల్ శ్రీనివాస్ బాధితులు ఇంకా ఎవరైనా ఉంటే ముందుకు వచ్చి ఫిర్యాదులు చేయాలని పోలీసులు కోరారు.

గజల్‌పై వ్యాఖ్యలకు సిగ్గుపడుతున్నా!

- ఏపీ మంత్రి మాణిక్యాలరావు

తాడేపల్లిగూడెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గజల్ శ్రీనివాస్‌కు మద్దతుగా చేసిన వ్యాఖ్యలను దేవాదాయశాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు వెనక్కి తీసుకున్నారు. అమ్మ, నాన్నల ప్రాధాన్యాన్ని, దేశఖ్యాతిని పెంచేలా పాటలు పాడటం వల్ల గజల్ శ్రీనివాస్ అంటే అభిమానం ఉండేదని మంత్రి అన్నారు. అందుకే ఆయనపై వచ్చిన ఆరోపణలను ఖండించానని, కానీ వాస్తవం తెలిశాక గజల్ శ్రీనివాస్‌కు మద్దతుగా మాట్లాడినందుకు సిగ్గుపడుతున్నానని గురువారం మీడియా ఎదుట పేర్కొన్నారు. మహిళలపట్ల అతని వికృత చర్యలు తననెంతో తీవ్రంగా బాధించాయన్నారు. గజల్ శ్రీనివాస్‌ను నాణేనికి ఒకవైపు చూశానే తప్పా, రెండో వైపు ఆయన ప్రవర్తన జుగుప్సాకరంగా ఉందన్నారు. అటువంటి వ్యక్తులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని మంత్రి మాణిక్యాలరావు సూచించారు.

యాంకర్ ప్రదీప్ ఎక్కడ?

- డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడినప్పటి నుంచి అజ్ఞాతంలో



హైదరాబాద్ సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): టీవీ యాంకర్ ప్రదీప్ ఎక్కడ? గురువారం కూడా అతడు కౌన్సెలింగ్‌కు హాజరు కాలేదు. నూతన సంవత్సర వేడుకల రాత్రి హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45లో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ప్రదీప్ పట్టుబడ్డాడు. అతడు అధిక మోతాదులో మద్యం తాగినట్టు (178ఎంజీ/100ఎంల్) పరీక్షలో తేలింది. అప్పటికప్పుడు ప్రదీప్ వాహనాన్ని సీజ్ చేసిన పోలీసులు.. బేగంపేట ట్రాఫిక్ కౌన్సెలింగ్ సెంటర్‌లో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని చెప్పి వదిలేశారు. మరో కారు ద్వారా అక్కడి నుంచి వెళ్లి పోయిన ప్రదీప్ సోమ, మంగళవారాల్లో కౌన్సెలింగ్‌కు హాజరవుతాడని పోలీసులు భావించారు. అయితే గురువారం వరకు కూడా అతడు కౌన్సిలింగ్‌కు హాజరు కాకపోవడంతో అనుమానాలు తలెత్తుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. మరోవైపు అతడు ఇంట్లోలేడని, ఫోన్ కూడా స్విచాఫ్ చేసి ఉందని సమాచారం. ఈ విషయమై ట్రాఫిక్ కమిషనర్ రవీందర్‌ను సంప్రదించగా.. సిటీలో చిక్కిన 1477 మంది మందుబాబుల్లో అతనొకరని, ఇచ్చిన గడువులోపు హాజరయ్యే అవకాశముందన్నారు. సాధారణంగా డ్రంకెన్ డ్రైవ్‌లో చిక్కినవారు జీవిత భాగస్వాములతో కౌన్సిలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుందని, అయితే బేగంపేట కౌన్సిలింగ్ సెంటర్‌లో ఉన్న స్థలాభావం వల్ల రోజుకు 50 మందికి చొప్పున కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ఒకవేళ గడువు లోపు కౌన్సిలింగ్‌కు హాజరు కాకుంటే చార్జిషీట్ దాఖలుకు చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ పోలీసులు చెప్పారు.

సంక్రాంతికి సినిమా టిక్కెట్ల ధరల పెంపునకు హైకోర్టు అనుమతి

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సీజన్‌కు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో రిలీజ్ అయ్యే సినిమాలకు టిక్కెట్ల ధరలు పెంచుకోడానికి థియేటర్ల యాజమాన్యాలకు హైకోర్టు అనుమతించింది. ప్రదర్శనకు తీసుకునే సినిమాలకు భారీగా నిధులు ఖర్చు చేయాల్సి వస్తుంది కాబట్టి, టిక్కెట్ల ధరలు పెంచుకోడానికి అనుమతించాలంటూ రెండు రాష్ట్రాల్లోని పలు థియేటర్లు హైకోర్టును ఆశ్రయించాయి. ఈ వ్యాజ్యాలను విచారించిన హైకోర్టు....గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులనే పునరుద్ఘాటించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీ భట్ ఆదేశాలు జారీచేశారు. గతంలో జడ్జి ఇచ్చిన ఉత్తర్వులనే సంక్రాతి సీజన్‌కు వర్తింప జేశారు. థియేటర్ల యజమాన్యాలు పెంచనున్న టిక్కెట్ల ధరల వివరాలు అధికారులకు తెలపాలని స్పష్టం చేశారు. టిక్కెట్ల పెంపువల్ల చేకూరిన ఆదాయాన్ని ప్రత్యేక అకౌంట్లలో థియేటర్ల యాజమాన్యాలు చూపాల్సిన అవసరం లేదన్నారు. పెంచిన టిక్కెట్ల ధరలకు అనుగుణంగా పన్నులు చెల్లించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.



కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న స్వాములు

మాలధారుడిపై చేయిచేసుకున్న పోలీసు

- కామారెడ్డిలో అయ్యప్ప స్వాముల ఆందోళన
- హైదరాబాద్‌లో దీక్ష తీసుకున్న విద్యార్థికి అవమానం

నస్రుల్లాబాద్/రాంనగర్/హైదరాబాద్, జనవరి 4: భక్తి శ్రద్ధలతో అయ్యప్ప దీక్ష తీసుకుంటున్న స్వాములకు పలు చోట్ల ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం దుర్కికి చెందిన సావిత్రిబాయి, బాలకృష్ణలు ఇంటి పక్క వారు గొడవ పడటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం బాలకృష్ణ (అయ్యప్ప మాల వేసుకున్నారు) స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదుపై వాకబు చేశారు. ఫిర్యాదు పత్రాన్ని ఫొటో తీసుకునేందుకు ప్రయత్నించగా.. అక్కడే ఉన్న హెడ్‌కానిస్టేబుల్ అజ్మత్ బాలకృష్ణపై చేయిచేసుకున్నాడు. బాధితుడు తోటి స్వాములతో విషయం చెప్పాడు. అయ్యప్ప స్వాములతో బీజేపీ, ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు నస్రుల్లాబాద్ చేరుకొని ప్రధాన రహదారిపై బైఠాయించారు. అజ్మత్‌ను ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేస్తున్నట్లు డీఎస్పీ నర్సింహారావు చెప్పడంతో స్వాములు ఆందోళన విరమించారు. కాగా హైదరాబాద్ చిక్కడపల్లిలోని సెయింట్ ఆడమ్స్ హైస్కూల్‌లో 4వ తరగతి చదువుతున్న ధవళేష్ అయ్యప్ప మాల ధరించాడు. యూనిఫాం వేసుకుంటేనే పాఠశాలకు రానిస్తామని చెప్పడంతో ధవళేష్ యూనిఫాం వేసుకొని వెళుతున్నాడు. బూట్లు వేసుకోకపోతే పరీక్ష రాయనివ్వబోమని స్కూల్ యాజమాన్యం స్పష్టం చేసింది. దీనిపై విద్యార్థి బాబాయి, మరికొందరు స్వాములు వెళ్లి నిలదీయడంతో ధవళేష్‌ను పరీక్ష రాసేందుకు అనుమతించారు.

టీఎస్పీఎస్సీ వెబ్‌సైట్లో.. పీజీటీ అభ్యర్థుల మార్కులు

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పీజీటీ, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల మార్కుల వివరాలను టీఎస్పీఎస్సీ గురువారం తన వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేసింది. కాగా.. టీఎస్పీఎస్సీ ఛైర్మన్ ఘంటా చక్రపాణి, సభ్యులు విఠల్ తదితరులు కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని గవర్నర్ నరసింహన్‌ను రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు జారీ చేసిన నోటిఫికేషన్లు, భర్తీ చేసిన పోస్టులు, వివిధ దశల్లో ఉన్న పోస్టుల వివరాలను వారు గవర్నర్‌కు తెలిపారు.

లోకం తీరు



నేను నీ సీనియర్‌ని నన్ను ఫాలో కా !

ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	06.0	28.9
వరంగల్	13.0	30.0
ఖమ్మం	14.0	31.0
హైదరాబాద్	14.3	29.3
నల్లగొండ	15.4	29.0

నేడు అతి శీతల గాలులకు అవకాశం

హైదరాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గత రెండు రోజులుగా తగ్గుముఖం పట్టిన చలి.. గురువారం పెరిగింది. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడ శీతల, అతి శీతల గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆదిలాబాద్‌లో గురువారం ఉదయం ఉష్ణోగ్రత 6 డిగ్రీల మేర నమోదవగా.. భద్రాచలంలో 9, ఖమ్మంలో 10.6, మెదక్‌లో 11.3, రామగుండంలో 12 డిగ్రీల మేరకు రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హన్మకొండ, మెదక్‌లలో 3, రామగుండం, నల్లగొండల్లో 2 డిగ్రీ మేరకు సాధారణం కంటే తక్కువగా రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.


కళ్లు తెరిచే కలలు కంటా



నేను కళ్లు తెరిచే కలలు కంటాను. అవి ఆచరణలోకి తీసుకొచ్చేందుకు, కలలను నిజం చేసేందుకు కష్టపడతాను. అందువల్లే మధ్యప్రదేశ్ అభివృద్ధి చెందుతోంది.

- మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్

సామాజిక స్పృహ లేని వారే నిజమైన అంధులు



సామాజిక స్పృహ లేని వారే నిజమైన అంధులు. కంటిని తృప్తిపర్చడం కోసం మనిషి విలాస జీవితంలో 95 శాతం గడుస్తుంది. మన ఆర్భాటాలను తగ్గించుకుని అంధులకు సేవ చేయాలి. మానవ సేవయే మాధవసేవగా భావించాలి.

- త్రిదండి చినజీయర్ స్వామి

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.74.09	పాత ధర 65.06
కొత్త ధర రూ.74.11	కొత్త ధర 65.12
పెరుగుదల : 2 పైసలు	పెరుగుదల : 6 పైసలు

మద్యంతో కేన్సర్ ఎలా వస్తుందంటే..

లండన్: మద్యం సేవిస్తే ఏడు రకాల కేన్సర్లు వస్తాయి. అయితే, అవి ఎలా వస్తాయో తెలుసుకునేందుకు యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్ శాస్త్రవేత్తలు పరిశోధనలు జరిపారు. తమ పరిశోధనలో ఆల్కాహాల్ సేవించడం వల్ల కొత్త రక్తాన్ని పుట్టించే మూలకణాల డీఎన్ఏ శాశ్వతంగా దెబ్బతింటాయని గుర్తించారు. దెబ్బతిన్న ప్రాంతాన్ని డీఎన్ఏ బాగుచేసుకునేప్పుడు కొన్నిసార్లు సరైన క్రమంలో నిర్మితం కాకపోవడం వల్ల నోటి, గొంతు, స్వరపేటిక, అన్నవాహిక, రొ మ్ము, కాలేయ, పేగు కేన్సర్లు వస్తాయని పరిశోధకులు తెలిపారు.

కృత్రిమ గర్భధారణకు 'స్పార్టన్' తోడు

బోస్టన్: సంతానం లేని లక్షలాది మంది దంపతులకు కల్పతరువు టెస్ట్ ట్యూబ్ బేబీ(ఇన్ విట్రో ఫర్టిలైజేషన్). అయితే, ఐవీఎఫ్ సత్ఫలితాల రేటును పెంచేందుకు అమెరికాలోని వార్సెస్టర్ పాలిటెక్నిక్ ఇనిస్టిట్యూట్, స్టాన్‌ఫర్డ్ వర్సిటీకి చెందిన భారత సంతతి శాస్త్రవేత్తతో సహా పలువురు పరిశోధకులు 'సింపుల్ పీరియాడిక్ ఏఅర్ రే ఫర్ ట్రాపింగ్ అండ్ ఐసోలేషన్(స్పార్టన్)' అనే పరికరాన్ని తయారు చేశారు. ఈ పరికరం చురుకైన, ఆరోగ్యకరమైన శుక్రకణాలను గుర్తించి.. దానితో అండం ఫలదీకరణం చెందించి మహిళ గర్భాశయంలో ప్రవేశపెట్టి ఐవీఎఫ్ సక్సెస్ రేటును పెంచవచ్చని పరిశోధకులు వెల్లడించారు.

మెదడువాపు చికిత్సకు వైరస్ సాయం

లండన్, జనవరి 4: మెదడువాపు, రొమ్ము కేన్సర్ల కణితులను నాశనం చేయడానికి వైరస్‌లను ఉపయోగించవచ్చని శాస్త్రవేత్తలు అంటున్నారు. ప్రకృతిసిద్ధంగా ఉత్పత్తి అయ్యే 'రియోవైరస్'ను నేరుగా రక్తంలోకి పంపి, వ్యాధి నిరోధక శక్తిని పెంచి కణితులను అంతమొందించవచ్చని లండన్‌కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ లీడ్స్, ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కేన్సర్ రీసెర్చ్ పరిశోధకులు తెలిపారు.



గుట్ట పైకి రోడ్డు మార్గం (ఇన్‌సెట్‌లో) బయోమెట్రిక్

పింఛను కోసం గుట్ట పైకి!

చండూరు, జనవరి 4: వృద్ధులైనా.. దివ్యాంగులైనా.. పింఛను కావాలంటే రెండు కిలోమీటర్లు నడవాలి! ఆపై గుట్టపైకి వెళ్లాలి! అక్కడ ఏర్పాటు చేసిన బయో మెట్రిక్‌పై వేలిముద్ర వేస్తేనే ఆ నెలకు పింఛను! నల్లగొండ జిల్లా చండూరు మండలం తుమ్మలపల్లిలో పరిస్థితి ఇది! గ్రామ పరిధిలో మొత్తం 226 మంది పింఛన్ లబ్ధిదారులున్నారు. వీరికి పింఛను కావాలంటే ఊళ్లోని రామలింగేశ్వరస్వామి దేవాలయ గుట్టను ఎక్కాల్సి వస్తోంది. ఇందుకు కారణం, ఏపీ ఆన్‌లైన్ అందించిన బయో మెట్రిక్ మిషన్లు ఏ ఫోను సిగ్నల్స్‌నూ అందుకోకపోవడమే. నిజానికి, బయో మెట్రిక్ మిషన్‌లో 1.1 వెర్షన్ సాఫ్ట్‌వేర్ ఉండేది. వాటి సామర్థ్యాన్ని పెంచాలని ఏపీ ఆన్‌లైన్ నిర్ణయించింది. అయితే, మిషన్లను మార్చకుండానే సాఫ్ట్‌వేర్‌ను 2.2 వెర్షన్‌కు అప్‌గ్రేడ్ చేసింది. దాంతో, ఆ సాఫ్ట్‌వేర్‌ను పాత మిషన్లు సపోర్ట్ చేయలేకపోతున్నాయి. సిమ్‌లు మార్చినా ఉపయోగం లేదు. దాంతో, పింఛను కోసం గుట్ట ఎక్కక తప్పడం లేదు.

24 గంటల విద్యుత్తుపై తెలంగాణకు ప్రశంసలు

» ఆరా తీస్తున్న రాష్ట్రాలు

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా తీరుతెన్నుల్ని ఆసక్తిగా పరిశీలిస్తున్న పలు రాష్ట్రాలు.. తెలంగాణ సర్కారు ప్రయత్నాన్ని ప్రశంసిస్తున్నాయి. ఇప్పటికే గుజరాత్‌తో పాటు మరికొన్ని రాష్ట్రాల అధికారులు ఫోన్‌లో వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాధ్యాసాధ్యాలపై ప్రశ్నలు వేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఇబ్బందులపై ఆరా తీస్తున్నారు. త్వరలో రాష్ట్రానికి వచ్చి, 24 గంటల విద్యుత్ సరఫరా తీరును పరిశీలిస్తామని తెలంగాణ ప్రభుత్వానికి చెబుతున్నారు.



ఖమ్మం జిల్లా పాలేరు జలాశయంలో నిర్మించిన ఇన్‌టేక్ వెల్



జీళ్ల చెరువు గుట్టపై వేరు వేరు ఎత్తుల్లో నిర్మించిన ట్యాంకులు

జనగామలో భగీరథ పూర్తి

692 గ్రామాలకు నీరు, 60% ఇళ్లకు నల్లాలు పూర్తి పాలేరు సెగ్మెంట్ నుంచి నీటి విడుదల

» నెలాఖరుకు అన్ని చోట్ల ట్రయల్ రన్: ఈఎన్‌సీ

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టును మొత్తం 26 ప్రధాన సెగ్మెంట్‌లుగా విభజించగా ప్రధాన పనుల్లో 90 శాతం పూర్తయ్యాయి. ప్రతి సెగ్మెంట్‌ను కూడా ప్రాంతాలకు అనుగుణంగా సబ్ సెగ్మెంట్‌లుగా విభజించారు. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్(హెచ్ఎండబ్ల్యుఎస్) పైప్‌లైన్ ద్వారా గోదావరి జలాలు (ఎల్లంపల్లి జలాశయం నుంచి) సేకరించి పంపిణీ జరిగే... జనగామ సెగ్మెంట్‌లో పనులన్నీ పూర్తయ్యాయి. కేవలం గ్రామాల్లో అంతర్గత పైప్‌లైన్ పనులు మాత్రమే కొన్ని చోట్ల మిగిలాయి. మరో వైపు పాలేరు జలాశయం వద్ద నిర్మించిన ఇన్‌టేక్ వెల్ నుంచి కూడా 3 రోజుల క్రితమే నీటి విడుదల ట్రయల్‌రన్ నిర్వహించారు. అన్ని చోట్ల ప్రధాన పనులు పూర్తి కావస్తుండడంతో నెలాఖరు నాటికి ట్రయల్‌రన్ నిర్వహిస్తామని, అనంతరం బల్క్‌గా గ్రామాలకు నీటిని విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నారు. మరో 6 నెలల్లో ఇంటింటికీ నల్లా కనెక్షన్‌లను కూడా పూర్తి చేస్తామని పేర్కొంటున్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఈఎన్‌సీ బి.సురేందర్‌రెడ్డి నేతృత్వంలో సీఈ విజయ్‌పాల్‌రెడ్డి, ఈఈ విజయ్‌కుమార్ తదితరులు మిషన్ భగీరథ పనులపై క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. ఖమ్మం, జనగాం జిల్లాల్లో ప్రాజెక్టును సందర్శించారు. పాలేరు సెగ్మెంట్‌లోని ఇన్‌టేక్ వెల్ నుంచి నీటి విడుదల ట్రయల్‌రన్ నిర్వహిస్తున్నారు. ఇక్కడి నుంచి నీటిని ట్రీట్‌మెంట్ ప్లాంట్ వరకు నీరు చేరింది. ట్రయల్‌రన్ విజయవంతమవడంతో... ఈ నీటిని ట్యాంకులకు చేర్చి, గ్రామాలకు పంపిణీ చేసేందుకు సమాయత్తమవుతున్నారు. జనగామ సెగ్మెంట్‌లో ఇప్పటికే పనులు పూర్తికావడంతో 692 గ్రామాలకు బల్క్‌గా నీటిని చేరుస్తున్నారు. సివిల్ పనులన్నీ పూర్తి కావస్తుండగా... ఎలక్ట్రో మెకానికల్ పనులు చురుకుగా సాగుతున్నాయన్నారు. ట్రయల్ రన్ విజయవంతమైన ప్రాంతాల్లోని గ్రామాలకు దశలవారీగా నీరందిస్తామని సురేందర్ రెడ్డి అన్నారు.

జనగామ సెగ్మెంట్ ప్రాజెక్టు

- మొత్తం మండలాలు- 15 (జనగామ-11, సిద్దిపేట-3, మహబూబాబాద్-1తో పాటు జనగామ పట్టణం)
- మొత్తం గ్రామాలు- 692 (జనగామ-557, సిద్దిపేట- 102, మహబూబాబాద్-33)
- మొత్తం జనాభా - 6,31,083 (జనగామ-4,43,103. జనగామ పట్టణం-52,394. సిద్దిపేట-1,15,560. మహబూబాబాద్-20,000)
- మొత్తం 27 నిర్మాణాలు.. 1,523.33 కిలోమీటర్ల ప్రధాన పైప్‌లైన్ నిర్మాణం పూర్తి. 692 గ్రామాలకు బల్క్‌గా నీటి సరఫరా జరుగుతోంది.
- మొత్తం 1,46,590 కుటుంబాలకు గాను 91,536 కుటుంబాలకు(60 శాతం) ఇంటింటికీ నల్లా కనెక్షన్ కూడా పూర్తయింది
- 692 గ్రామాల్లో 77శాతం మేర అంతర్గత పైప్‌లైన్ నిర్మాణాలు పూర్తి
- ఇంటింటికీ నీరందించేందుకు 508 ట్యాంకుల నిర్మాణానికి గాను 427 (80 శాతం) పూర్తయ్యాయి.

రాష్ట్రంలో భగీరథ పనులు

- 19 ఇన్‌టేక్ వెల్‌ల నిర్మాణాలు పూర్తి
- 425 సంపులకు గాను 396 నిర్మాణాలు పూర్తి
- 149 జీఎల్‌బీఆర్‌లకు 143 నిర్మాణాలు పూర్తి
- 566 ఓహెచ్‌బీఆర్‌లకు గాను 457 నిర్మాణాలు పూర్తి
- ప్రధాన పైప్‌లైన్ 48,923 కిలోమీటర్లకు గాను 43,752 కి.మీ.లు పూర్తి
- ఇప్పటికే 4,488 గ్రామాలకు, ఏడు పట్టణాలకు భగీరథ ద్వారా బల్క్‌గా నీటి పంపిణీ
- 1,955 గ్రామాల్లోని కుటుంబాలకు ఇంటింటికీ నల్లాలు బిగించి నీటి పంపిణీ జరుగుతోంది.
- ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం సుమారు రూ. 45 వేల కోట్లు
- ప్రాజెక్టు నిర్మాణ పనులకు ఇప్పటి వరకు జరిగిన చెల్లింపులు రూ. 21,750 కోట్లు
- ప్రాజెక్టు వ్యయంలో 11 బ్యాంకులు అంగీకరించిన రుణ మొత్తం రూ. 30,798 కోట్లు
- ఇప్పటి వరకు బ్యాంకులు అందించిన రుణ మొత్తం రూ. 16,183 కోట్లు.

పాలేరు(ఖమ్మం), వైరా సెగ్మెంట్ ప్రాజెక్టులో పూర్తైనవి

- పాలేరు జలాశయంలో ఇన్‌టేక్ వెల్
- జీళ్ల చెరువు వద్ద 90 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నిర్మించిన నీటి శుద్ధి ప్లాంటు
- పాలేరు ఇన్‌టేక్ వెల్ నుంచి జీళ్ల చెరువు నీటి శుద్ధి ప్లాంటు వరకుట్రయల్ రన్ విజయవంతం
- ఖమ్మం జిల్లాలోని 7 మండలాలు కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, రఘునాథపాలెం, చింతకాని, ముదిగొండతో పాటు ఖమ్మం కార్పొరేషన్‌లోని మొత్తం 7.23 లక్షల జనాభాకు ప్రయోజనం

24గంటల విద్యుత్తు వద్దని రైతుల రాస్తారోకో



24గంటల విద్యుత్తు సరఫరా వద్దని గురువారంజనగామ-సూర్యాపేట రహదారిలోని దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి బస్‌స్టేజి వద్ద రైతులు రాస్తారోకో నిర్వహించారు. 12గంటలు నాణ్యమైన కరెంటు అందిస్తే చాలని రైతులు అన్నారు.

-దేవరుప్పుల

నాగలి పట్టిన ఎమ్మెల్యే



వ్యవసాయానికి నిరంతర విద్యుత్తు సరఫరా చేస్తుండడంతో మంచిర్యాల జిల్లావ్యాప్తంగా అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతులతో కలిసి ప్రజాప్రతినిధులు వేడుకలు జరుపుకొంటున్నారు. గురువారం మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు దండేపల్లి మండల కేంద్రంలో నాగలి పట్టి కాసేపు పొలం దున్నారు.

-దండేపల్లి

'ఖద్దరు'కు ఖాకీల అండ!

కేసుల నమోదుతో సరి..

రాష్ట్రంలో 4 ఏళ్లుగా 543 కేసులు పెండింగ్

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ నాయకులపై నమోదైన కేసుల విషయంలో పోలీస్‌లు మీనమేషాలు లెక్కిస్తుండడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 534 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎన్నికల సమయంలో కేసులు నమోదు చేసిన వారి వివరాలు పంపాలని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పోలీసులు పట్టించుకోవడం లేదు. 2014 సాధారణ ఎన్నికల్లో ఓటర్లకు డబ్బు పంచుతున్నారన్న ఆరోపణలతో తెలుగు రాష్ట్రాల్లో వేల సంఖ్యలో కేసులు నమోదు చేశారు. అందులో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు స్వయంగా డబ్బులు పంచుతూ పట్టుబడ్డ కేసులు 534 ఉన్నాయి. ఈ కేసుల్లో పోలీసులు ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి సాధించలేదు. రాజకీయనాయకులపై తమిళనాడులో 10,354 కేసులు నమోదవగా 7,865 కేసుల్లో పోలీసులు చార్జ్‌షీట్లు దాఖలు చేశారు. పంజాబ్‌లో 2,471, కర్ణాటకలో 1,599 కేసులు నమోదయ్యాయి. కాగా.. రాష్ట్రంలో రాజకీయ నాయకులపై నమోదైన కేసులు, పోలీస్ పరంగా తీసుకున్న చర్యలు తెలియజేయాల్సిందిగా కోరుతూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ డీజీపీ మహేందర్ రెడ్డికి ఇటీవల లేఖ రాసింది. ఎన్నికల సంఘానికి ఇప్పటికే 18 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో రాజకీయ నాయకులపై నమోదైన కేసుల వివరాలను పంపాయి.

ఉద్యమబాటలో అర్చక, ఉద్యోగులు!



» సగం వేతనం ఇవ్వడంపై ఆందోళన

» దేవాదాయ శాఖ తీరుపై ఆగ్రహం..

ఖమ్మం సాంస్కృతికం, జనవరి 4: రాష్ట్రంలోని వివిధ ఆలయాల్లో పనిచేస్తున్న అర్చక, ఉద్యోగులు ఉద్యమబాటకు సిద్ధమవుతున్నారు. 2016 జనవరి నాటి వరకు పనిచేస్తున్న అర్చక ఉద్యోగులు 5,645 మందికి ట్రెజరీ జీతాలు ఇచ్చేందుకు సీఎం కేసీఆర్ ఇటీవల జీవో జారీ చేశారు. అయితే జనవరి 1వ తేదీ నాటికి 738 మందికే జీతాలు అందాయి. అది కూడా ట్రెజరీ ద్వారా సగం జీతాలు ఇచ్చి మిగిలిన మొత్తాన్ని ఆలయాల నుంచి తీసుకోవాలని దేవాదాయశాఖ అధికారులు పేర్కొనడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, మంత్రులతో సీఎం సమావేశమైనప్పుడు అడ్డుచెప్పని దేవాదాయ శాఖ అధికారులు.. ఇప్పుడు ఇలా చేయడం సరికాదంటున్నారు. కాగా సీఎం ఇచ్చిన జీవోను అమలు చేయని అధికారుల వైఖరికి నిరసనగా ఉద్యమం చేయాలని అర్చక, ఉద్యోగులు నిర్ణయించారు. ఖమ్మంలో ఈనెల 6న అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్టు వరంగల్ అర్చక, ఉద్యోగుల జేఏసీ కన్వీనర్ రమేష్‌శర్మ, ఖమ్మం అర్చక ఉద్యోగుల జేఏసీ నేతలు పేర్కొన్నారు. ఈ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించనున్నట్లు వారు తెలిపారు.

ఎన్నికల బాండ్లు

పదేళ్లలో ఈ దేశంలోని వివిధ రాజకీయపార్టీల ఆదాయం మూడు నుంచి ఆరురెట్లు పెరిగిందని అసోసియేషన్ ఆఫ్ డెమోక్రాటిక్ రైట్స్ (ఏడీఆర్) అనే స్వచ్ఛంద సంస్థ చెప్పినప్పుడు అందరూ ఆశ్చర్యపోయారు. ఆర్థిక సంస్కరణల చలువతో పారిశ్రామికవేత్తల, కార్పొరేట్ల ఆస్తులు భారీగా పెరుగుతున్నప్పుడు రాజకీయపార్టీలు కూడా భారీ విరాళాలతో బలపడటం సహజం. గుట్టుచెప్పనక్కరలేని ఆదాయాలతో కాంగ్రెస్, బిజేపీలు పోటాపోటీగా ఎలా పెరుగుతున్నాయో ఏడీఆర్ నివేదిక గతంలో వివరించింది. ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత కోసం ప్రజలను పరుగులు తీయిస్తున్న మోదీ ప్రభుత్వం పార్టీల రక్షణ కవచాలన్నీ ఒలిచేసి, విరాళాల ప్రక్రియను పారదర్శకంగా మార్చేస్తుందని ప్రజలు ఆశించారు. ఈ విషయంలో ఏదో జరగబోతున్నదన్న భ్రమ కూడా ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ గత బడ్జెట్ ప్రసంగంతో కలిగింది. అప్పుడిచ్చిన హామీ మేరకు ఇప్పుడు ఆయన ప్రకటించిన ఎన్నికల బాండ్ల పథకం మాత్రం పూర్తి భిన్నంగా ఉన్నది. ఇకపై రాజకీయ పార్టీలకు విరాళాల పేరిట నల్లడబ్బు రాజమార్గంలో సమకూరబోతున్నదని ఈ రంగంలో సంస్కరణలను ఆశిస్తున్న సంస్థలు వాపోతున్నాయి.

విరాళాల విషయంలో ప్రధానంగా కావల్సింది పారదర్శకతే. దాతలు ఎవరో, ఏ పార్టీకి ఎంత ఇచ్చారో అందరూ తెలుసుకోగలిగే వీలుంటేనే విరాళాల విధానం పారదర్శకంగా ఉన్నట్టు. ఒక పారిశ్రామిక వేత్త లేదా ఓ కార్పొరేట్ సంస్థ ఏ పార్టీకి ఎంత విరాళం ఇచ్చిందో తెలిస్తే, ప్రభుత్వాలు తీసుకున్న విధాన నిర్ణయాల్లో వారికి ఎలా మేలు చేకూరిందో ప్రజలకు అర్థమవుతుందని కొందరి వాదన. ఇంత ఆశ ప్రజలకు లేకున్నా, వ్యవస్థను సమూలంగా ప్రక్షాళిస్తామని హామీ ఇచ్చిన నాయకులు విరాళాల వివరాలు తమకు మాత్రమే తెలిసే ఏర్పాటు చేసుకొని, ప్రజలకు తెలియనీయకుండా చేయడం విశేషం. ఈ బాండ్ ద్వారా విరాళం అందుకున్న రాజకీయపార్టీకి కూడా దాత ఎవరో అధికారికంగా తెలియదు కాబట్టి సదరు పార్టీ ఎన్నికల సంఘానికి బాండ్ల ద్వారా ఎంత సొమ్ము సమకూరిందో చెబుతుందే కానీ దాతలెవరో చెప్పదు. విరాళం ఇచ్చిన కంపెనీ తన బ్యాలెన్స్ షీట్‌లో ఎంత సొమ్ము వెచ్చించి బాండ్లను కొన్నదో చూపుతుంది తప్ప వాటిని ఏ పార్టీకి ఇచ్చిందో చెప్పదు. 2013 కంపెనీల చట్టం ప్రకారం గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో సదరు కంపెనీ ఆర్జించిన సగటు నికరలాభంలో 7.5శాతం మించి రాజకీయ పార్టీలకు విరాళం ఇవ్వకూడదన్న నియమం ఉండేది. మోదీ ప్రభుత్వం ఆర్థికబిల్లుతో ఆ నియమం ఎత్తేసింది. దీనికితోడు కంపెనీలకు తాము విరాళాలు ఇచ్చిన పార్టీల పేరు చెప్పనక్కరలేని బాధ కూడా తప్పిపోయింది. నగదు కాకుండా కేవలం చెక్కులు, డిమాండ్ డ్రాఫ్టులు, ఎలక్ట్రానిక్ బదలాయింపులతోనే బాండ్లు కొనుగోలు చేయాలన్న నియమం మినహా కుళ్ళును కడిగేసే విప్లవాత్మకమైన చర్యలేవీ జైట్లీ విధానంలో కనిపించడం లేదు.

విరాళాలు ఇవ్వదల్చుకున్న వ్యక్తులు, సంస్థలు, కంపెనీలు ప్రభుత్వం విడుదల చేసే ఈ బాండ్లను బ్యాంకునుంచి కొనుగోలు చేస్తున్నప్పుడు ఆ సొమ్ము పుట్టుపూర్వోత్తరాలు ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. దాత పేరు లేని ఈ బాండ్లను స్వీకరించిన రాజకీయ పార్టీలు పదిహేను రోజుల్లోగా వీటికోసం నిర్దేశించిన ఖాతాలో వాటిని జమచేసుకోవాలి. కేవైసీ (నో యువర్ కస్టమర్) నిబంధనల మేరకే కొనుగోలు జరుగుతుంది కనుక ఎవరు ఎంత విలువ బాండ్లు కొన్నారో బ్యాంకుల వద్ద సమాచారం ఉంటుందన్నది నిజమే. కానీ, ఈ సమాచారమేదీ ఆటోమేటిక్‌గా ఆదాయపు పన్నుశాఖకు చేరదు కనుక ఫలితం ఉండదన్నది విమర్శకుల ఆక్షేపణ.

తమ ఖాతాలనుంచి బాండ్లు కొనుగోలు చేసిన వారి వివరాలు, ఆ బాండ్లు తమ ఖాతాల్లో జమచేసుకున్న పార్టీల వివరాలు బ్యాంకుల్లో విడివిడిగా నిక్షిప్తమై ఉంటాయి. అధికారంలో ఉన్న రాజకీయపార్టీ ఈ వివరాలను తెలుసుకోగలదు కానీ, మిగతా పార్టీలకు ఆ అవకాశం సహజంగానే ఉండదు. కొన్ని ప్రజాపెట్టుబడులున్న కంపెనీలకు తప్ప మిగతా వ్యక్తులకు, సంస్థలకూ ఎలాగూ తమ ఆదాయ వివరాలను బహిర్గతం చేయాల్సిన అవసరం లేదు. ఈ కారణంగా విరాళాల వివరాలు ప్రభుత్వానికి తప్ప ఎవరికీ తెలియదు. ఇచ్చినదెవరో, పుచ్చుకున్నదెవరో బహిర్గతం కాదు కనుక, నల్లకుబేరులు, నేరస్థులు ఈ బాండ్లను పార్టీలకు ఇచ్చి పరోక్షంగా లబ్ధిపొందవచ్చు. బ్యాంకులనుంచి వివరాలను తవ్వితీసి విపక్షాలకు విరాళాలు ఇచ్చిన వారిని వేధిస్తుందన్న అనుమానం ఉన్నప్పుడు ప్రతిపక్షాలకు సహజంగానే విరాళాలు తగ్గిపోతాయి. వ్యవహారమంతా తెల్లగానే సాగుతుందని జైట్లీ బలంగా నమ్ముతున్నప్పుడు దాతలు, స్వీకర్తల మధ్య చెక్కుల ద్వారా, ఎలక్ట్రానిక్ ప్రకియద్వారా మాత్రమే బదలాయింపు జరగాలన్న ఒక్క నిబంధన పెడితే సరిపోయేది. మధ్యలో బాండ్లను తెచ్చి దాతలు, స్వీకర్తల మధ్య ఓ అడ్డుగోడ కట్టి, ఇచ్చిందెవరో, పుచ్చుకున్నదెవరో తమకు తప్ప మరెవ్వరికీ తెలియకుండా చేయడం ద్వారా జైట్లీ ఏ సాధించారో అర్థం కావడం లేదు.

పోడు భూములే ప్రాణప్రదం

పారిశ్రామీకరణ పేరుతో పాలకులు ఆదివాసీ ప్రాంతాలను బొందలగడ్డలుగా మార్చుతున్నారు. ఆదివాసీలను నిలువునా నిర్వాసితులను చేస్తున్నారు. తెలంగాణ ఏజెన్సీ ప్రాంతమైన గుండాల నుంచి భూపాలపల్లి వరకూ విస్తరించిఉన్న బొగ్గును వెలికి తీసేందుకు ఓపెన్‌కాస్ట్‌లను ప్రారంభించి కోల్ కారిడార్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివాసీల అస్తిత్వానికే పెనుప్రమాదం ఏర్పడుతుంది. గుండాల మండలంలో 80 శాతం ఆదివాసీ పోడుభూములకు పట్టాలులేవు. ఈ మండలంలో 90 శాతం ఉన్న ఆదివాసీలు పూర్తిగా పోడు వ్యవసాయం మీదే ఆధారపడి బతుకుతున్నారు. కానీ సింగరేణి కార్మికుల హక్కుల గురించి మాట్లాడే కార్మిక సంఘాలు గిరిజనుల జీవన్మరణ సమస్యల గురించి మాట్లాడడం లేదు.

ఖమ్మం జిల్లా మణుగూరు ప్రాంతంలో 20 ఆదివాసీ గ్రామాలను బలవంతంగా ఖాళీ చేయించి అక్కడ ఓపెన్‌కాస్ట్‌లు తీస్తున్నారు. కోయగూడెం, ఇల్లందు, కొత్తగూడెం, సత్తుపల్లి ప్రాంతాలలో కూడా ఇదే పరిస్థితి. ఒక్కమాటలో చెప్పాలంటే ఆదివాసీల జీవించే హక్కును సింగరేణి కాలరాస్తున్నది. ఇవేమీ తెలియని ఆదివాసీ అమాయకులు ఓపెన్‌కాస్ట్‌లు వస్తే తమకు మేలు జరుగుతుందని భ్రమపడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలలో ఆదివాసీలకు ఎంత మేలు జరిగింది? ఎంతమందికి ఉపాధి లభించిందో పాలకులు సమాధానం చెప్పగలరా? అన్ని రాజకీయ పార్టీలూ ఆదివాసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయి. ఏజెన్సీ ప్రజలపై సవతితల్లి ప్రేమను కురిపిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో ఆదివాసీ గిరిజనులు తమ హక్కులకోసం ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. పార్టీలకు, జెండాలకూ అతీతంగా ఆదివాసులంతా కలిసి ఓపెన్‌కాస్ట్‌లకు వ్యతిరేకంగా చేసే ఉద్యమానికి ప్రజలందరి అండదండలు అర్థిస్తున్నారు.

(నేడు గుండాల మండలంలో 'సింగరేణి ఓపెన్ కాస్ట్‌ల వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో సదస్సు')

– పూనె రామకృష్ణ దొర

జనవాక్యం

జీతం విధానం అమలుపర్చాలి

రాష్ట్రం అభివృద్ధి చెందేందుకు, ప్రజలు సుఖ శాంతులతో ఉండేందుకు అర్చకుల ఆశీర్వాదం కావాలని అందువల్లే ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అర్చకులకు ఆలయ సిబ్బందికి 2015 పీ.ఆర్‌సి ప్రకారం వేతనాలు పెంచుతున్నామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. తెలంగాణకి జూన్ 2 తేదీ ఎంత ముఖ్యమో, అర్చక ఉద్యోగులకు డిసెంబర్ 1వ తేదీ అంతే గొప్పదని ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి అన్నారు. అర్హులైన 5625 సిబ్బంది, ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల మాదిరిగానే కొత్త జీతాలు తమతమ బ్యాంకు ఖాతాలలో జమ అవుతాయని వెయ్యి కళ్ళతో ఎదురుచూసారు. కానీ వారిలో కేవలం 734 సిబ్బందికి, అది కూడా పీ.ఆర్‌సి ప్రకారం పెరిగిన మొత్తాన్ని మాత్రమే బ్యాంకు ఖాతాలో జమచేశారు. మిగతా వారికి ఎప్పటిలాగే ఆలయాల నుండి ఇచ్చేలా నిర్ణయించారు. ఇది న్యాయమేనా?

కేసీఆర్‌గారూ, జిఓ.నెం.577 తయారుచేసిన వారు, మీకు ఎక్కడ మంచి పేరు ప్రఖ్యాతులు వస్తాయో అని తిరకాసు పెట్టి, మీకు అపఖ్యాతి తెచ్చేలా లొసుగులతో తయారుచేసినట్టు ఉంది. మీరు తక్షణం జిఓ. నెం. 577 లో ఉన్న ఈ లొసుగును తొలగించి ఆలయ సిబ్బంది వారి దీవెనలు పొందాలని మనవి.

– చామర్తి వెంకట రామకృష్ణ, హైదరాబాద్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన మెయిల్:
editpage@andhrajyothy.com

కుల చాణక్యాలు

■ రాజ్‌దీప్ సర్దేశాయి



దీపశిఖ

కుల రాజకీయాల కథనాలు మన నిచ్చెనమెట్ల సమాజపు అంతర్గత దోషాలను బహిర్గతం చేసి, అత్యంత సులువుగా వివాదాలను సృష్టించగలుగుతాయి. హిమాచల్ ప్రదేశ్ కొత్త ముఖ్యమంత్రిగా జైరామ్ ఠాకూర్‌ను ఎంపిక చేసినప్పుడు భారతీయ జనతా పార్టీకి చెందిన 11 మంది ముఖ్యమంత్రులలో (ఈశాన్య రాష్ట్రాల వారు మినహా) 9 మంది అగ్రకులాలకు చెందినవారేనని నేను ట్వీట్ చేశాను. ఊహించినట్టుగానే నా ట్వీట్‌పై ఆక్షేపణలు వెల్లువెత్తాయి. కులం లాంటి అంశంపై ట్విటర్‌పై 280 అక్షరాలతో ఒక వాదనను స్పష్టంగా చేయడం అసాధ్యం గనుక నేను ఆ ట్వీట్‌ను తొలగించాను.

జైరామ్ ఠాకూర్ వరుసగా ఐదో పర్యాయం ఎన్నికైన శాసన సభ్యుడు. రైతు అయిన ఠాకూర్ ముఖ్యమంత్రి పదవికి అర్హుడు కావచ్చుగానీ, హిమాచల్‌ప్రదేశ్‌లోని 'ఠాకూర్–వాద్' ఆధిపత్య రాజకీయాల లబ్ధిదారు. ఇటీవలే ఏర్పడిన కొత్త శాసనసభలోని పాలకపక్ష సభ్యులలో సగం మంది జైరామ్ ఠాకూర్ సామాజిక వర్గం వారే. నిజానికి నా ప్రధాన వాదన దృఢమైనది. ఏడు దశాబ్దాల స్వాతంత్ర్యానంతరం కూడా, మరింత 'సమ్మిళిత' రాజకీయాల కోసం ఎంతగా ప్రయత్నిస్తున్నప్పటికీ, మన రాజ్యవ్యవస్థ అగ్రకులాల ఆధిపత్యంలోనే ఉన్నది.

నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయినప్పుడు దేశ పాలనలో ఒక కొత్త అధ్యాయం ప్రారంభమయినట్టుగా భావించడం జరిగింది. అధికార వ్యవస్థలో మౌలిక మార్పులు చోటు చేసుకోగలవని ఎంతో మంది విశ్వసించే వారు. మోదీ ప్రధాని అయ్యేంతవరకు దేశ అత్యున్నత కార్యనిర్వాహక పదవి దాదాపుగా అగ్రకులాల వారి ఆధ్వర్యంలోనే ఉన్నది.

2014 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో తన ఓబీసీ అస్తిత్వం గురించి నరేంద్ర మోదీ చాలా చతురంగా సగర్వంగా చెప్పుకున్నారు. కుల అస్తిత్వాలకు అమిత ప్రాధాన్యమున్న ఉత్తర భారతావనిలో అనేక సామాజిక వర్గాలలో మోదీ నాయకత్వ శైలి కొత్త ఆశలకు దారితీసింది. కాంగ్రెస్ నాయకుడు మణి శంకర్ అయ్యర్ మోదీని 'చాయ్‌వాలా' అని తిరస్కార పూర్వకంగా అపహసించడం మోదీకే ఎనలేని మేలు చేసింది. అట్టడుగుస్థాయి సామాజిక వర్గం, అత్యంత అల్పాదాయ కుటుంబ నేపథ్యం నుంచి ప్రభవించిన అగ్రవర్ణ కులీన శ్రేణులను సవాల్ చేస్తున్న సమర్థ నాయకుడుగా ప్రజల మనస్సుల్లో మోదీ స్థానం సంపాదించుకున్నారు.

సరే, మోదీ అధికారంలోకి వచ్చి సంవత్సరాలకు పైగా గడిచిపోయింది. అయినా ఇప్పటికీ ఆ కులీన వర్గాలే అధికార వ్యవస్థలోని ప్రాబల్య స్థానాలలో ఉన్నాయి. కేంద్ర కేబినెట్‌లోని సీనియర్ మంత్రులను చూడండి. ఉదాహరణకు జాతీయ భద్రతా వ్యవహారాలపై కేబినెట్ కమిటీ సభ్యులందరూ బ్రాహ్మణులు లేదా ఠాకూర్‌లు. ప్రభుత్వ యంత్రాంగంలోని అధికారులందరూ అగ్రకులాలకు చెందినవారే ఉన్నారు. ఇక ప్రధాన ప్రతిపక్షానికి నాయకత్వం వహిస్తుంది జంధ్యం ధరిస్తున్న ఒక హిందువు అని, గుజరాత్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్‌వారు మరీమరీ ఘోషించారు. బహుశా నెహ్రూ–గాంధీలు 'అగ్రకుల' హిందువులు కారని సూచించడానికి ఎవరైనా సాహసిస్తారేమోనని కాంగ్రెస్ నాయకులు భావించారు కాబోలు!

అవును, భారత రాష్ట్రపతి ఒక దళితుడు. అయితే రాష్ట్రపతిగా రామనాథ్ కోవింద్ నియామకం ఒక రాజకీయ లాంఛనం మాత్రమే. రాష్ట్రపతి భవన్‌లో ఆయన పదవీ కాలం మరింతగా దళితుల సాధికారతకు దారితీసే అవకాశం లేదు. ప్రతిభాపాటిల్ రాష్ట్రపతిగా ఉన్నంత మాత్రాన మహిళాభ్యుదయానికి విశేష స్థాయిలో జరిగిన దోహదమేముంది? నిజమేమిటంటే భారత రాజకీయాల 'బహుజనీకరణ' అనేక చిక్కులతో కూడుకున్న ఒక ప్రయోగంగా జరిగింది. ఇప్పుడు దానిని భిన్న రంగాలలో సవాల్‌చేయడం జరుగుతోంది. తమిళనాడులో ద్రవిడ పార్టీల ఉత్థానం, మహారాష్ట్రలో దళితులు–బహుజనులలో చైతన్యం వెల్లివిరియడానికి ముందు ఆ రెండు రాష్ట్రాలలో ఒక మహత్తర సాంఘిక సంస్కరణల విప్లవం చోటు చేసుకున్నది. ఆ విప్లవం ఫలితంగానే సాపేక్షంగా రాజకీయ అధికార బదిలీ సామరస్య పూర్వకంగా జరిగింది. దక్షిణ, పశ్చిమ భారత రాష్ట్రాలకు భిన్నంగా ఉత్తర భారతావనిలో 1980వ దశకం తుది నాళ్ళలో చోటుచేసుకున్న మండల్ విప్లవం చట్టసభలలో దళితులు, ఓబీసీలకు మరింత ప్రాతినిధ్యం లభించడానికి దోహదం చేసింది. అయితే ఆ మార్పుకు అగ్రకులాల నుంచి తీవ్ర ప్రతిఘటన కూడా ఎదురయిందన్న వాస్తవాన్ని మనం విస్మరించకూడదు. గత దశాబ్దంలో పార్లమెంటులో ఓబీసీల (ఇతర వెనుకబడిన వర్గాలు) ప్రాతినిధ్యం మండల్ విప్లవపూర్వపు స్థాయికి పడిపోయిందని గణాంకాలు విశదం చేస్తున్నాయి. ఓబీసీల ప్రాతినిధ్యం ఇంచుమించు ఇరవై శాతానికి తగ్గిపోగా అదే కాలంలో అగ్రకులాల వారి ప్రాతినిధ్యం 44 శాతానికి పెరిగింది.



> దళితులు, బహుజనుల ప్రయోజనాలకు హాని కలిగించకుండా పాటీదార్లు, మరాఠాలు, జాట్లు మొదలైన శక్తిమంతమైన సామాజిక వర్గాలతో సర్దుబాటు చేసుకొని ఆ కులాలను తమకు అనుకూలంగా ఉంచుకోవడమనేది ఇప్పుడు ఏ ప్రధాన రాజకీయ శక్తికైనా ఒక పెద్ద సవాల్ గా ఉన్నది. ఈ సవాల్‌ను సమర్థంగా ఎదుర్కోవడమే మండల్ అనంతర రాజకీయాల భవిష్యత్తును నిర్ణయాత్మకంగా రూపొందిస్తుందని చెప్పవచ్చు.

గత ఏడాది ఉత్తరప్రదేశ్ శాసనసభా ఎన్నికలలో సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీల పట్ల సంకుచిత కుల విధేయతలు భారతీయ జనతా పార్టీ హిందుత్వ ఉధృతిలో కొట్టుకుపోయిన తీరు దేశరాజకీయాల భావి దిశను సూచిస్తుంది. యాదవేతర ఓబీసీలు, జాతవేతర దళితుల మద్దతును కోరి, సాధించుకున్న తరువాత కూడా ఉత్తర ప్రదేశ్ కొత్త ప్రభుత్వానికి సారథ్యం వహించేందుకు హిందుత్వ చిహ్నంగా ఒక అగ్రకుల ఠాకూర్‌నే బీజేపీ ఎంపిక చేసుకున్నది. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాది పార్టీ యాదవ్‌లు, బీఎస్‌పీ మాయావతి, బిహార్‌లో లాలూప్రసాద్ యాదవ్, ఆయన తనయులు అవినీతిపరులుగా సొంత సంపదలను పెంచుకున్నవారుగా ముద్రపడ్డారు. వారి పార్టీలు ఫ్యామిలీరాజ్ పార్టీలుగా అప్రతిష్ఠ పాలయ్యాయి. ఈ నేపథ్యంలో, తీవ్ర అసంతృప్తితో ఉన్న మండల్ విప్లవ సైనికులతో–వీరిలో చాలామంది అట్టడుగు స్థాయి సామాజిక కులాలు, ఆర్థికంగా పేద వర్గాలకు చెందినవారే–ఒక సంకర వర్గ, సంకర కుల సంకీర్ణాన్ని సృష్టించేందుకై బీజేపీ వారిని విశాల హిందూ మత ఛత్రం కింద సమీకరించింది. కాంగ్రెస్ పార్టీ కూడా కొత్త తరం దళిత్–బహుజన్ నాయకులను కలుపుకొని బీజేపీకి దీటుగా ఒక ప్రత్యర్థి రాజకీయ కూటమిని నిర్మించడానికి ప్రయత్నిస్తోంది. గుజరాత్‌లో జిగ్నేస్ మేవానీ లాంటి యువ దళిత నాయకుడితో పొత్తు మంచి ఫలితాలివ్వడంతో తన ప్రయత్నాల పట్ల కాంగ్రెస్ నిండు ఆశాభావంతో ఉన్నది. కర్ణాటకలో ఇప్పటికే వెనుకబడిన కులానికి చెందిన పాలనాదక్షుడు సిద్దరామయ్య నేతృత్వంలో శాసనసభా ఎన్నికలలో పోరాడడానికి కాంగ్రెస్ సంసిద్ధంగా ఉన్నది.

అయితే సంకీర్ణానికి నాయకత్వం వహిస్తున్న ప్రధాన పార్టీ ప్రయోజనాలు, మిగతా భాగస్వామ్య పక్షాల ప్రయోజనాలతో ఘర్షిస్తున్న కారణంగా ఈ కొత్త పొత్తులు ఎటువంటి సమస్యలు లేకుండా కొనసాగుతాయని చెప్పడానికి వీలులేదు. కొద్ది రోజుల క్రితం మహారాష్ట్రలో దళితులు తమ పూర్వీకులు ఒక యుద్ధంలో పీష్వాల సైన్యంపై సాధించిన విజయం 200వ వార్షికోత్సవాన్ని జరుపుకున్నారు. ఆ సందర్భంగా బ్రాహ్మణవాద శక్తులకు, దళితులకు మధ్య జరిగిన ఘర్షణలు పాత వైషమ్యాలు సరికొత్త రీతుల్లో ఎలా వ్యక్తమవుతాయో స్పష్టం చేశాయి (ఇది 1818లో జరిగిన భీమా–కోరేగావ్ యుద్ధానికి ప్రస్తావన. ఆ యుద్ధంలో పీష్వా సైన్యంపై, బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ సైన్యంలో ఉన్న మహర్ సైనిక దళం విజయం సాధించింది. అగ్రవర్ణాల వారి ఆధిపత్యాన్ని అధిగమించడంలో తమ ఈ విజయం ఒక కీలక సంఘటన అని దళితులు భావిస్తున్నారు). మహారాష్ట్రలో ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న దేవేంద్ర ఫడ్నవీస్ బ్రాహ్మణ కులస్తుడు కావడం కూడా దళితులు మరింతగా రెచ్చిపోవడానికి కారణమయింది. భీమా–కోరేగావ్ గ్రామంలో విజయోత్సవం జరుపుకొంటున్న దళితులపై జరిగిన దాడికి బాధ్యులయిన వారిపై అగ్రవర్ణ పక్షపాతం కారణంగా రాజ్యవ్యవస్థ చర్యలు తీసుకోలేదని దళిత నిరసనకారులు విశ్వసిస్తున్నారు (నిజానికి ఈ ఘర్షణలు మరాఠాలు, దళితుల మధ్య మాత్రమే చోటుచేసుకున్నాయి. స్థానికంగా ఉన్న కొన్ని సంఘ వ్యతిరేక శక్తుల ప్రమేయం కూడా ఉన్నది. ఈ వాస్తవాలను నొక్కిచెప్పవలసి అవసరం ఎంతైనా ఉన్నది).

అంతేగాక గ్రామీణ ప్రాంతాలలో అంతకంతకూ అధికమవుతోన్న ప్రజల దురవస్థలు, ఆర్థిక అసమానతల ఫలితంగా సంప్రదాయ భూస్వామ్య వర్గాలలోని పలుకుబడి గల వ్యవసాయక కులాల వారి నిరసన ఉద్యమాలు కూడా ఉధృతమవుతున్నాయి. ఇటీవలే ముగిసిన గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇరవైమూడేళ్ళ హార్దిక్ పటేల్ నేతృత్వంలో పాటీదార్ కులస్తులలో ఒక కొత్త నాయకత్వం ప్రభవించింది. విద్యా ఉద్యోగాలలో పటేల్ కులస్తులకు రిజర్వేషన్లు ఇవ్వాలన్న ఆ యువ నాయకుల డిమాండ్ ఆ కులస్తులను విశేషంగా ఆకట్టుకొంది. గుజరాత్ ఎన్నికల ఫలితాలను గణనీయంగా ప్రభావితం చేసింది. పాటీదార్ల వలే మహారాష్ట్రలో మరాఠాలు, హర్యానాలో జాట్లు కూడా రిజర్వేషన్లలో తమకూ సముచిత వాటా ఇవ్వాలన్న డిమాండ్‌తో వీధుల కెక్కుతున్నారు. దళితులు, బహుజనుల ప్రయోజనాలకు హాని కలిగించకుండా ఆ శక్తిమంతమైన సామాజిక వర్గాలతో సర్దుబాటు చేసుకొని వాటిని తమకు అనుకూలంగా ఉంచుకోవడమనేది ఇప్పుడు ఏ ప్రధాన రాజకీయ శక్తికైనా ఒక పెద్ద సవాల్‌గా ఉన్నది. ఈ సవాల్‌ను సమర్థంగా ఎదుర్కోవడమే మండల్ అనంతర రాజకీయాల భవిష్యత్తును నిర్ణయాత్మకంగా రూపొందిస్తుందని చెప్పవచ్చు. ఆ భవిష్యత్తు ఆగమించేంతవరకు ఎడతెగని మార్పులు సంభవిస్తూనేవుంటాయి. ఆ మార్పులు ఘర్షణలతో మిళితమై ఉంటాయనే సత్యాన్ని మనం విస్మరించకూడదు. మరి ఈ మధ్యంతర కాలంలో రాజకీయ అధికారానికై జరిగే పోరాటాలలో కులం ఒక కీలక పాత్ర పోషించడమనేది కొనసాగుతూనే ఉంటుంది.

తాజా కలం: రాజకీయాలలో కుల సంబంధిత గణాంకాలు చికాకు కలిగిస్తున్నాయా? వార్తా పత్రికలలో వివాహ ప్రకటనల పేజీలపై చూపు సారించండి. మన వ్యవస్థలోని సామాజిక అభిమాన దురభిమానాలకు ఆ కల్యాణ వేదికలు అద్దం పట్టడం లేదా? సరే, మా పాత్రికేయుల విషయానికి వస్తాను. తమ వృత్తి ప్రపంచపు అంతర్గత సామాజిక ఆవరణాన్ని పాత్రికేయులు నిష్పాక్షికంగా పరిశీలించవల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఆ నిష్పాక్షికత అనివార్యంగా ఒక ఇబ్బందికరమైన ప్రశ్నను వేస్తుందనడంలో సందేహం లేదు. భారతీయ మీడియా వార్తా విభాగాలలో ఎంతమంది దళిత్, ఓబీసీ, ఆదివాసీ ఎడిటర్లు ఉన్నారు? అనేదే ఆ ప్రశ్న.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

'వసంతగీతం' వర్ధిల్లాలి!

ఆకురాలుకాలం శిశిర శైథిల్యంలోకి మారుతున్నవేళ పాత ఆదిలాబాదు జిల్లా ఐదుడిగ్రీల చలికి వణుకుతున్న వేళ, గోదావరి లోయ ఓపెన్‌కాస్ట్ విధ్వంసంతో బొందలగడ్డగా మారుతున్నవేళ, మావోయిస్టు సాకుతో ఆదివాసులపై నూటనలభై సెక్షన్లు, కరెంటు కోతలు, కర్ఫ్యూలు అమలవుతున్నవేళ ఎనభై పున్నములు, అమావాస్యలు చూసిన అమ్మ విప్లవ అమ్మ పావెల్ తల్లిగా అందరూ తలచుకునే, పిలుచుకునే గజ్జెల లక్ష్మి (85) బెల్లంపల్లిలో ఈనెల 1న అమరురాలైంది. అల్లం రాజయ్య కథలు నవలలు చదివేవారికి, ఆ మాటకొస్తే ఆదిలాబాదు, కరీంనగర్ రైతాంగ పోరాటాలు మొదలు దండకారణ్య విప్లవోద్యమం వరకు సాహిత్యంతో పరిచయం ఉన్న వారెవరికీ బెల్లంపల్లి అమ్మను పరిచయం చేయాల్సిన అవసరం లేదు.

విప్లవంలో జగిత్యాల జైత్రయాత్ర తరానికి ఆమె గజ్జెల గంగారామ్ తల్లిగా తెలుసు. నల్లా ఆదిరెడ్డి (శ్యాం) కూడ అమ్మగా పిలుచుకునే పిల్లనిచ్చిన తల్లిగా తెలుసు. ఆమె కన్న తల్లే గానీ, విప్లవ ఉగ్గుపాలు తాగిన బిడ్డగా ఎదిగిన గజ్జెల సరోజ విప్లవంలో ఎంచుకున్న సహచరుడు శ్యాం. నిజానికి అందులో ఒక్క గంగారామ్ తల్లి కావడమే చాలు ఆమె పావెల్ అమ్మ కావడానికి. పావెల్ అమ్మను రష్యన్ విప్లవంలో అమ్మను చూసి మాగ్జిం గోర్కీ సృష్టించాడు. రష్యా విప్లవంలో తమ సంతానం ప్రభావంతో విప్లవ అమ్మలయిన ఎందరో కన్నతల్లుల సమాహార రూపం పావెల్ అమ్మ.



> అల్లం రాజయ్య కథలు నవలలు చదివేవారికి, ఆ మాటకొస్తే ఆదిలాబాదు, కరీంనగర్ రైతాంగ పోరాటాలు మొదలు దండకారణ్య విప్లవోద్యమం వరకు సాహిత్యంతో పరిచయం ఉన్న వారెవరికీ బెల్లంపల్లి అమ్మను పరిచయం చేయాల్సిన అవసరం లేదు.

బెల్లంపల్లి అమ్మ సహచరుడు సింగరేణి కార్మికుడు. సింగరేణి బొగ్గు గనుల్లోకి విప్లవాన్ని తెచ్చిన తలిదండ్రుల తరం వాళ్లు. 1967–68 నక్సల్బరీ శ్రీకాకుళ రైతాంగ పోరాటాలు గోదావరి లోయలోకి, మంథని, మహదేవ్‌పూర్, బలార్షా, చంద్రపూర్ అడవుల్లోకి, ముఖ్యంగా బొగ్గుబావుల్లోకి నిప్పురవ్వగా ప్రవేశించినపుడే పోగొట్టుకోవడానికి ఏమీలేని కార్మికులుగా, భూమిహీనులైన దళితులుగా విప్లవంలోకి అతి సహజంగా ఆకర్షితులైనవారు. 1956నాటికే కృష్ణా జిల్లా నుంచి ములుగు ఘనపురం, అక్కడినుంచి జన్నారం బతుకుతెరువుకువెళ్లిన కొండపల్లి సీతారామయ్య లక్సెట్టిపేట జన్నారం ప్రాంతాలకు కమ్యూనిస్టు రాజకీయాలు తీసుకపోయాడు. ఆయనక్కడ ఎక్కువకాలం లేకపోయినా ఆయన రాజకీయాల ప్రభావం కొనసాగింది. లక్సెట్టిపేటలో స్థిరపడిన కళ్యాణం వెంకటేశ్వరరావు ఆంధ్రాబోరుగా పిలుచుకునే ప్రాంతం నుంచి బెల్లంపల్లి కాగజ్‌నగర్‌ల దాకా నక్సల్బరీ, శ్రీకాకుళ రైతాంగ పోరాటాల వెలుగులను ప్రసరింపచేసాడు. కాగజ్‌నగర్‌కు 1967లోనే చారుమజుందార్ విగ్రహ విధ్వంస రాజకీయాలు సుప్రసిద్ధ హిందీకవులు వేణుగోపాల్, తేజ్‌రాజేందర్‌సింగ్‌ల ద్వారా ప్రత్యక్షంగా, వాళ్ల గురువయిన ఎం.టి.ఖాన్ ద్వారా పరోక్షంగా చేరుకున్నాయి. అక్కడ విప్లవ విద్యార్థిగా రూపొందినవాడే తుషార్‌కాంత భట్టాచార్య. ఈ జ్ఞాపకాలన్నీ బెల్లంపల్లి అమ్మ ఆఖరిశ్వాస గురించి రాత్రి పదిన్నరవేళలో విన్నపుడు నాతో సికిందరాబాదు (ముషీరాబాదు) జైల్లో ఎమర్జెన్సీలో గడిపిన బెల్లంపల్లి ఎంఎల్ పార్టీ సిఐసి సానుభూతిపరులుగా, మీసా డిటెన్యూలుగా వచ్చిన మలయాళీ మిత్రుడు నాయర్, మరికొందరు యువకులు, పేర్లు కూడ మరచిపోయినవాళ్లు, కళ్లల్లో మెదిలారు. జ్ఞాపకాల్లోకి వచ్చారు.

అల్లం రాజయ్య 'తల్లిచేప' కథలో ఉపాధ్యాయురాలు మనసులో ఎవరిని పెట్టుకొని చెప్పిందోకానీ గజ్జెల లక్ష్మి అటువంటి తల్లిచేప. సింగరేణి కార్మికుల్లో సికాసగా, పల్లెల్లో రైతుకూలీసంఘ సభ్యులుగా, పల్లెల్లో పట్నంలో గంగారామ్, పెద్దిశంకర్ వంటి రాడికల్స్‌గా, తర్వాత విప్లవకారులుగా ఎదిగినవాళ్ళందరూ ఆమె భావాల్లో ఈదినవాళ్లే. ఆమె కొడుకు కమలాకర్ పోలీసుల చిత్రహింసలతో మరణించాడు. పద్మ జననాట్య మండలిలో పనిచేసి, ఒక ముస్లిం యువకుణ్ని ప్రేమించి పెళ్లిచేసుకొని తర్వాత జీవితంలో చాల నలిగిపోయి విషాదంగా మరణించింది.

ఆ ఇంటి కుంపటిలో రగిలిన బొగ్గుకణికలే ఆమె కొడుకు గజ్జెల గంగారామ్, పెద్దిశంకర్, నల్లా ఆదిరెడ్డి (శ్యాం), మధునయ్యలు. జగిత్యాల జైత్రయాత్రతో ప్రారంభమైనా రఘుగా పార్టీనిర్మాణం, సికాస నిర్మాణం, అడవి ఉద్యమ నిర్మాణం, రైతాంగపోరాట నిర్మాణంతో పాటు నల్లా ఆదిరెడ్డి బహుముఖ ఆచరణంతా ఆదిలాబాదు జిల్లానుంచే, బెల్లంపల్లి, గోదావరిఖని, ఇంద్రవెల్లి వంటి పోరాట క్షేత్రాల నుంచే. విప్లవంలో ఏర్పడిన స్నేహబంధమే ప్రేమానుబంధంగా మారి గజ్జెల సరోజ, జననాట్యమండలి నుంచి క్రమంగా ఎదుగుతూ పార్టీ నుంచి ఆదిలాబాదు జిల్లా నిర్మాణం నుంచి దండకారణ్యం దాకా వెళ్లి జీవితమంతా విప్లవానికి అంకితమై క్యాన్సర్ వ్యాధితో 11 డిసెంబర్ 2013న అమరురాలైంది. ఆమె మృతదేహాన్ని కూడ చూసుకోలేకపోయిన తల్లి, సరోజ అమరత్వం తర్వాత వెలువడిన ఆమె రచనలు, ఆమె గురించిన స్మృతుల పుస్తకం 'సాహస యోధురాలు'ను బెల్లంపల్లిలో గానీ, హనుమకొండలో గానీ సభ ఏర్పాటుచేసి ఆవిష్కరింపచేయాలనే మా ఆకాంక్ష నెరవేరకుండానే ఆమె అనారోగ్యానికి గురయింది. కాని హనుమకొండ కాళోజీనగర్ అంబేద్కర్‌భవన్‌లో 2014 జనవరిలో జరిగిన విరసం మహాసభల్లో తన చేతుల మీదుగా ఆమె పులి మధునయ్యకు అంకితమైన అల్లంరాజయ్య నవల 'వసంతగీతం'ను ఆవిష్కరించింది. మావోయిస్టుపార్టీ ఇంకా పీపుల్స్‌వార్‌గా రూపొందుతున్న రోజుల్లోనే విప్లవకారులు శత్రువునుంచి ఆయుధాలు స్వాధీనం చేసుకోవడంతో పాటు, తమ ఆయుధాలు, ఆయుధాగారాలు తామే రూపొందించుకోవాలనే సృజనాత్మకతను ప్రవేశపెట్టిన తొలితరం యువనాయకుడు గజ్జెల గంగారామ్ వరంగల్ రీజనల్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థి. జనార్దన్ సాహచర్యంలో పదునెక్కి ఆదిలాబాదు కరీంనగర్ రైతాంగపోరాటాన్ని ఎర్రజెండెర్రజెండెన్నియలుగా తన వాక్ప్రవాహంతో భద్రాచలం దాకా ప్రచారం చేసినవాడు. దండకారణ్యంలో 1982లో తాను తయారుచేస్తున్న బాంబు పేలి అమరుడయ్యాడు. అప్పుడే సాహు, మల్లోజుల కోటేశ్వర్లు కూడ గాయపడ్డారు. ఈ అమ్మ పూనికపై బెల్లంపల్లిలో గంగారామ్, పెద్దిశంకర్ వంటి అమరుల కోసం మేస్త్రీలు స్వచ్ఛందంగా అర్ధరాత్రిపూట స్థూపం నిర్మిస్తే పోలీసులు కూల్చేసిన సందర్భాన్ని అల్లంరాజయ్య మరొక కథ 'దూదిపులి'లో చెప్తాడు.

అమరవీరులైన విప్లవకారుల కథలు, గాథలు చదువుకుంటాం. కాని వాళ్ల తల్లులు, సహచరులు ఆ విప్లవకారులు రూపొందడంలో నిజమైన భూమిక అయి దోహదం చేసినవాళ్లు, వాళ్ల ఊళ్లల్లోనో, పరిసరాల్లోనో కాకుండా ప్రజలకంతా తెలియాలి. అందాకా, ఆ అన్‌సంగ్ తల్లుల కోసం, ఎవరి కన్నీళ్లు వాళ్ల వెక్కిళ్లలోనే, ఎవరి జ్ఞాపకాలు వారి గుండెల్లోనే దాచుకొని ఈ నేలవిముక్తికి తమ రక్తమాంసాలిచ్చిన తల్లుల కోసం....

■ వరవరరావు

ఉద్యమ చైతన్యంతోపాటు ఓటు చైతన్యం

అస్తిత్వ ఉద్యమాలకున్న పరిధీ, పరిమితులను నాయకత్వాలు సరిగా అర్థం చేసుకోకుంటే అనతి కాలంలోనే ఆ ఉద్యమాలు సామాజిక అంగీకారాన్ని (సోషల్ యాక్సెప్టెన్స్) కోల్పోవాల్సి వస్తుంది. ఏ అస్తిత్వ ఉద్యమమైనా ఒక్క సారి సామాజిక అంగీకారాన్ని కోల్పోయిన తరువాత, ఆ నాయత్వంతోపాటు ఆ ఉద్యమమూ ఉనికికోల్పోక తప్పదు. గత నాయకత్వంలోని మాదిగ ఉద్యమం ఇప్పుడు ఆదే దుస్థితికి చేరుకుంది.

అస్తిత్వ ఉద్యమాలు ముందుకు తెచ్చే న్యాయమైన డిమాండ్ల కారణంగా ఆ ఉద్యమాలకు సామాజిక అంగీకారం సులువుగానే దొరుకుతుంది. అందుకే, 23 సంవత్సరాల క్రితం దండోరా ఉద్యమం ప్రారంభమైనప్పుడు యావత్ సమాజం తన గుండెలద్దుకుంది. 'అణగారిన ప్రజలందరికీ సమాన అవకాశాలు దక్కాలి' అన్న దండోరా డిమాండ్‌లోని న్యాయబద్ధతకు సమాజం నీరాజనాలు పలికింది. ఆర్థికంగా, హార్దికంగా... అన్నివిధాలా సహకరించి గుప్పెడు యువకులతో ప్రారంభమైన దండోరా ఉద్యమాన్ని గొప్ప సామాజిక న్యాయ ఉద్యమంగా తీర్చిద్దింది. సమాజం నుంచి దండోరాకు అందుతోన్న తిరుగులేని మద్దతును గమనించిన పాలకులు అనివార్యంగా ఉద్యమాన్ని, నాయకత్వాన్నీ గుర్తించారు. అయితే, నాడు ఉమ్మడి ఎంఆర్పీఎస్‌కు అధినేతగా ఉన్న వ్యక్తి ఇదంతా తన ఘనతగా భావించారు. దీంతో ఆయనలో అహంకారం మొదలయ్యింది. కార్యకర్తలను కట్టుబానిసలుగా చూడడం మొదలెట్టారు. ఆర్థిక అరాచకత్వం విజృంభించింది. ఆయనలో వస్తున్న మార్పులను గమనించి అనేక మంది నాయకులు, కార్యకర్తలు తీరు మార్చుకోమని వేడుకున్నారు. అందుకు ప్రతిఫలంగా వారికి హేళనలు, వేధింపులే మిగిలాయి. ప్రశ్నించిన ప్రతి ఒక్కరి మీదికీ సాటి సహచరులనే ఉసిగొల్పి ఉద్యమం నుంచి తరిమిగొట్టించారు. వ్యక్తిగత జీవితాలను అల్లకల్లోలం చేశారు. ఈ నియంతృత్వ పోకడలను గమనించిన సామాజిక మద్దతుదారులంతా దూరం జరిగారు. వేదనకు గురైనవారు ఒక్కొక్కరుగా ఉద్యమం నుంచి బైటకు వెళుతుంటే వారిపై చెడు ప్రచారం చేసి నెట్టుకొచ్చిన నాయకునికి, మూడు సంవత్సరాల క్రితం తెలంగాణలోని బలమైన నాయకత్వం, మెజారిటీ కార్యకర్తలు బయటకొచ్చి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి తెలంగాణ (ఎంఆర్పీఎస్ టిఎస్)ను ఏర్పాటు చేయడం 'ఉనికి' సమస్యను తెచ్చిపెట్టింది. దీంతో ఎంఆర్పీఎస్–టిఎస్ నాయకత్వాన్ని తుదముట్టించేందుకు కుట్రపన్నారు. మాకూ వేరుపడడం ఇష్టం లేదు. కార్యకర్తలను, అమరవీరుల కుటుంబాలను పట్టించుకోమని ప్రాధేయపడ్డాం. ఒకరు, ఇద్దరు కాదు వేలాది మంది, నాయకులు కార్యకర్తలూ మిమ్మల్ని వీడిపోయేందుకు సిద్ధంగా ఉన్నారని, అది జాతికి మంచిది కాదనీ కాళ్లావేళ్ళాపడ్డాం. 'నాయకుని కోసం కార్యకర్తలు అనేది నియంతృత్వం కార్యకర్తల కోసం నాయకుడు అనేది ప్రజాస్వామికం', మనది ప్రజాస్వామిక ఉద్యమం, పనితీరు మార్చుకోమన్నాం. అయినా మార్పులేదు. సరికదా! నియంత పోకడలు మరింత తీవ్రమయ్యాయి.

2014లో మహాజన సోషలిస్టు పార్టీ స్థాపించినపుడు ఎమ్మార్పీఎస్ జెండాను పక్కన పెట్టమన్నారు. అంటే, తనకిష్టమైనపుడు కార్యకర్తలు జెండా పట్టాలి, ఇష్టం లేనపుడు విసిరికొట్టాలా? ఎన్నికల్లో పోటీ చేసి తనకు మాత్రం అన్ని పార్టీల మద్దతు తీసుకుని మిగిన అభ్యర్థులను గాలికొదిలేశారు. ఇదేనా తాను నిత్యం జపించే సామాజిక న్యాయం? 1. మహాజన ఫ్రంట్, 2. మహాజన సంఘర్షణ సమితి, 3. మహాజన సోషలిస్టు పార్టీ... మొత్తం మూడు పార్టీలు స్థాపించారు! దేశ, ప్రపంచ చరిత్రలో మూడు పార్టీలు మారిన నాయకుల్ని మనం చూశాముగానీ, మూడు పార్టీలను స్థాపించిన నాయకుడ్ని చూసామా? తన మీద తనకే నమ్మకంలేని నాయకుడు ఇక కార్యకర్తలకు, ప్రజలకేం చేస్తాడు? ఆయన ద్వారా సమాజానికి ఒనగూరే ప్రయోజనం లేదని పూర్తిగా నిరూపణైన తరువాత, ఇక తప్పదనుకుని ఎమ్మార్పీఎస్ టిఎస్‌ను ఏర్పాటు చేశాం.



> జీవితం బహుముఖమైనదైనప్పుడు, ఉద్యమమూ బహుముఖంగా సాగకతప్పదు. వర్గీకరణ సాధించుకుంటే చాలు, సకల సమస్యలూ పరిష్కరించబడతాయన్న భ్రమల్లో మునిగిపోయి మిగిలిన అన్ని రంగాలనూ అశ్రద్ధచేశాం. ఈ నేపథ్యంలో, ఉద్యమ చైతన్యాన్ని ఓటు చైతన్యంగా మార్చుకుని, రాజ్యాధికారంతో సకల సమస్యలనూ పరిష్కరించుకుందాం.

పార్లమెంటరీ పరిధిలోసాగే అస్తిత్వ ఉద్యమాలు ప్రభుత్వాలతో ఎలా మెలగాలి? మనిషికన్నా ఓటుకు, ఓటుకన్నా ఓట్ బ్యాంకుకూ విలువ ఉన్న ఎన్నికల రాజకీయాలలో మన ప్రజలకు ఉద్యమ చైతన్యంతో పాటు ఓటు చైతన్యం అందించకుంటే ప్రయోజనం లేదని అర్థం చేసుకున్నాం. ఓటు చైతన్యానికి, జీవితం స్థిరపడడానికీ విద్య అత్యంత కీలకమని భావించాం. అందుకే 'విద్య–ఉద్యమం–ఓటు' ఈ మూడింటిపై కేంద్రీకరించి కృషిచేస్తున్నాం. ఈ క్రమంలో సమాజంలోని సామాజిక న్యాయ శక్తులు తమ అండదండలు అందిస్తున్నాయి. మేం వినమ్రంగా స్వీకరిస్తున్నాం. ఈ నేపథ్యంలో ప్రభుత్వంలో ఎవరున్నా మనల్ని గుర్తించక తప్పదు. ప్రభుత్వం మనకు అంటరానిదేమీ కాదు. ప్రభుత్వ సొమ్ము మనదే. అందుకే, డప్పు చెప్పు వృత్తిదారులకు 2వేల పెన్షన్, మాదిగలకు 3ఎకరాల భూమి, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ప్రభుత్వం నుంచి రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నాం.

'ఆత్మగౌరవం అభివృద్ధి అధికారం' ఈ మూడింటికీ అవినాభవ సంబంధం ఉంది. ఆత్మగౌరవంలేనిదే అభివృద్ధి జరగదు. అభివృద్ధిలేనిదే అధికారం అందదు. అయితే, ఆత్మగౌరవానికైనా, అభివృద్ధికైనా, అధికారానికైనా విద్య కీలకం. అందుకే విద్య మీద దృష్టి కేంద్రీకరించాం. పూలే అంబేద్కర్ జంబూద్వీప జ్ఞానకేంద్రాలను రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పల్లెలోనూ ఏర్పాటు చేస్తున్నాం. రెసిడెన్షియల్ స్కూళ్లలో మాదిగ పిల్లల్ని చేర్పించడాన్ని ఒక ఉద్యమంలా చేపడుతున్నాం. అలాగే రెసిడెన్షియల్ సూళ్లు చాలినన్ని స్థాపించాలని ప్రభుత్వంపై వత్తిడి తెస్తున్నాం. త్వరలో ఎమ్మార్పీఎస్–టిఎస్ ఆధ్వర్యంలోనే సివిల్స్, గ్రూప్స్‌కు ఉచితంగా కోచింగ్ ఇప్పించేందుకు కృషిచేస్తున్నాం. అలాగే, మనల్ని గుడికి దూరంచేసి అంటరానితనంలో ముంచిన మనువాదానికి ప్రత్యామ్నాయంగా ఆధ్యాత్మిక సమానత్వంతో కూడిన ఆలోచనా విధానానికి అంకురార్పణ చేస్తున్నాం.

జీవితం బహుముఖమైనదైనప్పుడు, ఉద్యమమూ బహుముఖంగా సాగకతప్పదు. కానీ, కృష్ణమాదిగ నాయకత్వంలో ఉద్యమం కేవలం వర్గీకరణ అంటూ ఏకముఖంగా సాగింది. వర్గీకరణ సాధించుకుంటే చాలు, సకల సమస్యలూ పరిష్కరించబడతాయన్న భ్రమల్లో మునిగిపోయి మిగిలిన అన్ని రంగాలనూ అశ్రద్ధచేశాం. ఎంతో నష్టపోయాం. ప్రభుత్వాల నుంచి రాబట్టుకోగలిగిన అనేక సంక్షేమ పథకాలు, రాయితీలు చేజేతులా కోల్పోయాం. దీంతో, ప్రాణంపెట్టి పనిచేసే కార్యకర్తలు పస్తుల పాలబడ్డరు. అధినాయకులు మాత్రం కుబేరులైపోయారు. బతికున్న వాళ్లను మానసికంగా చంపుతూ చనిపోతున్న వాళ్లకు సంతాప సభలు పెడుతున్నరు. ఆ సభలను సైతం ఉనికి నిలుపుకునేందుకు వేదికలుగా మలచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో, 'సమస్య మన బతుకుల్లో ఉంటే, పరిష్కారం మన చేతుల్లోనే ఉందని' ప్రతి ఒక్కరం గుర్తించి ఐక్యంగా ముందుకు సాగుదాం. అక్షరాలను ఆయుధాలుగా మలచుకుని, ఉద్యమ చైతన్యాన్ని ఓటు చైతన్యంగా మార్చుకుని, రాజ్యాధికారంతో సకల సమస్యలనూ పరిష్కరించుకుందాం.

■ వంగపల్లి శ్రీనివాస్

వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మార్పీఎస్ – టిఎస్

(మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి – తెలంగాణ ఆధ్వర్యంలో జనవరి 6, 7 తేదీల్లో నాగార్జునసాగర్‌లో రాజకీయ శిక్షణా తరగతులు)

మేకలు కాయొద్దు.. చదువుకోవాలె

బడి మానిన విద్యార్థిని పాఠశాలలో చేర్చిన మహబూబ్‌నగర్ కలెక్టర్


విద్యార్థితో మాట్లాడుతున్న కలెక్టర్ రొనాల్డ్ రోస్

దేవరకద్ర, జనవరి 4: బడీడు పిల్లవాడు ఒకడు రోడ్డు పక్కన మేకలు కాస్తున్నాడు. ఇంతలో అటుగా వెళ్తున్న కలెక్టర్ ఆ దృశ్యాన్ని గమనించారు. వెంటనే కారు ఆపి, ఆ బాలుడి దగ్గరికెళ్లారు. వివరాలు తెలుసుకున్నారు. తొమ్మితో తరగతి చదువుతున్న తాను ఇటీవలే బడి మాని మేకలు కాస్తున్నానని చెప్పగా, అతడిని కారులో ఎక్కించుకొని నేరుగా తీసుకెళ్లి, బడిలో చేర్పించారు ఆ కలెక్టర్. మహబూబ్‌నగర్ జిల్లా పోతన్‌పల్లి గ్రామానికి చెందిన మౌలానా దేవరకద్ర మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. తండ్రి చనిపోవడంతో నాలుగు నెలలక్రితం బడి మాని మేకలు కాస్తున్నాడు. గురువారం కలెక్టర్ రొనాల్డ్ రోస్ దేవరకద్ర పర్యటనకు వెళతుండగా మధ్యలో చౌదర్‌పల్లి స్టేజీ దగ్గర మేకలను కాస్తున్న మౌలానాను గమనించారు. వెంటనే కారు దిగి విద్యార్థి వద్ద కెళ్లి వివరాలు అడిగారు. చదువుకుంటావా? అని అడిగ్గా.. చదువుకుంటానని ఆ బాలుడు చెప్పాడు. కలెక్టర్ వెంటనే ఆ బాలుడిని తన వాహనంలో ఎక్కించుకుని, దేవరకద్ర ఉర్దూ మీడియం పాఠశాలకు తీసుకెళ్లారు. ఇక మీదట విద్యార్థి ప్రతి రోజూ పాఠశాలకు వస్తాడని, వారి తల్లిదండ్రులకు, విద్యార్థికి.. ఉపాధ్యాయులు, పోలీసులు కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు.

స్వచ్ఛ శబరిమలకు కృషి చేస్తాం: అయ్యప్పలు


ప్రతిజ్ఞ చేస్తున్న అయ్యప్పస్వాములు

వనస్థలిపురం/హైదరాబాద్, జనవరి 4: ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి హస్తినాపురం డివిజన్, కర్మఘాట్ హరిహర క్షేత్ర అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప స్వాములు, భక్తులు ప్రతిజ్ఞ చేశారు. కాలుష్య రహిత శబరిమల కోసం ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి గురువారం మద్దతు తెలిపారు. ఇక నుంచి ప్లాస్టిక్ వాడబోమని, స్వచ్ఛ శబరిమలకు తమవంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. శబరిమలకు తరలి వెళ్లే స్వాములు, భక్తులు ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిల్స్ తీసుకు వెళ్లబోమని హామీ ఇచ్చారు. ప్రజల్లోనూ చైతన్యాన్ని నింపుతామన్నారు.

కోడి పందేలు ఆపాల్సిందే!

మా ఉత్తర్వులను అమలు చేయాల్సిందే... విఫలమయితే ఏపీ ప్రభుత్వానిదే ఆ బాధ్యత

- గతంలో ఆపని అధికారులపై చర్యలేవీ?
- బెట్టింగ్ వందలకోట్లలో, సీజ్ 10లక్షలేనా!
- నిర్వాహకులనొదిలేసి చిన్నవాళ్లపై వేటా?
- కౌంటర్ దాఖలుకు హైకోర్టు బెంచ్ ఆదేశం



హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): "ఎట్టి పరిస్థితుల్లోనైనా కోడి పందేలకు అడ్డుకట్ట వేయాల్సిందే. కోర్టు ఉత్తర్వులు అమలు చేయకపోతే అందుకు ఏపీ ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది" అని హైకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. సంక్రాంతి సందర్భంగా కోడిపందేల నిర్వహణ విషయమై 2016 డిసెంబర్ 26న జారీచేసిన ఉత్తర్వులను అమలు చేసితీరాల్సిందేనని తేల్చి చెప్పింది. "యేటా కోడి పందేలు ఒక మెగా ఈవెంట్‌లా మారిపోతున్నాయి. ఎక్కడెక్కడి నుంచో, టూరిస్టులు కోడి పందేల్లో పాల్గొనడానికి వస్తున్నారు. పందేలు నిర్వహిస్తున్న ప్రాంగణం అంతా బస్సులు, కార్లతో నిండిపోవడం చూస్తే, ఎంత పెద్ద ఎత్తున పందేలు నిర్వహిస్తున్నారనేది అర్థం అవుతోంది. ఉభయ గోదావరి జిల్లాల్లో మొదలైన కోడిపందేలు సమీపంలోని కృష్ణ, గుంటూరు, విశాఖపట్నం జిల్లాలకు వ్యాపించాయి. ఈ తతంగం అంతా మేం గమనిస్తున్నాం" అని బెంచ్ వ్యాఖ్యానించింది. సంక్రాంతి పండగ సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా వెంప, శ్రీరాంపుర్ గ్రామాల్లో పెద్దఎత్తున అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారనున్న కోడి పందేలను ఆపాలంటూ కె. రామ చంద్రరాజు అనే స్థానికుడు హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై గురువారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్‌రంగనాథన్, జస్టిస్ జి. శ్యాంప్రసాద్‌ల బెంచ్ మరోసారి విచారణ చేపట్టింది. దీనిపై పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్, ఎస్పీ వేర్వేరుగా ఇచ్చిన నివేదికలను ధర్మాసనం పరిశీలించింది. కోడి పందేలు నిర్వహిస్తున్న ప్రాంతాలపై అధికారులు దాడులు చేసి రూ.9.72 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు నివేదికలో పేర్కొనడం పట్ల ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. వందల కోట్ల రూపాయలు కోడి పందేల్లో చేతులు మారిపోతుంటే, లక్షల్లో సీజ్‌చేయడం విస్మయంగా ఉందని వ్యాఖ్యానించింది. కోడి పందేలను అడ్డుకోవడంలో విఫలమైన 43 మంది తహసీల్దార్లు, 49 మంది ఎస్‌హెచ్‌వోలకు షోకాజ్ నోటీసులు జారీచేసినట్లు తెలపగా, వారిపై ఏం చర్యలు తీసుకున్నారో వివరిస్తూ నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. ఏపీ ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ కల్పించుకుంటూ... పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయడానికి కొంత గడువు ఇవ్వాలని కోరారు. ఈ సంవత్సరం కోడిపందేలు నిర్వహించకుండా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ గట్టి చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు. ఈ వాంగ్మూలాన్ని డివిజన్ బెంచ్ రికార్డు చేసింది. "మీ చిత్తశుద్ధిని పరీక్షించబోతున్నాం. ఈ సంవత్సరం పశ్చిమగోదావరి జిల్లా వెంప, శ్రీరాంపురం గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించడానికి వీల్లేదు. ఈ విషయంలో విఫలమైతే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది" అని తేల్చి చెప్పింది. కాగా, గత సంవత్సరం కోర్టు ఉత్తర్వులు అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై ఏమి చర్యలు తీసుకున్నారో కౌంటర్‌లు వేయాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్, ఎస్పీలను ఆదేశించింది. కోడి పందేలు నిర్వహించకుండా తీసుకునే చర్యలు, చట్ట వ్యతిరేకంగా కోడిపందేల్లో పాల్గొనే వారిపైన తీసుకున్న చర్యల వివరాలతో సీఎస్, డీజీపీలు నివేదికలు ఇవ్వాలని నిర్దేశించింది. నిర్వాహకులపై ఎటువంటి కేసులు పెట్టకుండా, చిన్నపాటి వ్యక్తులపై కేసులు నమోదు చేయడం వల్ల ప్రయోజనం ఉండదని తేల్చిచెప్పింది. తొలుత కోడి పందేలను అరికట్టడంలో విఫలమైన అందరు అధికారులకు కోర్టు ధిక్కార నోటీసులు ఇచ్చి విచారించాలని భావించామని, అయితే కౌంటర్ వేస్తామని ఏపీ ఏజీ ఇచ్చిన హామీతో వెనక్కు తగ్గామని ధర్మాసనం తెలిపింది. తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది.

మాజీ ఏఎస్ఐ మోహన్‌రెడ్డిపై మరో కేసు



కరీంనగర్ క్రైం, జనవరి 4: మాజీ ఏఎస్ఐ మోహన్‌రెడ్డిపై అవినీతి నిరోధక చట్టం కింద మరో క్రిమినల్ కేసు నమోదు చేశామని అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) కరీంనగర్ రీజియన్ డీఎస్పీ సుదర్శన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన పోతర్ల గట్టయ్య 2013లో మోహన్‌రెడ్డి వద్ద రూ.12 లక్షలు అప్పుగా తీసుకుని సెక్యూరిటీగా కోతిరాంపూర్‌లోని అతని భవనాన్ని జీపీఏ అండ్ సేల్ డీడ్ చేశాడు. ఈ సేల్ డీడ్ ఆధారంగా మోహన్‌రెడ్డి తన బినామీ సంగీత పేరిట ఆ భవనాన్ని రిజిస్ట్రేషన్ చేయించాడు. అయితే అప్పు తీసుకున్న గట్టయ్య నెలకు రూ.48 వేల చొప్పున మార్చి 2013 నుంచి 2015 డిసెంబర్ వరకు వడ్డీ రూ.15 లక్షలు చెల్లించాడు. అప్పు తీసుకున్న రూ.12 లక్షలు కలిపి మొత్తం రూ.27 లక్షలు మోహన్‌రెడ్డికి చెల్లించాడు. అప్పు తీరాక, తన ఇల్లు తనకు రిజిస్ట్రేషన్ చేయాలని గట్టయ్య కోరాడు. ఇంకా రూ.20 లక్షలు చెల్లించాలని, లేదంటే చంపుతామని మోహన్‌రెడ్డితోపాటు ఆయన బావమరిది ఇట్టిరెడ్డి శ్రీపాల్‌రెడ్డి, బానాల రమణారెడ్డి, మోహన్‌రెడ్డి భార్య లత, కొడుకు అక్షయ్‌రెడ్డి, బినామీలు ఇట్టెడి సంగీత, ఆమె భర్త ఎల్లారెడ్డి బెదిరించారు. దీనిపై గట్టయ్య కరీంనగర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో మోహన్‌రెడ్డితో పాటు అయన అనుచరులు, బినామీలపై కేసు నమోదు చేశారు.

నకిలీ నోట్ల ముఠా అరెస్టు

రూ.1.12 లక్షల నోట్లు, రెండు కార్లు, ప్రింటర్ స్వాధీనం

జనగామ టౌన్, జనవరి 4: నకిలీ నోట్ల తయారీ, పంపిణీకి పాల్పడుతున్న అంతర్ జిల్లా ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. ముఠా నుంచి నకిలీ నోట్లు, తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని జనగామ పశ్చిమ జోన్ డీసీపీ ఎం.మల్లారెడ్డి తెలిపారు. జనగామలో ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. గత డిసెంబర్ 29న పట్టణంలోని గిర్ని గడ్డ చౌరస్తా వద్ద శ్రీ భవాని బ్యాంగిల్ స్టోర్‌లోకి కారులో వచ్చిన ఓ మహిళ రూ.2 వేల నోటు ఇచ్చి రూ.270 విలువ గల వస్తువులు కొనుగోలు చేసి మిగతా చిల్లర తీసుకొని వెళ్లిపోయింది. కొద్దిసేపటికి నోటుపై అనుమానం వచ్చిన షాపు యాజమాని అది నకిలీ నోటుగా గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, సమీపంలోని సీసీ కెమెరా ద్వారా బ్యాంగిల్ స్టోర్‌కు వచ్చిన కారు నంబర్ గుర్తించి వివరాలు సేకరించారు. కారు హన్మకొండ ప్రాంతం వారిదిగా గుర్తించి, గ్యారేజీ ద్వారా నిందితుడి ఫోన్ నెంబర్ తీసుకొని దర్యాప్తు ముమ్మరం చేశారు. తీవ్ర గాలింపు అనంతరం హన్మకొండ వినాయక నగర్‌లో ఓ మహిళతో పాటు ఇద్దరిని పట్టుకొని విచారించారు. దీంతో నకిలీ నోట్ల తయారీ, చలామణి బాగోతం బయటపడింది. ముఠాకు చెందిన బెజవాడ రాజీవ్, ఎండీ షఫీతో పాటు ఒక మహిళను అరెస్ట్ చేసి, రెండు కార్లు, రూ. 1.12 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని డీసీపీ తెలిపారు.

చలి మంటలో సెల్ బ్యాటరీ పేలి ఏడుగురికి గాయాలు

కేసముద్రం, జనవరి 4: చలిమంటలో సెల్ ఫోన్ బ్యాటరీ పేలి ఏడుగురు గాయపడ్డారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అన్నారం శివారు ధర్మారంతండాలో గురువారం ఈ ప్రమాదం జరిగింది. తండాకు చెందిన కొందరు తెల్లవారుజామున చలికాగేందుకు చెత్తాచెదారాన్ని పోగేసి మంట పెట్టారు. అదే సమయంలో పిల్లలు మంట మరింత వచ్చేందుకు సమీపంలోనే ఉన్న పాతబస్తాను తీసుకువచ్చి అందులో వేశారు. అయితే అంతకుముందే ఆ బస్తాలో పాడైపోయిన సెల్‌ఫోన్ బ్యాటరీ ఉన్న విషయం బాధితులకు తెలియదు. కొద్దిసేపటికే బ్యాటరీ పేలడంతో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి.

వద్దు వద్దురన్నో.. బహిరంగానికి!

అది వరంగల్ అర్బన్ జిల్లా కమలాపూర్ మండలం.. తెల్లవారుజామునే గ్రామస్తులు చెంబులు పట్టుకుని హడావుడిగా 'బయట'కు వెళ్తున్నారు. ఇంతలో ఓ జీపు రయ్..మంటూ వారి ముందుకు వచ్చి ఆగింది. అందులోని అధికారులు చెంబులు పట్టుకున్నవాళ్లందరినీ జీపులో ఎక్కించుకుని, ఊళ్లో రౌండ్లు వేశారు. బిక్కరగా చూస్తున్న వారిని ఇళ్లదగ్గర దిగబెట్టి.. 'మీరు చేస్తుంది తప్పు.. శిక్షగా తలా ఒక మొక్క నాటండి' అని హుకూం జారీచేసి, వారితో మొక్కలు నాటించారు. తర్వాత తీరిగ్గా అసలు విషయం బయటపెట్టారు. 'మీ ఊరు బహిరంగ మలమూత్ర విసర్జన రహిత గ్రామంగా గుర్తింపు పొందింది. సర్కారు అన్ని ఇళ్లలో మరుగుదొడ్లు కట్టించింది. వాటిని వాడుకోండి' అంటూ హితబోధ చేశారు.

\- ఆంధ్రజ్యోతి, కమలాపూర్


బహిరంగ మలవిసర్జనకు వెళ్తున్న వారిని అడ్డుకున్న అధికారులు (ఇన్‌సెట్‌లో) సంచార రథం

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- విద్యుదాఘాతంతో అన్నదాత మృతి
- ట్రాక్టర్ బావిలో పడి రైతు దుర్మరణం


బావిలో బోల్తాకొట్టిన ట్రాక్టర్


సంతోష్ (ఫైల్)

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్: అప్పుల బాధతో మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం కొప్పులపల్లి గ్రామానికి చెందిన రాములు (33) ఆత్మహత్య చేసుకున్నాడు. రాములుకు రెండెకరాల పొలం ఉండగా అప్పుల బాధ తాళలేక ఎకరం పొలాన్ని విక్రయించాడు. ఉన్న ఎకరం పొలంలో పంటలు సరిగా పండకపోవడంతో అప్పులు ఎక్కువయ్యాయి. దీంతో గురువారం ఇంట్లోనే ఉరేసుకున్నాడు. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలంలో విద్యుదాఘాతంతో గురువారం ఓ రైతు మృతిచెందాడు. ఇమామ్‌నగర్ గ్రామానికి చెందిన లకావత్ సంతోష్(24) పొలంలో విద్యుత్‌మోటారు పనిచేయకపోవడంతో మెకానిక్, మరొకరితో కలిసి పొలం దగ్గరకు వెళ్లాడు. అక్కడ మోటారు రిపేరు చేశారు. తర్వాత విద్యుత్ మోటారులో పైపులు దించేటప్పుడు పక్కనే ఉన్న 11కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌కు పైపు తగిలి విద్యుత్‌షాక్‌కు గురయ్యారు. ముగ్గురినీ ఏన్కూరు ఆస్పత్రికి తరలించారు. సంతోష్ పరిస్థితి విషమించటంతో ఖమ్మం తరలిస్తుండగా మృతిచెందాడు. మరో ఇద్దరిని ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. ట్రాక్టర్ అదుపుతప్పి బావిలో పడి రైతు మృతి చెందిన ఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మాణెపల్లిలో గురువారం జరిగింది. పుల్లబోయిన వెంకటయ్య(45) తన ట్రాక్టర్‌తో రబీ సాగు కోసం పొలాన్ని చదును చేస్తుండగా చెరువు పక్కనే ఉన్న బావిలోకి అదుపుతప్పి ట్రాక్టర్ దూసుకుపోయింది. దీంతో వెంకటయ్య అక్కడికక్కడే మృతి చెందాడు.

అప్పుల బాధతో చీటీల వ్యాపారి ఆత్మహత్య?

కామారెడ్డి రూరల్, జనవరి 4: అప్పుల బాధతో ఓ చీటీల వ్యాపారి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కామారెడ్డి పెద్దబజార్‌కు చెందిన బత్తయ్యల సతీష్ (42) చీటీల వ్యాపారి. అతడికి రూ.35 లక్షల వరకు రావాల్సి ఉంది. సకాలంలో డబ్బులు రాక, ఇతరుల వద్ద రూ.20 లక్షల వరకు తీసుకుని కట్టాడు. అప్పులవాళ్ల ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో గురువారం క్యాసంపల్లి శివారులో ఉరేసుకున్నట్టు గుర్తించారు. కుటుంబీకులు మాత్రం ఆత్మహత్య చేసుకునే పిరికివాడు కాదని చెప్తున్నారు.

వక్ఫ్ భూమి అక్రమ రిజిస్ట్రేషన్..?

సబ్ రిజిస్ట్రార్‌తో పాటు మరికొందరిపై కేసులు

బోధన్, జనవరి 4: నిజామాబాద్ జిల్లా బోధన్‌లో వక్ఫ్ బోర్డు భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారన్న ఫిర్యాదుపై సబ్ రిజిస్ట్రార్ రవికిరణ్‌తోపాటు మరికొంతమందిపై కేసులు నమోదయ్యాయి. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్‌లోని సర్వే నంబర్ 665లో నాలుగు ఎకరాల వక్ఫ్ బోర్డు భూమి ఉంది. దీనిని కొందరు ప్రయివేటు వ్యక్తులు తమ పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ దాదాపు ముగిసిపోవడంతో వ్యవహారం బయటకు పొక్కింది. దీంతో మైనారిటీలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. వక్ఫ్‌బోర్డు భూమిని ప్రైవేటు వ్యక్తులకు ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. వక్ఫ్ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్‌తో పాటు ప్రైవేటు వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన ఉద్రిక్తంగా మారడంతో సీఐ వెంకటేశ్వర్లు నేతృత్వంలో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ రవికిరణ్, సబీయా బేగం, షకీల్‌పటేల్, రియాజుద్దీన్‌లపై కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం సబ్ రిజిస్ట్రార్ రవికిరణ్ సెలవులో ఉన్నారు.

హత్య కేసులో నలుగురికి జీవిత ఖైదు

కరీంనగర్ లీగల్, జనవరి 4: పాత కక్షలతో ఓ యువకుడిని కత్తులతో పొడిచి హత్యచేసిన నలుగురు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ కరీంనగర్ స్పెషల్ ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక కోర్టు, జిల్లా ఐదో అదనపు సెషన్స్ న్యాయమూర్తి నాగరాజు తీర్పు చెప్పారు. గోదావరిఖనికి చెందిన దాసరి చందు మరో ముగ్గురితో కలిసి పాత కక్షలతో ప్రశాంత్‌పై కత్తులతో దాడి చేశాడు. దీంతో ప్రశాంత్ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ప్రశాంత్ తండ్రి గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు నిందితులు అరెస్టు చేశారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి నాగరాజు గురువారం నిందితులకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి 1,500 రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

అక్రమ దందాలో తగాదాలు

వ్యక్తి దారుణ హత్య

హసన్‌పర్తి, జనవరి 4: వరంగల్ జిల్లా హసన్‌పర్తికి చెందిన చిత్తారి కుమార్(35) బుధవారం అర్ధరాత్రి హత్యకు గురయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం.. చిత్తారి కుమార్, తన చిన్నాన్న కొడుకుకైన చిత్తారి వెంకటేశ్వర్లు కలిసి పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తుండేవారు. కొద్ది రోజులుగా ఈ అక్రమ రవాణాను వరుసగా అధికారులు పట్టుకున్నారు. వీరిద్దరి మధ్య ఆర్థిక లావాదేవీల్లో గొడవలు వచ్చాయి. సివిల్ సప్లైస్ అధికారులకు కుమార్ సమాచారం ఇస్తున్నాడని, డబ్బుల లెక్కలు సరిగా చూపించడంలేదని వెంకటేశ్వర్లు.. అతడిపై కక్ష పెంచుకున్నాడు. బుధవారం రాత్రి తమ మిత్రులతో కలిసి కుమార్‌ను హత్య చేశారు.

ఏసీబీ వలలో లేబర్ ఆఫీసర్

ఖమ్మం క్రైం, జనవరి 4 : ఏసీబీ వలకు ఓ అవినీతి చేప చిక్కింది. ఖమ్మం సర్కిల్ -2 లేబర్ ఆఫీసర్‌గా పని చేస్తున్న అంబటి ఏసుపాదం రూ.2 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఓ ట్రావెల్స్ సంస్థ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి బాణోత్ శ్రీనివాసరావు అనే వ్యక్తి నుంచి లంచం డిమాండ్ చేయగా.. బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన ఏసీబీ డీఎస్పీ సత్యనారాయణ, నిందితుడు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. తాజా ప్రభుత్వ నిబంధనల ప్రకారం కార్లు తదితర వాహనాల రిజిస్ట్రేషన్‌కు లేబర్ అధికారి తనిఖీ చేసి సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంది. దరఖాస్తు చేసిన మూడు రోజుల్లో సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉండగా లేబర్ అధికారి ఏసుపాదం అతడిని రోజుల తరబడి తిప్పుతున్నాడు. దీంతో శ్రీనివాసరావు నిలదీయటంతో తనకు రూ.3 వేల లంచం ఇవ్వాలని డిమాండ్ యడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు.

రైతు దగ్గరే విత్తన కొనుగోలు

'విత్తన గ్రామపథకం' కమిటీ నిర్ణయం

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): 'రైతుల నుంచే విత్తనం కొనుగోలు చేయాలి. వాటిని రైతులకు సబ్సిడీపై అందించాలి. మార్క్‌ఫెడ్, హాకా, రాష్ట్ర విత్తనాభివృద్ధి శాఖలు ఈ బాధ్యతను చేపట్టాలి' అని గురువారం జరిగిన రాష్ట్రస్థాయి 'విత్తన గ్రామపథకం' కమిటీ నిర్ణయించింది. వ్యవసాయ శాఖ కార్యదర్శి పార్థసారథి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో.. త్వరలో ఈ పథకానికి సంబంధించి మార్గదర్శకాలు రూపొందించాలని నిర్ణయించారు. ఈ మార్గదర్శకాల్లో విత్తనోత్పత్తి గ్రామాల ఎంపిక, తొలి విడతలో ఖర్చును భరిస్తూ.. రైతులకు మూల విత్తన సరఫరా, విత్తన క్షేత్రాల నమోదు, తనిఖీలు, దిగుబడి అంచనాలు, విత్తన కొనుగోలు ధరల నిర్ణయం, విత్తన శుద్ధి యూనిట్ల ఏర్పాటు, మొబైల్ విత్తనశుద్ధి కేంద్రాలు తదితర అంశాలపై స్పష్టత రానుంది.

కేంద్ర ప్రభుత్వం తాజాగా తెలంగాణ రాష్ట్రానికి ఐదు రాష్ట్రాలకు చెందిన అంతర్జాతీయ విత్తన ధ్రువీకరణల అధికారాన్ని అప్పగించిందని వ్యవసాయ శాఖ కమిషనర్ పార్థసారథి ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరీ, లక్షద్వీపాల్లో ఉత్పత్తి అయ్యే విత్తనాలను తాము ధ్రువీకరిస్తామని, దీంతో తెలంగాణ మొత్తం తొమ్మిది రాష్ట్రాల విత్తనాలను ధ్రువీకరించనుందని వివరించారు.

విభిన్న రంగాల్లో అవకాశాలు

హాస్పిటాలిటీ కోర్సు పూర్తి చేసిన వారికి విస్తృతమైన అవకాశాలు అందుబాటులో ఉంటాయి. వీరు మేనేజ్‌మెంట్ ట్రెయినీ హోదాతో హోటళ్లు, రిసార్ట్స్‌లో కెరీర్ ప్రారంభించొచ్చు. ఆసక్తి, ప్రావీణ్యాన్ని బట్టి కిచెన్ మేనేజ్‌మెంట్, హౌస్ కీపింగ్ మేనేజ్‌మెంట్, ఫ్లైట్ కిచెన్స్/ ఆన్‌బోర్డ్ ఫ్లైట్ సర్వీసెస్, వివిధసేవా పరిశ్రమల్లో గెస్ట్/ కస్టమర్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్, ఫాస్ట్‌ఫుడ్ చెయిన్స్‌లో ఎగ్జిక్యూటివ్, క్యాటరింగ్ సంస్థలు, బహుళజాతి కంపెనీల క్యాంటీన్లు, హౌస్ కీపింగ్ నిర్వహణ, హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలల్లో ఫ్యాకల్టీ, సొంతంగా ఫుడ్ చెయిన్ ప్రారంభించడం తదితర అవకాశాలు దక్కుతాయి. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ కూడా ఉంటాయి. ఐహెచ్‌ఎం విద్యార్థుల్లో దాదాపు 90 శాతం మందికి ఆన్ క్యాంపస్, ఆఫ్ క్యాంపస్ ద్వారా ఉద్యోగాలు లభిస్తున్నాయి.

ఆతిథ్య రంగం.. వేలాది అవకాశాల నెలవుగా మారుతోంది. పర్యాటకుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటం, జీవనశైలిలో మార్పుల వల్ల ఆతిథ్య రంగంలో నిపుణులైన మానవ వనరులకు డిమాండ్ ఏర్పడుతోంది. దీంతో హాస్పిటాలిటీ, హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు ఆదరణ పెరుగుతుంది. ఈ రంగంలో శిక్షణకు దేశంలోనే అత్యుత్తమ సంస్థలు.. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఐహెచ్‌ఎం)లు. ఈ సంస్థలను నేషనల్ కౌన్సిల్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ పర్యవేక్షిస్తుంది. ఇవి అందించే బీఎస్సీ (హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే పరీక్ష, సీట్లు, ప్రిపరేషన్ విధానం తెలుసుకుందాం...



అవకాశాలకు... ఆతిథ్యం

కెరీర్ గైడ్

హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ (బీఎస్సీ) కోర్సుల్లో ప్రవేశానికి ఎన్‌సీహెచ్‌ఎంసీటీ దేశ వ్యాప్తంగా జాయింట్ ఎంట్రెన్స్ టెస్ట్ (జేఈఈ)ను నిర్వహిస్తుంది. ఈ పరీక్ష ద్వారా 58 ఐహెచ్‌ఎంల్లో ప్రవేశం పొందొచ్చు. వీటిలో 21 జాతీయ సంస్థ (ఐహెచ్‌ఎం)లు, 22 రాష్ట్రీయ, 14 ప్రైవేట్ సంస్థలు, ఒక ప్రభుత్వ రంగ సంస్థ ఉన్నాయి. ఇందులో తెలుగు రాష్ట్రాల్లోని సంస్థల వివరాలు..

సంస్థ	సీట్ల సంఖ్య
ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ - హైదరాబాద్	230
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ - హైదరాబాద్	60
స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ - తిరుపతి	60
తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కావేలీ గ్రామం, సంగారెడ్డి జిల్లా	60
ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ - హైదరాబాద్	120


లెర్నింగ్ బై డూయింగ్

బీఎస్సీ (హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) కోర్సు వ్యవధి మూడేళ్లు. మొదటి ఏడాది ఆతిథ్య రంగంలోని అన్ని అంశాలపై అవగాహన కల్పిస్తారు. హౌస్ కీపింగ్, ఫ్రంట్ ఆఫీస్, ఫుడ్ అండ్ బేవరేజెస్, ప్రొడక్షన్ / సర్వీసెస్ తదితర విభాగాల్లో ప్రాథమికాంశాలపై శిక్షణ ఇస్తారు.

- ఇవేకాకుండా వివిధ కొలతలు (టీ స్పూన్, టేబుల్ స్పూన్), ఏవి ఎంత మొత్తంలో వాడాలి, డైనింగ్ టేబుల్ ఎటికెట్స్, అతిథితో ఎలా వ్యవహరించాలి... ఇలా ప్రతి అంశం గురించి పూర్తిగా అవగాహన కల్పిస్తారు.
- రెండో సంవత్సరంలో క్షేత్రస్థాయి శిక్షణ ఉంటుంది. విద్యార్థులు పని చేస్తూ నేర్చుకుంటారు (లెర్నింగ్ బై డూయింగ్). ఏదైనా హోటల్ లేదా క్యాటరింగ్ సంస్థ ద్వారా తర్ఫీదు ఇస్తారు.
- మూడో సంవత్సరంలో ఫైనాన్స్, బిజినెస్ ఎన్విరాన్‌మెంట్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, హోటల్ అకౌంటెన్సీ, ఫుడ్ సేఫ్టీ అండ్ క్వాలిటీ, హ్యూమన్ రీసోర్స్ మేనేజ్‌మెంట్, ఫెసిలిటీ ప్లానింగ్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, టూరిజం మార్కెటింగ్ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ అంశాలను పూర్తిస్థాయిలో బోధిస్తారు.

ముఖ్య సమాచారం

- అర్హత: ఇంగ్లీష్ ఒక సబ్జెక్ట్‌గా 10+2 / తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత, చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు కూడా అర్హులే.
- వయసు: 22 ఏళ్లు (2018 జూలై 1 నాటికి)
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 11, 2018.
- పరీక్ష తేదీ: ఏప్రిల్ 28, 2018.
- వెబ్‌సైట్: www.nchm.nic.in



జేఈఈ ఇలా

రాత పరీక్షను ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ప్రశ్నాపత్రం ఇంగ్లీష్ / హిందీ భాషల్లో మాత్రమే ఉంటుంది. ఇందులో ఐదు విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. సమాధానాలను గుర్తించడానికి మూడు గంటల సమయాన్ని కేటాయిస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. నెగిటివ్ మార్కింగ్ కూడా ఉంది. ప్రతి తప్పునకు 0.25 మార్కు కోత విధిస్తారు. మొత్తం 200 ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నల విభజన ఇలా ఉంటుంది.

విభాగం	ప్రశ్నల సంఖ్య
న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్	30
రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్	30
జనరల్‌నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్	30
ఇంగ్లీష్ లాంగ్వేజ్	60
ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్	50

- ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్ విభాగంలో పూర్తిగా సరైన సమాధానానికి ఒక మార్కు, కొంత వరకు సరైన జవాబుకు ముప్పావు (0.75) మార్కు, తరవాత స్థాయిలో సరైన దానికి అర మార్కు (0.50) ఇస్తారు.

జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్

ప్రపంచవ్యాప్తంగా సామాజికంగా, రాజకీయంగా, శాస్త్ర - సాంకేతిక తదితర రంగాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలపై అభ్యర్థుల అవగాహనను ఈ విభాగంలో పరీక్షిస్తారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలను నిశితంగా గమనించాలి.

- అవార్డులు, క్రీడలు, శాస్త్ర - సాంకేతిక పరిశోధనలు, ఎన్నికలు, చట్టాలు, వార్తల్లో వ్యక్తులు, నియామకాలు తదితర అంశాలను సమగ్రంగా ఫాలో కావాలి. పరీక్ష తేదీకి ముందు ఆరు నుంచి ఎనిమిది నెలల కాలంలో చోటుచేసుకున్న పరిణామాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- స్టాక్ జీకే కూడా చదవాలి. హోటల్ పరిశ్రమకు సంబంధించిన ప్రశ్నలు కూడా రావచ్చు. వివిధ సంస్థలు నిర్వహించే హోటల్స్ పేర్లు, నూతనంగా ప్రవేశించిన సంస్థలు, మార్పులపై అవగాహన పెంచుకోవాలి.

ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్

ఈ విభాగంలో సంబంధిత రంగంలో రాణించడానికి అవసరమైన నైపుణ్యాలను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. ఇటువంటి ప్రశ్నలకు సమయస్ఫూర్తితో సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ప్రత్యేకంగా ఎటువంటి ప్రిపరేషన్ అవసరం లేదు.

ఇంగ్లీష్ లాంగ్వేజ్

తక్కువ సమయంలో ఎక్కువ స్కోర్ చేసే అవకాశం ఉన్న విభాగం. ఈ విభాగానికి అత్యధిక వెయిటేజీ ఇచ్చారు. కాబట్టి ఫలితాల్లో ఈ మార్కులే కీలకంగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రిపరేషన్‌లో ఇంగ్లీష్ టాపిక్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ఇందులో ఎర్రర్ స్పాటింగ్, ఫిల్ ఇన్ ద బ్లాంక్స్, ఒకాబులరీ, స్పెల్లింగ్, బేసిక్ గ్రామర్, సెంటెన్స్ స్ట్రక్చర్, ఫ్రేజెస్, యాంటినిమ్స్ - సినానిమ్స్, కాంప్రెహెన్షన్ తదితర అశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. బేసిక్ గ్రామర్ అంశాలపై దృష్టిసారిస్తే ఇందులో మెరుగైన స్కోర్ సాధించవచ్చు.

మాదిరి ప్రశ్నలు

Directions (Q.nos. 1 to 2): In these questions choose the word opposite in meaning (antonym) to the given words.

1. ACCOLADE
   A) Marmalade B) Agreement
   C) Disapproval D) Understand
2. ILLUMINATE
   A) Dim B) Heat C) Specific D) Brighten

న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్

ఈ విభాగంలో గణితంతో ముడిపడిన సమస్యలు ఉంటాయి. టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ వర్క్, ట్రైన్స్, సింపుల్ ఇంట్రెస్ట్, రేషియో, పార్టనర్‌షిప్, ఎల్‌సిఎం, హెచ్‌సిఎఫ్, కాంపౌండ్ ఇంట్రెస్ట్, నెంబర్స్, పర్సంటేజ్, ఏరియాస్, ప్రొబబిలిటీ, పర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. మిగతా విభాగాల పోల్చితే ఇందులోని ప్రశ్నలను సాధించడానికి కొంత సమయం పడుతుంది.

- తక్కువ సమయంలో ఎక్కువ ప్రశ్నలను ప్రయత్నించేలా సన్నాహకాలు ఉండాలి. ఇందుకు ఏకైక మార్గం ప్రాక్టీస్. వీలైనన్నీ సమస్యలను ప్రాక్టీస్ చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. సిలబస్‌లో ఒక అంశాన్ని తీసుకుంటే దానికి సంబంధించిన ప్రాథమిక భావనలు, సూత్రాలను క్షుణ్నంగా అవగాహన చేసుకోవాలి. తరవాత సమస్యను సాధించడం అలవాటు చేసుకోవాలి. తద్వారా ప్రాథమిక భావనలపై పట్టు ఏర్పడుతుంది.
- కొన్ని షార్ట్‌కట్ మెథడ్స్ నేర్చుకోవాలి. వీటిని నోట్స్ రూపంలో రాసుకోవడం ప్రయోజనకరం. ఒక అంశాన్ని తీసుకుంటే.. దానికి సంబంధించి ఎన్ని రకాలుగా ప్రశ్నలు అడిగే అవకాశం ఉందో ముందే ఊహించుకొని ప్రాక్టీస్ చేయాలి. కింది మాదిరి ప్రశ్నలను పరిశీలించండి.

- Two pipes can fill a tank in 10 hours and 12 hours respectively while a third pipe empties the full tank in 20 hours. If all the three pipes operate simultaneously, in how much time will the tank be filled?
  (1) 6 hrs 45 min (2) 7 hrs 30 min
  (3) 7 hrs 15 min (4) 7 hrs 45 min
- The difference of the squares of two consecutive odd integers is divisible by which of the following integers?
  (1) 3 (2) 6 (3) 7 (4) 8

రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్

అభ్యర్థుల తార్కిక శక్తిని పరీక్షించే విభాగం. ముఖ్యంగా సందర్భానుసారం సమయస్ఫూర్తిగా ఎలా వ్యవహరిస్తారో తెలుసుకునేందుకు ప్రాధాన్యం ఇస్తారు. ఈ క్రమంలో వెర్బల్, నాన్ వెర్బల్, క్రిటికల్ థింకింగ్, సోషల్ ఇంటెలిజెన్స్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్ సంబంధిత అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

- అనాలజీ, ప్రాబ్లమ్ సాల్వింగ్, బ్లడ్ రిలేషన్స్, రీజనింగ్, అర్థమెటిక్, నెంబర్ సిరీస్, కోడింగ్ - డికోడింగ్, డేటా సఫిషియెన్సీ, డైరెక్షన్ సెన్స్, ర్యాంకింగ్స్, సీట్ అరేంజ్‌మెంట్స్, వర్డ్ బిల్డింగ్, వెన్ డయాగ్రమ్స్, స్పేస్ విజువలైజేషన్, మ్యాచింగ్ వంటి టాపిక్స్‌పై దృష్టి సారించాలి.
- ఈ విభాగం కోసం బేసిక్ మేథమెటిక్స్, అల్ఫాబెట్ టెస్ట్ అంశాలను బాగా ప్రాక్టీస్ చేయాలి. తద్వారా సిలబస్‌పై ఒక అవగాహన వస్తుంది. టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ వర్క్, ట్రైన్స్, సింపుల్ ఇంట్రెస్ట్, నెంబర్స్, పర్సంటేజ్, ఏరియాస్, పార్టనర్‌షిప్ వంటి కీలకమైన అంశాలపై ప్రధానంగా దృష్టిసారించాలి.
- ఈ విభాగంలో ఎక్కువ స్కోర్ చేయాలంటే వేగంతో పాటు కచ్చితత్వం కూడా అవసరం. కాబట్టి సమయాన్ని నిర్దేశించుకొని ప్రాబ్లమ్స్‌ను సాల్వ్ చేయడం నేర్చుకోవాలి.

మాదిరి ప్రశ్నలు

- A is B's sister. C is B's mother. D is C's father. E is D's mother. Then, how is A related to D?
  (1) Grandfather (2) Grandmother
  (3) Daughter (4) Granddaughter
- Complete the series. 1, 2, 3, 10, ? , 9802
  (1) 99 (2) 199 (3) 299 (4) 999

భిన్నత్వం.. ఏక పౌరసత్వం



పోటీ పరీక్షల ప్రత్యేకం
పాలిటీ

పౌరసత్వమనే భావన మొదటగా గ్రీకు నగర రాజ్యాల్లో మొదలైంది. ఆధునిక జాతి - రాజ్యాల అవతరణ తరవాత పౌరసత్వ భావనకు మరింత ప్రాధాన్యం పెరిగింది. ప్రఖ్యాత రాజనీతి తత్వవేత్త అరిస్టాటిల్ 'పౌరుల సమాజమే రాజ్యం' అని అభివర్ణించాడు.

ఏ దేశ జనాభానైనా రెండు వర్గాలుగా విభజిస్తారు. అవి పౌరులు, విదేశీయులు. పౌరసత్వమనేది.. ఒక దేశంలో వ్యక్తికి చట్టబద్ధ గుర్తింపుతోపాటు పౌర, రాజకీయ హక్కులను అందిస్తుంది. కొన్ని సందర్భాల్లో విదేశీయులకు కూడా మానవతా దృష్ట్యా కొన్ని పౌర హక్కులను కల్పిస్తారు. రాజకీయ హక్కులను ఇవ్వరు.

భారతదేశం - పౌరసత్వం

భారత రాజ్యాంగ నిర్మాణ దశలో పౌరసత్వానికి సంబంధించిన అంశాలకు అధిక ప్రాముఖ్యం ఇచ్చారు. భారత పౌరులకు కొన్ని ప్రత్యేక హక్కులు కల్పించాలని రాజ్యాంగ కర్తలు భావించారు.

భారత రాజ్యాంగం - పౌరుల ప్రత్యేక హక్కులు

రాజ్యాంగంలోని 15, 16, 19, 29, 30 అధికరణల్లో ప్రాథమిక హక్కుల వివరణ ఉంది. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, సుప్రీం కోర్టు/ హైకోర్టు న్యాయమూర్తులు, అటార్నీ జనరల్, రాష్ట్ర గవర్నర్, అడ్వకేట్ జనరల్ వంటి పదవుల ఆవశ్యకతను రాజ్యాంగంలో వివరించారు. పౌరులకు లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల ఎన్నికల్లో ఓటు వేసే అధికారంతోపాటు ఆ సభల్లో సభ్యులయ్యే అవకాశం కల్పించారు. అదే విధంగా పన్నులు చెల్లించడం, జాతీయ పతాకాన్ని, గీతాన్ని, గేయాన్ని గౌరవించడం, దేశరక్షణ వంటి కొన్ని నైతిక బాధ్యతలను పౌరులకు అప్పగించారు. రాజ్యాంగంలోని 14, 20, 21, 23, 25, 27 అధికరణల్లో విదేశీ పౌరులకు ఇచ్చే ప్రాథమిక హక్కుల వివరణ ఉంది.

పౌరసత్వ ప్రాతిపదికలు

భారత రాజ్యాంగం రెండో భాగంలో 5 నుంచి 11 వరకు ఉన్న అధికరణలు పౌరసత్వ భావనలను ప్రస్తావిస్తున్నాయి. అయితే ఇవి కేవలం రాజ్యాంగం అమలు నాటికి ఉన్న వ్యక్తులను గుర్తించింది తప్ప తరవాతి కాలంలో దేశ పౌరసత్వాన్ని పొందే విధానాల గురించి లేదా పౌరసత్వాన్ని కోల్పోయే పరిస్థితుల గురించి కానీ విశ్లేషణా పూర్వకంగా పేర్కొనలేదు. ఈ అధికారాన్ని 11వ అధికరణ ద్వారా భారత పార్లమెంటుకు దాఖలు చేశారు. అంటే పార్లమెంట్ కాలానుగుణంగా చేసే చట్టాల ద్వారా భారత పౌరసత్వాన్ని పొందే, కోల్పోయే పద్ధతులను నిర్ధారిస్తారు.

భారత పౌరసత్వ చట్టం - 1955

1955లో మొదటగా భారత పౌరసత్వ చట్టాన్ని రూపొందించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా 1986, 1992, 2003, 2005లలో ఈ చట్టాన్ని సవరించారు.

పౌరసత్వాన్ని పొందే పద్ధతులు

- **జన్మత:** 1950 జనవరి 26 తరవాత భారతదేశంలో జన్మించిన వారందరూ భారతీయ పౌరులవుతారు. అయితే విదేశీయులకు, విదేశీ రాయబారులకు ఈ నిబంధన వర్తించదు.
- **నమోదు:** భారతీయులను వివాహమాడిన విదేశీయులు కొన్ని షరతులతో పౌరసత్వాన్ని పొందొచ్చు.
- **సహజీకృతం:** విదేశీయులు తమకు సహజ సిద్ధంగా లభించిన మాతృ దేశ పౌరసత్వాన్ని త్యజించి భారతదేశం మీద ఉన్న మక్కువతో ఇక్కడి పౌరసత్వాన్ని కోరుకొంటే కొన్ని షరతులతో సహజీకృత పద్ధతి ద్వారా పౌరసత్వాన్ని కల్పిస్తారు.
- **వారసత్వ రీత్యా:** భారతీయ తల్లిదండ్రులకు విదేశాల్లో సంతానం కలిగినపుడు ఆ సంతానానికి వారసత్వ రీత్యా భారత పౌరసత్వం లభిస్తుంది.
- **భూభాగాల విలీనం ద్వారా:** ఏవైనా ఇతర భూభాగాలు భారత్‌లో విలీనమైతే ఆ భూభాగంలో నివసించే ప్రజలు భారత పౌరసత్వాన్ని పొందొచ్చు.

పౌరసత్వాన్ని త్యజించే పద్ధతులు

- **స్వతహాగా పరిత్యజించడం:** ఏ భారతీయ పౌరుడైనా విదేశీ పౌరసత్వాన్ని పొందాలంటే తనకు తానుగా భారత పౌరసత్వాన్ని వదులుకోవాలి. ఇలాంటి పరిస్థితుల్లో భారత ప్రభుత్వం అతని పౌరసత్వాన్ని రద్దు చేస్తుంది.
- **అంతమవటం:** భారతీయ పౌరసత్వం గల వ్యక్తి విదేశీ పౌరసత్వాన్ని స్వీకరించినపుడు సహజ సిద్ధంగానే భారత పౌరసత్వాన్ని కోల్పోతాడు.
- **అనివార్య తొలగింపు:** ఒక వ్యక్తి అక్రమంగా, మోసపూరితంగా భారత పౌరసత్వాన్ని పొందినా లేదా భారత సార్వభౌమత్వాన్ని సవాల్ చేసినపుడు ఆ వ్యక్తి పౌరసత్వాన్ని రద్దు చేస్తారు.



ఎల్. కొండబాబు

జాబ్ కార్నర్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఖాళీలు 50

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ)- స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- పోస్టు: డిప్యూటీ మేనేజర్ (ఇంటర్నల్ ఆడిట్)
- అర్హత: సీఏ పూర్తిచేసి ఉండాలి. సిఐఎస్ఏ అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది. 2017 డిసెంబరు 1 నాటికి బ్యాంకుల్లో స్టాట్యుటరీ / ఇంటర్నల్/ కంకరెంట్ ఆడిట్స్‌కు సంబంధించి కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి. ఎంఎస్ ఆఫీస్ పరిజ్ఞానం ఉండాలి.
- వయసు: 2017 జూన్ 30 నాటికి 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
- ప్రొబెషన్: ఏడాది
- ఎంపిక: ఆన్‌లైన్ రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్ ద్వారా
- ఆన్‌లైన్ టెస్ట్ వివరాలు: రీజనింగ్ నుంచి 50 ప్రశ్నలు (50 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 35 ప్రశ్నలు (35 మార్కులు), ఇంగ్లీష్ నుంచి 35 ప్రశ్నలు (35 మార్కులు), ప్రొఫెషనల్ నాలెడ్జ్ నుంచి 50 ప్రశ్నలు (100 మార్కులు) ఇస్తారు. ప్రొఫెషనల్ నాలెడ్జ్ టెస్ట్‌కు 45 నిముషాల సమయం ఇస్తారు. మిగిలిన టెస్టులన్నింటికీ కలిపి 90 నిముషాలు ఇస్తారు. ఈ టెస్టులన్నింటిలో క్వాలిఫై అయినవారిని ఇంటర్వ్యూ, జిడికి పిలుస్తారు. జిడికి 20 మార్కులు, ఇంటర్వ్యూకి 30 మార్కులు ఉంటాయి. జిడి నిర్వహించని పక్షంలో ఇంటర్వ్యూ 50 మార్కులకు ఉంటుంది. ఇంటర్వ్యూలో అభ్యర్థి సాధించిన మార్కులను 25 మార్కులకు గణించి వీటిని ప్రొఫెషనల్ నాలెడ్జ్ టెస్ట్ మార్కులతో కలిపి మెరిట్ లిస్ట్ తయారు చేస్తారు.
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, సికింద్రాబాద్, విశాఖపట్నం
- కాల్ లెటర్ డౌన్‌లోడింగ్: ఫిబ్రవరి 12 నుంచి
- ఆన్‌లైన్ టెస్ట్: ఫిబ్రవరి 25 నుంచి
- దరఖాస్తు ఫీజు: రూ.600
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: జనవరి 28
- వెబ్‌సైట్: www.sbi.co.in

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ

ఖాళీలు 60

గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ - అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఆర్ట్స్ గ్రూపులోని ఖాళీలు: 26 (కామర్స్ & బిజినెస్ మేనేజ్‌మెంట్ 4, ఎకనామిక్స్ 5, ఇంగ్లీష్ 2, లా (లీగల్ స్టడీస్) 3, పొలిటికల్ సైన్స్ 3, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ 4, రూరల్ డెవలప్‌మెంట్ 1, తెలుగు & ఓరియంటల్ లాంగ్వేజెస్ 4)
- సైన్స్ గ్రూపులోని ఖాళీలు: 22 (బయోటెక్నాలజీ 4, బోటనీ & మైక్రో బయాలజీ 4, కెమిస్ట్రీ 2, జియాలజీ 2, మేథమెటిక్స్ 3, ఫార్మసీ 2, ఫిజిక్స్ 1, స్టాటిస్టిక్స్ 1, యుఎస్ఐసి & ఇ & ఐటి 1, జువాలజీ 2)
- ఇంజనీరింగ్ గ్రూపులోని ఖాళీలు: 11 (ఆర్కిటెక్చర్ & ప్లానింగ్ 1, సివిల్ 2, కంప్యూటర్ సైన్స్ 3, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ 2, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్ 1, మెకానికల్ 2)
- రీసెర్చ్ సెంటర్ గ్రూపులోని ఖాళీలు: సైంటిఫిక్ సోషలిజం 1
- అర్హత: సంబంధిత సబ్జెక్టులో కనీసం 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. నెట్ / స్లెట్/ సెట్ అర్హత పొంది ఉండాలి. పిహెచ్‌డి అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఎంపిక: స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా
- స్క్రీనింగ్ టెస్ట్ వివరాలు: ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్ 1 అందరికీ కామన్‌గా ఉంటుంది. పేపర్ 1లో టీచింగ్ అండ్ రీసెర్చ్ ఆప్టిట్యూడ్‌కి సంబంధించిన 120 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు (120 మార్కులు) ఇస్తారు.
- పేపర్ 2లో సంబంధిత సబ్జెక్టు నుంచి 180 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు (180 మార్కులు) ఇస్తారు. పేపర్ 1కి రెండు గంటలు, పేపర్ 2కి మూడు గంటల పరీక్ష సమయం ఉంటుంది. నెగెటివ్ మార్కింగ్ ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3 వంతు మార్కు కోత ఉంటుంది. స్క్రీనింగ్ టెస్ట్‌లో కనీస కటాఫ్ మార్కులు సాధించిన వారిని మాత్రమే ఇంటర్వ్యూకి పరిగణనలోకి తీసుకుంటారు.
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: జనవరి 25
- దరఖాస్తు కాపీ చేరడానికి ఆఖరు తేదీ: జనవరి 30
- వెబ్‌సైట్: www.anu.ac.in



ఫోకస్

గోఆధారిత సేద్యమే రక్ష

సహజ వనరులతో సేద్యం చేయడం ఒక్కటే రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభాలకు పరిష్కారం అంటున్నారు ప్రకృతి సేద్యం ఉద్యమకారుడు పద్మశ్రీ సుభాష్ పాలేకర్. జనవరి 8 వరకు ప్రకృతి సేద్యంపై పాలేకర్ సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుంటూరు నాగార్జునా విశ్వవిద్యాలయం సమీపంలో శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నది. ఈ సదస్సులో పాల్గొన్న రైతులను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది.

హరిత విప్లవం పేరుతో మనం అనుసరిస్తున్న వ్యవసాయ విధానాలు సరికావని స్పష్టం అవుతున్నది. దేశవ్యాప్తంగా పత్తి రైతుకు అపారనష్టం కలిగించిన గులాబీ పురుగును అరికట్టడంలో శాస్త్రవేత్తలు ఎందుకు విఫలమయ్యారని ప్రశ్నించారు గో ఆధారిత సేద్యం ఉద్యమకారుడు పద్మశ్రీ సుభాష్ పాలేకర్. రైతులతో పాటు విచ్చలవిడిగా సాగుతున్న రసాయనాల వినియోగం ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నది. గో ఆధారిత సేద్యమే ఈ సమస్యకు పరిష్కారం. ఒక ఆవుతో రైతు 20-25 ఎకరాలు సాగు చేయవచ్చు. అందువల్ల రైతులంతా ఆవులు కొనాలి. గత ఏడాది అప్పుల బారిన పడిన వేలాదిమంది రైతులు ఆత్మాభిమానంతో ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ విధ్వంసం ఆగాలంటే ఖర్చులేని ప్రకృతి వ్యవసాయమే శరణ్యమన్నారు పాలేకర్.

రైతులకు ఆవుల్ని ఇవ్వాలి



రెండు తెలుగు రాష్ట్రాల్లో రైతుల ప్రయోజనం కోసం సబ్సిడీపై ఎరువులు, యంత్ర పరికరాలను ప్రభుత్వం అందజేస్తున్నది. అదేవిధంగా పెట్టుబడి లేని వ్యవసాయానికి మూలాధారమైన ఆవును ఉచితంగా రైతుకు అందజేయాలి.

- రవీంద్రరెడ్డి వనపర్తి, తెలంగాణ

అరెకరంలో ఆరు పంటలు



నాకున్న అరెకరంలో మిశ్రమ పంటలు పండిస్తూ అధిక ఆదాయాన్ని పొందుతున్నా. సాళ్ల వారిగా వరి, మినుము, కంది, బొబ్బర్లు, కూరగాయలు సాగు చేస్తున్నా. ఎటువంటి రసాయనాలు వాడని పంటకు మంచి డిమాండ్ వుంది. కషాయాల సేద్యం వల్ల ఆర్థికంగా స్థిర పడ్డాను. రైతులంతా ప్రకృతి సేద్యాన్ని తప్పక అనుసరించాలి.

- లింగా విజయ్ కుమార్, ఖమ్మం

పెట్టుబడిలేని సేద్యం మేలు



20 ఎకరాల బత్తాయి తోట సాగు చేస్తున్నాను. కేవలం ప్రకృతి ఎరువులు ఉపయోగిస్తున్నాను. నాణ్యమైన ఉత్పత్తులతో పాటు ఖర్చులు గణనీయంగా తగ్గించుకోగలిగాను. పెట్టుబడి లేని గో ఆధారిత సేద్యంలో ఎటువంటి ఎరువులూ వాడవలసిన అవసరం లేదు.

- ఈదా మాధవరెడ్డి, కాజ, గుంటూరు జిల్లా.

పశువు లేనిదే సేద్యం లేదు



పశువు లేనిదే సేద్యం లేదు ఒక గ్రాము ఆవు పేడ భూమిలో కలిస్తే 300 నుంచి 500 బ్యాక్టీరియాలను ఉత్పత్తి చేస్తుంది. ఈ విషయం తెలియక లక్షల రూపాయలు ఎరువులు, పురుగుల మందులకు ఖర్చు చేసి అప్పులు మిగుల్చుకున్నాను. ఆరేళ్లుగా ప్రకృతి సేద్యం చేస్తున్నాను. ఎకరాకు రూ.9వేల పెట్టుబడితో రూ.90 వేల ఆదాయం వస్తున్నది. పండిన ధాన్యాలను నేనే నేరుగా వినియోగదారుడికి అమ్ముతున్నాను. ఆవు పాలు అమ్మడంతోపాటు కోడెదూడలను అమ్ముతున్నాను.

- మేకా రాధాకృష్ణమూర్తి, మంత్రిపాలెం

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, గుంటూరు



విజయ గాథ

ఆయనో ప్రకృతి సేద్య ప్రేమికుడు... విత్తన సంరక్షకుడు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన ఆహారం లభించాలంటే దేశీ విత్తనాలతోనే సాధ్యం అని నమ్మారు. అందుకోసం అరుదైన దేశీ విత్తనాలను పరిరక్షిస్తున్నారు 3 ఎకరాల్లో 250 రకాల పంటలు పండిస్తూ ప్రకృతి సేద్యం లాభదాయకం అని నిరూపిస్తున్నారు రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం నాగరకుంటకు చెందిన గణపతి శివప్రసాదరాజు.

ప్రకృతి సేద్య ప్రేమికుడు

ఉద్యమంగా దేశీ విత్తన సంరక్షణ.. 3 ఎకరాల్లో 250 పంటలు సాగు చేస్తున్న రాజు

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం నాగరకుంటలో మూడెకరాల విస్తీర్ణంలో వున్న వ్యవసాయ క్షేత్రం 250 రకాల అరుదైన పంటలకు నిలయం. అడవిలో మొక్కలు పెరిగిన విధంగా అన్ని పంటల్నీ కలిపి, ప్రకృతి సేద్యం చేయడం ఈ క్షేత్రం ప్రత్యేకత. ఈ ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో 40 రకాల చిక్కుడు, నల్లమిర్చి, ఎర్ర మిర్చి, 3 రకాల గుమ్మడి, 12 రకాల టమాట, 8 రకాల సొరకాయలు... ఇలా 250 రకాల పంటలు సాగుచేస్తున్నాడు శివప్రసాద రాజు.

పశ్చిమగోదావరి జిల్లా భీమవరంకు చెందిన ప్రసాదరాజు డిగ్రీ వరకు చదివారు. వ్యాపారాలు చేసి చేతులు కాల్చుకున్నారు. ఆయన దృష్టి వ్యవసాయం మీదకు మళ్లింది. 5 ఎకరాల పొలం కౌలుకు తీసుకుని గోరుచిక్కుడు, వరి సాగు చేసి అనుభవం లేక ఆర్థికంగా చాలా నష్టపోయారు. విత్తనాల నుంచి ఎరువుల దాకా దిగుబడి ఖర్చులు పెరిగిపోవడమే రైతులు నష్టపోవడానికి కారణం అని గ్రహించారు. సాగుకు ప్రాణమైన విత్తనాలను మనమే తయారు చేసుకుని, ప్రకృతి పద్ధతుల్లో సాగు చేస్తే లాభాలు తప్పకవస్తాయని భావించారు. 2012లో నాగరకుంటలో 3.2 ఎకరాల్లో విలక్షణ సాగుకు శ్రీకారం చుట్టారు. దేశీ విత్తనాల సంరక్షణను ఉద్యమంగా చేపట్టారు. 250 రకాల పంటలను అడవిలో అన్ని రకాల చెట్లు ఎలా కలసి పెరుగుతాయో, అంతే సహజంగా... అన్ని పంటలను కలిపి సాగు ప్రారంభించారు. సీజన్‌కు అనుగుణంగా పంటలను మారుస్తున్నారు. చీడపీడల నివారణకు కేవలం జీవామృతాన్ని పిచికారీ చేస్తున్నారు. పురుగుల ఉధృతి ఎక్కువగా వుంటే అగ్ని అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారు. పంట పూత, కాయ దశలో చేపల ద్రవాన్ని బెల్లంతో కలిపి పంటలకు అందిస్తున్నారు. ప్రకృతి సిద్ధంగా ఈ రైతు పండిస్తున్న ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి ధర పలుకుతున్నది. నేను ఒక్కడినే మంచి పంటలు పండించడం కాదు.. రైతులంతా దేశీ విత్తనాలతోనే సాగు చేయాలనే లక్ష్యంతో విత్తన సంరక్షణ చేపట్టారు రాజు. ప్రకృతి ప్రేమికుడు హరినాథ్‌రెడ్డి ప్రేరణతో దేశీయ విత్తనాల ప్రాధాన్యత తెలుసుకున్నారు. దేశమంతా పర్యటించి అరుదైన విత్తనాలు సేకరించారు. ఇప్పటివరకు 420 రకాల వరి విత్తనాలను, 250 రకాలకు పైగా కూరగాయల విత్తనాలను సేకరించారు. వాటితో విత్తనోత్పత్తి ప్రారంభించారు. మేలురకం విత్తనాలను తక్కువధరకు సాటి రైతులకు అందిస్తున్నారు. దేశీ విత్తనాన్ని పరిరక్షించే జాతీయ స్థాయి సంస్థ బీజ్ స్వరాజ్ మంచ్‌లో ఈ రైతుకు స్థానం లభించింది. జీఎం విత్తనాలకు వ్యతిరేకంగా పనిచేసే 55 సంస్థలున్న ఈ మంచ్‌లో రాజుకు స్థానం దక్కడం విశేషం.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, రంగారెడ్డి అర్బన్

దేశీ విత్తనాలే రక్ష : ప్రసాదరాజు

అత్యంత ఘాటైన మిరప భూత్ జిలోకియను మేఘాలయ నుంచి తెచ్చి సాగు చేస్తున్నాను. ఏడు నెలల పాటు కాసే కాశీ టమాటాను చండీఘర్ నుంచి తెచ్చాను. ఇండియన్ వయాగ్రాగా పిలిచే నవార రకం వరి, కేన్సర్‌ను దూరం చేసే నల్ల బియ్యాన్ని సాగు చేస్తున్నాను. వాటి విత్తనాలను పరిరక్షిస్తున్నాను. లక్షల సంఖ్యలో వుండే దేశీ విత్తనాలు ఇప్పుడు వేలకు పడిపోయాయి. వాటిని కాపాడుకుంటేనే మన వ్యవసాయం బతుకుతుంది. ఆ పంటలు ఆహారంగా తీసుకుంటేనే ప్రజలు ఆరోగ్యంగా వుంటారు.

రాజు ఫోన్ : 86868 71048



రాజు పండిస్తున్న పలు రకాల వంకాయలు



ప్రపంచంలోనే ఘాటైన మేఘాలయ నల్లమిరప



దేశీయ విత్తనాలు...

సహజ ఎరువుల మోహనుడు!

ఆదర్శంగా నిలుస్తున్న కొత్తగడి రైతు

సేంద్రియ సేద్యం మాత్రమే నేలతల్లితో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతుందని బలంగా నమ్మడంతో పాటు దాన్ని ఆచరణలో పెట్టి, సత్ఫలితాలు సాధిస్తున్నారు వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కొత్తగడికి చెందిన మోహన్‌రెడ్డి.

ఆదర్శం

డిగ్రీ చదివిన మోహన్ రెడ్డి వ్యవసాయ మీద ఉన్న ప్రేమతో ఉద్యోగాన్ని వదులుకున్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో సాగు పద్ధతుల్ని అధ్యయనం చేశారు. సేంద్రియ సేద్యం మాత్రమే రైతుకు మేలు చేస్తుందని భావించారు. సేంద్రియ పద్ధతిలో టమాట, క్యారెట్, బీర, కాకర, బొప్పాయి, వంకాయ, కాలీఫ్లవర్, క్యాబేజి తదితర పంటల సాగు చేపట్టారు. గత ఏడాది ఎకరంలో 40 టన్నుల టమాటా దిగుబడి సాధించానన్నారు మోహన్‌రెడ్డి. వేస్ట్ డీ కంపోస్ట్ బాక్టీరియా, జీవామృతాలతో సేద్యం చేస్తున్నారాయన. సేంద్రియ సాగుతో రైతుకు పెట్టుబడి ఖర్చులో 70 శాతం తగ్గుతుంది. అంతేకాకుండా సేంద్రియంగా పండించే కూరగాయలు తినే వారిపై ఎలాంటి చెడు ప్రభావం వుండదు. పెట్టుబడి తగ్గడం వల్ల రైతుకు లాభం ఎక్కువగా వస్తుందంటారాయన. విలక్షణమైన ఆయన సాగు విధానాలు చూసేందుకు సాటి రైతులతో పాటు శాస్త్రవేత్తలు కూడా ఆయన క్షేత్రాన్ని సందర్శించడం విశేషం.





వేస్ట్ డీ కంపోస్ట్ బ్యాక్టీరియా అనేది ప్రస్తుతం కూరగాయల పంటలు సాగు చేసేవారికి వరంగా మారింది. దీన్ని రైతులు పొలంలోనే తయారు చేసుకోవచ్చు. ఒక మిల్లీలీటర్ మదర్ కల్చర్ నూనెను 200 లీటర్ల నీటిలో వేసి అందులో రెండు కిలోల బెల్లం, పప్పు ధాన్యాల పిండి వేయాలి. ఏడు రోజుల పాటు దీనిని నానబెట్టాలి. నానబెట్టే క్రమంలో అప్పుడప్పుడు కలుపుతూ ఉండాలి. ఈ మిశ్రమాన్ని పొలాలపై పిచికారీ చేస్తే పంటలను ఆశించే చీడపీడలు పంటల దరిచేరవు. ముఖ్యంగా ఇది దోమపోటుకు బాగా పని చేస్తుంది. ఈ మిశ్రమాన్ని చెట్టు మొదట వేస్తే చెట్టు బలంగా పెరుగుతుంది.

సేంద్రియ సాగులో జీవామృతం అనేది చాలా కీలకం. జీవామృతం వాడటం వల్ల పంట ఏపుగా పెరుగుతుంది. పంటపై పిచికారీ చేస్తే చీడ పీడలు ఆశించవు అదే విధంగా మొక్క కాండం వద్ద జీవామృతం పోస్తే మొక్క ఏపుగా పెరిగి అధిక దిగుబడి వస్తుంది. దీనిని రైతు ఇంటి వద్ద, పొలం వద్ద సులువుగా తయారు చేసుకోవచ్చు. 200 లీటర్ల నీటిలో 10 లీటర్ల గో మూత్రం, 10 కిలోల గోవు తాజా పేడ, 2 కిలోల బెల్లం వేసి కలపాలి. అదే విధంగా ఇందులో పప్పుధాన్యాల పిండి(ఏదైనా పప్పు ధాన్యం), కొంత ఒరంగట్టు మట్టిని కలపాలి. ఈ మిశ్రమాన్ని రోజుకు నాలుగుసార్లు కలిపి 48 గంటలు నానబెట్టాలి. ఈవిధంగా తయారుచేసిన జీవామృతం మిశ్రమాన్ని నేరుగా చెట్లకు పిచికారీ చేయాలి. అదే విధంగా చెట్టు కాండం వద్ద పోయవచ్చు.


- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, అనంతగిరి



ఖరీఫ్‌లో వరి పంట చేతికి వచ్చే సమయంలో దోమపోటుతో పంట నష్టపోయాం. రబీ నార్లు చలి కారణంగా సరిగా ఎదగడం లేదు. దీనికితోడు నార్లకు అగ్గి తెగులు, మొగి పురుగు సోకుతున్నాయి. నారు దశలోనే రెండు, మూడుసార్లు మందులు పిచికారీ చేయాల్సి వస్తోంది. నారు సక్రమంగా ఎదిగేందుకు ఏం చేయాలి?

- ముత్యాల గంగారెడ్డి, రైతు, తాటిపెల్లి

నారు ఎదగడం లేదు.. ఏం చేయాలి?



సమస్య - సమాధానం

రబీ సీజన్‌లో సాధారణంగా చలి తీవ్రత పెరుగుతుంది. అందుకోసం స్వల్పకాలిక, చలిని తట్టుకునే వరి రకాలను ఎంచుకోవడం ఉత్తమం. ఫిబ్రవరి 15 తర్వాత వరి పంట పూత దశ దాటే విధంగా చూసుకోవాలి. పూత దశలో చలి ఎక్కువగా వుంటే పంట నష్టపోయే ప్రమాదం ఉంది. ఏప్రిల్ మొదటి వారం లోపు పంట కోత పూర్తయ్యే విధంగా చూసుకోవాలి. లేదంటే ఎండ వేడిమి పెరగడంతోపాటు నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉంది. ఇదంతా జరగాలంటే జనవరి 10లోపు వరినాట్లు పూర్తయ్యే విధంగా చూసుకోవడం తప్పనిసరి. చలికి పోషకాల లోపంతో నారు సరిగా ఎదగకపోవడంతో పాటు ఆకుల రంగు మారిపోతోంది. జింక్ లోపం, ఇతర పోషకాల లోపం గానీ ఉంటే రైతులు గమనించి ఎగ్రోమిన్ వాక్స్ గానీ, ఫార్ములా - 4, ఫార్ములా - 6 వంటి మందులను లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున కలిపి నారుపై పిచికారీ చేయాలి. అలాగే అగ్గి తెగులు సోకినట్లైతే ట్రైసైక్లోజోన్ లీటరు నీటికి 0.6 గ్రాములు, మొగి పురుగు ఉధృతి ఉంటే ఎకరానికి సరిపోయే నారుకు 600-800 గ్రాముల 3జీ గానీ, 4జీ గానీ చల్లుకోవాలి. అలాగే నారుమడిలో ఉండే నీటిని ఉదయం తీసేసి, మళ్లీ కొత్త నీటిని పెట్టాలి. దీనివల్ల తెగుళ్ల ఉధృతి తగ్గే అవకాశం ఉంది.



- డాక్టర్ కిరణ్‌బాబు, శాస్త్రవేత్త, పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం



నయా మాల్

సోలార్ పవర్ స్ప్రేయర్

తక్కువ ఖర్చుతో సౌకర్యవంతమైన సోలార్ పవర్ స్ప్రేయర్, బోరుబావి మోటార్‌ను రిమోట్ సాయంతో ఆన్ చేసి ఆఫ్ చేసే పరికరాన్ని తయారు చేశారు వరంగల్ రూరల్ జిల్లాకు చెందిన ముప్పారపు రాజు.

తక్కువ ఖర్చుతో, ఎక్కువ ప్రయోజనం వున్న వ్యవసాయ పరికరాలు తయారుచేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు వరంగల్ రూరల్ జిల్లా దుగ్గొండి మండలం గోపాలపురం గ్రామానికి చెందిన ముప్పారపు రాజు. డిగ్రీ వరకు చదివిన రాజు ఇప్పటికే పలు వ్యవసాయ పరికరాలను తయారుచేసి ప్రశంసలు పొందారు. తాజాగా సోలార్ పవర్ స్ప్రేయర్, ఆటోమెటిక్ స్టార్టర్, కలుపు తీసే కొడవలిని తయారు చేశారు. పంటలకు తెగుళ్లు సోకినప్పుడు వాటిని నివారించేందుకు మందులు పిచికారీ చేస్తారు రైతులు. అందుకోసం పెట్రోల్‌తో నడిచే స్ప్రేయర్లు మార్కెట్‌లో అందుబాటులో వున్నాయి. వాటికంటే సౌకర్యవంతంగా, శబ్దం లేకుండా, తక్కువ ఖర్చుతో సోలార్ పవర్ స్ప్రేయర్‌ను తయారు చేశారు రాజు. ఈ పరికరంతో తక్కువ శ్రమతో వేగంగా మందులు స్ప్రే చేయవచ్చు. ఐదు లీటర్ల ట్యాంక్, డీసీ మోటార్, సోలార్ ప్యానల్ వంటి పరికరాలతో ఈ స్ప్రేయర్‌ను తయారు చేశారు. సోలార్ పవర్ ప్యానల్‌ను ప్లైవుడ్ చెక్కకు బిగించి రైతు తలకి ఎండ తగలకుండా అమర్చారు. ప్లాస్టిక్ ట్యాంక్ ఉపయోగించి, ఎక్కువ దూరం మందును చల్లే విధంగా ఆ పరికరాన్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్దారు. 3 గంటలు ఎండలో ఉంచితే ఈ పరికరాన్ని 8 గంటలు వాడవచ్చు. 10 అడుగుల వరకు దూరం వరకు స్ప్రే చేయగలుగుతుంది. ఈ పరికరానికి పెద్దగా మరమ్మతులు అవసరం లేదు. దీన్ని తయారు చేయడానికి రూ.6 వేలు ఖర్చయినట్టు రాజు తెలిపారు. మార్కెట్‌లో దీన్ని రూ.8 వేలకు విక్రయిస్తున్నారు. పెట్రోల్‌తో నడిచే పవర్ స్ప్రేయర్ రూ.10 నుంచి రూ. 20వేల వరకు ధర పలుకుతున్నది.



రైతులు విద్యుత్ ప్రమాదాలు బారిన పడకుండా ఉండేందుకు రిమోట్‌తో పనిచేసే బోరుబావి మోటార్‌ను తయారు చేశారు రాజు. దూరం నుంచే మోటార్‌ను ఆన్, ఆఫ్ చేయవచ్చు. రేడియో తరంగాలతో పనిచేస్తే ట్రాన్స్‌మీటర్, రిసీవర్‌ను తీసుకుని దానిని స్టార్టర్‌కి అనుసంధానం చేసి ట్రాన్స్‌మీటర్‌ని నొక్కినప్పుడు మోటార్ ఆన్ అవుతుంది. ఆఫ్ నొక్కగానే ఆగిపోయేలా దీన్ని రూపొందించారు. స్థానికంగా దొరికిన పరికరాలతో దీన్ని తయారు చేయడం విశేషం. రిమోట్ 300 మీటర్ల దూరం వరకు పనిచేస్తుంది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్ రూరల్

మన ఇల్లు.. మన కూరగాయలు

మార్కెట్‌లో కొంటున్న ఆకు కూరలు, కూరగాయలు రుచీ పచీ వుండవు. మందులు కొట్టి పండించే ఈ తిండి తింటే ఆరోగ్యం ఏమవుతుందో అని అందోళన చెందని పట్టణవాసులు వుండరు. సిటీలో మన ఇంటి డాబా మీద, పెరట్లో, ఇంటి ముందు కుండీల్లో మనం తినే కూరగాయలను మనమే పండించుకుంటే రుచికరమైన కూరగాయలతో పాటు కొండంత సంతృప్తి కూడా మన సొంతం అవుతుంది. ఆ ఆలోచన నుంచి పుట్టిందే మన ఇల్లు - మన కూరగాయల పథకం. జంట నగరాల్లో నివసిస్తున్న ఇలాంటి పర్యావరణ ప్రియుల కోసం తెలంగాణ ప్రభుత్వం మన ఇల్లు - మన కూరగాయలు పథకాన్ని అమలు చేస్తున్నది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద మన ఇల్లు- మన కూరగాయలు పథకంలో భాగంగా అర్బన్ ఫార్మింగ్ యూనిట్లను ప్రభుత్వం జంటనగరాల ప్రజలకు సబ్సిడీపైన సరఫరా చేస్తున్నది. పట్టణంలో నివసిస్తూ 50 నుంచి వంద చదరపు అడుగుల వరకు ఇంటి పైకప్పు/పెరటి స్థలం/బాల్కనీ ఉండి.. నీటి సదుపాయం ఉన్నవారు ఈ పథకానికి అర్హులు. దరఖాస్తుదారుడు తన అడ్రస్ ప్రూఫ్‌తో పాటుగా పాస్‌పోర్టు సైజు ఫొటోనూ జత చేర్చి ఉద్యానవన శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. ఈ పథకం 200 చదరపు అడుగులకు మించి మంజూరు చేయరు.

పట్టణ ప్రజలు వారి ఇళ్లలో సేంద్రియ పద్ధతుల్లో కూరగాయలు, ఆకుకూరలు పండించుకునేందుకు వీలుగా తెలంగాణ ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు, సహజ ఎరువులు, వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నది. ఆసక్తి వున్న వారికి కూరగాయలు పండించడంలో శిక్షణ కూడా ఇస్తున్నది.

కిట్ - ఏ లో ఉండే వస్తువులు : నాలుగు సిల్పాలిన్ కవర్లు(40 ఇంచుల డయా, 12 ఇంచుల లోతు, 250జీఎస్ఎం), 52 ఘనపు అడుగుల ఎర్రమట్టి, పశువుల ఎరువు, 2:1 నిష్పత్తిలో 20 పాలీ బ్యాగులు), 12 రకాల కూరగాయల విత్తనాలు, 25 కిలోల వేపపిండి, 500 మిల్లీలీటర్ల వేపనూనె, కుర్పీ, సికేచర్, చిన్న స్ప్రేయర్, షవర్ వంటి పనిముట్లు ఇస్తారు.

కిట్ - బిలో ఇచ్చే వస్తువులు : 12 అంగుళాల డయా, 12 అంగుళాల లోతు వున్న 22 బ్యాగులు, 26 ఘనపుటడుగుల మట్టి, పశువుల ఎరువు, 2:1 నిష్పత్తిలో పాలీ బ్యాగుల మట్టి మిశ్రమం, 25 కిలోల వేప పిండి, 500 మిల్లీ లీటర్ల వేపనూనె, కుర్పీ, సికేచర్, చిన్న స్ప్రేయర్, షవర్ వంటి పనిముట్లు ఉంచిన చేతి సంచిని ఇస్తారు. ఈ పథకంలో భాగంగా కూరగాయలను గచ్చు/బాల్కనీ/పైకప్పులపై పెంచుకోవచ్చు. 3 నుంచి4 అడుగుల వెడల్పు, 9-20 అంగుళాల లోతు ఉండే బెడ్లను తయారుచేసి పెంచవచ్చు. సూర్య రశ్మి, సాగునీటి లభ్యత చూసుకోవాలి. కాగా.. ఎర్రమట్టి, సేంద్రియ ఎరువులను 2:1 నిష్పత్తిలో ఉపయోగించాలి. సేంద్రియ ఎరువులుగా పూర్తిగా కుళ్లిన పశువుల ఎరువు/వర్మీ కంపోస్టు/కోకాపీట్‌లను లేదా వీటి మిశ్రమాన్ని ఉపయోగించాలి. మన ఇల్లు మన కూరగాయలు కార్యక్రమంలో ఆకు కూరలు (పాలకూర, మెంతికూర, కొత్తిమీర, చుక్కకూర, గోంగూర, బచ్చలి, తోటకూర, పుదీన తదితరాలు), దుంప కూరలు(ముల్లంగి, క్యారట్, ఆలుగడ్డ, ఉల్లిపరక, బీట్ రూట్), పూల కూరలు(కాలి ఫ్లవర్, అరటి, క్యాబేజీ), గింజ కూరలు(బీన్స్, బఠానీలు, తీయని మొక్కజొన్న), కూరగాయలు(బెండ, వంకాయ, టమాటా, గోరుచిక్కుడు, తీగజాతి పందిరి రకాలైన సొరకాయ, కాకర, బీర, పొట్లకాయ), పండ్లు(ఆపిల్, రేగు, సీతాఫలం, బొప్పాయి)... పండడానికి అనువైన కూరగాయలు, పండ్ల రకాలు. పెరుగుతున్న జనాభా, కూరగాయల ఖర్చు, పోషకాహార లోపం, పట్టణాల్లో స్థలాభావాన్ని దృష్టిలో పెట్టుకుని ఉద్యానవనశాఖ జంటనగరాల్లో ఈ పథకాన్ని అమలు చేస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన దగ్గరినుంచీ ఈ పథకం కింద ఉద్యానవన శాఖ ఇప్పటివరకు 1886 యూనిట్లను లబ్ధిదారులకు అందజేసింది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, హైదరాబాద్



గార్డెనింగ్

పర్యావరణ ప్రేమికులకు ఉచిత శిక్షణ

ఈ పథకంలో భాగంగా కూరగాయలు పెంచేందుకు కావాల్సిన సిల్పాలిన్ కవర్లు, మట్టి మిశ్రమం, విత్తన సంచి, వేపపిండి, వేప నూనె, పనిముట్లను సగం సబ్సిడీపైన ఉద్యానవనశాఖ పౌరులకు అందిస్తుంది. ప్రతి ఇంటికీ 2 యూనిట్లను ఇవ్వడంతో పాటుగా సాగుపై ఉచిత శిక్షణా ఇస్తుంది. కిట్- ఏ యూనిట్ ధర రూ. 6 వేలు కాగా.. సబ్సిడీ పోను రూ. 3 వేలకు అందించనుంది. మట్టి మిశ్రమం లేకుండా అయితే సబ్సిడీ పోను రూ. 2 వేలకు కిట్‌ను అందిస్తుంది. కిట్ - బిని మట్టి మిశ్రమంతో అయితే రూ. 1900, మట్టి మిశ్రమం లేకుండా అయితే రూ. 1400కు పంపిణీ చేయనుంది.

సీఎంతో గంటల తరబడి మాట్లాడ్డం కాదు

హక్కుల పరిరక్షణపై గవర్నర్ జోక్యం చేసుకోవాలి: కిషన్‌రెడ్డి



హైదరాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణపై గవర్నర్ నరసింహన్ జోక్యం చేసుకోవాలని బీజేఎల్పీ నేత కిషన్‌రెడ్డి కోరారు. సీఎం కేసీఆర్‌తో గంటల తరబడి మాట్లాడ్డం కాదు.. హక్కుల పరిరక్షణపైనా జోక్యం చేసుకోవాల్సి బాధ్యత గవర్నర్‌పై ఉందన్నారు. ప్రజాస్వామ్యయుత ఆందోళనలపై టీఆర్ఎస్ ప్రభుత్వం నిషేధం విధించడంపై కేంద్రానికి గవర్నర్ నివేదించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నియంతృత్వ పాలనపై తమపార్టీ యుద్ధం చేస్తుందని, హక్కుల పరిరక్షణ కోసం అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు కలిసిరావాలని పిలుపునిచ్చారు.

ఎస్సీ వర్గీకరణ చేయొద్దు: చెన్నయ్య

న్యూఢిల్లీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేపడితే బీజేపీ, టీఆర్ఎస్ పార్టీలు మూల్యం చెల్లించుకోక తప్పదని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య హెచ్చరించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ చేయడమంటే రాజ్యాంగంపై దాడి చేసినట్లే అన్నారు. ఎమ్మార్పీఎస్ బ్లాక్‌మెయిళ్లకు భయపడి వర్గీకరణ చేపట్టవద్దన్నారు. మరోవైపు, లోక్‌సభలో కాంగ్రెస్‌పక్ష నేత మల్లికార్జున ఖర్గేను చెన్నయ్య, జంగా శ్రీనివాస్ కలిసి పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు రాకుండా అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమ విజ్ఞప్తికి ఆయన సానుకూలంగా స్పందించారని చెన్నయ్య తెలిపారు.

తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం: రమణ

హైదరాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీకి పూర్వ వైభవం తేవాలని కార్యకర్తలకు టీటీడీ-టీఎస్ అధ్యక్షుడు ఎల్.రమణ పిలుపునిచ్చారు. ఆయన ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ కార్యకర్తలకు రాజకీయ శిక్షణ తరగతులను ప్రారంభించారు. తెలంగాణలో టీడీపీ ఎక్క డుందంటున్న నాయకులు ఎన్టీఆర్ పార్టీ పెట్టినపుడు ఎక్కడున్నారని ప్రశ్నించారు. ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణ మాదిగను జైల్లో పెట్టడాన్ని ఖండించారు.

ఈటల వియ్యంకుడికి పదవి అక్రమం: కొనగాల

ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ తనవియ్యంకుడు వెంకట్రామిరెడ్డికి చట్ట విరుద్ధంగా హార్టికల్చర్ డైరెక్టర్ పదవి ఇప్పించుకున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి కె.మహేశ్ ఆరోపించారు. ఐఏఎస్ అధికారి కేడర్‌కు చెందిన పోస్టులో ఒక నాన్ ఐఏఎస్‌ను నియమించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రిటైర్ అయిన వెంకట్రామిరెడ్డికి ప్రమోషన్ ఇస్తూ జీవో నెం.57 జారీ చేశారన్నారు.

చేపల పెంపక పరిశోధన కేంద్రం కావాలి: బూర

న్యూఢిల్లీ, జనవరి4(ఆంధ్రజ్యోతి): తెలంగాణకు దేశీయ చేపల పెంపకం పరిశోధనా కేంద్రం మంజూరు చేయాలని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి గజేంద్ర షెకావత్‌ను టీఆర్ఎస్ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ కోరారు. పౌల్ట్రీ ఫార్మింగ్ తరహాలో షెడ్లలో పెంచే రకాల గొర్రెల బ్రీడ్ ఉత్పత్తి చేసే పరిశోధన కేంద్రాన్ని కూడా రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరానన్నారు. చార్మినార్, శాతవాహన, షిరిడీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు జనగాం స్టేషన్‌లో ఆగేలా చూడాలని రైల్వే మంత్రి పీయూష్‌గోయల్‌ను కోరానన్నారు.

మండలాలకు ఓఎఫ్‌సీ సౌకర్యం

హైదరాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రాల్లోని వీడియోకాన్ఫరెన్స్‌లకు ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్(ఓఎఫ్‌సీ) సౌకర్యం సమకూర్చేందుకు రూ.1.25 కోట్లను ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ మంజూరు చేశారు. అలాగే స్టేట్ డేటా సెంటర్‌లో అధునాతన సర్వర్, సెక్రటేరియట్ క్యాంపస్ ఏరియా నెట్‌వర్క్ కోసం రూ.2.5 కోట్లు మంజూరు చేసింది.

గవర్నర్‌తో టీఎస్‌పీఎస్సీ కమిషన్ భేటీ

హైదరాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి, సభ్యులు గవర్నర్ నరసింహన్‌తో గురువారం రాజ్‌భవన్‌లో భేటీ అయ్యారు. 2017లో పోస్టుల భర్తీకి సంబంధించిన వార్షిక నివేదికను సమర్పించారు. టీఎస్‌పీఎస్సీ ద్వారా ఇప్పటి వరకు భర్తీ చేసిన పోస్టుల వివరాలు, భర్తీ ప్రక్రియలో ఉన్న పోస్టులు, నోటిఫికేషన్‌కు సిద్ధంగా ఉన్న పోస్టుల వివరాలను గవర్నర్‌కు తెలిపినట్లు చక్రపాణి మీడియాకు తెలిపారు.

మందకృష్ణ అరెస్టు అక్రమం: ఉత్తమ్

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ అన్నారు. ప్రభుత్వం మందకృష్ణను బేషరతుగా విడుదల చేసి, ఆయనపై అక్రమంగా పెట్టిన కేసులను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. మందకృష్ణ రాజ్యాంగ బద్ధంగా, చట్టబద్ధంగా ఆమరణ నిరాహార దీక్షకు దిగితే అరెస్టు చేయడం టీఆర్ఎస్ పాశవిక పాలనకు పరాకాష్ఠ అని అయన అన్నారు. మరోవైపు చంచల్‌గూడ జైలులో మందకృష్ణ దీక్ష చేస్తున్నట్లు కాంగ్రెస్ నేత వీ. హనుమంతరావు ధ్రువీకరించారు. మందకృష్ణ, ఇతర ఎమ్మార్పీఎస్ నేతలు జైలులో ఉపవాస దీక్షలు చేయడం లేదని చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ రాజేశ్ తెలిపారు. జైలులో అందించే ఆహారం తింటున్నారని తెలిపారు.

ఎంసెట్-2 చార్జిషీట్‌లో జేఎన్టీయూ!

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎంసెట్-2 ప్రశ్నపత్రం లీకేజీ కేసులో జేఎన్టీయూ పేరును చార్జిషీట్‌లో సీఐడీ పొందుపరిచింది. చివరి దశ కేసు దర్యాప్తులో భాగంగా, గత ఏడాది నవంబరు రెండో వారంలో సీఐడీ.. జేఎన్టీయూకు కొన్ని ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని నోటీసులు పంపిన విషయం తెలిసిందే. ఇటీవలే నివేదికను జేఎన్టీయూ సీఐడీ అధికారులకు అందజేసింది. దానిని పరిశీలించిన అధికారులు.. ఈ కేసులో జేఎన్టీయూ ప్రమేయం ఉందని నిర్ధరించుకుని చార్జిషీట్‌లో పేరు పొందుపరిచారు. ఇక, జేఎన్టీయూతోపాటు ఢిల్లీలోని ప్రింటింగ్ ప్రెస్ యాజమాన్యం కూడా ఇటీవలే నివేదిక అందజేసింది. దానిని పరిశీలించిన తర్వాత.. న్యాయ సలహా తీసుకుని కోర్టులో త్వరలో చార్జిషీట్ దాఖలు చేయాలని సీఐడీ భావిస్తోంది.

15 లోగా నాలుగో విడత మిషన్ కాకతీయ

చిన్న నీటి వనరుల అభివృద్ధికి కేంద్రం ప్రవేశపెట్టిన జలవనరుల మరమత్తులు, పునరుద్ధరణ, పునరావాసం(ఆర్‌ఆర్‌ఆర్) పథకం కింద రాష్ట్రానికి రూ. 162 కోట్లు కేంద్రం మంజూరు చేసినట్లు మంత్రి హరీశ్‌రావు తెలిపారు. జనవరి నెలాఖరులోగా టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి... ఫిబ్రవరిలో ట్రిపుల్ ఆర్ పనుల గ్రౌండింగ్ ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఉమ్మడి ఖమ్మంలో 66, మెదక్‌లో 45, నల్లగొండలో 36 పనులు ట్రిపుల్ ఆర్ కింద చేపట్టనున్నట్లు చెప్పారు. మిషన్ కాకతీయ నాలుగో దశ పనులను ఈ నెల 15 కల్లా ప్రారంభించాలని అధికారులకు సూచించారు.

ఇసుక మాఫియా మారణకాండ

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యక్ష సాక్షి ఒకరు చెప్పినట్టు కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. సాయిలును ఢీకొన్న ఇసుక ట్రాక్టర్ అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకుడిదని సదరు ప్రత్యక్ష సాక్షి పోలీసులకు తెలిపినట్లు సమాచారం. అయితే, పోలీసులు మాత్రం సాయిలును ఢీకొట్టింది ఇసుక ట్రాక్టర్ కాదని.. ఇటుక ట్రాక్టర్ అని చెబుతుండడం గమనార్హం. ప్రమాదానికి కారణమయ్యారంటూ అంబయ్య, దుర్గయ్య అనే ఇద్దరు డ్రైవర్లను అదుపులోకి తీసుకుని, వారు నడుపుతున్న ఇటుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ దారుణం వెనుక అధికార పార్టీ నేతలు ఉండడం వల్లనే పోలీసులు కేసును పక్కదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని.. సాయిలు కుటుంబసభ్యులు, గ్రామప్రజలు ఆరోపిస్తున్నారు. సాయిలు కన్నా ముందు.. కామారెడ్డి జిల్లాలో, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఇలా ఎందరో అభాగ్యులు ఇసుక మాఫియా చేతిలో ప్రాణాలు కోల్పోయారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బేరసారాలు షురూ..

సాయిలును ఇసుక ట్రాక్టర్‌ను ఢీకొట్టిందన్న విషయం తెలియగానే.. తల్లి వీరవ్వ, తండ్రి శివయ్య, భార్య సాయవ్వ, కూతురు లావణ్య, కొడుకు విఠల్‌లతో పాటు బంధువులు హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అయితే పిట్లం మండలానికి చెందిన కొందరు అధికార పార్టీ నేతలు కొందరు రంగంలోకి దిగి మృతుడు సాయిలు కుటుంబ సభ్యులతో నేరుగా చర్చలు జరిపారు. "పోయిన వాడి ప్రాణాలు ఎలాగూ పోయాయి.. కేసులు, కోర్టులు అంటూ తిరిగితే పోయిన వాడి ప్రాణాలు వస్తాయా..? ఉన్న వారి గురించి ఆలోచించాలి కదా.." అని సాయిలు కుటుంబసభ్యులను మచ్చిక చేసుకునే ప్రయత్నం చేశారు. తక్షణమే రూ.2.5 లక్షలు ఇస్తామని.. భవిష్యత్‌లో సాయిలు కొడుకు, కూతురికి అండగా ఉంటామని ఆశ చూపుతున్నారు. ఈ దిశగా ఆలోచించాలని.. ఎక్కడా నోరు మెదపవద్దని వారి బంధువుల ద్వారా, తెలిసినవారితో.. గ్రామానికి చెందిన ఓ అధికార పార్టీ నేత చెప్పించినట్టు విశ్వసనీయ సమాచారం.

ఇటుక టిప్పరు ఢీకొట్టడం వల్లే ప్రమాదం

కాందార్ సాయిలును ఢీకొట్టింది ఇసుక టిప్పరు కాదు.. ఇటుక టిప్పర్. కారేగావ్ శివారులో ఇటుకలను డంప్ చేసి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదానికి కారణ మైన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడమే కాకుండా ఇటుక టిప్పరును కూడా స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌లో ఉంచాం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం.

-శ్వేతారెడ్డి, కామారెడ్డి జిల్లా

కారకులైన వారిని శిక్షించాలి

కారేగావ్ శివారుల్లో కాందార్ సాయిలు ఇసుక టిప్పరు ఢీకొనడం వల్లే మృతి చెందాడు. ప్రమాదానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి. ట్రాక్టర్ యాజమానిపైనా కేసు నమోదు చేయాలి. గ్రామస్థాయిలోని వీఆర్వో, వీఆర్ఏలకు ఇసుక మాఫియా వల్ల రక్షణ లేకుండా పోతోంది. అక్రమంగా తరలిస్తున్న ఇసుక వాహనాలను అడ్డుకుంటే దాడులు చేయడమే కాకుండా అవే వాహనాలతో మీదెక్కించి ప్రాణాలు తీయడం దారుణం.

-నర్సింహరెడ్డి, వీఆర్వోల సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు

ఇసుక తరలింపునకు అనుమతి లేదు

కాకి వాగులో ఇసుక తరలింపునకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. గతంలో కూడా ఈ వాగు నుంచి ఇసుక తవ్వకాలు జరగలేదు. ఆ వాగులో ఇసుక ఉన్నట్లు మా శాఖ దృష్టికి కూడా రాలేదు.

-రవి, కామారెడ్డి జిల్లా మైనింగ్ శాఖ ఏడీ

ఇసుక అక్రమ రవాణ నియంత్రణ వీఆర్ఏల డ్యూటీ కాదు

ఇసుక అక్రమ రవాణ నియంత్రణకు వీఆర్ఏలకు సంబంధం లేదు. వీఆర్ఏల సర్వీసు రూల్స్‌లో ఈ అంశం లేదు. అయినప్పటికీ వారికి ఇసుక డ్యూటీలను వేస్తున్నారు. దాంతో ఇసుక మాఫియా దాడులకు వారు బలి కావాల్సి వస్తోంది. ఈ విషయంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని.. ఇసుక అక్రమాల నియంత్రణపై ప్రభుత్వం నుంచి ఉన్నతాధికారుల వరకు కఠినంగా ఉంటే...కింది స్థాయిలో ఇబ్బందులు రావు.

-వంగూరు రాములు, వీఆర్ఏల సంఘం రాష్ట్ర కార్యదర్శి

రెవెన్యూ సిబ్బందికి పోలీసు రక్షణ అవసరం

ఇసుక అక్రమ దందాను అరికట్టడంలో రెవిన్యూ అధికారులు, సిబ్బందికి పోలీసుల రక్షణ అవసరం ఉంది. క్షేత్రస్థాయిలో తనిఖీలకు వెళ్లినప్పుడు వారి వెంట పోలీసులు కూడా ఉండాలి. కేవలం రెవిన్యూ అధికారియే కాకుండా మైన్స్, పోలీసులు, పంచాయితీ రాజ్ వంటి శాఖల వారు కూడా తనిఖీ బృందంలో ఉండాలి. ఒక బృందంగా ఇసుక అక్రమ రవాణను అడ్డుకుంటే.. మాఫియా దాడులను గట్టిగా ఎదుర్కోవడానికి అవకాశం ఉంటుంది.

- మఠం శివశంకర్, తెలంగాణ రెవిన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఇసుకను తరలించనీయం

మన్‌పహాడ్ గ్రామస్తుల స్పష్టీకరణ

దేవరుప్పుల (జనగామ జిల్లా), జనవరి 4: 'ఓ వ్యక్తి స్వార్థ ప్రయోజనాల కోసం మేమంతా నష్ట పోవాలా.. మా ప్రాణాలు పోయినా గ్రామ వాగు నుంచి ఇసుకను తరలించనీయమ'ని మన్‌పహాడ్ గ్రామస్తులు, రైతులు స్పష్టం చేశారు. 'చట్టం చట్టుబండలు' శీర్షిక గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ప్రచురితమైన వార్తకు స్పందించిన వారు విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీచరాజు హరికిషన్‌రావు కుటుంబం ఒకప్పుడు గ్రామంలో భూస్వాములుగా ఉన్న మాట నిజమేనని తెలిపారు. వారికి 100 ఎకరాల భూమి ఉండేదని, యాభై ఏళ్ల కిందట సుమారు 45 నుంచి 50 మందికి భూమిని పూర్తిగా విక్రయించేశారని చెప్పారు. ప్రస్తుతం వారికి గ్రామంలో వ్యవసాయ భూమి ఏమాత్రం లేదని పేర్కొన్నారు. రెండు వందల ఏళ్లుగా వరద ప్రవహించినపుడు రైతులందరి భూములు కోతకు గురవుతున్నాయని,

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

కోతకు గురైన భూమిని వదులుకొని ఉన్న భూమినే సాగు చేసుకుంటున్నామని తెలిపారు. వాగులో ఇసుకను అమ్ముకోవటం కోసం అధికారుల చేతులు తడిపి 36 సర్వే నంబరు పేరుతో 5.32 ఎకరాల భూమికి అక్రమంగా పట్టాలు సంపాదించారని ఆరోపించారు. తాము వాగులో చేతి బోర్లు వేసుకొని ప్రతి యేటా వరి సాగు చేసుకుంటున్నామని వివరించారు. తమ ప్రయోజనాల కోసం చెక్‌డ్యాం నిర్మించాలని ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావును కోరినట్టు తెలిపారు.



వరంగల్ రూరల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ల్యాబర్తి ఆకేరు వాగులో స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు



జయశంకర్ జిల్లా కాటారం మండల కేంద్రం శివారులో విజిలెన్స్ అధికారులు పట్టుకున్న లారీలు

ఇసుక లారీలపై విజిలెన్స్ కొరడా

జయశంకర్ జిల్లాలో 15 ఇసుక లారీల పట్టివేత

వరంగల్‌జిల్లా వర్ధన్నపేట మండలంలో 12 ట్రాక్టర్లు సీజ్

కాటారం, వర్ధన్నపేట, జనవరి 4: ఇసుక మాఫియా అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'లో వస్తున్న కథనాలపై విజిలెన్స్ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. జయశంకర్ జిల్లా, కాటారం మండల కేంద్రం శివారులో బుధవారం రాత్రి ఇసుకను తరలిస్తున్న లారీలపై కొరడా ఝుళిపించారు. ఇసుక క్వారీల నుంచి ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న 15 ఇసుక లారీలు, టిప్పర్లను పట్టుకున్నారు. ఆ లారీలను స్థానికంగా ఉన్న వేబ్రిడ్జి కాంటాపై తూకం వేయించగా సామర్థ్యానికి మించి ఇసుకను తరలిస్తున్నట్లు తేలింది. ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న లారీలకు జరిమానా విధించడానికి మైనింగ్, రవాణాశాఖ అధికారులకు రాసినట్లు అధికారులు తెలిపారు. రాత్రిపూట కాకుండా మధ్యాహ్నం సమయంలో అధికారులు తనిఖీలు నిర్వహిస్తే ఎక్కువ సంఖ్యలో లారీలు ఓవర్‌లోడ్‌తో పట్టుబడేవని పలువురు అభిప్రాయ పడ్డారు. మరోవైపు.. వరంగల్ రూరల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఆకేరు వాగులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 12 ట్రాక్టర్లను అధికారులు సీజ్ చేశారు.

ఇసుక దందాపై కేటీఆర్ సీరియస్

నియంత్రణపై పోలీసులకు ఆదేశాలు

సిరిసిల్ల జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మానేరు వాగు నుంచి అక్రమ ఇసుక రవాణాపై కఠినంగా వ్యవహరించాలని పురపాలక, ఐటీ, మైనింగ్ శాఖ మంత్రి కె.తారక రామారావు పోలీసులను ఆదేశించినట్లు తెలిసింది. గురువారం సిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేటలో నూతనంగా నిర్మించిన మోడల్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంలోనే ఆయన పోలీసు అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడినట్లు సమాచారం. జిల్లాలోని మానేరు వాగు నుంచి అక్రమంగా తరలిపోతున్న ఇసుక వ్యవహారాలపై 'ఆంధ్రజ్యోతి'లో వస్తున్న కథనాలపై మంత్రి సీరియస్‌గా స్పందించినట్లు తెలిసింది. ఇసుక అక్రమ రవాణాలో ఎవరినీ ఉపేక్షించవద్దని కఠినంగా వ్యవహరించాలని, ఏ పార్టీ వారైనా సరే.. ఇసుక అక్రమ రవాణా చేస్తే కేసులు పెట్టాలని మంత్రి ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో విజిలెన్స్, ఏసీబీ ఇంటెలిజెన్స్ అధికారులు ఇసుక అక్రమ రవాణాపై వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

మేధస్సుకు విశ్రాంతి

(మొదటి పేజీ తరువాయి)

బాగున్నారా' అని పలకరించారు. ఆయన స్పందించలేదు. 'చాలా రోజులైంది మిమ్మల్ని చూసి. నన్ను గుర్తుపట్టారా?' అని మరోమారు అడిగారు. అప్పటికీ ఆయన స్పందించలేదు. మౌనమే సమాధానం! అప్పుడు తెలిసింది... ఆయన జ్ఞాపక శక్తి కోల్పోయారని! అల్జీమర్స్‌తో బాధపడుతున్నారని! ఆయన ఎవరో కాదు! ఎందరో ఐఏఎస్‌లు తమ గురువుగా, ఆదర్శ అధికారిగా భావించే జన్నత్ హుస్సేన్! ఔను... నాలుగు దశాబ్దాలపాటు రాష్ట్రం కోసం ఆలోచించిన ఆయన 'మేధస్సు' ఇప్పుడు పూర్తిగా విశ్రాంతి తీసుకుంటోంది. గతాన్ని మరిచిపోయి, వర్తమానాన్నీ పట్టించుకోని స్థితిలో సేదతీరుతోంది. ఏ 'ఆలోచనా' లేని పసివాడి అంతరంగాన్ని తలపిస్తోంది. ఇది... రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జన్నత్ హుస్సేన్ పరిస్థితి. సుమారు ఏడాదికాలంగా ఆయన అల్జీమర్స్ వ్యాధితో బాధపడుతున్నారు. జ్ఞాపక శక్తిని పూర్తిగా కోల్పోయారు. నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా 'మనసున్న మారాజు'గా అందరి మన్ననలు అందుకున్న జన్నత్ హుస్సేన్... ఇప్పుడు అదే జిల్లా సూళ్లూరుపేటలో తన చిన్న కుమారుడివద్ద ఉంటున్నారు. 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులు గురువారం జన్నత్ నివాసానికి వెళ్లారు. ఆయన క్షేమ సమాచారం తెలుసుకున్నారు. ఆయనతో మాట్లాడేందుకు, పాత విషయాలు గుర్తు చేసేందుకు ప్రయత్నించారు. ఏం అడిగినా మౌనమే ఆయన సమాధానం. ఏదో సమాధానం చెప్పేందుకు ఆలోచిస్తున్నట్లుగా అటూ ఇటూ చూడటం, చివరికి ఏదీ చెప్పలేని అసహాయ స్థితి. ఒకటి రెండు మాటలు మాట్లాడినా... అస్పష్టంగానే! ఎన్టీఆర్ నుంచి రోశయ్య దాకా ఎంతోమంది ముఖ్యమంత్రుల వద్ద పని చేశారు. 'వారితో మీ అనుబంధం ఏమిటి?' అని 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా... జన్నత్ హుస్సేన్ అటూ ఇటూ చూస్తూ మౌనం వహించారు.

ఏడాదిగా ఇదే పరిస్థితి...

రెండేళ్ల క్రితం జన్నత్ దంపతులు సూళ్లూరుపేటలో ఉన్న తన రెండో కుమారుడు నియాజ్ హుస్సేన్ వద్దకు వచ్చారు. ఎంతో చురుగ్గా ఉన్న జన్నత్‌కు ఏడాది క్రితం అల్జీమర్స్ వ్యాధి సోకింది. కుటుంబ సభ్యులు ఆయనకు అమెరికాలో చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. ప్రస్తుతం చెన్నైలోని అపోలో వైద్యశాలలో చికిత్స చేయిస్తున్నారు. అల్జీమర్స్ సోకడంతో జన్నత్ గతాన్ని పూర్తిగా మరచిపోయారు. మౌనంగా ఉంటారు. ఏదో ఆలోచన చేస్తున్నట్లుగా అటూ ఇటూ చూస్తారు. జన్నత్‌ను ఆయన సతీమణి షెహరున్నీసా శ్రద్ధగా చూసుకుంటున్నారు. ఉదయం అల్పాహారం నుంచి రాత్రి భోజనం దాకా ఆమే ఆయన నోటికి అందిస్తారు. జన్నత్‌ను ఉదయం బయటికి వెళ్లి నడిపించేందుకు, పొరపాటున బయటికి వెళ్లి తప్పిపోకుండా చూసేందుకు ప్రత్యేకంగా ఒక యువకుడిని నియమించారు. ముందు జాగ్రత్తకోసం ఇంటి చుట్టూ సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ

పనిలో ఎంతో శ్రద్ధ

మొదటి నుంచి ఆయన పని మంతుడు. ఇంటి బాధ్యతలను కూడా చూసుకునే వారు. దైవ చింతన, పేదలంటే ఎంతో అభిమానం. వారి కష్టాలు తీర్చినప్పుడు పడే ఆనందం అంతా ఇంతా కాదు. అలాంటి వ్యక్తి నేడు చిన్నపిల్లాడిలా మారడం ఎంతో బాధ కలుగుతోంది. నా భర్తను ఎంతో జాగ్రత్తగా బిడ్డను చూసుకున్నట్లుగా చూసుకుంటున్నా.

- షెహరున్నీషా హుసేన్, జన్నత్ హుస్సేన్ భార్య

కుమారుడిగా గర్విస్తున్నా..

ఇప్పటి సీనియర్ ఐఏఎస్ అధికారులు మా నాన్న గురించి గొప్పగా చెబుతుంటే ఎంతో ఆనందం కలుగుతుంది. డైనమిక్ ఐఏఎస్ అధికారిగా పేరు తెచ్చుకున్నారు. పేదల పట్ల ఆయన చూపే ఆదరణ మరచిపోలేం. పేదల కోసం చట్టపరంగా, న్యాయపరంగా కొంత సడలింపు ఇచ్చి వారి సమస్యలు తీర్చేవారు. పేదల సమస్యలను తీర్చడంలోనే దేవుడికి సేవ చేశామనే భావన ఉండేదని మాతో చెప్పేవారు. జన్నత్ హుస్సేన్ కొడుకుగా ఎంతో గర్విస్తున్నా.

- నియాజ్ అహ్మద్, కుమారుడు



ఉదయం 8 గంటలకు ఆయనను మార్నింగ్ వాక్‌కోసం బయటికి తీసుకొస్తారు.

ప్రత్యేక ముద్ర...

ఉత్తర ప్రదేశ్‌కు చెందిన జన్నత్ హుస్సేన్ (67) వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. అలహాబాద్‌లో అధ్యాపకుడిగా పని చేస్తూ... 1977లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. మొదట కాకినాడ అసిస్టెంట్ కలెక్టర్‌గా, ఆ తరువాత కొత్తగూడెం సబ్ కలెక్టర్‌గా పని చేశారు. 1985లో నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. రెండేళ్లపాటు జిల్లా పాలనపై ప్రత్యేక ముద్ర వేశారు. 'కలెక్టర్ అంటే ఇలా ఉండాలి' అని చిరకాలం చెప్పుకొనేలా చేశారు. నెల్లూరు సమీపంలోని గుడిపాడు పంచాయతీ తట్టుకున్నపాళెంలోని పేదలు నాడు జన్నత్‌ను కలిసి తమకు గూడు కల్పించాలని వేడుకున్నారు. అక్కడ ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో... ఒకరైతు నుంచి భూమి కొని మరీ 70 మంది పేదలకు ఇంటిపట్టాలు ఇచ్చారు. దీనికి కృతజ్ఞతగా ఆ పేదలు 'జన్నత్ హుస్సేన్ కాలనీ' ఏర్పాటు చేసుకున్నారు. ఆ తరువాత గుంటూరు కలెక్టర్‌గానూ జన్నత్ హుస్సేన్ సమర్థంగా పని చేశారు. ఆపై... హైదరాబాద్‌లో వివిధ హోదాల్లో 26 సంవత్సరాలు విధులు నిర్వహించారు. తన ఆలోచనలు, మేధస్సుతో ఎన్నో పథకాలను రూపొందించి... ప్రభుత్వాన్ని ఒప్పించి వాటిని అమలు చేసేవారు. 2004లో వైఎస్ ముఖ్యమంత్రిగా తొలి సంతకం చేసింది... ఉచిత విద్యుత్తు ఫైలుపైనే! బహిరంగ వేదికపై ఈ ఫైలును వైఎస్‌కు అందించి, సంతకం చేయించింది జన్నత్ హుస్సేన్. ఉచిత విద్యుత్తు పథకానికి సంబంధించిన విధి విధానాలను రూపొందించింది ఆయనే. 2010 డిసెంబరు 31న ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో జన్నత్ రిటైర్ అయ్యారు. ఆ వెంటనే... అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు సమాచార హక్కు చట్టం ప్రధాన కమిషనర్‌గా కీలక బాధ్యతలు అప్పగించింది. 2014లో రాష్ట్ర విభజన జరిగేదాకా ఆయన ఈ పదవిలో ఉన్నారు. ఇలా 40 ఏళ్ల పాటు ఆయన ప్రభుత్వ సేవల్లో కొనసాగారు. రాష్ట్ర పరిపాలనపై ప్రత్యేక ముద్ర వేసిన జన్నత్ హుస్సేన్ ఇప్పుడు ఇలా మారిపోవడం ఆయన శిష్యులను, అభిమానులను కలచివేస్తోంది.

ఇదీ కుటుంబం...

జన్నత్ హుస్సేన్ దంపతులకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. కుమార్తె కుటుంబం హైదరాబాద్‌లో నివసిస్తోంది. పెద్ద కుమారుడు నిషార్ ఎంబీఏ చేసి అమెరికాలో స్థిరపడ్డారు. రెండో కుమారుడు నియాజ్ అహ్మద్ బీటెక్ చదివి మాంబట్టు సెజ్‌లో లేజర్ కాంటినెట్ యూనిట్ పరిశ్రమ నడుపుతున్నారు. ఆయన సూళ్లూరుపేటలో నివాసం ఉంటున్నారు.

టీఆర్ ప్రసాద్‌దీ అదే పరిస్థితి!

కేబినెట్ కార్యదర్శిగా అత్యున్నత స్థానం

అల్జీమర్స్‌తో గతం మరిచిపోయిన వైనం



విశాఖపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తాతా రామచంద్ర ప్రసాద్... దేశవ్యాప్తంగా ఐఏఎస్ అధికారులకు టీఆర్ ప్రసాద్‌గా సుపరిచితుడు. 'ఐఏఎస్‌లకే ఆయన కలికితురాయి' అని పేరొందిన సమర్థుడు. దేశంలో అత్యున్నత అధికార స్థానమైన 'కేంద్ర కేబినెట్ కార్యదర్శి'గా పని చేశారు. తన మేధస్సును దేశం కోసం ధారపోశారు. ఇప్పుడు... అదే టీఆర్ ప్రసాద్ తన ఘనమైన స్వీయ గతాన్ని, జ్ఞాపకాలను మరిచిపోయారు. విశాఖలో కుటుంబ సభ్యుల వద్ద ఉంటున్న టీఆర్ ప్రసాద్ సుమారు ఏడాదిగా అల్జీమర్స్‌తో బాధపడుతున్నారు. పూర్తిగా విశ్రాంతి తీసుకుంటున్నారు. ఎవరైనా వచ్చి పలకరించినా మాట్లాడలేకపోతున్నారు. వారిని గుర్తుపట్టలేని పరిస్థితి. 1963 బ్యాచ్‌కు చెందిన టీఆర్ ప్రసాద్ ఎన్టీఆర్ వద్ద ముఖ్య కార్యదర్శిగా పని చేశారు. ప్రధాని హోదాలో రాజీవ్‌గాంధీ హైదరాబాద్‌కు వచ్చినప్పుడు నదీ జలాల్లో ఏపీ వాటా, హక్కుల గురించి వివరించే బాధ్యతను ఎన్టీఆర్ అప్పట్లో టీఆర్ ప్రసాద్‌కే అప్పగించారు. నదీజలాల వివాదాలు, హక్కుల గురించి సంపూర్ణంగా తెలిసిన అతికొద్దిమందిలో టీఆర్ ప్రసాద్ ఒకరని మాజీ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ తెలిపారు. "రాష్ట్ర విభజన సమయంలో నదీజలాల వివాదంపై అవసరమైన సలహాలకు ప్రసాద్‌ను సంప్రదించాలని అధికారులకు నేను సూచించాను. మారుతీ కార్ల బోర్డుకు టీఆర్ ప్రసాద్ చైర్మన్‌గా ఉండేవారు. మారుతీ కార్ల గేరు బాక్స్ జపాన్‌లో తయారుచేస్తామని సుజుకి ప్రతినిధులు ప్రతిపాదించగా... ప్రసాద్ ససేమిరా అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడే విషయంలో ఆయన రాజీ పడేవారు కాదు. 2000లో టీఆర్ ప్రసాద్ కేంద్ర కేబినెట్ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. పదవీ విరమణ చేసిన తరువాత టీఆర్ ప్రసాద్ విశాఖలో స్థిరపడ్డారు" అని శర్మ వివరించారు.

అల్జీమర్స్ అంటే?

మనిషి అంటే.. వట్టి శరీరమే కాదు. అనుభవాలు, జ్ఞాపకాలు, మేధస్సుల సమాహారం. రకరకాల కష్టాలు, ఇబ్బందులను ఎదుర్కొని రాటుదేలి విస్తృత అనుభవాన్ని సంపాదించిన ఒక మనిషి.. ఆ అనుభవాలను, జ్ఞాపకాలను పూర్తిగా మరచిపోతే? భార్య, పిల్లలను సైతం గుర్తుపట్టలేనంతగా అయిపోతే? సొంత పేరు.. ఉండే ఊరు.. చిరునామా.. అన్నీ ఆ మెదడులోంచి ఖాళీ అయిపోతే? ఆ పరిస్థితినే వైద్య పరిభాషలో 'అల్జీమర్స్' అంటారు. వయసు పెరిగే కొద్దీ కొందరికి మతిమరపు రావడం సహజమే. అలాంటివారికి వారు మర్చిపోయిన విషయాన్ని గుర్తుచేస్తే వెంటనే గుర్తొస్తుంది. అల్జీమర్స్ బాధితుల మతిమరపు అలా కాదు. వారికి ఏదైనా విషయం గుర్తుచేసినా.. మరునిమిషమే మళ్లీ మర్చిపోతారు. ఒకే విషయాన్ని పదేపదే మాట్లాడతారు. ఒకే ప్రశ్న పదే పదే వేస్తారు. దీనికి కారణం.. వారి మెదడు సామర్థ్యం క్రమేపీ సన్నగిల్లిపోతుండడమే. అల్జీమర్స్ బాధితుల జ్ఞాపకశక్తి నానాటికీ తగ్గిపోతుంటుంది. ఆలోచించే సామర్థ్యం నశిస్తుంది. 1906లో జర్మనీకి చెందిన డాక్టర్ అలోయిస్ అల్జీమర్ అనే వైద్యుడు ఈ వ్యాధిని తొలిసారి గుర్తించారు. అసాధారణ మతిమరపు, భాషా సమస్యలు, అనూహ్య ప్రవర్తనతో బాధపడుతున్న ఒక మహిళ చనిపోయాక ఆమె మెదడుపై పరిశోధన చేశారు. ఆమె మెదడులో అమిలాయిడ్ ప్లేక్స్‌ను, నాడులను కప్పివేసినట్టుగా ఉన్న ఫైబర్లను, నాడుల మధ్య అనుసంధానం లేకపోవడాన్ని గుర్తించారు. ఇవే ఆమె సమస్యకు కారణమని గుర్తించారు. అందుకే ఈ వ్యాధికి ఆయన పేరు పెట్టారు.


'సహకార' మార్పులు

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ఎన్నికల్లో అక్రమాలకు ఎలాంటి తావివ్వకుండా ప్రభుత్వం కొత్త నియమావళిని రూపొందించింది. ఇకపై సహకార చట్టం పరిధిలో నమోదైన ఏ సంఘానికైనా, ఈ నియమావళి మేరకే ఎన్నికలను నిర్వహించాలి. ఎన్నికల నోటిఫికేషన్ మొదలు.. ఓటర్ల జాబితా ప్రచురణ, ఎన్నికల నిర్వహణ ఖర్చులు తదితర అంశాలపై భారీ మార్పులు చేస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి.రాష్ట్రంలో ఇరవై అయిదు కేటగిరీల్లో దాదాపు 25 వేల సహకార సంఘాలున్నాయి. వీటిలో హౌసింగ్, పీఏసీఎస్, ఉద్యోగ, సహకార, గీత కార్మిక, మత్స్య కార్మిక, గొర్రెల పెంపకందారులు, బలహీనవర్గాలతో పాటు, పలు సొసైటీలు ఉన్నాయి. తాజా నియమావళి మేరకు.. ఈ సంఘాల ప్రస్తుత సభ్యుల పదవీకాలం పూర్తవ్వడానికి ఆర్నెళ్ల ముందే ఎన్నికల నిర్వహణకోసం ఏర్పాటు చేసిన అథారిటీకి నిర్ణీత నమూనాలో ప్రతిపాదనలు, ఓటర్ల జాబితా పంపాల్సి ఉంటుంది. ఈ జాబితాలో తప్పనిసరిగా ఓటర్ల ఫొటోలను ముద్రించాలి. ఎన్నికల నిర్వహణ ఖర్చును కూడా ప్రస్తుత సంఘాలే భరించాలి. ఇష్టారాజ్యంగా ఖర్చుకు అవకాశాలుండవు. రాష్ట్ర సహకార ఎన్నికల సంఘం నిర్ణయించిన మేరకే ఖర్చు చేయాల్సి ఉంటుంది. పాలకవర్గాల్లో ఒకటి రెండు స్థానాల భర్తీ కాకపోయినా.. అభ్యర్థులెవరైనా చనిపోయినా.. మునుపటిలా ఎవరో ఒకర్ని నామినేషన్ చేసుకోవడంపైనా పలు నిబంధనలు విధించారు. నామినేషన్ల సమయంలో అభ్యర్థులు ఆధార్, పాన్ కార్డులను తప్పనిసరిగా అందించాలని తాజా నియమావళి పేర్కొంటోంది. పాలకవర్గాల్లో ఒక స్థానాన్ని ఎస్సీ/ఎస్టీ వర్గానికి, రెండు స్థానాలు మహిళలకు తప్పనిసరిగా కేటాయించాలి.

ధరావతు వివరాలు

సహకార సంఘం కేటగిరీ	ఎస్సీ/ఎస్టీ	బీసీ	ఇతరులు
ప్రాథమిక సొసైటీలు	500	750	1,000
అర్బన్ బ్యాంకులు/కేంద్ర సంఘాలు	1,000	2,000	4,000

మాల్యా ప్రకటిత నేరగాడు



న్యూఢిల్లీ : వేల కోట్ల రూపాయలు ఎగవేసి లండన్‌లో తల దాచుకుంటున్న లిక్కర్ కింగ్ విజయ్‌మాల్యాను ఢిల్లీ కోర్టు ప్రకటిత నేరగాడిగా ప్రకటించింది. ఫెరా నిబంధనల ఉల్లంఘన కేసులో పలుమార్లు సమన్లు జారీ చేసినప్పటికీ కోర్టు ముందు మాల్యా హాజరుకాని నేపథ్యంలో చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ దీపక్ షెరావత్ ఈ ఆదేశాలను జారీ చేశారు. సమన్లు జారీ అయిన మాల్యా గానీ ఆయన తరఫున ప్రతినిధులు గానీ కోర్టు ముందు హాజరుకాలేదు. ఈ నేపథ్యంలో మాల్యాను ప్రకటిత నేరగాడిగా ప్రకటించినట్టు కోర్టు పేర్కొంది.

ప్రతిబంధకాలున్నా..

సానుకూల పవనాలు



జిడిపి-2018

ఆర్థిక రంగం వృద్ధి రేటుపై భిన్న అంచనాల నడుమ కొత్త ఏడాది ప్రారంభం అయింది. ఈ ఏడాది రికవరీ సాధ్యమేనని కొందరంటుంటే మరి కొంత కాలం కూడా స్తబ్ధత తప్పదని మరి కొందరు హెచ్చరిస్తున్నారు. డీమానిటైజేషన్, జిఎస్‌టి ప్రతికూలతల వల్ల వరుసగా రెండు త్రైమాసికాలుగా క్షీణించిన ఆర్థిక రంగంలో ప్రస్తుత పరిస్థితులు ఎలా ఉన్నాయి, ఈ ఏడాది సానుకూలతలేమిటి, ప్రతికూలతలేమిటి, ముందు సవాళ్లు ఎన్నున్నాయి అనే అంశాలపై ప్రముఖ ఆర్థిక రంగ విశ్లేషకుడు **కె నరసింహమూర్తి** వ్యాసం ఆంధ్రజ్యోతికి ప్రత్యేకం...

వరుసగా రెండు త్రైమాసికాలుగా ప్రతికూలతలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఆర్థిక రంగానికి కలిసి వచ్చే పలు సంకేతాలు, సానుకూలతలు కొత్త ఏడాది తెర పైకి తీసుకువచ్చింది. ప్రభుత్వం చేపట్టిన డీమానిటైజేషన్, జిఎస్‌టి సంస్కరణల కారణంగా 2017 సంవత్సరం మిశ్రమ ఫలితాలను అందించగా 2018 సంవత్సరం ఇందుకు కాస్తంత భిన్నంగానే ఉండవచ్చనిపిస్తోంది. పలు సానుకూల సంకేతాలు వెలువడినప్పటికీ రానున్న కాలంలో చోటు చేసుకోనున్న సంఘటనల నేపథ్యంలో కొన్ని ఎదురుగాలులు కూడా తప్పకపోవచ్చు. దేశీయ, విదేశీ యవనికలపై చోటు చేసుకోగలవనుకుంటున్న సంఘటనల కారణంగా కొన్ని ఆందోళన కలిగించే పరిణామాలు కూడా తప్పకపోవచ్చు.

సానుకూలతలను పరిగణనలోకి తీసుకుంటే ఇన్‌ఫ్రా, ఎగుమతి రంగాల పునరుజ్జీవం, విదేశీ నిధుల రాక పెరగడం, పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరగడం, డాలరు మారకంలో రూపాయి బలంగా నిలవడం, రియల్టీ రంగం పుంజుకోవడం వంటివి ఉన్నాయి. ప్రజల్లో కొన్ని భయాలున్నా డీమానిటైజేషన్, జిఎస్‌టి ప్రభావం నుంచి ఆర్థిక రంగం క్రమంగా బయటపడుతూ ఉండడమే వివిధ రంగాల్లో పునరుజ్జీవానికి కారణం. ప్రభుత్వంలో అత్యున్నత స్థాయిలో అవినీతి, కుంభకోణాలు లేకపోవడం, స్వచ్ఛమైన ప్రభుత్వం అన్న భావం ప్రజల్లో ఉండడం, ప్రపంచదేశాలు కూడా ఈ వాస్తవాలను గుర్తించడం ఆర్థిక రంగానికి సానుకూలత కల్పించిన అంశాలు.

సానుకూలతలివే...

- ఆర్థిక రంగానికి కీలకం అయిన ఎనిమిది మౌలిక రంగాల్లో పునరుజ్జీవం ఏర్పడింది. నవంబరు నెలలో ఈ రంగాల్లో 6.8 శాతం వృద్ధి నమోదయింది. 13 నెలల విరామం అనంతరం ఈ రంగంలో మంచి పురోగతి కనిపించింది. రిఫైనరీ ఉత్పత్తులు, స్టీల్, సిమెంట్, విద్యుత్ రంగాలు ఇందుకు ఆలంబనగా నిలిచాయి. కార్ల అమ్మకాలు కూడా నాలుగేళ్ల గరిష్ఠ స్థాయికి పెరిగాయి. డీమానిటైజేషన్, జిఎస్‌టి ప్రభావాల నుంచి వ్యవస్థ, ప్రజలు కూడా సర్దుబాటుకావడంతో ఈ వృద్ధి సాధ్యమైంది.
- విదేశీ నిధుల రాక ఏప్రిల్-అక్టోబరు నెలల మధ్య 30 శాతం పెరిగింది. ఇటీవలికాలంలో నిధుల రాకలో గరిష్ఠస్థాయి ఇదే. వీటిలో 40 శాతం రుణాల రూపంలో వచ్చినా ఆర్థిక వ్యవస్థ మీద విదేశీ ఇన్వెస్టర్ల నమ్మకానికి అవి దర్పణం పడుతున్నాయి. డీమానిటైజేషన్, జిఎస్‌టి రెండు సంస్కరణలు ఆర్థిక రంగానికి ఉత్తేజం కల్పిస్తాయన్న నమ్మకంతోనే విదేశీ పెట్టుబడులు వస్తున్నాయి. వచ్చే ఏడాది కాలంలో ఈ సంస్కరణల ఫలాలు మరింతగా దృగ్గోచరం కానున్నాయి.
- ఎగుమతులు పునరుజ్జీవం సాధించడం మరో సానుకూలత. ఎగుమతులు పుంజుకోవడం వల్ల వాణిజ్య లోటు జిడిపిలో 1.2 శాతానికి తగ్గింది. దిగుమతులు కూడా పెరిగాయి. క్రూడాయిల్ ధరలు పెరగడం వల్ల వాణిజ్యలోటు పెరిగే ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ ఎగుమతులు పెరగడం వల్ల ఆ ప్రభావం నామమాత్రమే అయింది. ఎగుమతులు పెరగడం కూడా కీలక రంగాల వృద్ధికి దోహదపడిన అంశం.
- పన్ను చెల్లింపు ధోరణులు కూడా పెరిగాయి. 2016-17 సంవత్సరంలో పన్ను చెల్లింపుదారుల సంఖ్య 6.27 కోట్లకు చేరింది. అంతకు ముందు ఏడాదితో పోల్చితే ఇది 19.5 శాతం అధికం. ఫలితంగా జిడిపిలో పన్నుల వాటా పెరిగింది. ప్రధానంగా కోటి రూపాయల లోపు ఆదాయం ప్రకటించే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది.
- డాలరుతో రూపాయి బలోపేతంకావడం మరో సానుకూలత. ఫారెక్స్ మార్కెట్‌లో గత ఏడాది అంతా రూపాయి స్థిరంగా నిలిచి ఏడాది మొత్తంలో 6 శాతం వృద్ధిని సాధించింది. వాస్తవానికి రూపాయి విలువ పెరుగుదల ప్రభావం ఎగుమతుల రంగం మీద పడుతుంది. కానీ రూపాయి విలువ పెరుగుదలకు సమాంతరంగా ఎగుమతులు పెరగడం వల్ల వాణిజ్య లోటు తగ్గడానికి దోహదపడింది.
- రియల్టీ రంగం గత త్రైమాసికంలో పుంజుకుంది. డీమానిటైజేషన్, రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ చట్టాల వల్ల మొదట్లో ఈ రంగం ప్రభావితం అయినా ఆ తర్వాత సద్దుకుని వృద్ధి బాటలో అడుగు పెట్టింది. ఆయిల్, గ్యాస్, స్టీల్, భూసేకరణ విభాగాల్లో లోటుపాట్లు సరిదిద్ది పర్యావరణపరమైన అనుమతులు కూడా తేలిగ్గా లభించే వాతావరణం కల్పించడం ఈ వృద్ధికి కారణం. పైగా ప్రభుత్వం విత్తలోటు సవాలుగానే ఉన్నప్పటికీ రెండు లక్షల కోట్ల రూపాయల మేరకు పెట్టుబడులు ప్రకటించడం, పిఎస్‌యులు పెట్టుబడి ప్రణాళికలతో ముందుకుసాగడం ఈ వృద్ధికి కారణాలు.
- ఉదయ్ స్కీమ్ ద్వారా విద్యుత్ రంగంలో ఎటిసి నష్టాలను గణనీయంగా అదుపు చేయగలిగింది. 2016లో ఎటిసి నష్టాలు దేశవ్యాప్తంగా 51,590 కోట్ల నుంచి 34,827 కోట్ల రూపాయలకు తగ్గాయి.
- జిఎస్‌టి వల్ల ఏర్పడుతున్న నష్టాలను భర్తీ చేయడానికి రాష్ట్రాలకు నిధులు సమకూర్చేందుకు విధించిన సెస్ వసూళ్లు 30,799 కోట్ల రూపాయలైతే రాష్ట్రాలకు చెల్లించింది 24,500 కోట్ల రూపాయలే. జిఎస్‌టి వల్ల రాష్ట్రాలు అంచనా వేసిన నష్టాలకన్నా వాస్తవ నష్టాలు తక్కువగా ఉన్నాయనేందుకు ఇది సంకేతం.
- డీమానిటైజేషన్ అనంతరం మ్యూచువల్ ఫండ్లలోకి పెట్టుబడులు పెరిగాయి. 2017 నవంబరు చివరి నాటికి 4.08 లక్షల కోట్ల రూపాయలు వివిధ ఫండ్ స్కీమ్‌లలోకి వచ్చి పడ్డాయి. బ్యాంక్ డిపాజిట్లలో నిధులు తగ్గి మ్యూచువల్ ఫండ్లలోకి పెట్టుబడులు పెరగడం స్టాక్‌మార్కెట్ వృద్ధికి దోహదపడింది. పబ్లిక్ ఇష్యూలు కూడా మార్కెట్‌లో వెల్లువెత్తాయి. నవంబరు చివరి నాటికి పబ్లిక్ ఇష్యూల ద్వారా 65,293 కోట్ల రూపాయలు ఈ ఇష్యూల ద్వారా వివిధ కంపెనీలు సమీకరించాయి. 2016లో సమీకరించిన మొత్తం 26,494 కోట్ల రూపాయలతో పోల్చితే ఇది 250 శాతం అధికం. అంతర్గత పొదుపుతోనే ఆర్థిక రంగం పెరిగిందనేందుకు ఇది సంకేతం. ఒక పక్క విదేశీ నిధుల రాక పెరగడం, మరోపక్క దేశీయ పొదుపు ఆర్థిక రంగానికి మద్దతు ఇస్తున్నందు వల్ల అంతర్జాతీయంగా తిరోగమన పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఆ ప్రభావం సత్వరం భారత ఆర్థిక వ్యవస్థపై పడకుండా ఇవి రక్షణగా ఉంటాయి.

ప్రతికూలతలు, సవాళ్లు రేపటి సంచికలో..

ఫోన్ బ్యాంకింగ్‌లో పొంచి ఉన్న డేంజర్

232 బ్యాంకింగ్ యాప్స్‌పై మాల్‌వేర్ దాడి!



స్టేట్ బ్యాంక్, ఐసిఐసిఐ యాప్‌లకూ ముప్పు?

న్యూఢిల్లీ : ప్రభుత్వం డిజిటలైజేషన్ అని ఊదరగొడుతోంది. సౌకర్యంగా ఉందని ప్రజలు ఎడాపెడా బ్యాంకింగ్ యాప్స్ డౌన్‌లోడ్ చేస్తున్నారు. అడిగిన వెంటనే లాగిన్ ఐడి, పాస్‌వర్డ్ ఎంటర్ చేస్తున్నారు. అయితే ఇందులో ప్రమాదాలు పొంచుకొని ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకునే ముందూ, సమాచారాన్ని ఎంటర్ చేసే ముందుకు ఒకటికి రెండుసార్లు సరిచూసుకోకుంటే ఖాతాలోని సొమ్ము ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని చెబుతున్నారు. కంప్యూటర్ సెక్యూరిటీ సర్వీసుల సంస్థ క్విక్‌హీల్ హెచ్చరిక ప్రకారం.. ఓ కొత్తరకం ఆండ్రాయిడ్ మాల్‌వేర్ శరవేగంగా బ్యాంకింగ్, ఆర్థిక సంస్థలకు సంబంధించిన యాప్‌లను కమ్మేస్తోంది. దాదాపు 232 బ్యాంకింగ్ యాప్‌లను ఈ మాల్‌వేర్ అనుకరిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ మాల్‌వేర్ పేరు ఆండ్రాయిడ్.బ్యాంకర్.ఎ2ఎఫ్8ఎ. థర్డ్‌పార్టీ స్టోర్లలోని నకిలీ ఫ్లాష్‌ప్లేయర్ యాప్ ద్వారా ఇది మన మొబైల్‌లోకి ప్రవేశించి విస్తరిస్తోందని క్విక్‌హీల్ వెల్లడించింది.

(ఏయే బ్యాంకింగ్ యాప్‌లపై మాల్‌వేర్ దాడి చేయొచ్చన్న వివరాలు ఆంధ్రజ్యోతి నెట్ ఎడిషన్ (www.andhrajyothy.com)లో చూడవచ్చు)

ఈ యాప్ డౌన్‌లోడ్ అయిన తర్వాత ఇన్‌స్టాల్ అయిన బ్యాంకింగ్, క్రిప్టోకరెన్సీ యాప్‌లను పట్టేస్తుంది. వాస్తవ యాప్‌ల నోటిఫికేషన్లను పోలిన మోసపూరిత నోటిఫికేషన్‌ను ప్రదర్శిస్తుంది. యూజర్లకు సంబంధించిన లాగిన్ ఐడి, పాస్‌వర్డ్‌ను అడుగుతుంది. ఆ వివరాలు గనక తెలియజేస్తే ఆ సమాచారం చోరీకి గురైనట్టే లెక్క. వ్యక్తిగత సమాచారం, ఎస్ఎంఎస్‌లు, ఫోన్‌లోని కాంటాక్ట్‌లను కూడా ఈ మాల్‌వేర్ హ్యాక్ చేస్తుంది. ఇది టార్గెట్ చేస్తున్న బ్యాంకింగ్ యాప్‌లలో ఎస్‌బిఐ ఎనీవేర్ పర్సనల్, ఐసిఐసిఐ బ్యాంకు ఐ మొబైల్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ మొబైల్ బ్యాంకింగ్, యాక్సిస్ మొబైల్, ఐడిబిఐ-గో మొబైల్, మొబైల్ బ్యాంకింగ్ ఎల్ఐటిఇ, బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంకుల మొబైల్ యాప్‌లు ఉన్నాయి.

'సోషల్ మీడియా సైట్లు, వెబ్‌సైట్లు, యూట్యూబ్ నుంచి పైరేటెడ్ సినిమాలు, పాటలు, పోర్న్ వీడియోలు డౌన్‌లోడ్ చేస్తున్నప్పుడు వాటితో పాటు ఓ ఫేక్ ఫ్లాష్ ప్లేయర్ యాప్ కూడా డౌన్‌లోడవుతుంది. ఇది గనక మన మొబైల్ ఫోన్లలో ఇన్‌స్టాల్ అయిపోతే ఇక ఈ 232 బ్యాంకుల్లో ఏ బ్యాంకు యాప్‌ను మనం ఉపయోగించినా దాన్ని ఆ మాల్‌వేర్ ఫ్లాష్ ప్లేయర్ యాప్ ద్వారా టార్గెట్ చేస్తుంది.

ఏంచేయాలి?

మాల్‌వేర్ దాడికి గురికాకుండా ఉండాలంటే.. "థర్డ్ పార్టీ యాప్ స్టోర్స్ నుంచి యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దు. అంటే ఇ-మెయిల్స్, ఎస్ఎంఎస్‌లు, లింక్స్ ద్వారా వచ్చే మెసేజ్‌ల ఆధారంగా యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దు. మన మొబైల్‌లోని అన్‌నోన్ సోర్సెస్ ఆప్షన్‌ను ఎప్పుడూ డిజేబుల్ చేసి ఉంచాలి. యాంటీవైరస్ ఉంటే అది మాల్‌వేర్‌ను అడ్డుకోగలదు. స్మార్ట్‌ఫోన్‌లోని ఆపరేటింగ్ సిస్టమ్‌ను, యాప్ వెర్షన్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేటెడ్ చేసుకోవాలి.

రూ.200 నోటు కోసం

రూ.120 కోట్ల ఖర్చు

ఎటిఎంలలో మార్పులు బ్యాంకులకు భారం



ముంబై : భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) గత ఏడాది విడుదల చేసిన 200 రూపాయల నోట్లను ఆటోమెటిక్ టెల్లర్ మెషిన్స్ (ఎటిఎం) ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు బ్యాంకులు కసరత్తు చేస్తున్నాయి. ఇందుకు సంబంధించి ఎటిఎంలను రీకాలిబరేటింగ్ చేసే ప్రక్రియను బ్యాంకులు చేపట్టాయి. దేశవ్యాప్తంగా 30 వేల క్యాష్ రీసైకిలర్స్ సహా దాదాపు 2.4 లక్షల ఆటోమెటిక్ టెల్లర్ మెషిన్స్ ఉన్నాయి. ఇందులో క్యాష్ రీసైక్లర్ మెషిన్.. నగదు విత్‌డ్రాయల్, డిపాజిట్ చేసే విధంగా ఉన్నాయి. కాగా ఎటిఎంలను పూర్తిగా 200 రూపాయల నోటును అందించే విధంగా మార్చాలంటే బ్యాంకులు 100-120 కోట్ల రూపాయల వరకు ఖర్చును భరించాల్సి ఉంటుందని పరిశ్రమ నిపుణులు తెలిపారు. ఇప్పటికే కొన్ని బ్యాంకులకు సంబంధించిన ఎటిఎంలను రీకాలిబరేట్ చేసినట్లు ఎన్‌సిఆర్ కార్పొరేషన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ నవ్రోజ్ దస్తూర్ తెలిపారు. ప్రతి ఎటిఎంలోను నాలుగు విభాగాలు ఉంటాయని, వాటిల్లో ఏయే డినామినేషన్ నోట్లను పెట్టాలో బ్యాంకులు నిర్ణయించుకుంటాయని అందుకుతగ్గట్టుగా తాము రీకాలిబరేషన్‌ను చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరోవైపు కొన్ని బ్యాంకుల మార్గదర్శకాలకు అనుగుణంగా రీకాలిబరేషన్ సమయంలో 2000 రూపాయల నోటు స్థానంలో 200 నోటుకు స్థానం కల్పించినట్లు హిటాచీ పేమెంట్ సర్వీసెస్ ఎండి లోనీ ఆంటోని తెలిపారు. కొద్ది నెలల కిందటే తాము ఈ ప్రక్రియను ప్రారంభించామని, దాదాపు నాలుగు వేలకు పైగా ఎటిఎంల్లో మార్పులు చేసినట్లు చెప్పారు. కాగా దేశవ్యాప్తంగా ఉన్న ఎటిఎంలలో ఎన్‌సిఆర్ వాటా 1.10 లక్షలు ఉండగా హిటాచీ ఏర్పాటు చేసిన ఎటిఎంలు 55 వేల వరకు ఉన్నాయి.

12 నెలలు.. 50 లక్షల బైక్‌లు


హోండా మోటార్‌సైకిల్ రికార్డు



న్యూఢిల్లీ : హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. 2017 సంవత్సరంలో ఈ కంపెనీ 57,94,893 బైక్‌లను విక్రయించింది. కంపెనీ భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన 17 ఏళ్ల కాలంలో ఒక సంవత్సరంలో 50 లక్షలకు పైగా వాహనాలను విక్రయించడం ఇదే మొదటిసారి. ఉత్పత్తి సామర్థ్య విస్తరణ, కొత్తగా మూడు బైక్‌ల విడుదల, ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు డీలర్‌షిప్ నెట్‌వర్క్‌ను విస్తరించడం వంటి చర్యల వల్ల ఏడాదిలో కాలంలో తాము సరికొత్త రికార్డు సృష్టించగలిగామని హెచ్ఎంఎస్ఐ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (సేల్స్, మార్కెటింగ్) యద్విందర్ సింగ్ గులేరియా తెలిపారు. గత ఏడాదిలో స్కూటర్లకు ఎక్కువగా డిమాండ్ నెలకొందని ఆయన చెప్పారు. 2017-18 సంవత్సరంలో 60 లక్షల వాహనాలను విక్రయించాలన్న లక్ష్యాన్ని చేరుకుంటామన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. కాగా గత డిసెంబరులో కంపెనీ 3,90,420 వాహనాలను విక్రయించింది. అంతకు ముందు ఏడాది ఇదే నెలతో పోల్చితే అమ్మకాలు 68 శాతం మేర పెరిగాయి. డిసెంబరులో స్కూటర్ల అమ్మకాలు 57 శాతం వృద్ధితో 1,51,758 నుంచి 2,38,818కి చేరుకున్నాయి.

మరో పదేళ్లలో రూ.100 లక్షల కోట్లు

దూసుకుపోతున్న మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ



వచ్చే పదేళ్ల కాలంలో మ్యూచువల్‌ఫండ్ సంస్థల నిర్వహణలోని ఆస్తుల విలువ మొత్తం రూ.100 లక్షల కోట్లను దాటే అవకాశం ఉంది. ప్రస్తుతం దేశంలోని మ్యూచువల్ ఫండ్ సంస్థల నిర్వహణలోని సొమ్ము విలువ 22.36 లక్షల కోట్ల రూపాయలుంది. అంటే వచ్చే పదేళ్లలో ఇది నాలుగురెట్లకంటే మించి పెరిగే అవకాశం ఉందన్న మాట. గత కొద్ది సంవత్సరాలుగా మార్కెట్లో రిటైల్ ఇన్వెస్టర్ల భాగస్వామ్యం భారీ స్థాయిలో పెరుగుతోంది. ద్రవ్యోల్బణం దెబ్బకు ప్రజలు ఈక్విటీలవైపు మొగ్గుచూపిస్తున్నారనీ మహీంద్రా ఎఎంసి మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ అశుతోష్ బిష్ణోయ్ చెప్పారు. సంప్రదాయంగా బంగారం, రియల్టీల్లో ఇన్వెస్ట్ చేసేవారు కూడా ఇప్పుడు అధికరాబడుల కోసం మ్యూచువల్ ఫండ్స్ ద్వారా ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్‌వైపు మొగ్గు చూపిస్తున్నారని ఆయన అన్నారు. 2017లో దేశంలోని 42 మ్యూచువల్‌ఫండ్ సంస్థల స్థూల అసెట్స్ విలువ 32 శాతం పెరిగింది. గత ఐదేళ్లలో ఈ పెరుగుదల 24 శాతం ఉంది. ఈ భారీ పెరుగుదలకు కారణం ఇన్వెస్టర్లలో పెరుగుతున్న ఆసక్తి. గత కొన్ని త్రైమాసికాలుగా స్టాక్ మార్కెట్లలోకి వచ్చిపడుతున్న దేశీయ నిధుల్లో అత్యధిక భాగం మ్యూచువల్ ఫండ్ సంస్థల నుంచే వస్తోంది. ముఖ్యంగా సిప్‌ల్లో ఇన్వెస్ట్ చేసేవారి సంఖ్య బాగా పెరిగింది. మ్యూచువల్‌ఫండ్ సంస్థల స్థూల ఆస్తుల విలువ మొదటిసారిగా 2014లో 10 లక్షల కోట్ల రూపాయలను దాటింది. ఆ తర్వాత సరిగ్గా మూడేళ్లు తిరక్కుండానే 22 లక్షల కోట్ల రూపాయలను దాటింది. 2016 డిసెంబరు ఆఖరు నాటికి కూడా మ్యూచువల్‌ఫండ్ పరిశ్రమ నిర్వహణలోని సంపద విలువ 16.49 కోట్ల రూపాయలే.

పబ్లిక్ ఇష్యూ సన్నాహాల్లో ఐఆర్‌ఎఫ్‌సి



- భారత రైల్వేకు రూ.1.8 లక్షల కోట్ల రుణం
- మార్చిలోగా రూ.4 వేల కోట్ల నిధుల సేకరణ
- మార్కెట్లోకి క్యాపిటల్ గెయిన్ 54 ఇసి బాండ్ల జారీ
- 'ఆంధ్రజ్యోతి'తో ఐఆర్‌ఎఫ్‌సి ఎండి సంతోష్‌కుమార్ పట్నాయక్

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి) : భారతీయ రైల్వేకు ఆర్థికంగా వెనుదన్నుగా నిలుస్తున్న అతిపెద్ద ఆర్థిక సర్వీసుల సంస్థ ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్‌ఎఫ్‌సి). మూడు దశాబ్దాల చరిత్ర ఉన్న ఈ సంస్థ త్వరలోనే పబ్లిక్ ఇష్యూకు రాబోతున్నది. నిధుల సమీకరణకు 54ఇసి క్యాపిటల్ గెయిన్స్ బాండ్లను జారీచేయనుంది. భారత రైల్వేకి ఇప్పటివరకు రూ.1.8 లక్షల కోట్ల రుణం ఇచ్చామని, ఈ ఏడాది మార్చి లోగా మొత్తం రూ.40 వేల కోట్లు అందించనున్నామని ఐఆర్‌ఎఫ్‌సి మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్ కుమార్ పట్నాయక్ తెలిపారు. దేశీయ రైల్వేల విస్తరణలో కీలకభూమిక పోషిస్తున్న ఈ ప్రభుత్వ సంస్థ పనితీరు, భవిష్యత్ వ్యూహాలపై పట్నాయక్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఈ సందర్భంగా తమ సంస్థ ఐపిఒ సన్నాహాల్లో ఉన్నట్టు వెల్లడించారు. ఇంటర్వ్యూ విశేషాలు...

రైల్వేల అభివృద్ధిలో మీ సంస్థ ఎలాంటి పాత్ర నిర్వహిస్తోంది ?

- రైల్వేలో రోలింగ్ స్టాక్స్ సహా మౌలిక వసతల ప్రాజెక్టులకు ఫండింగ్ చేస్తాము. ఇప్పటివరకు ఐఆర్‌ఎఫ్‌సి ఇచ్చిన నిధులతో 8,998 లోకోమోటివ్‌లు, 47,910 పాసింజర్ కోచ్‌లు, 2,14,456 వ్యాగన్లు రైల్వే శాఖ సమకూర్చుకుంది. రైల్వేకు ఇచ్చే నిధుల్లో 70 శాతం రోలింగ్ స్టాక్స్‌పైనే వెచ్చిస్తారు. ఐఆర్‌ఎఫ్‌సి ద్వారా తీసుకున్న రుణం ద్వారా రైల్వే తన ఆస్తులను నాలుగు రెట్లు పెంచుకుంది. 2017 మార్చినాటికి రూ. 1.8 లక్షల కోట్లు రుణంగా ఇచ్చాము. 2018 మార్చి నాటికి ఈ మొత్తం రూ. 2.2 లక్షల కోట్లకు చేరుతుంది.

ఐఆర్‌ఎఫ్‌సి నిధుల సమీకరణ వ్యూహాలేమిటీ ?

- ప్రజల నుంచి వాటాల రూపంలో, బాండ్ల రూపంలో సంస్థ నిధులను సమీకరిస్తుంది. దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ మార్కెట్లో డాలర్లు, యూరోలు, యెన్ రూపంలోను నిధులు సమీకరిస్తుంది. ఈ ఏడాది మార్చి నాటికి క్యాపిటల్ గెయిన్స్‌పై పన్ను మినహాయింపు ఉన్న 54 ఇసి బాండ్ల విక్రయం ద్వారా రూ.4,000 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ బాండ్లపై ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుంది. మూడేళ్ల వరకు లాకిన్ పీరియడ్. ఆ తరువాత వాటిని విక్రయించుకోవచ్చు. పెట్టుబడిపై 5.25 శాతం వడ్డీ గ్యారెంటీ ఇస్తున్నాము. దీంతోపాటు ఆదాయ పన్ను ద్వారా మరికొంత లబ్ది చేకూరుతుంది. ఆ విధంగా ఇందులో పెట్టుబడి పెట్టేవారికి సగటున 7.5 శాతం రాబడి వస్తుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ.20,000. ఆ తరువాత రూ.10 వేలు చొప్పున ఎంతైనా పెట్టవచ్చు. ఆ విధంగా ఒకరు రూ.50 లక్షల వరకు బాండ్లు తీసుకోవచ్చు.

డివిడెండ్ల చెల్లింపు వంటివి ఏమైనా ఉంటాయా?

- ఇప్పటివరకు వాటాదారులకు రూ.2,749 కోట్ల డివిడెండ్లు చెల్లించాము. 2016-17కు సంబంధించి రూ.373 కోట్ల డివిడెండ్లు ఇస్తున్నాం.

రైల్వే ప్రాజెక్టులకు ఎలా నిధులు సమకూరుస్తున్నారు?

- భారత రైల్వే సామర్థ్యం పెంచడానికి, ప్రాజెక్టుల కోసం 2011-12 నుంచి ప్రత్యేకంగా నిధులు ఇస్తున్నాం. ఇందుకోసం ఎల్ఐసి వంటి సంస్థల నుంచి ఇనిస్టిట్యూషనల్ ఫైనాన్స్ కూడా తీసుకుంటున్నాం. ఈ విధంగా 2019-20 నాటికి రూ.1.5 లక్షల కోట్లు సమీకరించాలనేది లక్ష్యం.

భారత రైల్వే లైన్ల విద్యుదీకరణ పనులకు ఎంత ఇస్తున్నారు?

- లైన్లు అన్నింటిని 100 శాతం విద్యుదీకరించాలన్నది లక్ష్యం. ఇప్పటివరకు 42 శాతం పనులు పూర్తి చేశారు. మిగిలిన 58 శాతాన్ని వచ్చే నాలుగేళ్లలో పూర్తిచేయాలనేది లక్ష్యం. దీనికి రూ.35,000 కోట్లు అవసరం. ఆ మొత్తం సమకూరుస్తాం.

ఇన్ఫోసిస్ సిఇఒ వేతనం రూ.18.6 కోట్లు



బెంగళూరు : ఇన్ఫోసిస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ)గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సలీల్ పరేఖ్ వార్షికంగా 18.6 కోట్ల రూపాయల వరకు వేతనం అందుకోనున్నారు. ఇందులో వేరియేబుల్ పే (పనితీరు ఆధారంగా చెల్లించే మొత్తం) కూడా కలిసి ఉంది. ఏప్రిల్ తర్వాతి నుంచి ఈ మేరకు సలీల్ పరేఖ్ వేతనం అందుకోనున్నారు. పరేఖ్ ఇవ్వనున్న వేతన ప్రతిపాదన ప్రకారం.. ఆయన వార్షిక వేతనం 6.5 కోట్ల రూపాయలు (ఫిక్స్‌డ్). పనితీరు, సాధించిన విజయాల ఆధారంగా వార్షిక వేరియేబుల్ పే 9.75 కోట్ల రూపాయలపై గరిష్ఠంగా 125 శాతం పొందడానికి (రూ.12.18 కోట్ల రూపాయలు) ఆయన అర్హులు. 3.25 కోట్ల రూపాయల నియంత్రిత స్టాక్ యూనిట్లు, 13 కోట్ల రూపాయల వార్షిక పనితీరు ఆధారిత ఈక్విటీ గ్రాంట్స్, 9.75 కోట్ల రూపాయల వన్‌టైమ్ ఈక్విటీ గ్రాంట్ కూడా ఆయన పొందడానికి అవకాశం ఉంటుంది. పరేఖ్ సిఇఒ బాధ్యతలు నిర్వహించే ఐదేళ్ల కాలంలో ఎప్పుడైనా స్టాక్ రూపంలో ఇచ్చే పరిహారం అందనుంది. ఈ ఏడాది మొదటి మూడు నెలల్లో ఫిక్స్‌డ్ సాలరీ, ఇతర ప్రయోజనాలతోపాటు ప్రారంభ వేరియేబుల్ పే కింద 2.37 కోట్ల రూపాయలు ఆయన అందుకోనున్నారు.



గురువారం హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్‌ను సిండికేట్ బ్యాంక్ జనరల్ మేనేజర్ ఎస్‌పి శర్మ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు బ్యాంక్ కార్యకలాపాల గురించి శర్మ వివరించారు.

మేరా హోర్డింగ్స్ మొబైల్ యాప్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ఆన్‌లైన్‌లో హోర్డింగ్‌ల స్పేస్‌ను విక్రయించే మేరా హోర్డింగ్స్ సంస్థ ఒక మొబైల్ యాప్‌ను ప్రారంభించింది. బ్యాడ్మింటన్ క్రీడాకారిణి కరోలినా మారిన్, హైదరాబాద్ హంటర్స్ ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ సభ్యుడు సాయి ప్రణీత్ ఈ యాప్‌ను విడుదల చేశారు. వరుసగా రెండు సీజన్లుగా తాము హైదరాబాద్ హంటర్స్ టీమ్‌కు ప్రకటనల ప్రచారం చేస్తున్నామని, మూడో సీజన్‌లో కూడా అది కొనసాగుతుందని మేరా హోర్డింగ్స్ వ్యవస్థాపక చైర్మన్ సాయికృష్ణ గజవెల్లి తెలిపారు. ఆ స్ఫూర్తితో ఇప్పుడు తాము ఈ మొబైల్ యాప్‌తో పూర్తి స్థాయి ప్రకటనల రంగంలోకి దిగుతున్నట్టు ఆయన చెప్పారు. ద్వితీయ, తృతీయ శ్రేణి వ్యాపారవేత్తలే తమ టార్గెట్ అని ఆయన అన్నారు. ఇలాంటి వారు హోర్డింగ్‌లు అందుబాటు ధరల్లో లభించక చాలా ఇబ్బందులు పడుతున్నారంటూ అలాంటి వారికి తక్కువ ధరకే వారికి కావలసిన ప్రదేశాల్లో హోర్డింగ్‌లు చూపించడం తమ లక్ష్యమని ఆయన తెలిపారు. ప్రకటనల హోర్డింగ్‌లు కావాలనుకునే వారు మొబైల్ యాప్‌లోకి లాగిన్ అయి తాము ఎంచుకున్న ప్రదేశంలో ఏయే హోర్డింగ్‌లు ఖాళీ ఉన్నాయో చూసుకుని నేరుగా దాన్ని బుక్ చేసుకోవచ్చునని సాయికృష్ణ తెలిపారు. తాము చిన్న చిన్న హోర్డింగ్‌ల యజమానులతో ఒప్పందం కుదుర్చుకుని వారికి, వ్యాపారవేత్తలకు మధ్య అనుసంధానకర్తలుగా వ్యవహరిస్తామన్నారు. చిన్న హోర్డింగ్‌లను కొనుగోలు చేసి దానికి తమ నిర్వహణ ఖర్చులు జత చేసి తక్కువ ధరకే సిద్ధంగా ఉంచడం ద్వారా తమకు ఆదాయం లభిస్తుందని ఆయన చెప్పారు.

మార్కెట్లోకి హెచ్ఐఎల్

చార్మినార్ ఫార్చ్యూన్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న బిల్డింగ్ మెటీరియల్ సంస్థ హెచ్ఐఎల్ లిమిటెడ్ మార్కెట్లోకి నాన్ ఆస్బెస్టాస్ రూఫింగ్ ఉత్పత్తి చార్మినార్ ఫార్చ్యూన్‌ను విడుదల చేసింది. అడ్వాన్స్‌డ్ ఆటోక్లేవింగ్ టెక్నాలజీని వినియోగించటం ద్వారా కొత్త ఉత్పత్తిని తయారు చేసినట్లు కంపెనీ తెలిపింది. ప్రపంచమంతా పర్యావరణ అనుకూలమైన ఉత్పత్తులపై దృష్టి సారిస్తున్నాయని, అందుకు తగ్గట్టుగానే చార్మినార్ ఫార్చ్యూన్‌ను రూపొందించినట్లు హెచ్ఐఎల్ పేర్కొంది. సాంప్రదాయిక వినియోగదారులకు ప్రత్యామ్నాయంగా కొత్త ఉత్పత్తులు ఉండనున్నాయని హెచ్ఐఎల్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ దిరుప్ రాయ్ చౌదరి తెలిపారు. తొలుత దేశీయ మార్కెట్లో వీటిని అందుబాటులో ఉంచనున్నామని, రానున్న కాలంలో పొరుగు దేశాలకు ఎగుమతి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భారతీయ రూఫింగ్ పరిశ్రమలో చార్మినార్ ఫార్చ్యూన్ కొత్త విప్లవాన్ని సృష్టించనుందని ఆయన అన్నారు. నాన్ ఆస్బెస్టాస్ ఉత్పత్తిని తయారు చేసేందుకు కంపెనీ ఆర్ అండ్ డి బృందం విశేషంగా కృషి చేసిందన్నారు. చార్మినార్ ఫార్చ్యూన్‌ను కొండపల్లిలోని ప్లాంట్‌లో ఉత్పత్తి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం ఈ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం 33,600 మెట్రిక్ టన్నులుగా ఉందని. మున్ముందు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు మరిన్ని పెట్టుబడులు పెట్టనున్నట్లు చౌదరి తెలిపారు.

3 నెలల్లో 20 ఇ-సైకిళ్లు

హీరో సైకిల్స్ వెల్లడి

న్యూఢిల్లీ : మరో మూడు నెలల్లో (ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు) ఎలక్ట్రిక్ సైకిళ్ల సంఖ్యను 20కు పెంచుకోవాలన్న సన్నాహాల్లో ఉన్నట్టు హీరో సైకిల్స్ తెలిపింది. ఈ ఎలక్ట్రిక్ సైకిళ్లను 4-5 గంటలు చార్జింగ్ చేస్తే 50 కిలో మీటర్ల వరకు ప్రయాణించవచ్చని, గరిష్ఠంగా గంటకు 25 కిలో మీటర్ల వేగంతో ప్రయాణించవచ్చని కంపెనీ తెలిపింది. కంపెనీ లెక్ట్రో శ్రేణిలో నాలుగు ఎలక్ట్రిక్ పెడల్ అసిస్టెడ్ సైకిళ్ల (ఇపిఎసి)ను తయారు చేస్తోంది. వీటి ధరల శ్రేణి 45,000 రూపాయల నుంచి 89,000 రూపాయల వరకు ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి వీటి సంఖ్యను 20కు పెంచుకోవాలన్నది కంపెనీ లక్ష్యం. ఫలితంగా మార్కెట్లో తన స్థానం మరింత బలోపేతం అవుతుందని కంపెనీ భావిస్తోంది. దేశీయంగానే ఇ-సైకిళ్లను తయారు చేసేందుకుగాను అంతర్జాతీయ టెక్నాలజీ కంపెనీలతో హీరో చర్చలు జరుపుతోంది.



7.75 శాతం రేటుతో సర్కారు బాండ్లు



న్యూఢిల్లీ : రిటైల్ ఇన్వెస్టర్ల కోసం ప్రభుత్వం తాజాగా 7.75 శాతం వడ్డీ రేటుతో కొత్త బాండ్ల స్కీమ్ ప్రకటించింది. గతంలో ప్రకటించిన 8 శాతం వార్షిక వడ్డీ రేటు బాండ్ల స్థానంలో ప్రారంభిస్తున్న ఈ కొత్త బాండ్ల స్కీమ్ జనవరి 10న ప్రారంభమవుతుంది. ఈ బాండ్ల కాలపరిమితి 7 సంవత్సరాలు. ఈ బాండ్లపై వడ్డీని ప్రతి ఆరు నెలలకు చెల్లిస్తారు. ఈ బాండ్లలో 1,000 రూపాయలు ఇన్వెస్ట్ చేస్తే ఏడేళ్ల చివర ఆ మొత్తం 1703 రూపాయలవుతుంది. ఈ బాండ్ల రాబడిపై పన్ను భారం ఉంటుంది. రిటైల్ ఇన్వెస్టర్లు బాండ్లలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రోత్సాహించే ఉద్దేశంతో ప్రభుత్వం 2003లో 8 శాతం వడ్డీ రేటుతో బాండ్స్ స్కీమ్‌ను ప్రారంభించింది. అప్పట్లో బాండ్ల కాలపరిమితిని ఆరేళ్లుగా నిర్ణయించారు. వడ్డీ రేట్లు తగ్గుతున్న తరుణంలో 8 శాతం రేటున్న బాండ్ల స్థానే ఇప్పుడు 7.75 శాతం వడ్డీ రేటు బాండ్లను ప్రభుత్వం ప్రవేశపెడుతోంది.

సామ్‌సంగ్ ఫోన్లపై ఎయిర్‌టెల్, వొడాఫోన్ క్యాష్‌బ్యాక్

న్యూఢిల్లీ : స్మార్ట్‌ఫోన్ విభాగంలో తమ కస్టమర్ల సంఖ్యను పెంచుకునేందుకు మొబైల్ ఫోన్ కంపెనీ సామ్‌సంగ్‌తో భారతి ఎయిర్‌టెల్, వొడాఫోన్‌లు జట్టుకట్టాయి. ఇందులోభాగంగా ఎంపిక చేసిన గెలాక్సీ జె సిరీస్ సామ్‌సంగ్ స్మార్ట్‌ఫోన్లను కొనుగోలు చేసే కస్టమర్లకు ఈ రెండు సంస్థలు 1,500 రూపాయల దాకా క్యాష్ బ్యాక్ ఇవ్వనున్నాయి. రెండేళ్లకాలంలో ఈ క్యాష్‌బ్యాక్ లభిస్తుంది. గెలాక్సీ జె2 (2017), గెలాక్సీ జె5 ప్రైమ్, గెలాక్సీ జె7 ప్రైమ్, గెలాక్సీ జె7 ప్రో (ధర శ్రేణి రూ.6,900 నుంచి రూ.19,900) ఫోన్లను కొనుగోలు చేసిన వారికి ఎయిర్‌టెల్ క్యాష్‌బ్యాక్ స్కీమ్ వర్తిస్తుంది. గెలాక్సీ జె2 ప్రో (రూ.8,490), జె7 నెక్స్ట్ (రూ.10,490), జె7 (రూ.16,900) ఫోన్లపై వొడాఫోన్ క్యాష్‌బ్యాక్ ఇస్తోంది. ఎయిర్‌టెల్ నెట్‌తో సామ్‌సంగ్ ఫోన్‌ను కొనుగోలు చేసిన కస్టమర్లు నెలకు 199 రూపాయలతో రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో రోజుకు 1జిబి డేటా పొందడంతోపాటు అపరిమిత కాల్స్‌ను మాట్లాడుకోవచ్చు. ఎయిర్‌టెల్ కస్టమర్లు ఈ స్కీమ్ కింద 5,000 రూపాయల (రెండేళ్లలో) విలువైన రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇక వొడాఫోన్ కస్టమర్లు నెలకు 198 రూపాయలతో రీచార్జ్ చేసుకోవాలి. రెండేళ్లలో రీచార్జ్‌ల మొత్తం విలువ 4,752 రూపాయలు ఉండాలి. అప్పుడే పూర్తి క్యాష్‌బ్యాక్‌ను పొందగలిగే అవకాశం ఉంటుంది. 12 నెలల కాలంలో 2,500 రూపాయల రీచార్జ్ చేసుకున్న వారు 12వ నెల చివర్లో 300 రూపాయల క్యాష్‌బ్యాక్‌ను పొందుతారని ఎయిర్‌టెల్ తెలిపింది. తదుపరి 12 నెల్లలో 2,500 రూపాయల రీచార్జ్ చేసుకుంటే మరో 1,200 రూపాయల క్యాష్‌బ్యాక్ లభిస్తుంది. ఈ మొత్తాన్ని కస్టమర్‌కు సంబంధించిన ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ వాలెట్‌లో జమచేస్తారు. కాగా వొడాఫోన్ 12 నెలల తర్వాత 600 రూపాయలు, ఆ తర్వాత 12 నెలల తర్వాత 900 రూపాయల క్యాష్‌బ్యాక్ ఇవ్వనుంది. ఈ మొత్తాన్ని ఎం-పెసా వ్యాలెట్‌లో జమ చేయనుంది. వొడాఫోన్ పోస్ట్ పెయిడ్ కస్టమర్లకు కూడా ఈ ఆఫర్‌ను అందిస్తోంది.

airtel

vodafone

SAMSUNG

లాభాలతో బోణీ



సెన్సెక్స్ 176 పాయింట్లు అప్

ముంబై : స్టాక్ మార్కెట్లో మూడు రోజుల వరుస నష్టాలకు గురువారం తెరపడింది. సానుకూల సంకేతాలతో సెన్సెక్స్ , నిఫ్టీ మళ్లీ లాభాల బాటపట్టాయి. సెన్సెక్స్ 176.26 పాయింట్ల లాభంతో 33969 వద్ద, నిఫ్టీ 61.60 పాయింట్ల లాభంతో 10504 పాయింట్ల వద్ద క్లోజయ్యాయి. రూ.80,000 కోట్లతో ప్రభుత్వ రంగ బ్యాంకు (పిఎస్‌బి)ల మూలధన పటిష్టీకరణ కోసం ప్రభుత్వం పార్లమెంట్ ఆమోదం కోరడం, ఆసియా, ఐరోపా మార్కెట్లు లాభాల్లో ఉండడం మార్కెట్‌కు కలిసొచ్చింది. డిసెంబరు నెల సేవల రంగం పిఎంఐ సానుకూలంగా ఉండడం కూడా సెంటిమెంట్‌ను పెంచింది. 'మెటల్ కంపెనీల షేర్లలో కొనసాగిన కొనుగోళ్లు, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ కుదుట పడడం, పిఎస్‌బిలను ఆదుకునేందుకు ఉద్దేశించిన ప్యాకేజీకి ప్రభుత్వం తుదిరూపం ఇవ్వడం ఈ ర్యాలీకి కారణం' అని జియోజిత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ సంస్థ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. మెటల్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, క్యాపిటల్ గూడ్స్, పిఎస్‌యు, ఇన్‌ఫ్రా, హెల్త్‌కేర్, ఆయిల్ అండ్ గ్యాస్, బ్యాంకింగ్, పవర్ కంపెనీల షేర్లు మంచి లాభాలతో ముగిశాయి. చమురు సెగతో ఇంధన కంపెనీల షేర్లు మళ్లీ వెలుగులోకి వచ్చాయి. సెన్సెక్స్ షేర్లలో టాటా స్టీల్ షేరు అత్యధికంగా 3.74 శాతం లాభపడింది. తర్వాత డాక్టర్ రెడ్డీస్ షేరు 3.14 శాతం లాభపడింది.

బ్యాంకు షేర్లకు గిరాకీ

మూలధన పటిష్టీకరణ ప్యాకేజీ ఖరారవడంతో గురువారం బిఎస్ఇలో పిఎస్‌బిల షేర్లు మంచి లాభాలతో ట్రేడయ్యాయి. యూకో బ్యాంకు షేర్లు 8.5 శాతం, ఐడిబిఐ బ్యాంకు షేర్లు 8.33 శాతం, పిఎన్‌బి 5.97 శాతం, బ్యాంక్ ఆఫ్ ఇండియా 3.83 శాతం లాభాలతో ముగిశాయి.

బైబ్యాక్ వార్తలతో వెలుగులోకి ఆరతి డ్రగ్స్

బైబ్యాక్ వార్తలతో ఆరతి డ్రగ్స్ కంపెనీ షేరు చురుగ్గా ట్రేడయింది. ఇందుకోసం కంపెనీ డైరెక్టర్ల బోర్డు వచ్చేవారం సమావేశం అవుతోందని వార్తలు వచ్చాయి. దీంతో బిఎస్ఇలో ఈ కంపెనీ షేరు ఒక దశలో 7.67 శాతం లాభంతో 52 వారాల గరిష్ఠ స్థాయిని తాకాయి. చివరికి 4.61 శాతం లాభంతో రూ.738.40 దగ్గర ముగిశాయి.

ఈ ఏడాది కూడా భారత స్టాక్ మార్కెట్ పరుగు ఆగదని దాయిష్ బ్యాంక్ అంచనా వేసింది. కంపెనీల రాబడుల వృద్ధి రేటు రెండంకెల్లో ఉండే అవకాశం ఉన్నందున డిసెంబరు నాటికి సెన్సెక్స్ 37000 పాయింట్లకు, నిఫ్టీ 11500 పాయింట్లకు చేరతాయని గురువారం విడుదల చేసిన ఒక పరిశోధనా నివేదికలో పేర్కొంది. ఈ సంవత్సరం గత ఏడాది కనిపించిన ఆటుపోట్లు కూడా పెద్దగా ఉండక పోవచ్చని తెలిపింది. బ్యారల్ చమురు ధర 70 డాలర్లు దాటితే మాత్రం భారత ఆర్థిక వ్యవస్థకు కష్టాలు తప్పవని హెచ్చరించింది. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పెట్రో ఉత్పత్తుల ధరలు పెంచకుండా, అదనంగా అప్పులు చేయడం ద్వారా ప్రభుత్వం తన ఖర్చులు కొనసాగించే అవకాశం ఉందని అంచనా వేసింది. అదే జరిగితే ద్రవ్య లోటు అదుపు తప్పే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

సెన్సెక్స్ 37000
నిఫ్టీ 11500

రూ.6,750 కోట్లు సమీకరించనున్న ఐడియా సెల్యులార్

ఐడియా సెల్యులార్ ఈక్విటీలో ఆదిత్య బిర్లా గ్రూప్ వాటా మరింత పెరగనుంది. ఇందుకోసం కంపెనీ 32.66 కోట్ల ఈక్విటీ షేర్లను ఒక్కో షేరు రూ.99.5 చొప్పున గ్రూప్‌లోని నాలుగు కంపెనీలకు ప్రిఫరెన్షియల్ పద్ధతిలో కేటాయించనుంది. దీంతో ఐడియా సెల్యులార్‌లో ఆదిత్య బిర్లా గ్రూప్ వాటా 42.4 శాతం నుంచి 47.2 శాతానికి పెరగనుంది. ఈ ఇష్యూ ద్వారా ఐడియా సెల్యులార్ కంపెనీకి రూ.6,750 కోట్లు సమకూరతాయి. గురువారం జరిగిన బోర్డు సమావేశం ఇందుకు ఆమోదం తెలిపింది.

అపోలో మైక్రో సిస్టమ్స్ ఇష్యూ ధర రూ.270-275

హైదరాబాద్‌కు చెందిన అపోలో మైక్రో సిస్టమ్స్ లిమిటెడ్ (ఎఎంఎస్ఎల్) కంపెనీ ఈ నెల 10న పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. రూ.10 ముఖ విలువ ఉండే ఒక్కో షేరును రూ.270-275 ధరల శ్రేణిలో జారీ చేయడం ద్వారా రూ.156 కోట్లు సమీకరించనున్నట్టు తెలిపింది. కంపెనీ ఉద్యోగులు, రిటైల్ ఇన్వెస్టర్లకు మాత్రం ఇష్యూ ధరలో ఒక్కో షేరుపై రూ.12 డిస్కౌంట్ ఉంటుంది. ఈ ఇష్యూ ద్వారా సమీకరించే రూ.156 కోట్లను నిర్వహణ మూలధనం, ఇతర అవసరాలకు వినియోగించనుంది. ఐపిఒ ఈ నెల 10న ప్రారంభమై ఇదే నెల 12న ముగుస్తుంది. హైదరాబాద్‌కు చెందిన ఈ కంపెనీ రక్షణ, వైమానిక, అంతరిక్ష రంగాలు, రవాణా, హోమ్‌లాండ్ సెక్యూరిటీ రంగాలకు అవసరమైన ఎలక్ట్రానిక్, ఎలక్ట్రో-మెకానికల్ వ్యవస్థలను అభివృద్ధి చేసి సరఫరా చేస్తోంది.

డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌లో వాటాల విక్రయం

న్యూఢిల్లీ : డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ) సహా మూడు పిఎస్‌యు సంస్థల్లో వాటాల విక్రయానికి ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఈ వాటాల విక్రయానికి అడ్వైజర్లుగా వ్యవహరించేందుకు మర్చంట్ బ్యాంకింగ్ సంస్థల నుంచి ప్రభుత్వం బిడ్లను ఆహ్వానించింది. హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్ కేర్ , ఇండియన్ మెడిసిన్స్ ఫార్మాస్యూటికల్ కార్పొరేషన్ (ఐఎంపిసిఎల్)లో 100 శాతం వాటాలను ప్రభుత్వం విక్రయించనుంది. రెండు దశల్లో వేలం ప్రక్రియను నిర్వహిస్తారు.

- డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌లో ప్రభుత్వానికి 73.47 శాతం వాటా ఉంది. కేంద్ర షిప్పింగ్ శాఖ సారథ్యంలోని ఈ సంస్థ నెట్‌వర్త్ 1,547 కోట్ల రూపాయలు. ప్రస్తుతం డ్రెడ్జింగ్ కార్పొరేషన్ షేరు రూ.882 వద్ద ట్రేడ్ అవుతోంది.




- ఐఎంపిసిఎల్‌ను కేంద్ర ప్రభుత్వంలోని ఆయుష్ శాఖ, ఉత్తరాఖండ్ ప్రభుత్వం జెవిలో ఏర్పాటు చేశాయి. ఈ సంస్థ నికర విలువ 65.49 కోట్ల రూపాయలు.
- హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్ కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య శాఖ నియంత్రణలో ఉంది. ఈ కంపెనీ నికర విలువ 487 కోట్ల రూపాయలు.

రెండున్నరేళ్ల గరిష్ఠానికి రూపాయి

ముంబై : ఫారెక్స్ మార్కెట్లో రూపాయి హవా కొనసాగుతోంది. అమెరికా డాలర్‌తో రూపాయి మారకం రేటు గురువారం రెండున్నరేళ్ల గరిష్ఠ స్థాయికి చేరింది. బుధవారం డాలర్‌తో రూ.63.53 దగ్గర ముగిసిన రూపాయి మారకం రేటు గురువారం రూ.63.41 దగ్గర ముగిసింది. ఒక దశలో రూ.63.62 స్థాయికి క్షీణించినా, ట్రేడింగ్ చివర్లో కోలుకుని రూ.63.41 దగ్గర ముగిసింది. 2015, జూలై 15 తర్వాత డాలర్‌తో రూపాయి మారకం రేటు ఈ స్థాయిలో ముగియడం ఇదే మొదటిసారి. కొనసాగుతున్న ఎఫ్‌పిఐల ప్రవాహం, ఆర్థిక వ్యవస్థ గాడిన పడుతోందన్న వార్తలు ఇందుకు కారణమని మార్కెట్ వర్గాలంటున్నాయి.

బులియన్




బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	30,360	30,400	30,430	---	29,460
క్రితం ముగింపు	30,490	30,500	30,530	30,400	29,600
22 క్యారెట్లు	28,110	28,300	27,990	---	28,060
క్రితం ముగింపు	28,230	28,300	28,080	28,200	28,190
వెండి (కిలో)	39,600	40,200	39,800	---	41,900
క్రితం ముగింపు	39,800	40,200	39,900	39,900	42,000

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.50 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	390.00	చిత్తూరు	398.00
వరంగల్	392.00	చెన్నై	405.00
విజయవాడ	388.00	నమక్కల్	395.00
గోదావరి	388.00	బెంగళూరు	385.00
విశాఖపట్నం	395.00	ముంబై	432.00

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	86.00	విజయవాడ	86.00
కరీంనగర్	88.00	గుంటూరు	86.00
వరంగల్	86.00	ఒంగోలు	88.00
మహబూబ్‌నగర్	86.00	చిత్తూరు	78.00
కర్నూలు	86.00	నెల్లూరు	88.00
విశాఖపట్నం	87.00	అనంతపురం	88.00
గోదావరి	84.00		

ముగింపు నిలకడ

టెక్ వ్యూ

నిఫ్టీ ప్రారంభంలో రియాక్షన్ ప్రదర్శించినా 10400 కన్నా పైనే రికవరీ సాధించి రోజంతా నిలకడగా పురోగమించింది. చివరికి డే గరిష్ఠ స్థాయిల్లో క్లోజ్ కావడం సానుకూల సంకేతం. కొద్ది రోజుల కన్సాలిడేషన్ అనంతరం 10500 కన్నా పైన క్లోజ్ కావడం బలాన్ని సూచిస్తోంది. మరింత అప్‌ట్రెండ్ కోసం మరోరోజు నిలదొక్కుకోవడం తప్పనిసరి. 10 డిఎంఏ కన్నా పైన పునరుజ్జీవం సాధించింది. వారాంతపు చార్టులు తయారుకానున్నందు వల్ల శుక్రవారం నాటి ముగింపు కీలకం.

శుక్రవారం స్థాయిలివే...

నిరోధం : 10540
మద్దతు : 10500

- రికవరీ బాట పడితే ఇంట్రాడే నిరోధం 10540 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 10600.
- 10500 కన్నా పైన నిలదొక్కుకోవడంలో విఫలమైతే అప్రమత్త ట్రెండ్‌ను సూచిస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 10400.
- బ్యాంక్ నిఫ్టీకి ప్రధాన నిరోధం 25500.

■ వి.సుందర్ రాజా

ద్వితీయార్ధం నిస్తేజం

ఆస్ట్రో వ్యూ

తిథి : పుష్య బహుళ చవితి **నక్షత్రం :** మఖ

రోహిణి, హస్త, శ్రవణ నక్షత్ర జాతకులు, కన్య, మకర రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10504.80 (+61.60)
టెండ్ మార్పు వేళలు : 9.23; 2.57
ధోరణి : గ్రహగతులను బట్టి నిస్తేజంగా ప్రారంభమై 10.15 వరకు అదే ధోరణిని ప్రదర్శిస్తూ 11.50 నుంచి 1.25 మధ్యలో మెరుగ్గా మారి ఆ తర్వాత చివరి వరకు నిస్తేజంగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 10.15 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 11.45 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. మధ్యాహ్నం 12 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని 1.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1.30 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే ముగింపు సమయంలో క్లోజ్ చేసుకునేలా మరిన్ని షార్ట్ పొజిషన్లు పరిశీలించవచ్చు.

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

నిరోధ స్థాయిలు : 10545, 10580
మద్దతు స్థాయిలు : 10465, 10430
గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి www.thefinanciala strologer.blogspot.in

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	57.87	67.10
పౌండ్	78.21	91.71
యూరో	69.51	80.62
ఆస్ట్రేలియా డాలర్	45.30	52.41
బహ్రెయిన్ దినార్	156.71	179.59
కువైట్ దినార్	174.47	217.19
ఒమని రియాల్	153.46	175.57
సౌదీ రియాల్	15.38	18.24
సింగపూర్ డాలర్	43.49	51.52
యుఎఇ దిరమ్	15.75	18.41

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు (BSE)

ACI INFOCOM 9.5(9.85)215	AVANTEL LTD 509.05(484.85)17120	CCL PRODUCTS 299.8(298.65)6582	DQ ENT 18.9(19.3)10445	GRANULES (I) 134.9(134.75)76443		MSR INDIA 36.25(34.95)5391	PALRED 92.4(93)1223	RESTILE CER. 10.03(9.47)33675	SURYACHAKRA 1.42(1.36)15303	VIJAY TEXTIL 44.2(43.9)9212
ADITYA SPIN. 8.13(8.51)260	AVANTI FEEDS 2547.85(2563.25)5411	CELESTIAL 21.6(21.7)43747	DR.REDDY'S 2409.5(2336.2)50190	GVK POWERINF 20.1(19.25)2956802		N C L IND. 282.05(265.7)68168	PANYAM CEMEN 62.75(62.3)23275	SAGAR CEM. 1104.5(1011)46485	SURYAMBA SP 74(72.85)4158	VIMTA LABS 172.8(170.45)23302
AGRO TECH FO 727.5(713.7)2269	B.N.RATHI SE 54.05(55.1)13835	CIL SECURITS 37.65(37.3)2573	EMPEE SUGARS 5.5(5.59)34068	HBL P SYS 72.8(73.05)191642		NACLIND 64(62.2)299347	PENNAR STEEL 68.45(67.55)147565	SAMKRG PIST. 348.65(346.45)11341	SURYAVA SPIN 8.49(8.44)900	VIRAT CRANE 45.15(44.75)6898
AISHWARYA TE 7.71(7.5)48710	BALAJI AMINE 618.85(623.6)10978	COROM INTER 576.1(568.7)14085	EVEREST ORG. 138.05(136.5)6312	HERITGFOOD 825.2(803.35)1677		NATCO PHARM 974.15(973.75)13632	PFL INFOTECH 8.82(8.4)3138	SAMPRE NUTRI 87.45(90.4)26835	SURYLAK.COTT 97.15(95.95)2932	VIRINCHI 132.65(126.45)204694
ALPHAGEO (I) 928.85(910.5)5556	BAMBINO AGRO 317.65(325)2165	CUBEX TUBING 28.15(28.5)1083	FACOR ALLOYS 4.15(3.96)252757	HINDUSTN BIO .4(.39)2450	KCP LTD 161.35(147.2)387032	NCC 132.6(130)500472	PHYTOCHEM I. 74.9(74.4)13417	SANGHI IND. 137.5(139.6)68847	SUVEN LIFE S 215.3(202.3)159739	VISAKA IND. 774.4(662.05)224963
ALU FLUORIDE 139.4(135.9)14094	BARTRONICSIN 15.92(15.17)81080	CYBERMATE 3.45(3.49)90592	FIRSTOBJ 15.6(15.85)18201	I.C.S.A. IND 4.9(4.67)208378	KERNEX MICRO 46.85(46.45)21322	NEHA INTER. 10.81(10.25)105256	PITTI LAMIN. 103.55(104.95)28100	SATVAH.ISPAT 35.35(34.2)100736	TAJ GVK HOTL 180.5(178.2)14541	VISTA PHARMA 43.55(41.5)25352
AMAR RAJA BA 839.85(846.1)22415	BHAGIRA.CHEM 345.95(314.75)24456	CYIENT 575.9(576.65)3550	GATI LTD. 137.1(135.4)196603	INCAP LTD. 124.85(120.65)13547	KNR CONST 309.2(312.95)19529	NETTLINX LTD 84.25(81.85)26272	POKARNA LTD 221.65(220.9)18090	SAVEN TECHNO 24.55(24.5)10080	TANLA 41.2(40.7)355006	VIVIMED LABS 104.45(104.35)149560
ANDHRA BANK 59.45(57.35)490844	BHAGYA INL 51.85(51.15)47782	DANLAW TECH. 80.65(76.85)10002	GAYATRI PROJ 212.75(228.1)3537022	IPAPPM 332.45(332)30836	KREBS BIOCHM 160.05(161.4)16860	NEULAND LAB. 869.55(875.05)5188	PRAJAY ENGS. 16.76(15.97)24250	SMPL 1.73(1.75)46130	TCI INDUS. 1043.15(1080)29	VST INDUS. 3149.2(3201.95)299
ANDHRA CEMEN 13.98(13.75)61765	BHARATFIN 1001.3(992.4)13121	DECAN CEMENT 602.65(564.6)2696	GENNEX LAB 6.04(6.1)362143	IVRCL LTD 6.51(6.85)327402	LANCO INFRA 1.62(1.55)5552588	NIHAR INFO 14.01(14.3)681	PREMIER EXPL 462.8(431.8)20362	SMS PHARMACE 101.4(102)10299	TRANSCORP IN 59.55(58.7)18751	WATERBASE 381.85(400.95)441446
ANDHRA PETRO 61.2(58.3)107959	BNR UDYOG 30.85(30.05)1149	DHAN ROTO SP 44.95(42.85)2630	GMR INFRASTR 21.15(21.8)4966750	KAKATIYA CEM 402.1(395.6)17996	LOKESH MACH 78.7(77.65)202027	NILE LTD. 931.25(910.05)9066	PRISM CEMENT 120.95(115.4)60432	SREE RAYALA 225.15(217.7)8123	TRANSGENE BI 2.36(2.37)7241	XLENERGY 3.85(3.9)14029
ANJANI PORTL 247.8(238.2)4447	CAMBRIDGE 84.65(83)740	DIAMONPOWER 22.25(23.75)298494	GODAVARI DRU 42.25(42.8)9561	KALLAM SPG. 26.8(25.7)111317	MADHUCON PRJ 36.85(35.7)102412	NTL 5.12(4.9)12458	RAIN 431.85(438.95)1896593	STEEL EXCH 46.25(48.65)116414	TRANSPORT CO 289.9(290.4)4223	YBRANTDIGI 5.84(5.98)2374487
ASTRA MICRO 118.9(120.9)41708	CAT TECHN. 1.22(1.2)28087	DIVI'S LAB. 1103.15(1098.2)27878	GOLDST INFRA 205.85(199.7)31718	KARAN WOO-SN 1.05(1.09)200	MOLD-TEK TEC 74.5(75)16861	OIL COUNTRY 62.3(64.2)111044	RAJ PACKAGIN 37.8(37.2)15879	SUJANA INDUS .89(.9)222342	USHER AGRO 9(8.79)26007	ZEN TECH 152.15(149.15)91045
AUROB.PHARMA 668.65(666.5)125749	CCHHL 20.05(20.85)160754	DIVYA.GRANIT 106.15(101.1)27830	GOLDSTONE EN 14.65(15.35)23352	KAVERI SEED 534.55(536.35)36768	MOSCHIP SEMI 39.65(39.7)155253	PADMALAYA TE 5.8(5.83)20392	REG.CERAMIC 9.4(9.49)16603	SURANATP 6.28(6.24)44441	VICEROY HOTE 19.75(20.45)382921	ZENOTECH 48.9(47)40851

ఎన్ఎస్ఇ-500 (NSE) — షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 740.4(708)220286
[illegible]
BALMLAWRIE 273.5(270.75)90515
BALRAMCHIN 137.15(137.25)1534990
BANKBARODA 163.9(157.85)17214456
BANKINDIA 174.65(168.35)8222419
BASF 2142.5(2119.45)11546
BATAINDIA 767.35(772.4)939051
BBTC 1613.55(1628.55)80842
BEML 1530.8(1523.9)658084
[illegible]
CYIENT 576.1(576.9)41300
DABUR 355(354.65)1107800
DALMIABHA 3101.05(3103.75)77777
DBCORP 355.95(353.4)41493
DBREALTY 71.2(67.85)1003890
DCBBANK 194.85(191.85)1046679
DCMSHRIRAM 556.8(549.65)127097
DEEPAKFERT 426.2(425.9)177604
[illegible]
GODFRYPHLP 988.7(986.35)91946
GODREJCP 989.45(986.4)269423
GODREJIND 612.45(607.8)593868
GODREJPROP 714.75(710.75)53134
GPPL 138.85(137.95)498540
GRANULES 135.15(134.95)1212662
GREAVESCOT 141.85(139.8)1601508
GREENPLY 371.25(359.9)262045
[illegible]
INDIACEM 190.35(186.4)5170878
INDIANB 380.15(373.2)1146187
INDOCO 278.85(280.95)33939
INDUSINDBK 1646.6(1630.25)747232
INEOSSTYRO 1066.05(1071.6)9486
INFRATEL 379.05(378.65)4247055
INFY 1015.4(1021.3)4473807
INGERRAND 873.6(859.5)91408
[illegible]
KWALITY 112.95(111.55)1366365
L&TFH 172.4(170.05)4408258
LAKSHVILAS 148.2(148.55)929027
LAOPALA 635.4(651.25)54155
LAXMIMACH 5951.95(5803.55)14312
LICHSGFIN 567.6(566.85)880901
LITL 1.55(1.5)1059957
LT 1315.7(1275.3)4546456
[illegible]
ORIENTCEM 168.8(169.45)133338
ORISSAMINE 2056.25(2037.5)9120
PAGEIND 24595.7(24680.45)14296
PARSVNATH 29.65(30.55)333506
PCJEWELLER 486.6(475.8)2606626
PEL 2819.3(2850.05)167634
PERSISTENT 708.5(696)246895
PETRONET 252.7(253.6)1758113
[illegible]
SBIN 308.5(302.85)24517099
SCHAEFFLER 5806.35(5747.6)678
SCHNEIDER 129.45(129.65)282276
SCI 96.5(96.05)1882384
SHARDACROP 469.05(453.35)44503
SHILPAMED 621.7(610.4)18735
SHK 289.55(294)53392
SHOPERSTOP 531.95(533.25)60213
[illegible]
TECHNO 395.55(399.35)14758
TEXRAIL 113.4(113.8)1204035
THERMAX 1237.45(1238.15)81772
THOMASCOOK 249.45(250.8)197953
TIDEWATER 7613.05(7071.95)42228
TIMKEN 886.65(897.35)11571
TITAN 892.9(856.3)3028931
[illegible]


తృణధాన్యాలతో చేసిన తిను బండారాలను విద్యార్థులకు అందిస్తున్న కడియం

మధ్యాహ్న భోజనం మెనూ మారుస్తాం

» కేంద్ర సాయం సరిపోవడం లేదు: కడియం

నార్సింగ్/హైదరాబాద్, జనవరి 4: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మెనూను మార్చాల్సిన అవసరముందని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. వారికి మరింత పౌష్టికాహారం ఇచ్చేందుకు అక్షయపాత్ర ఫౌండేషన్, ఇక్రిశాట్, ఎన్ఐఎన్‌తో బృందాన్ని ఏర్పాటు చేసి, ఉత్తమ మెనూ తయారు చేయిస్తామన్నారు. లక్ష మంది విద్యార్థులకు తృణధాన్యాల పంపిణీ కార్యక్రమాన్ని కడియం గురువారం అక్షయపాత్ర ఫౌండేషన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనం కోసం కేంద్రప్రభుత్వం ప్రాథమిక విద్యార్థులకు రూ.4.13, హైస్కూల్ విద్యార్థులకు రూ.6.18 ఇస్తోందని, ఈ డబ్బులతో పౌష్టికాహారాన్ని ఎలా అందిస్తామని ప్రశ్నించారు. ఈ మొత్తాలను పెంచాలని కేంద్రానికి లేఖ రాస్తామన్నారు. మధ్యాహ్న భోజనానికి ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణలో ప్రభుత్వం ఏటా రూ.116 కోట్లు ఖర్చు చేస్తోందని, గురుకుల పాఠశాలలు, కస్తూర్బా స్కూళ్లు, ఇతర రెసిడెన్షియల్ స్కూళ్లను కలిపి రూ.557 కోట్లు వెచ్చిస్తోందన్నారు. మధ్యాహ్న భోజనంలో వారానికి 3 రోజులు గుడ్డు ఇస్తున్నామన్నారు. గురుకులాల్లో నెలలో 2 రోజులు మేక మాంసం, 4 రోజులు కోడి మాంసం, రోజూ గుడ్డు, బోర్న్‌విటా, 50 గ్రాముల నెయ్యితో ఉత్తమ ఆహారం అందిస్తున్నామన్నారు. అక్షయ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్య గౌరచంద్ర దాసా మాట్లాడుతూ.. చిన్నారులకు సమతుల ఆహారం కోసం తృణధాన్యాలను చిరుతిండిగా మధ్యాహ్న భోజనంలో ఇస్తున్నామన్నారు. ఎన్ఐఎన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మయ్య, ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డేవిడ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీజన్‌లో ఎకరాకు 50 వేలు మిగలాలి

» ఇక విద్యుత్తు కోత ఉండదు: పోచారం

హైదరాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రైతుకు ప్రతి సీజన్‌లో ఖర్చులు పోను ఎకరానికి రూ.50 వేలు మిగలాలన్నదే తమ లక్ష్యమని వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖలు, సీడ్ కార్పొరేషన్ సమన్వయంతో 2018లో మంచి దిగుబడులకు కృషిచేస్తామన్నారు. గురువారం ఆయన సచివాలయంలోని తన చాంబర్‌లో వ్యవసాయశాఖ, ఉద్యాన వర్సిటీ క్యాలెండర్లను, విత్తన ధ్రువీకరణ ఏజెన్సీ డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి 5000 ఎకరాలకు ఒక ఏఈవో, మండలానికి ఒక ఏవోను నియమించామని, రూ.17 వేల కోట్ల రుణమాఫీ కూడా గతేడాది పూర్తయిందన్నారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో కోటి ఎకరాలకు సాగు నీరందిస్తామన్నారు. తెలంగాణ విత్తన ధ్రువీకరణ ఏజెన్సీకి దేశంలోనే మంచి పేరొచ్చిందని, 5 రాష్ట్రాలకు నోడల్ ఏజెన్సీగానూ కేంద్రం నియమించిందన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఫీజులు పెంచొద్దు

» ఈ విద్యాసంవత్సరం ఫీజులే వచ్చేసారి కూడా
» తదుపరి ఉత్తర్వులు వచ్చే దాకా అమలు
» ప్రైవేటు పాఠశాలలకు సర్కారు ఆదేశం


హైదరాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజులపై ప్రైవేటు స్కూళ్లకు తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. తదుపరి ఆదేశాలు ఇచ్చేంత వరకు ఫీజులను పెంచొద్దని స్పష్టం చేసింది. ఫీజుల విషయం తేలకుండా అడ్మిషన్ల కోసం ప్రైవేటు పాఠశాలలకు అనుమతి ఇవ్వడంపై 'ఆంధ్రజ్యోతి' ఈ నెల 2న 'తగ్గించాలంటే పెంపా?' శీర్షికన ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. 2017-18 విద్యా సంవత్సరంలో ఎంతమేర ఫీజులు వసూలు చేశారో.. 2018-19 విద్యా సంవత్సరానికి అంతే ఫీజును వసూలు చేయాలని ప్రైవేటు స్కూళ్లకు సూచించింది. ఈ మేరకు గురువారం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి రంజీవ్ ఆచార్య సర్క్యులర్ జారీ చేశారు. ఫీజుల పెంపుపై ప్రభుత్వం తదుపరి ఆదేశాలు ఇచ్చేంత వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఫీజులు పెంచొద్దని ప్రభుత్వం ఆ సర్క్యులర్‌లో పేర్కొంది. ఫీజుల పెంపుపై ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ తన నివేదికను గతనెల 30వ తేదీన ప్రభుత్వానికి అందించింది. అయితే దీనిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోలేదు. ఫీజులపై ఎలాంటి నిర్ణయం వెలువడకముందే రాష్ట్రంలోని సీబీఎస్ఈ, ఐసీఎస్ఈతో ఇతర ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్లకు పాఠశాల విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 12వ తేదీలోపు అడ్మిషన్ల ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో అసలు ఫీజులు తేలకుండా అడ్మిషన్లకు ఏ విధంగా అనుమతి ఇస్తారనే అంశంపై 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. దీనిపై ప్రభుత్వం పునరాలోచించింది. విద్యార్థుల తల్లిదండ్రుల సంఘాలు కూడా అడ్మిషన్లకు అనుమతివ్వడాన్ని వ్యతిరేకించాయి. వాస్తవానికి అడ్మిషన్ల ప్రక్రియనే నిలిపివేయాలని ప్రభుత్వం భావించింది. అయితే సీబీఎస్ఈ స్కూళ్లలో ఎక్కువగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, కేంద్రప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు ఉంటారు. ఈ నేపథ్యంలో ఇతర రాష్ట్రాల్లోని వాళ్లు తెలంగాణ కురావాలనుకున్నా, బదిలీ అయిన వారి పిల్లలకు ఇక్కడి స్కూళ్లలో అడ్మిషన్ పక్కా అయితేనే సిద్ధపడతారు. లేనిపక్షంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటారు. దీంతో సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాలల్లో ఇప్పుడు అడ్మిషన్లు నిలిపివేస్తే రాష్ట్రానికి నష్టం జరిగే ప్రమాదం ఉన్న నేపథ్యంలో అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు.

కేటీఆర్ సుడిగాలి పర్యటన

మల్కపేట టన్నెల్ పనులు.. 'డబుల్' ఇళ్ల పరిశీలన

» నిర్వాసిత యువతకు అర్హతను బట్టి ఉద్యోగం: మంత్రి

సిరిసిల్ల, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మాట లేదు.. ముచ్చట లేదు.. 6 గంటలు నిర్విఘ్నంగా అభివృద్ధి పనులను పరిశీలిస్తూ పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ హడావుడి చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలకు మంత్రి గురువారం ఆకస్మికంగా రావడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు హైరానా పడ్డారు. పనుల జాప్యంపై అధికారులను మందలిస్తూ.. కాళేశ్వరం 9వ ప్యాకేజీలో నిర్వాసిత రైతులకు భరోసా కల్పిస్తూ మంత్రి పర్యటనను కొనసాగించారు. ఉదయం 11 గంటలకు తంగళ్లపల్లి మండెపల్లి శివారులో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణాల్లో జాప్యంపై అసహనం వ్యక్తంచేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రాంతాన్ని గ్రేటర్ కమ్యూనిటీలా తీర్చిదిద్దాలన్నారు. అండర్ డ్రైనేజీ నిర్మాణం, ఓపెన్ జిమ్, డంపింగ్ యార్డు, చెట్లు పెంచేందుకు నిధులు ఇస్తామన్నారు. ఏడు వేల మంది నివసించే ఈ ప్రాంతంలో మౌలిక వసతులన్నీ కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ హాల్, సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, కాలనీకి వచ్చే రోడ్డును వంకరలు లేకుండా చూడాలన్నారు. అనంతరం మండెపల్లి వద్ద రూ.16.50 కోట్లతో నిర్మించే అంతర్జాతీయ డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన సంస్థ పనులను పరిశీలించారు. పనులు నత్తనడకగా సాగడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. మేలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా కోనరావుపేట మండలం మల్కపేట వద్ద నిర్మిస్తున్న టన్నెల్, రిజర్వాయర్ పనులను కేటీఆర్ పరిశీలించారు. టన్నెల్‌లోకి వెళ్లారు. పనుల వేగాన్ని పెంచేందుకు జామర్లను ఏర్పాటు చేయాలన్నారు. 3 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తున్న మల్కపేట రిజర్వాయర్ పనులనూ పరిశీలించారు. కేటీఆర్ మల్కపేట రిజర్వాయర్ పనులను పరిశీలిస్తుండగా ముంపునకు భూములు కోల్పోయిన రైతులు మంత్రి వద్దకొచ్చి పరిహారంలో నష్టపోయామంటూ గోడు వెళ్లబోసుకున్నారు. స్వచ్ఛందంగా భూములిచ్చిన రైతులను అభినందించిన మంత్రి నిర్వాసిత యువకులకు అర్హతను బట్టి ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామన్నారు.


టన్నెల్‌ను పరిశీలిస్తున్న కేటీఆర్

స్థిరాస్తుల తనఖా చెల్లదు!

వరంగల్ అర్బన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): చిట్‌ఫండ్ కంపెనీలకు భారీ షాక్! ఈ కంపెనీల నిర్వహణకు సరికొత్త మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ఒక్కో చిట్టీ విలువకు అవసరమైన మొత్తాన్ని స్థిరాస్తి రూపంలో కాకుండా నగదు డిపాజిట్లు చేయాలని రాష్ట్ర రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా చిట్‌ఫండ్ కంపెనీలు మార్టిగేజ్ చేసిన స్థిరాస్తుల వివరాలను సేకరించాలని జిల్లా రిజిస్ట్రార్లను ఆదేశించారు. దీంతో చిట్‌ఫండ్ కంపెనీలకు నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టారు. ఒక్క వరంగల్ జిల్లాలోనే దాదాపు 3 కోట్ల స్థిరాస్తులకు సంబంధించి నోటీసులు జారీ చేశారు.

చిట్‌ఫండ్ కంపెనీలు స్థిరాస్తిని మార్టిగేజ్ చేయడంలో మోసాలకు పాల్పడుతున్నారని ప్రభుత్వం ఆలస్యంగా గుర్తించింది. దీంతో చిట్‌ఫండ్ కంపెనీలు బోర్డులు తిప్పేసినప్పుడు వినియోగదారులు రోడ్డున పడుతున్నారు. ఉదాహరణకు ఒక చిట్‌ఫండ్ కంపెనీ రూ.5 లక్షల విలువైన చిట్టీ నడపాలంటే అంతే మొత్తం నగదు డిపాజిట్ చేయాలి. లేదా రూ.7.5 లక్షల విలువైన స్థిరాస్తిని మార్టిగేజ్ చేయాల్సి ఉంటుంది. ఎన్ని చిట్టీలు కొనసాగిస్తున్నా ఇవే నిబంధనలు పాటించాలి. దీంతో చిట్‌ఫండ్ కంపెనీల నిర్వాహకులు నగదు మాట మరచి కేవలం స్థిరాస్తులను మార్టిగేజ్ చేయడం ప్రారంభించారు. భూముల మార్కెట్ విలువను వాస్తవ విలువకంటే 10-20 రెట్లు పెంచేసి మార్టిగేజ్ చేస్తున్నారు. ఫలితంగా చిట్‌ఫండ్‌లు బోర్డులు తిప్పేసినప్పుడు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం చట్ట సవరణ చేసింది. 2017 ఏప్రిల్ 21న గెజిట్ నోటిఫికేషన్ జారీ అయింది. దీంతో 2016 జూలై 27 నుంచి దేశ వ్యాప్తంగా చిట్‌ఫండ్ కంపెనీలు చేపట్టిన స్థిరాస్తుల మార్టిగేజ్ చెల్లదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చిట్‌ఫండ్ కంపెనీలు చేసిన మార్టిగేజ్ వివరాలను సేకరించి చిట్‌ల విలువకు సరిపడ నగదు డిపాజిట్లు సేకరించాలని రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.


కర్ణాటక సాగునీటి పారుదల శాఖ మంత్రి పాటిల్‌తో మంత్రి హరీశ్‌రావు

ఆర్డీఎస్ నీళ్లు ఇవ్వండి

» తెలంగాణను కోరిన కర్ణాటక మంత్రి
» జూరాలకు 2 టీఎంసీలు ఇస్తామని హామీ
» ఆర్డీఎస్ పూర్తికి కర్ణాటక సాయం కోరిన తెలంగాణ

హైదరాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాజోలిబండ డైవర్షన్ స్కీం(ఆర్డీఎస్)లో తెలంగాణకు కేటాయించిన నీటిని తాము వాడుకునేందుకు అనుమతించాలని కర్ణాటక ప్రభుత్వం కోరింది. బదులుగా తెలంగాణ ప్రభుత్వం కోరినప్పుడు నారాయణపూర్ డ్యాం నుంచి జూరాలకు 2 టీఎంసీల నీటిని విడుదల చేస్తామని కర్ణాటక హామీ ఇచ్చింది. తుంగభద్ర పరీవాహక ప్రాంతంలో ఈ ఏడాది తీవ్ర నీటి కొరత ఉందని, తమ రాష్ట్రంలో తుంగభద్ర ఆయకట్టును కాపాడుకునేందుకు, తాగునీటి అవసరాలకు ఆర్డీఎస్ నీరు అవసరం ఉందంటూ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావుకు కర్ణాటక నీటిపారుదల శాఖ మంత్రి పాటిల్ లేఖ రాశారు. జలసౌధలో గురువారం వీరిద్దరూ ఇరు రాష్ట్రాల అధికారులతో కలిసి చర్చలు జరిపారు. తుంగభద్ర డ్యాం నుంచి తెలంగాణాకు 3.5 టీఎంసీల నీటి వాటా ఉందని పాటిల్‌కు హరీశ్ గుర్తు చేశారు. ఆర్డీఎస్ నుంచి కర్ణాటక ఎంత నీటిని వాడుకునేందుకు అనుమతించాలన్న అంశంపై ప్రధానంగా చర్చ జరిగింది. ఆలంపూర్ నియోజకవర్గంలోని 7 వేల ఎకరాల ఆరుతడి పంటలకు అవసరమైన నీటి వాడకంపై రెండు రాష్ట్రాల ఇంజనీర్లు అంచనా వేసిన తర్వాత మిగిలిన నీటిని కర్ణాటకకు ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తామని హరీశ్ స్పష్టంచేశారు. సీఎం కేసీఆర్‌తో చర్చించిన తర్వాత నిర్ణయం చెబుతామన్నారు. ఆలంపూర్ నియోజక వర్గంలో పంటను కాపాడుకుంటూ తుంగభద్ర నీటిని వాడుకునేందుకు కర్ణాటకకు అనుమతి ఇస్తే అభ్యంతరం లేదని స్థానిక ఎమ్మెల్యే సంపత్ అన్నారు. ఆర్డీఎస్ ఆధునికీకరణ పనులపై త్వరలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల సమావేశం నిర్వహించాలని తెలంగాణ, కర్ణాటక నిర్ణయించాయి. ఆర్డీఎస్ పనులను 6 నెలల్లో పూర్తి చేసేందుకు కర్ణాటక నిధులిస్తుందని, ఆంధ్రప్రదేశ్ సహకారం లేకుండా ఆర్డీఎస్ ఆధునికీకరణ పనులు పూర్తికావని కర్ణాటక మంత్రి అభిప్రాయపడ్డారు. దీనిపై మూడు రాష్ట్రాల నీటిపారుదల శాఖ మంత్రులు, కార్యదర్శులతో త్రైపాక్షిక సమావేశానికి చొరవ చూపాలన్న విజ్ఞప్తికి హరీశ్ అంగీకరించారు.

కోడిగుడ్డుపై ఈకలు పీకుతున్న కాంగ్రెస్

» రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోంది
» ఇప్పుడు జేఏసీ ఎందుకు?: హరీశ్‌రావు
» టీఎన్జీవోఏల డైరీ, కేలండర్ ఆవిష్కరణ

హైదరాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): 'విద్యుత్తు, వ్యవసాయం సహా అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిని సాధిస్తోంది. కాంగ్రెస్ నేతలు మాత్రం కోడిగుడ్డుపై ఆకలు పీకిన చందాన విమర్శలు చేస్తున్నారు' అని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. తాము రైతులకు 24 గంటల విద్యుత్తు ఇవ్వడంతో కాంగ్రెస్ నేతల దిమ్మ తిరిగి, మైండ్ బ్లాక్ అయిందని, ఇక 'ఇప్పుడు జేఏసీ ఎందుకు?' అని ప్రశ్నించారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం(టీఎన్జీఓఏ) డైరీ, కేలండర్లను గురువారం మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోఏ అధ్యక్షుడు కారం రవీందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ.. రైతులకు 24 గంటల పాటు నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇస్తామంటే చిత్రంగా ఉందన్న జానారెడ్డి, కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ఏమంటారని నిలదీశారు. రాష్ట్రానికి 14,500 మెగావాట్ల విద్యుత్తు అందుబాటులో ఉందని, మార్చి నాటికి మరో 800 మెగావాట్లు అందుబాటులోకి వస్తుందన్నారు. కొత్తగూడెం ప్లాంట్ల ద్వారా మరో 1,080 మెగావాట్లు వస్తుందని, 4 వేల మెగావాట్ల సామర్థ్యంతో కూడిన యాదాద్రి ప్లాంటుకు అన్ని అనుమతులూ వచ్చాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులను వెనక్కు రప్పించేందుకు విభజన చట్టంలోని కొన్ని పరిస్థితులు అడ్డంకిగా మారాయని, ఏపీ ప్రభుత్వ వైఖరి కూడా తమ ప్రయత్నాలను అడ్డుకుంటోందన్నారు. కొన్ని శాఖల్లో సూపర్ న్యూమరీ పోస్టులను కూడా నెలకొల్పామన్నారు. గత ప్రభుత్వాల్లో మాదిరిగా ఉద్యోగులపై తమ ప్రభుత్వం వేధింపులకు, కేసుల నమోదుకు పాల్పడడం లేదన్నారు. గతంలో ఉద్యోగులు రోడ్డెక్కితేనే ప్రభుత్వాలు పట్టించుకునేవని, కానీ అంగన్‌వాడీలు సహా ఇతర ఉద్యోగులను సీఎం కేసీఆర్ స్వయంగా ఆహ్వానించి, వారి సమస్యలను పరిష్కరిస్తున్నారని, ఒక ముఖ్యమంత్రి ఇలా చేయడం చరిత్రలోనే లేదన్నారు.

ప్రయోగాలు.. పైసా వసూల్

(మొదటి పేజీ తరువాయి)

పర్యవేక్షలుగా విధులు నిర్వర్తించే అధ్యాపకులు ప్రైవేటు కాలేజీలు ఇచ్చే మామూళ్ల మత్తులో జోగుతున్నారని, ప్రాక్టికల్స్‌ను నిర్లక్ష్యం చేస్తూ విద్యార్థుల జీవితాలతో అడుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పక్కాగా ప్రాక్టికల్స్ తీరును పర్యవేక్షించాల్సిన అధ్యాపకులు.. వసూళ్ల మత్తులో పడి యాజమాన్యాలకు దాసోహం అవుతున్నారనే విమర్శలున్నాయి. చిన్న ప్రైవేటు కాలేజీ నుంచి బడా కార్పొరేట్ కాలేజీల దాకా రాష్ట్రవ్యాప్తంగా అన్ని కాలేజీల్లోనూ ఇదే తంతు కొనసాగుతోందనే ఆరోపణలున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 1500 దాకా ప్రైవేటు జూనియర్ కాలేజీలున్నాయి. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. ప్రయోగాల పర్యవేక్షణకు ప్రతి కాలేజీ నుంచి అధ్యాపకులను ఇంటర్ బోర్డు ఎంపిక చేస్తుంది. సబ్జెక్టుకు ఒక పర్యవేక్షకుడు రోజుకు రెండు బ్యాచ్‌ల చొప్పున మూడు రోజుల పాటు ప్రాక్టికల్స్‌ను నిర్వహిస్తారు. అసలు మాయ ఈ ప్రాక్టికల్స్ పరీక్షల సమయంలోనే చోటుచేసుకుంటుంది. విద్యార్థులతో ప్రాక్టికల్స్ నిర్వహించి, ప్రశ్నలు అడిగి వారి ప్రతిభ ఆధారంగా మార్కులు వేయాల్సి ఉంటుంది. అయితే.. పర్యవేక్షకులుగా కాలేజీలకు వెళ్లే అధ్యాపకులు ల్యాబ్‌లలో లాంఛనప్రాయంగా కూర్చుంటారనే విమర్శలున్నాయి. లేని ప్రాక్టికల్స్‌ను జరిపినట్టుగా చూపేందుకుగాను పర్యవేక్షకులకు ఒక్కో కాలేజీ రూ.40వేల నుంచి రూ.50 వేల దాకా చెల్లిస్తోంది. ఈ రకంగా కాలేజీల్లో ప్రాక్టికల్స్ పరీక్షల సమయంలో ఏటా రూ. 7-8 కోట్ల దందా సాగుతోంది.

'కార్పొరేట్' పర్యవేక్షణ కాసుల పంటే

ప్రయోగ పరీక్షల సమయంలో కార్పొరేట్ కాలేజీల్లో ప్రాక్టికల్ పర్యవేక్షకులుగా నియామకమైతే ఆ అధ్యాపకుల పంట పండినట్టే! ప్రాక్టికల్స్ నిర్వహణ కోసం ఒక్కో కార్పొరేట్ కాలేజీ సుమారు రూ.50 వేల నుంచి రూ.70వేల దాకా మామూళ్లు చెల్లిస్తుండడం గమనార్హం. అదే పర్యవేక్షకులు చిన్న కాలేజీలకు వస్తే రూ. 30-40వేల వరకు చెల్లిస్తున్నాయి. నాలుగు సబ్జెక్టులకు వచ్చే నలుగురు పర్యవేక్షకులకు ఒక్కొక్కరికి ఎంతలేదన్నా రూ. 15-20వేలు ముడతాయి. వీరితో పాటు అప్పుడప్పుడు వచ్చే డీవో, డీఐఈవోలకు కనీసం రూ. 10వేలు చెల్లించుకోవాల్సిందే. ముఖ్యంగా కార్పొరేట్ కాలేజీల్లోనైతే పర్యవేక్షకులకు మధ్యాహ్నం బిర్యానీ, రాత్రి వేళల్లో మందు పార్టీలు కూడా ఇస్తున్నట్టు సమాచారం.

పైసలిచ్చి రికార్డులు

కార్పొరేట్ కాలేజీల్లోనైతే ప్రాక్టికల్స్ అంటే లెక్కే ఉండదు. విద్యార్థులతో రికార్డులు కూడా రాయించరనే విమర్శలున్నాయి. విద్యార్థులకు పాత రికార్డులు ఇచ్చి బంధువులతో రాయించాలని వారికి సూచిస్తున్నారు. విద్యార్థుల రికార్డులను రాసేందుకు కిరాయి వ్యక్తులూ లభిస్తున్నారు. కోఠి, అబిడ్స్ సహా ఆయా ప్రాంతాల్లో కొన్ని గ్యాంగ్స్ ఈ విధంగా విద్యార్థుల నుంచి డబ్బులు తీసుకుని వారి రికార్డులను రాసి ఇస్తున్నాయి. రూ.500-1000 ఇస్తే రెండు లేదా మూడు రికార్డులను రాసే విధంగా బేరం కుదుర్చుకుంటున్నారు. యాజమాన్యమే కూలీలను ఏర్పాటు చేసి విద్యార్థులకు వారి అడ్రస్‌లను చెబుతున్నాయి.

మొద్దు నిద్రలో ఇంటర్‌బోర్డు

ప్రాక్టికల్స్ నిర్వహణలో పర్యవేక్షకులు మమూళ్ల మత్తులో జోగుతున్నా, కాలేజీలు నిబంధనలకు నీళ్లొదులుతున్నా అన్నీ తెలిసి ఇంటర్ బోర్డు మాత్రం మౌనం వహిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రాక్టికల్స్ పరీక్షల సమయంలో కాలేజీల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాల్సిన ఇంటర్ బోర్డు అధికారులు ఆ పని చేయడం లేదు. సక్రమంగా ప్రాక్టికల్స్ నిర్వహించని కాలేజీలపై చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఉన్నతాధికారులకు కూడా మామూళ్లలో వాటాలు అందుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాక్టికల్స్‌కు షెడ్యూల్ విడుదల చేయడం, పర్యవేక్షకులను నియమించడంతోనే తమ బాధ్యత ముగిసినట్టు బోర్డు అధికారులు భావిస్తున్నారనే విమర్శలున్నాయి. కాగా ప్రాక్టికల్స్ సమయంలో పర్యవేక్షకులకు, అధికారులకు అందించే మామూళ్ల మొత్తం భారం చివరికి విద్యార్థులపైనే పడుతోంది. అడ్మిషన్ సమయంలోనే కార్పొరేట్ కాలేజీలు ల్యాబ్ ఫీజు కింద ఒక్కో విద్యార్థి నుంచి సుమారు రూ. 3-5వేలు వసూలు చేస్తున్నాయి. ఇతర ప్రైవేటు కాలేజీలు కూడా విద్యార్థుల నుంచి రూ. 500-1000 వరకు వసూలు చేస్తున్నాయి. ఈ విధంగా విద్యార్థుల నుంచి వసూలు చేస్తూ అధికారులకు సమర్పిస్తుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆర్టీసీ ఆధిపత్యానికి చుక్కెదురు!

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కడైనా నడుపుకొంటారు. కానీ, ఆర్టీసీ ప్రస్తుతం రాష్ట్రంలోనే బస్సులను నడుపుతోంది. పొరుగు రాష్ట్రాలకు బస్సులు నడపాలంటే వాటితో అవగాహన ఒప్పందాలు చేసుకుంటోంది. భవిష్యత్తులో ఇవి కుదరవు. కేంద్రం నుంచి ఆల్ ఇండియా పర్మిట్లు పొందాల్సిందే. వీటికి సూపర్ ఎక్స్‌ప్రెస్ బస్సుకు రూ.50 వేలు, డీలక్స్‌కు రూ.75 వేలు, ఏసీ బస్సుకు లక్ష రూపాయల చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఆర్టీసీకి మరో ఆర్థిక భారమే. పైగా ఈ సొమ్మంతా కేంద్రం ఖాతాలో జమకానుంది. అంతేనా, పర్మిట్ల జారీ అధికారాలు కేంద్రం అధీనంలోకి వెళ్లడంతో రాష్ట్రంలోని రవాణా శాఖ కార్యాలయాలు వెలవెలబోతాయి. ఇవే కాకుండా, ఆర్టీసీకి మరో ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే ప్రైవేటు వాహనాలతో ఆర్టీసీకి తలబొప్పి కడుతోంది. ఏ రూట్లో చూసినా, ఏ బస్టాండులో చూసినా ప్రైవేటు ఆటోలు, క్యాబ్‌లు, కార్లు దర్శనమిస్తున్నాయి. భవిష్యత్తులో వీటి నుంచి కూడా పోటీ ఎదురుకానుంది. ప్రస్తుతం ఆటోలు, కార్లు, క్యాబ్‌లకు స్టేజీ క్యారియర్లుగా అనుమతి లేదు. కానీ... కొత్త చట్టంలో 16 సీట్ల వరకూ స్టేజీ క్యారియర్లుగా అవకాశాలు కల్పిస్తోంది. దాంతో, ఆటోలు, కార్లను షేరింగ్ వాహనాలుగా నడుపుకొనే వెసులుబాటు కలగబోతోంది. ఇది ఆర్టీసీని మరింత దెబ్బ తీయనుంది. ఇప్పటికే షేరింగ్, స్టేరింగ్ ఆటోలు ఆర్టీసీ ఆదాయాన్ని కొల్లగొడుతున్నాయి. భవిష్యత్తులో వాటికి హక్కులు వస్తే.. నేరుగా బస్టాండుల్లోనే నిలిపి ప్రయాణికులను ఎక్కించుకునే అవకాశాలుంటాయి. ఈ నేపథ్యంలోనే, టీఎస్ఆర్టీసీ యూనియన్లు కొత్త చట్టంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈనెల 5న నిరసన కార్యక్రమాలు చేపట్టబోతున్నాయి. ప్రమాదాల నివారణ కోసం తెస్తున్న ఈ చట్టంలోని కొన్ని నిబంధనలు రవాణా సంస్థలను నిర్వీర్యం చేసేలా ఉన్నాయని కార్మిక సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

నిబంధనలు అతిక్రమించే వాహనదారులకు కూడా కేంద్ర చట్టం తాట తీయనుంది. ఆ నిబంధనలు..

- ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే మైనర్ తప్పులకు వాహన యజమానులు, సంరక్షకులు (గార్డియన్స్) బాధ్యత వహించాలి.
- డ్రంకెన్ డ్రైవ్ కేసులో అపరాధ రుసుము రూ.2000 నుంచి రూ.10,000కు పెంపు.
- ర్యాష్ డ్రైవింగ్‌కు అపరాధ రుసుము రూ.వెయ్యి నుంచి రూ.5000కు పెంపు.
- డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే ప్రస్తుతం రూ.500 ఫైన్ విధిస్తున్నారు. భవిష్యత్తులో ఇది రూ.5000కు పెరగనుంది.
- ఓవర్ స్పీడ్ ఫైన్ రూ.1000 నుంచి రూ.2000కు పెంపు.
- సీట్ బెల్టు వినియోగించని కారు డ్రైవర్లకు విధించే అపరాధ రుసుము రూ.100 నుంచి రూ.1000కి పెంపు.
- మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే... ప్రస్తుతమున్న ఫైన్ రూ.1000 నుంచి రూ.5000కు పెంపు.

కొత్త చట్టంతో కొంత మేలు

- 'హిట్ అండ్ రన్' కేసులో మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చే ఎక్స్‌గ్రేషియా రూ.25 వేల నుంచి రూ.2 లక్షలకు పెంపు
- రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు సహాయపడేవారికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు. వారి వివరాలను చెప్పాల్సిన అవసరం లేదు. ఎలాంటి క్రిమినల్/సివిల్ చర్యలు ఉండవు.
- వాహనాల డిజైన్లలో లోపాలుంటే.. వాటికి కాంట్రాక్టర్లు, కన్సల్టెంట్లు, పౌర సంస్థలే బాధ్యత వహించాలి.
- ప్రమాద బాధితులకు ఆరు నెలల్లోగా సహాయం అందించాలి.
- థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ కింద ఎలాంటి పరిమితి ఉండదు. ఇదివరకు మృతుల కుటుంబాలకు చెల్లించే బీమా సొమ్ము రూ.10 లక్షలు, క్షతగాత్రులకు చెల్లించే సొమ్ము రూ.5 లక్షల వరకు గరిష్ఠంగా ఉండేది.
- డ్రైవింగ్ లైసెన్సు గడువు మీరిన తర్వాత రెన్యువల్ కోసం ఇదివరకున్న నెల కాలపరిమితి ఏడాదికి పెంపు.

నేడు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు: టీఎంయూ, ఈయూ

కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త రవాణా చట్టం ప్రజా రవాణా వ్యవస్థలను నిర్వీర్యం చేసేలా ఉందని తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు థామస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి ఆరోపించారు. ఇది రాష్ట్ర ఆదాయానికి గండి కొట్టనుందని, ప్రైవేటు ఆపరేటర్లను పెంచి పోషించనుందని విమర్శించారు. ఈ బిల్లు రాజ్యసభలో గట్టెక్కకుండా రాజకీయ పార్టీలు అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5న అన్ని డిపోల్లో ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేయనున్నామని తెలిపారు.

లక్ష్మారెడ్డి.. మున్నాభాయ్ కాదు

1987లో బీహెచ్ఎంఎస్ పాసయ్యారు: ప్రిన్సిపాల్, పూర్వ విద్యార్థులు

పంజాగుట్ట/హైదరాబాద్, జనవరి 4: "వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి మున్నాభాయ్ కాదు.. ఆయన బీహెచ్ఎంఎస్ డిగ్రీ పూర్తి చేశారు. ఆయనపై ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నాం" అని హైదరాబాద్ - కర్ణాటక ఎడ్యుకేషనల్ సొసైటీ(హెచ్‌కేఈఎస్) హోమియోపతిక్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంపత్‌రావు, పూర్వ విద్యార్థులు అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం సంపత్ విలేకరులతో మాట్లాడుతూ.. లక్ష్మారెడ్డి గుల్బర్గాలోని హెచ్‌కేఈఎస్ హోమియోపతిక్ వైద్య కళాశాలలో బీహెచ్ఎంస్‌లో 1980-81లో చేరారన్నారు. 1983లో రెండో ఏడాది పాసయ్యారని, 1986 డిసెంబర్‌లో ఫైనల్ పరీక్షలు జరగగా, 1987లో ఫలితాలొచ్చాయన్నారు. లక్ష్మారెడ్డి పాస్ అయ్యారని, 1988లో హౌస్ సర్జన్ కూడా పూర్తి చేశారన్నారు. లక్ష్మారెడ్డి తమ కాలేజీలో మొదటి బ్యాచ్ విద్యార్థి అని, తరువాత కర్ణాటక హోమియోపతిక్ బోర్డులో రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారన్నారు. రేవంత్ రెడ్డి బాధ్యతాయుతంగా మాట్లాడాలని, బురద చల్లడం మంచిది కాదన్నారు. తప్పుడు ఆరోపణలతో మళ్లీ ఆరోపణలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాసవీ క్లబ్ ఇంటర్నేషల్ అధ్యక్షుడిగా వాసుదేవరావు

హైదరాబాద్‌సిటీ,జనవరి4(ఆంధ్రజ్యోతి): వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడిగా 2018 సంవత్సరానికిగాను విజయవాడకు చెందిన వంకదార వాసుదేవరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నగరంలోని గాంధీనగర్ పీఅండ్‌టీ కాలనీలోని ప్రధాన కార్యాలయంలో వాసుదేవరావు నూతన బృందంతో కలిపి బాధ్యతలు స్వీకరించారు.



బాషా ఒక్కసారి చెబితే..



» 2 రోజుల్లో మూడు లక్షల రిజిస్ట్రేషన్లు

» రజనీ వెబ్‌సైట్‌కు సూపర్ క్రేజ్

చెన్నై, జనవరి 4: తమిళనాడులో రజనీకాంత్ మేనియా ఓ రేంజ్‌లో ఉంది. 'రాజకీయాల్లోకి వస్తున్నాను' అంటూ ఆయన ప్రకటన చేసిన క్షణం నుంచి అభిమానులు ఆనందంతో ఊగిపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 50వేలకుపైగా ఉన్న అభిమాన సంఘాలను ఏకం చేయడంతోబాటు.. తన పార్టీలోకి అందరినీ ఆహ్వానిస్తూ.. 'రజినిమంద్రం.ఓఆర్‌జీ' పేరుతో తలైవా ఓ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఇక అంతే రెండు రోజుల్లో మూడు లక్షలమందికిపైగా అభిమానులు వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకుని పార్టీ సభ్యత్వం పొందారు. పది లక్షలమందికిపైగా ఈ సైట్‌ను విజిట్ చేశారు. 'అసంఖ్యాకమైన అభిమాన సంఘాలు, ఫ్యాన్ క్లబ్‌లు, తమిళ ప్రజలను ఏకం చేయడానికి ఈ వెబ్‌సైట్ ప్రారంభిస్తున్నాను. ఇందులో మీ పేర్లు నమోదుచేసుకుని పార్టీ సభ్యుడిగా చేరవచ్చు.' అని రజనీ వీడియో సందేశం ఇచ్చారు. రజనీ ఇలా ఒక్క వీడియో పోస్ట్ చేశారో లేదో అభిమాన సందోహంతో వెబ్‌సైట్ నిండిపోయింది. ఇంతకీ రజనీ పార్టీ పేరు ఏమిటన్న అంశం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. వెబ్‌సైట్ పేరే.. పార్టీ పేరు అంటూ ఊహాగానాలు వ్యాపించాయి. సంక్రాంతి రోజున తన పార్టీ పేరును రజనీ లాంఛనంగా ప్రారంభిస్తారని ప్రచారం జరుగుతోంది.

నేను కూడా వస్తున్నా..!

» వెనకడుగు వేసే ప్రసక్తే లేదు

» రాజకీయ ప్రవేశంపై కమల్ వ్యాఖ్య

చెన్నై, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆర్కే నగర్ ఉపఎన్నికలో ఓటర్లు తమ విలువైన ఓట్లను అంగట్లో సరకుల్లా అమ్ముకుని ప్రజాస్వామ్యానికి మాయని మచ్చను మిగిల్చారని ప్రముఖ నటుడు కమల్‌హాసన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. తాను కూడా రాజకీయాల్లోకి వస్తున్నానని, ఇక వెనకడుగు వేసే ప్రసక్తి లేదని ఆయన తేల్చిచెప్పారు. ఓ తమిళ వారపత్రికలో ధారావాహికగా రాస్తున్న వ్యాసంలో ఆర్కే నగర్ నియోజకవర్గం ఓటర్లపై కమల్ విమర్శల వర్షం కురిపించారు. నగదు బట్వాడా ఆరోపణలతో ఒకసారి రద్దయిన ఆ నియోజకవర్గం ఎన్నికలు మళ్లీ జరిగినా దృశ్యాలు, వర్గాలు మారినా తీరు మాత్రంమారలేదన్నారు. ఒక్కో ఓటుకు అధికార పార్టీ రూ.6వేలు, స్వతంత్ర అభ్యర్థి తరఫున రూ.20వేల ధర నిర్ణయించారన్నారు. ఈ పోటీలో తమ తలకు అధిక వెల ప్రకటించిన ఇండిపెంటెంట్ అభ్యర్థే... తమ కష్టాలను తీర్చేందుకు వచ్చిన ఆపద్బాంధవుడంటూ అక్కడి ఓటర్లు బటన్ నొక్కి తమకు తామే కష్టాలను కొని తెచ్చుకున్నారని కమల్ పేర్కొన్నారు. ఆర్కే నగర్ ఓటర్లు రూ.20 టోకెన్లకు అమ్ముడు పోయారని, ఇది భిక్షమెత్తడం వంటిదేనని, ఇంతటి నీచమైన సంఘటన మరెక్కడైనా చూడగలమా అంటూ విరుచుకుపడ్డారు.





ఈ 'కృత్రిమ చేయి'కి స్పర్శ

లండన్, జనవరి 4: తొలిసారి స్పర్శ కలిగిన కృత్రిమ చేయిని స్విట్జర్లాండ్‌లోని ఎకోల్ పాలిటెక్నిక్ ఫెడరల్ ఆఫ్ లోసెన్ శాస్త్రవేత్తలు తయారు చేశారు. 25 ఏళ్ల క్రితం ప్రమాదంలో చేతికి స్పర్శ కోల్పోయిన ఓ మహిళకు ఈ కృత్రిమ చేయిని అమర్చి ఆమె స్పర్శను ఆస్వాదించేట్లు చేశారు. ఇది ఒక నమూనా మాత్రమేనని, మరిన్ని పరిశోధనలు చేయాల్సి ఉందని పరిశోధకులు తెలిపారు.



మొక్కకు సెన్సర్ టాటూ

వాషింగ్టన్, జనవరి 4: పంటకు నీళ్లు ఎంత అవసరమో తెలుసుకునేందుకు శాస్త్రవేత్తలు చవకైన, గ్రాఫీన్ సెన్సర్‌ను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. టేప్‌లా ఉండే ఈ సెన్సర్‌ను మొక్క వేర్ల వద్ద, ఆకుల వద్ద అతికించి.. ఎంత మోతాదులో మొక్కకు నీటిని సరఫరా చేయవచ్చో తెలుసుకోవచ్చు. ఈ సెన్సర్‌ను అమెరికాలోని లోవా స్టేట్ యూనివర్సిటీ పరిశోధకులు తయారు చేశారు. దీన్ని 'మొక్కకు సెన్సర్ టాటూ'గా అభివర్ణించారు.

మళ్లీ పాక్ నాటకం

» జాదవ్‌పై మరో వీడియో విడుదల

» పాక్ అధికారులు బాగా చూసుకుంటున్నారు

» నాపై భారత్ అబద్ధమాడుతోంది: కులభూషణ్



వీడియోలో జాదవ్

ఇస్లామాబాద్/న్యూఢిల్లీ, జనవరి 4: భారత మాజీ నేవీ అధికారి, పాక్‌లో మరణశిక్ష ఎదుర్కొంటున్న కులభూషణ్ జాదవ్ తల్లిని, భార్యను ఘోరంగా అవమానించిన పాకిస్థాన్.. తాజాగా మరో నాటకానికి తెరతీసింది. జాదవ్ నేరాంగీకార వాంగ్మూలమంటూ ఆ దేశ విదేశాంగ కార్యాలయం గురువారం మరో వీడియోను విడుదల చేసింది. 'నన్ను పాక్ అధికారులు బాగా చూసుకుంటున్నారు. నన్ను కలవడానికి డిసెంబరు 25న నా తల్లి, భార్య వచ్చినప్పుడు వారి పట్ల భారతీయ దౌత్య అధికారి (డిప్యూటీ హైకమిషనర్) అనుచితంగా వ్యవహరించారు. భారత ప్రజలకు, ప్రభుత్వానికి, నేవీకి ఓ ముఖ్య విషయం చెబుతున్నాను. నేను ఇప్పటికీ నేవీలో కమిషన్డ్ ఆఫీసర్‌గా ఉన్నాను. నేను గూఢచార సంస్థ తరఫున పనిచేయడం లేదని భారత్ ఎందుకు అబద్ధమాడుతోంది' అని ఆయన అన్నట్లు వీడియోలో ఉంది. జాదవ్ భార్య మెడలో మంగళసూత్రాలు తీసేసుకోవడం, ఆమె చెప్పుల్లో కెమేరా ఉందన్న అనుమానంతో వాటిని స్వాధీనం చేసుకోవడం, నేరుగా జాదవ్‌ను కలుసుకోకుండా వారి మధ్య గాజుగోడ ఏర్పాటుచేసి ఇంటర్‌కమ్ ఫోన్ ద్వారా మాట్లాడించడంపై భారత్ మండిపడిన నేపథ్యంలో.. ఆ భేటీ జరిగిన పది రోజులకు పాక్ ఈ వీడియో విడుదల చేయడం గమనార్హం. 'ఆందోళన చెందవద్దని నా తల్లికి చెప్పాను. పాక్ అధికారులు నన్ను బాగా చూసుకుంటున్నారని.. నాపై చేయి వేయలేదని కూడా తెలిపాను. నన్ను చూశాక నా మాటలు ఆమె నమ్మింది. అయితే నా తల్లి కళ్లలో భయం చూశాను. నన్ను కలిసి బయటకు అడుగుపెట్టగానే భారతీయ అధికారి ఆమెపై కేకలు వేయడం నేను చూశాను' అని జాదవ్‌పేర్కొన్నారు. గాజు తలుపు ఆవల ఉన్న జాదవ్.. తల్లి బయటకు వెళ్లాక ఆమెపై భారతీయ దౌత్యవేత్త కేకలు వేయడం ఎలా చూశారో వీడియో విడుదల చేసిన పాక్‌కే తెలియాలని భారతీయ అధికారులు అంటున్నారు. జాదవ్ నేవీ మాజీ అధికారి అని, ఇరాన్‌లో వ్యాపారం చేసుకుంటున్నారని, ఆయన్ను పాక్ అక్కడ కిడ్నాప్ చేసి బలూచిస్థాన్‌లో బంధించినట్లు నాటకామాడుతోందని భారత్ తొలి నుంచీ చెబుతోంది. తాజా వీడియో కూడా దాని దుష్ప్రచారంలో భాగమని స్పష్టం చేసింది. జాదవ్‌ను హింసించారని తల్లిని కలిసిన నాడు ఆయన ఒంటిపై కనిపించిన గాయాలే రుజువు చేశాయని పేర్కొంది. ఇప్పుడు కూడా జాదవ్‌తో బలవంతంగా చెప్పించారని, ఇలాంటి ఎత్తుగడలకు విశ్వసనీయత లేదని స్పష్టం చేసింది. 'తాజా వీడియో మాకేమీ ఆశ్చర్యం కలిగించలేదు. ఇలాంటి బలవంతపు వాంగ్మూలాలను ఇప్పించడం పాక్ కొనసాగిస్తోంది. ఇలాంటి చౌకబారు ఎత్తులతో నమ్మించలేమని గ్రహించాలి' అని విదేశాంగ ప్రతినిధి రావిష్‌కుమార్ హితవు పలికారు.

ఆధార్ డేటా ఖరీదు రూ. 500

అందుబాటులో లక్షలాది మంది వివరాలు

రూ. 300కు నకిలీ ఆధార్ తయారీ సాఫ్ట్‌వేర్

ఆంగ్ల పత్రిక పరిశోధనలో బట్టబయలు.. డేటా లీక్ కట్టు కథ: యూఐడీఏఐ

న్యూఢిల్లీ, జనవరి 4: కేవలం రూ.500 ఖర్చు చేస్తే చాలు లక్షలాది మంది ఆధార్ డేటాను ఇట్టే సంపాదించవచ్చు. వ్యక్తి పేరు, ఫొటో, చిరునామా, ఫోన్ నంబరుసహా సమస్త వివరాలు క్షణాల్లో మీ చేతుల్లో ఉంటాయి. మరో రూ.300 ఖర్చు చేస్తే నకిలీ ఆధార్‌కార్డును తయారు చేసే సాఫ్ట్‌వేర్ మీ కంప్యూటర్‌లో ఇన్‌స్టాల్ అయిపోతుంది. ఓ ఆంగ్ల పత్రిక నిర్వహించిన పరిశోధనలో ఈ విషయం వెలుగు చూసింది. ఆధార్ భద్రతను ప్రశ్నార్థకం చేసింది. సదరు పత్రిక విలేకరి పంజాబ్‌లో ఓ ప్రైవేటు వ్యక్తికి కేవలం రూ.500 చెల్లించి ఆధార్ వివరాలు ఉన్న పోర్టల్ ఐపీ అడ్రస్‌ను పొందారు. ఆ పోర్టల్‌లో ఆధార్ నంబర్‌ను ఎంటర్ చేయడం ద్వారా ఆయా వ్యక్తులకు సంబంధించిన ఆధార్ డేటాను క్షణాల్లో పొందవచ్చు. అదే వ్యక్తికి మరో రూ.300 చెల్లించడం ద్వారా నకిలీ ఆధార్ కార్డులను సృష్టించే సాఫ్ట్‌వేర్‌నూ సదరు ఆంగ్ల పత్రిక విలేకరి పొందారు. ఆధార్ డేటా భద్రతలో డొల్లతనాన్ని బట్టబయలు చేసేందుకు తాము ఆ పరిశోధనను నిర్వహించినట్లు సదురు పత్రిక వెల్లడించింది. తమ వద్ద ఉన్న ఆధార్ డేటా అత్యంత భద్రంగా ఉందని యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా(యూఐడీఏఐ) ప్రకటించిన కొద్ది రోజులకే లక్షలాది మంది ఆధార్ డేటా కేవలం రూ.500కే బహిరంగ మార్కెట్‌లో లభ్యం కావడం గమనార్హం. దీనిపై యూఐడీఏఐ ప్రాంతీయ కేంద్రం అదనపు డైరెక్టర్ జనరల్ స్పందిస్తూ.. డైరెక్టర్ జనరల్‌కు, తనకు మినహా ఆధార్ అధికారిక పోర్టల్‌కి సంబంధించిన పాస్‌వర్డ్ తెలిసే అవకాశం లేదన్నారు. ఎవరైనా చట్టవిరుద్ధంగా పోర్టల్‌లోకి లాగిన్ అయితే వారిపై జాతిభద్రతకు భంగం కలిగించారన్న ఆరోపణలపై కేసు నమోదు చేస్తామన్నారు. అధికార బీజేపీ పార్టీ కూడా ఆధార్ డేటా లీకును కట్టుకథగా కొట్టిపారేసింది. కాగా, ఆధార్ డేటా లీకైందన్న వార్తలు వెలువడినప్పటి నుంచి యూఐడీఏఐ అధికారిక సర్వర్ డౌన్ అయింది.



దాణా కుంభకోణం కేసులో తుది తీర్పు కోసం సీబీఐ కోర్టుకు వస్తున్న లాలూ ప్రసాద్ యాదవ్

మీ శ్రేయోభిలాషులు ఫోన్ చేశారు

» వాళ్లకు ధిక్కరణ నోటీసులు ఇస్తాను

» లాలూతో ప్రత్యేక కోర్టు జడ్జి

» 'ప్రశాంత చిత్తం'తో పునరాలోచించాలని లాలు వినతి

» శిక్షలు మళ్లీ వాయిదా.. నేడు ఖరారు

రాంచీ, జనవరి 4: దాణా కుంభకోణం కేసులో బిహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ తదితరులకు శిక్ష ఖరారు వరుసగా రెండో రోజూ వాయిదా పడింది. వారికి శిక్షను శుక్రవారం ఖరారు చేస్తానని ప్రత్యేక కోర్టు జడ్జి శివ్‌పాల్ సింగ్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. లాలూ శ్రేయోభిలాషుల నుంచి తనకు ఫోన్ కాల్స్ వచ్చాయని వెల్లడించారు. తప్పితే, లాలూ మనుషులు ఏం మాట్లాడారు? దానికి ఆయన ఏం చెప్పారన్న వివరాలను వెల్లడించలేదు. అంతేనా, "మీ గురించి చాలామంది చెప్పారు. ఆందోళనపడకండి. నేను చట్టాన్ని తూ.చ. తప్పకుండా పాటిస్తాను" అని లాలూను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆర్జేడీ నాయకులు రఘువంశ్ ప్రసాద్ సింగ్, శివానంద్ తివారీ, లాలూ తనయుడు తేజస్వి యాదవ్, కాంగ్రెస్ నేత మనీశ్ తివారీలకు కోర్టు ధిక్కారణ కింద నోటీసులు జారీ చేస్తానని హెచ్చరించారు. దాంతో, నోటీసులు జారీ చేయవద్దని, 'ప్రశాంత చిత్తం'తో పునరాలోచించాలని లాలూ కోరారు. రూ.89.27లక్షల పశుదాణా కుంభకోణంలో లాలూతోపాటు మరో 15 మందిని సీబీఐ కోర్టు డిసెంబరు 23న దోషులుగా తేల్చిన విషయం తెలిసిందే. వారికి శిక్షలను జనవరి 3న ఖరారు చేస్తానని స్పష్టం చేశారు. అయితే, న్యాయవాది ఒకరు చనిపోవడంతో బుధవారం శిక్ష ఖరారును వాయిదా వేశారు. శిక్షలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారానా లేక కోర్టులో ప్రకటించాలా అనే విషయాన్ని శుక్రవారం స్పష్టం చేస్తానని జడ్జి అన్నారు. దాంతో, తాను వ్యక్తిగతంగా కోర్టుకే వస్తానని లాలూ చెప్పారు.

జిగ్నేశ్, ఖలీద్‌లపై కేసు

» మహారాష్ట్ర అల్లర్లకు వారే కారణం?

» పుణే పోలీసుల ఎఫ్ఐఆర్

న్యూఢిల్లీ, జనవరి 4: మహారాష్ట్రలో చెలరేగిన అల్లర్లకు కారణమంటూ దళిత నేత, ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవానీ, జేఎన్‌యూ విద్యార్థి నేత ఉమర్ ఖలీద్‌పై కేసు నమోదైంది. భీమా-కోరేగావ్ యుద్ధానికి 200 ఏళ్లయిన సందర్భంగా పుణే శనివార్ వాడాలో ఎల్గార్ పరిషత్ డిసెంబరు 31న ఏర్పాటు చేసిన సభలో వారు రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం వల్లే హింస చెలరేగిందని ఆరోపిస్తూ పుణే పోలీసులు వారిరువురిపై కేసు పెట్టారు. మరోవైపు, మహారాష్ట్ర అల్లర్లపై రాజ్యసభలోని వివిధ పార్టీల ఎంపీలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. హింసాత్మక చర్యలను ఖండిస్తూనే.. బాధ్యులను శిక్షించేందుకు న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై గురువారం స్వల్పకాలిక చర్చ జరిగింది. 'సభ్యులు ఎవరూ ఆవేశాలకు లోనుకాకుండా, సాధారణ పరిస్థితి నెలకొనేందుకు దోహదపడేలా చర్చలో పాల్గొనాలి' అని రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్య నాయుడు విజ్ఞప్తి చేశారు. కాగా, కుల ఘర్షణలపై మహారాష్ట్ర ప్రభుత్వం కేంద్ర హోంశాఖకు నివేదిక సమర్పించింది. బంద్‌తో బుధవారం అట్టుడికిన మహారాష్ట్రలో గురువారం ప్రశాంత పరిస్థితులు కనిపించాయి.

విద్యార్థుల అరెస్ట్

ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయన్న కారణంతో ముంబైలో గురువారం జరగాల్సిన 'ఆల్ ఇండియా స్టూడెంట్ సమ్మిట్-2018'కి పోలీసులు అనుమతి నిరాకరించారు. ఈ సదస్సులో జిగ్నేశ్, ఖలీద్ పాల్గొనాల్సి ఉంది. నిషేధాజ్ఞలు ఉన్నా పెద్దఎత్తున సదస్సు జరిగే ప్రాంగణానికి చేరుకున్న విద్యార్థి నాయకులను, ఎమ్మెల్సీ కపిల్ పాటిల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా, ఈ దేశాన్ని ఐక్యంగా ఉంచి, సామాజిక వివక్షను అంతమొందించాల్సిన అవసరం ఉందని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. ఉజ్జయినిలో ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పౌరులంతా ఒకరితో మరొకరు మమేకం కావాలని చెప్పారు.

హెచ్-1బీ కోసం ఇక పోటీ

ఐటీ నిపుణులపై ఒత్తిడి పెరగొచ్చు: నిపుణులు

హైదరాబాద్ సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అగ్రదేశం అనుసరిస్తున్న విధానాలతో ఉద్యోగం కోసం అమెరికా వెళ్లిన వారి ఆశలు అడియాసలవుతున్నాయి. హెచ్1బీ వీసాలు ఆటోమేటిక్‌గా రెన్యువల్ అయ్యే విధానాన్ని రద్దు చేయాలన్న ప్రతిపాదన నగర వాసుల్లో కలకలం రేపుతోంది. ఎంత మందికి గ్రీన్ కార్డు వస్తుంది. మరెంత మంది తిరుగు ముఖం పట్టాల్సి వస్తోందనన్న ఆందోళన అటు అమెరికాలో ఉన్న వారితో పాటు ఇక్కడున్న వారి కుటుంబ సభ్యుల్లో కనిపిస్తోంది. ట్రంప్ ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చే ప్రతిపాదన అమలైతే హెచ్1బీ వీసా కోసం మరింత పోటీ పెరుగుతుంది. అక్కడి నుంచి తిరుగు ముఖం పట్టిన వారంతా మళ్లీ అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నం చేసే అవకాశాలే ఎక్కువగా ఉంటాయని నగరానికి చెందిన ఓ కన్సల్టెన్సీ ప్రతినిధి అన్నారు. నైపుణ్యం ఉన్న వారికే అవకాశం కాబట్టి- స్కిల్డ్ వర్కర్లను పెద్ద జీతాలకు తీసుకుని వారికి హెచ్1-బీ వీసాలు లభించేట్లు చేయడానికి పెద్ద పెద్ద కంపెనీలు ప్రయత్నిస్తాయని, మిగిలిన వారిలో విపరీతమైన పోటీ ఏర్పడి అమెరికా వెళ్లేందుకు ఏళ్ల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితులు తలెత్తే పరిస్థితులు వస్తాయని ఓ ఐటీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న రవి కిశోర్ తెలిపారు. తాజా పరిణామాలు ఐటీ నిపుణుల్లో వత్తిడిని పెంచుతున్నాయి. ఉద్యోగంతో పాటు అమెరికాలోనే ఉండిపోవాలనుకుంటున్న వారికి ఇది ఊహించని పరిణామంగా చెప్పవచ్చు.

అమెరికాకే ఎక్కువ నష్టం

అమెరికాలో ఉద్యోగం చేస్తున్న వారంతా ఆయా రంగాల్లో నిపుణులే. వారంతా అక్కడి నిబంధనల ప్రకారం ఇండియాకు వస్తే పని చేసేదెవరు. దీనివల్ల అమెరికాకే చాలా నష్టం.

- కె.మోహన్ రాయుడు, ఛైర్మన్, కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ చాప్టర్.



నాడు సానుకూలం.. నేడు కఠినం

» హెచ్1బీ వీసాలపై మారిన ట్రంప్ వైఖరి

వాషింగ్టన్, జనవరి 4: హెచ్1బీ వీసాల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన వైఖరిని మార్చుకుంటూ వచ్చారా? దీనికి సమాధానం అవుననే వస్తోంది. అధ్యక్ష పదవి కోసం పోటీపడినపుడు ట్రంప్- అమెరికా ఫస్ట్- నినాదాన్ని బలంగా వినిపించారు. కానీ ఎన్నికలు ముగిశాక హెచ్1బీ వీసాల విషయంలో ఆయన సానుకూలత ప్రదర్శించారు. కానీ కొద్ది నెలల్లోనే ఆ వైఖరి మార్చేసి- బై అమెరికన్- హైర్ అమెరికన్ అనే ఆదేశాలిచ్చారు. "ఐటీ పరిశ్రమకు సాయం అందించాల్సిందే. హెచ్1బీ వీసాల అవసరమెంతో ఉందని ఎన్నికలు ముగిశాక ట్రంప్ మీడియా మొఘల్ రూపర్ట్ మర్డాక్‌తో ఫోన్లో అన్నారు" అని మైఖేల్ వోల్ఫ్ అనే జర్నలిస్టు తన పుస్తకం- "ఫైర్ అండ్ ఫ్యూరీ: ఇన్‌సైడ్ ది ట్రంప్ వైట్‌హౌస్"లో పేర్కొన్నారు. ఆనాడు సానుభూతిగా మాట్లాడిన ట్రంప్ ఇపుడు కఠిన వైఖరిని అవలంబిస్తున్నారని రచయిత వ్యాఖ్యానించారు.



గడ్డకట్టిన అమెరికా

అమెరికాలో చలి విశ్వరూపం చూపిస్తోంది. 3 దశాబ్దాలుగా మంచు అంటే ఏమిటో తెలియని ఉత్తర ఫ్లోరిడానూ గడ్డకట్టిస్తోంది. అమెరికా తూర్పు తీరం మొత్తం ఈ సారి మంచుబారిన పడక తప్పదని అమెరికా జాతీయ వాతావరణ సంస్థ హెచ్చరిస్తోంది. కాగా.. 27 ఏళ్లుగా మంచు ముఖమే ఎరుగని ఫ్లోరిడా రాజధాని తల్హాసీలో 0.1 అంగుళాల మందాన మంచుకురవడం విశేషం.

» చంద్రోదయం



గురువారం హైదరాబాద్‌లోని నందగిరి హిల్స్ వద్ద వెలుగులు విరజిమ్ముతున్న చందమామ

■ ఆన్‌లైన్‌లో కేన్సర్ పాఠాలు

న్యూఢిల్లీ, జనవరి 4: పలు రకాల కేన్సర్లను ముందస్తుగా గుర్తించడంతో పాటు నివారించేందుకు దేశంలో తొలిసారిగా ఆన్‌లైన్ ఆంకాలజీ ట్యూటోరియల్ సిరీస్‌ను కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రారంభించింది. టాటా మెమోరియల్ సెంటర్ రూపొందించిన ఈ సిరీస్‌ను రాష్ట్రాల సహకారంతో ప్రసారం చేస్తారు. 7వారాల కోర్సు వివరాలను www.omnicuris.com/academics/advancedclinicaloncologyలో చూడవచ్చని పేర్కొంది.

■ పోయెస్‌గార్డెన్‌లో మళ్లీ ఐటీ దాడులు

చెన్నై, జనవరి 4(ఆంధ్రజ్యోతి): జయలలిత అధికారిక నివాస గృహం పోయెస్ గార్డెన్‌లో ఆదాయపు పన్నులశాఖ అధికారులు మళ్లీ గురువారం ఆకస్మిక సోదాలు నిర్వహించారు. జయ సహాయకుడు పూంగుంద్రం గది, ఒకప్పుడు జయాటీవీ కార్యాలయం నడిపిన గదుల్లో తనిఖీలు జరిపారు.

■ 'గిషా ఘోష్' కేసులో దోషులకు తప్పిన ఉరి

న్యూఢిల్లీ, జనవరి 4: జిగిషా ఘోష్ హత్య కేసులో ఇద్దరు దోషులకు పడిన ఉరి శిక్షను ఢిల్లీ హైకోర్టు రద్దు చేసి యావజ్జీవ కారాగార శిక్షగా మార్చింది. మూడో దోషి బల్జీత్ మాలిక్‌కు ప్రత్యేక కోర్టు విధించిన యావజ్జీవ కారాగార శిక్షను సమర్థించింది.

■ బీజేపీలోకి తక్షణ తలాక్ లాయర్ నాజియా

కోల్‌కతా, జనవరి 4: తక్షణ తలాక్ బాధితురాలు ఇష్రత్ జెహాన్ కేసులో ఆమె తరఫున వాదించిన న్యాయవాది నాజియా ఇలాహీ ఖాన్ బీజేపీలో చేరారు. బీజేపీ సీనియర్ నేత ముకుల్ రాయ్, ఇతరుల సమక్షంలో గురువారం ఆయన బీజేపీ సభ్యత్వాన్ని స్వీకరించారు.

■ శబరిమల వెళ్లే స్త్రీలు వయసు ధ్రువీకరించాల్సిందే

తిరువనంతపురం, జనవరి 4: శబరిమలలోని అయ్యప్ప స్వామి దేవాలయాన్ని దర్శించాలనుకునే మహిళలు ఇక వయసు ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాల్సిందేనని దేవాలయ బోర్డు నిర్ణయించింది. రుతుస్రావం కలిగే 10-50 ఏళ్ల మధ్య వయసు గల మహిళలకు ఇందులో ప్రవేశం నిషిద్ధం.

■ భరతమాత హారతికి.. కాలేజీ నో

భోపాల్, జనవరి 4: మధ్యప్రదేశ్ విదిషాలోని సెయింట్ మేరీస్ కళాశాల ఆవరణలో 'భరతమాతకు హారతి' కార్యక్రమానికి యాజమాన్యం అనుమతి నిరాకరించడంతో ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. నినాదాలిస్తూ లోనికి చొచ్చుకుపోయేందుకు ప్రయత్నించారు.

■ ఆ తెగలకు.. 'చట్రం' నుంచి విముక్తి

న్యూఢిల్లీ, జనవరి 4: ప్రాచీన భారతం నుంచి కొన్ని తెగలకు దొంగతనం, ఇతర నేరాలే ప్రధాన వృత్తి. ఆయా తెగల్లో మార్పు చోటుచేసుకుంటున్నా కాలం చెల్లిన హ్యాబిచ్యువల్ అఫెండర్స్ యాక్ట్(1952) కొనసాగడంపై విమర్శల నేపథ్యంలో ఆ చట్టాన్ని రద్దు చేయనున్నట్లు కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి కిషన్ పాల్ గుర్జార్ గురువారం రాజ్యసభకు తెలిపారు.

■ బ్యాంకు ఉద్యోగులతో పెళ్లిళ్లు వద్దు: ఫత్వా

లక్నో, జనవరి 4: "బ్యాంక్ ఉద్యోగులను పెళ్లి చేసుకోవద్దు. బ్యాంకుల్లో పనిచేసే కుటుంబాలతోనూ వివాహాలు వద్దు" ముస్లింలకు సుప్రసిద్ధ ఇస్లాం సంస్థ దారుల్ ఉలూమ్ జారీ చేసిన ఫత్వా ఇది. అక్రమ పద్ధతిలో వ్యాపార పెట్టుబడులను ఇస్లాం తిరస్కరిస్తుందని, బ్యాంకు ఉద్యోగులు ఇలానే వేతనాలను పొందుతారని సంస్థ తెలిపింది.

■ సుప్రీం, హైకోర్టు జడ్జిల వేతనాలు భారీగా పెంపు!

న్యూఢిల్లీ, జనవరి 4: సుప్రీంకోర్టు, 24 హైకోర్టుల్లోని జడ్జిల వేతనాలు భారీ పెంచే బిల్లును లోక్‌సభ గురువారం ఆమోదించింది. ఇది చట్టరూపంలోకి వస్తే సీజేఐ నెలవేతనం రూ.2.80 లక్షలకు, సుప్రీంకోర్టు జడ్జిలూ, హైకోర్టు సీజేల వేతనం రూ.2.5 లక్షలకు, హైకోర్టు జడ్జిల వేతనం రూ.2.25 లక్షలకు పెరుగుతుంది.

■ 'ఓఖీ' రికార్డు పయనం!

చెన్నై, జనవరి 4: తమిళనాడు, కేరళ రాష్ట్రాలను ఇటీవల అతలాకుతలం చేసిన ఓఖీ తుఫాను రికార్డు స్థాయిలో ప్రయాణించింది. బంగాళాఖాతం నుంచి పశ్చిమాన గుజరాత్ తీరం వరకూ దాదాపు 2,400 కిలోమీటర్లు ఇది పయనించిందని ప్రాంతీయ వాతావరణ కేంద్రండైరెక్టర్ ఎస్. బాలచంద్రన్ పేర్కొన్నారు. గడిచిన 40ఏళ్లలో ఇంత దూరం వెళ్లిన తుఫాను లేదన్నారు.

■ భీమా-కోరేగావ్ అల్లర్ల వెనక మావోయిస్టులు!

నాగ్‌పూర్, జనవరి 4: ఇటీవల మహారాష్ట్రను అట్టుడికించిన భీమా-కోరేగావ్ అల్లర్ల వెనక పట్టణ ప్రాంత మావోయిస్టుల పాత్ర ఉండి ఉంటుందని నిఘావర్గాలు అనుమానిస్తున్నాయి. ఆందోళనకారుల అరెస్టు సమయంలో 'యల్గార్ పరిషత్'కు సంబంధించిన పత్రాలు లభించాయని, ఇది మావోయిస్టు సానుభూతి సంస్థ అని చెబుతున్నాయి.

■ ఎన్నికల్లో 'రిగ్గింగ్' కమిటీ రద్దు: ట్రంప్

న్యూయార్క్, జనవరి 4: గత ఎన్నికల్లో 'రిగ్గింగ్'పై నియమించిన కమిటీని రద్దు చేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. 2016 ఎన్నికల్లో రిగ్గింగ్ ఆరోపణల నేపథ్యంలో 8 నెలల క్రితం 11 మందితో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ రద్దుకు డెమోక్రాట్లే కారణమని, రిగ్గింగ్ జరగకుండా ఉండేందుకు ఓటర్ గుర్తింపు కార్డులిస్తామని అన్నారు.

■ రెడ్‌లైట్ ఏరియా నుంచి సోదరిని కాపాడిన అన్న

పట్నా, జనవరి 4: తప్పిపోయిన తన చెల్లెలి కోసం నాలుగేళ్లుగా ఆ అన్న వేతకని చోటు లేదు. చివరికి పోలీసుల సాయంతో రెడ్‌లైట్ ఏరియా నుంచి తన చెల్లిని కాపాడుకున్నాడు. బిహార్‌లోని బేగుసరాయ్ జిల్లాలో గుట్టుగా వ్యభిచారం నిర్వహిస్తున్న ప్రాంతంపై దాడి చేసిన పోలీసులు ఇద్దరు యువతులను రక్షించారు.

■ 'లవ్ సైకో' ప్రొఫెసర్

న్యూఢిల్లీ, జనవరి 4: ఆయన వయస్సు 40 ఏళ్లు. ఉన్నదేమో అధ్యాపక వృత్తిలో. చేసేదేమో పోకిరీ చేష్టలు! ప్రేమ పేరుతో తోటి మహిళా ప్రొఫెసర్‌ను తీవ్ర వేధింపులకు గురిచేశాడు. మితిమీరిన చేష్టలతో ఉద్యోగం కోల్పోయినా, పోలీసులు జైల్లో పెట్టినా తీరు మార్చుకోలేదు. ఆమెకు ఫోన్లు, మెసేజ్‌లతో వేధింపులకు గురిచేస్తూ పోలీసులకు నాలుగోసారి పట్టుబడ్డాడు. గురువారం ఢిల్లీ వర్సిటీలో మహిళా ప్రొఫెసర్‌ను వేధిస్తూ దొరికిపోయాడు.

■ అమెరికాలో భారతీయ వైద్యుడికి జైలు

వాషింగ్టన్, జనవరి 4: చికిత్స కోసం వచ్చిన ఇద్దరు టీనేజ్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన అరుణ్ అగర్వాల్(40) అనే భారతీయ వైద్యుడికి అమెరికా న్యాయస్థానం 10 నెలల జైలు శిక్ష విధించింది. ఆయన దేశబహిష్కరణ విచారణనూ ఎదుర్కొంటున్నారు. శిక్ష అనంతరం అరుణ్‌ను అమెరికా నుంచి భారత్‌కు పంపించే అవకాశాలున్నాయి.

■ భారత్‌లో పసివాళ్లపై జర్మన్ వాసి రేప్

బెర్లిన్, జనవరి 4: తన వద్దకొచ్చే 11 ఏళ్లలోపు చిన్నారులపై జర్మనీకి చెందిన 59 ఏళ్ల కార్ల్‌హెన్జ్ అనే వృద్ధుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘోరాన్ని వీడియోలో చిత్రీకరించి పైశాచికానందం పొందాడు. ఆరుగురు బాలికలపై దారుణానికి పాల్పడ్డారనే ఆరోపణలతో జర్మనీ న్యాయస్థానంలో విచారణను ఎదుర్కొంటున్నాడు. నిందితుడి ఇంట్లో 2500లకు పైగా ఫొటోలు, వీడియోలను జర్మనీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

స్నానం రెండు నిమిషాలే...!

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాలో టెస్టు విజయాల కరువుకు ముగింపు పలకాలనే పట్టుదలతో టీమిండియా వస్తే.. ఆటకంటే ముందు సరికొత్త చిక్కు వచ్చిపడింది. కేప్‌టౌన్‌లో నీటి ఎద్దడి కారణంగా జట్టులోని ప్రతి ఒక్కరూ 2 నిమిషాలకు మించి స్నానం చేయకూడదనే అధికారుల సూచనలు మేనేజ్‌మెంట్‌కు అందాయి. ఇక్కడ తీవ్ర నీటి ఎద్దడే దీనికి కారణం. భారత్-దక్షిణాఫ్రికా మధ్య తొలి టెస్టు శుక్రవారం మొదలు కానుంది. అయితే పిచ్‌ను తడపడానికి కూడా తగిన నీరు అందుబాటులో లేదని క్యూరేటర్ చెప్పాడు.

తిరగబడిన త్రివర్ణం...



కేప్‌టౌన్: త్రివర్ణ పతాకం తిరగబడింది. ఇండియా-సౌతాఫ్రికాల మధ్య శుక్రవారంనుంచి తొలి టెస్టు ప్రారంభం కానున్న నేపథ్యంలో న్యూలాండ్స్ స్టేడియంలో బుధవారం స్టేడియం యాజమాన్యం భారత త్రివర్ణ పతాకంలోని ఆకుపచ్చ రంగును పైకి ఉండేలా ఎగురవేసింది. అయితే స్టేడియం సిబ్బంది ఒకరు పొరపాటును గమనించి హెచ్చరించడంతో పతాకాన్ని వెంటనే అవనతం చేసి సవ్యదిశలో తిరిగి ఎగురవేశారు. ఆ సమయంలో కోహ్లీ సేన స్టేడియంలోనే సాధన చేస్తోంది. పొరపాటును వెంటనే గ్రహించి తెలియజేసిన ఉద్యోగికి స్టేడియం యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది. లేకుంటే పెద్ద నగుబాటుకు గురయ్యే వారమని స్టేడియం అధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

ఢిల్లీ కోచ్‌గా పాంటింగ్



న్యూఢిల్లీ: ఐపీఎల్ టీమ్ ఢిల్లీ డేర్‌డెవిల్స్ హెడ్ కోచ్‌గా ఆస్ట్రేలియా మాజీ రికీ పాంటింగ్ నియమితుడయ్యాడు. గత రెండు సీజన్లుగా ఢిల్లీ మెంటార్‌గా ఉన్న రాహుల్ ద్రావిడ్.. పరస్పర విరుద్ధ ప్రయోజనాల కారణంగా తప్పుకున్న విషయం తెలిసిందే.

హార్దిక్ పాండ్యా కీలకం




కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్‌లో హార్దిక్ పాండ్యా భారత్‌కు అత్యంత కీలక ఆటగాడని సఫారీ మాజీ ఆల్‌రౌండర్ లాన్స్ క్లూసెనర్ పేర్కొన్నాడు. 'హార్దిక్ పాండ్యాలాంటి నికార్సయిన ఆల్‌రౌండర్‌తో టీమిండియాకు అటు బ్యాటింగ్‌లో ఇటు బౌలింగ్‌లో సమతూకం ఏర్పడుతుంది' అని ప్రశంసించాడు. ఆతిథ్య జట్టుకు హార్దిక్ కొరకరాని కొయ్యగా మారడం ఖాయమని స్పష్టంజేశాడు.

ఫెడ్ కప్‌లో ప్రాంజలకు చోటు



పుణె: ఫెడ్ కప్‌లో భాగంగా జరిగే ఆసియా/ఓసియానియా గ్రూప్-1లో తలపడ భారత జట్టులో తెలుగమ్మాయి యడ్లపల్లి ప్రాంజలకు చోటు దక్కింది. వచ్చేనెల 7 నుంచి 10 వరకు న్యూఢిల్లీలో ఈ ఈవెంట్ జరగనుంది. మహిళల సింగిల్స్‌లో ఈ టీనేజర్ ప్రస్తుతం 482వ ర్యాంక్‌లో కొనసాగుతూ ఉంది. తనతో పాటు అంకిత రైనా (259), కర్మాన్ కౌర్ (285), ప్రార్థన తొంబరే (144) పాల్గొనబోతున్నారు. గాయం కారణంగా సానియా ఈ ఈవెంట్‌లో ఆడడం లేదు. ఈ గ్రూప్-1లో నెగ్గితే భారత జట్టు వరల్డ్ గ్రూప్-2కు అర్హత సాధిస్తుంది.

మర్రే అవుట్



సిడ్నీ: మాజీ నంబర్‌వన్ ఆండీ మర్రే తుంటి గాయం నుంచి కోలుకోలేక పోవడంతో ఆస్ట్రేలియా ఓపెన్‌నుంచి తప్పుకుంటున్నట్టు గురువారం ప్రకటించాడు. ఇంతకుముందే నొవాక్ జొకోవిచ్, నిషికోరి గాయాల కారణంగా ఆస్ట్రేలియన్ ఓపెన్‌నుంచి వైదొలిగినట్టు వెల్లడించారు.

సైనా, శ్రీకాంత్ గెలిచినా..

లక్నో: ఉత్కంఠభరితంగా సాగిన ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ మ్యాచ్‌లో గురువారం ముంబై రాకెట్స్ 4-1తో అవధ్ వారియర్స్‌పై గెలుపొందింది. ముంబై ట్రంప్‌గా ఎంచుకున్న కీలమైన ఆఖరి పోటీలో ఆ జట్టు పురుషుల డబుల్స్ జోడీ లి యాంగ్ డే, టాన్ బూన్ హోంగ్ 15-13, 15-12 స్కోరుతో హెంద్రా సెత్వియాన్, చిన్ చుంగ్‌పై గెలుపొందారు. అంతకు ముందు స్టార్ ఆటగాళ్లు సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్ అద్భుత విజయాలతో వారియర్స్‌ను పోటీలో నిలిపారు. తొలుత సైనా 8-15, 15-10, 15-13 స్కోరుతో బీవెన్ జాంగ్‌పై గెలుపొందింది. ఆపై శ్రీకాంత్ 15-13, 13-15, 15-4 స్కోరుతో సన్ వాన్ హూపై నెగ్గి ముంబై ఆధిక్యాన్ని 2-1కి తగ్గించాడు. రెండో మ్యాచ్‌లో సమీర్‌వర్మ 15-6, 15-14తో హర్షిత్ అగర్వాల్‌ని సునాయాసంగా ఓడించి ముంబైకి 2-(-1)తో భారీ ఆధిక్యం అందించాడు. ఇక ఆరంభ మ్యాచ్‌లో ముంబై మిక్స్‌డ్ డబుల్స్ జోడీ లీ యాంగ్ డే, గాబ్రియెలా స్టోయ్‌వా 15-10, 14-15, 15-7 స్కోరుతో క్రిస్టియానా పెడెర్సెన్, తాంగ్ చున్ మన్‌పై సంచలన విజయం సాధించి తమ జట్టుకు శుభారంభం ఇచ్చింది.

చరిత్ర సృష్టించేందుకు..

- తొలి సిరీస్ విజయమే లక్ష్యంగా టీమిండియా
- ముగ్గురు పేసర్లతో బరిలోకి!
- నేటి నుంచి దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు



కోహ్లీ

ఉపఖండంలో తిరుగులేని జట్టుగా పేరు.. రెండేళ్లుగా ఒక్క సిరీస్ కూడా కోల్పోని ట్రాక్ రికార్డు.. టెస్టుల్లో ప్రపంచ నెంబర్‌వన్ హోదా.. ఇదీ టీమిండియా ప్రస్తుత స్థితి. ఇప్పుడు ఈ జోరుకు అసలు సిసలు సవాల్ ఎదురుకాబోతోంది. ఇటీవలి వరుస విజయాలను కూడా విమర్శకులు వేలెత్తి చూపుతున్న తరుణంలో సఫారీ గడ్డపై కఠిన పోరుకు సై.. అంటోంది. ఎందుకంటే ఇప్పటిదాకా సాధించిన విజయాలన్నీ ఒకెత్తు.. ఇక ఆడబోయే సిరీస్ మరో ఎత్తు. ప్రస్తుత భారత జట్టే అత్యద్భుతమని మాజీలు ప్రశంసిస్తున్న వేళ పాతికేళ్లుగా అందకుండా ఊరిస్తోన్న సిరీస్ విజయం కోసం ప్రొటీస్‌తో యుద్ధానికి సిద్ధమంటోంది. అంతులేని ఆత్మవిశ్వాసంతో దూసుకెళుతున్న టీమిండియా విదేశాల్లోనూ సత్తా చూపించాలన్న పట్టుదలతో నేటి నుంచి ప్రారంభమయ్యే మూడు టెస్టుల సిరీస్‌లో బరిలోకి దిగనుంది. మరోవైపు తమ దేశంలో భారత్ పేలవ ఆటతీరును మరోసారి సొమ్ము చేసుకునేందుకు దక్షిణాఫ్రికా జట్టు ఎదురుచూస్తోంది. బౌలింగ్‌నే ప్రధాన ఆయుధంగా ఎక్కుపెట్టి భారత్‌ను ఉక్కిరిబిక్కిరి చేయాలనుకుంటోంది..

కేప్‌టౌన్: టెస్టు ఫార్మాట్‌లో అగ్రస్థానంలో ఉన్న టీమిండియా ఇప్పుడు ఆ హోదాకు తాము అన్ని విధాలా అర్హులమేనని నిరూపించుకోవాల్సిన సమయం వచ్చింది. వరుసగా తొమ్మిది సిరీస్‌లను గెలుచుకుని సమరోత్సాహంతో ఉన్న ఈ జట్టు మూడు టెస్టుల సిరీస్‌లో భాగంగా నేటి (శుక్రవారం) నుంచి దక్షిణాఫ్రికాతో తొలి మ్యాచ్‌లో ఆడనుంది. ఈ సిరీస్‌లో 0-3తో వైట్‌వాష్‌కు గురైనా భారత్ టాప్ ర్యాంకుకు వచ్చిన ముప్పేమీ ఉండబోదు. కాకపోతే ఈ సిరీస్ ద్వారా తమపై ఉన్న అంచనాలను అందుకోవాల్సిన ఒత్తిడితో బరిలోకి దిగనుంది. ముందుగా ఇక్కడి బౌన్సీ పిచ్‌లపై బుల్లెట్‌లా దూసుకువచ్చే బంతులను టీమిండియా బ్యాట్స్‌మెన్ సమర్థవంతంగా ఎదుర్కొనాల్సి ఉంది. భారత్ చివరిగా గెలిచిన తొమ్మిది సిరీస్‌లలో ఆరు స్వదేశంలోనే సాధించింది. రెండు శ్రీలంకలో, ఒకటి విండీస్‌లో నెగ్గింది. అయితే ఆ జట్లు బలహీనంగా ఉండడంతో ఇప్పుడు ప్రొటీస్‌పై ఆటే వారికి అసలు సిసలు సవాల్ కానుంది. తమ చివరి పర్యటనలో ఉన్న 13 మంది ఆటగాళ్లు ప్రస్తుత టీమ్‌లోనూ ఉన్నారు. ఇప్పుడు వారంతా అపార అనుభవం కలిగి ఉండడంతో ఈసారి పోటీ రసవత్తరంగా ఉండే అవకాశం ఉంది. ఇక న్యూలాండ్స్ మైదానంలో భారత్ ఆడిన 4 టెస్టుల్లో రెండు ఓడి, రెండు డ్రా చేసుకుంది.



సఫారీల సారథి డుప్లెసిస్

కూర్పుపైనే దృష్టి: అదనపు పేస్, బౌన్స్ ఎదురయ్యే ఇక్కడి పిచ్‌లపై కోహ్లీ, రహానే, పుజారా, విజయ్, రోహిత్, ధవన్‌లు తమ బ్యాటింగ్‌తో జట్టును నిలబెట్టాల్సి ఉంది. ఈ మ్యాచ్‌కు ధవన్ ఫిట్‌గా ఉన్నట్టు తేలడంతో మురళీ విజయ్‌తో కలిసి ఓపెనింగ్ చేయడం దాదాపు ఖాయమే. రోహిత్ సూపర్ ఫామ్‌ను లెక్కలోకి తీసుకుంటే పోటీలో ఉన్నట్టే. మరోవైపు పుజారా బ్యాటింగ్ ఈ సిరీస్‌లో కీలకం కానుంది. జడేజాకు వైరల్ జ్వరం కారణంగా జట్టులో ఏకైక స్పిన్నర్‌గా అశ్విన్‌కు చోటు ఖాయమే. ముగ్గురు పేసర్లతో బరిలోకి దిగేందుకు జట్టు మొగ్గు చూపుతోంది. అదే జరిగితే భువనేశ్వర్, షమి, ఇషాంత్ జట్టులో ఉండే అవకాశముంది.

ధీమాగా సఫారీలు: ఈ సిరీస్‌పై దక్షిణాఫ్రికా జట్టు భరోసాతో ఉన్నట్టు కనిపిస్తోంది. తొలి టెస్టు కోసం భారత్ భీకర ప్రాక్టీస్‌లో మునిగినా ప్రొటీస్ తేలిగ్గానే తీసుకుంది. అయితే భారత్‌లాగే వీరు కూడా తుది జట్టు కూర్పుపై మల్లగుల్లాలు పడుతున్నారు. వికెట్ కీపర్ డికాక్ గాయం నుంచి కోలుకున్నాడు. జింబాబ్వేతో టెస్టుకు డుప్లెసిస్ దూరం కావడంతో డివిల్లీర్స్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఇప్పుడు రెగ్యులర్ కెప్టెన్ ఫిట్‌గా ఉండడంతో డివిల్లీర్స్, టెంబా మధ్య పోటీ నెలకొంది. ఇక స్టెయిన్ తొలి టెస్టుకు సిద్ధంగానే ఉన్నప్పటికీ బెర్త్‌పై స్పష్టత లేదు. రబాడ, ఫిలాండర్, మోర్కెల్, స్పిన్నర్ కేశవ్ మహరాజ్‌లను ఆడించాలని చూస్తోంది.

రహానేకు చోటు కష్టమే!

అదనపు బౌలర్‌గా హార్దిక్ పాండ్యా.. ఫామ్‌లో ఉన్న రోహిత్ శర్మకు తుది జట్టులో చోటు కల్పించే ఆలోచనలో టీమ్ మేనేజ్‌మెంట్ ఉండడంతో అజింక్యా రహానెకు తొలి టెస్టులో బెర్త్ కష్టంగానే మారింది. బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ ఈమేరకు సూచనప్రాయంగా తెలిపాడు. రోహిత్ ఫామ్‌లో ఉండడంతో అతడినే ఆడించే అవకాశం ఉందని చెప్పాడు. కానీ రహానేకు విదేశీ గడ్డపై మెరుగైన రికార్డే ఉంది.

జట్లు (అంచనా)

భారత్: విజయ్, ధవన్/రాహుల్, పుజారా, కోహ్లీ (కెప్టెన్), రహానె, రోహిత్/పాండ్యా, సాహా, అశ్విన్, భువనేశ్వర్, ఇషాంత్, షమి.

దక్షిణాఫ్రికా: ఎల్గర్, మర్‌క్రామ్, ఆమ్లా, డుప్లెసిస్ (కెప్టెన్), డివిల్లీర్స్/టెంబా, డికాక్, ఫెహ్లుక్వాయో/మోరిస్, ఫిలాండర్, రబాడ, స్టెయిన్/మోర్కెల్, కేశవ్ మహరాజ్.

పిచ్, వాతావరణం

నీటి కరువు కారణంగా పిచ్‌పై పచ్చికను ఉంచేందుకు ఇబ్బంది ఎదురైంది. దీంతో బౌన్సీ ట్రాక్ కాకుండా ఈసారి ఫ్లాట్ పిచ్ ఉండే అవకాశం ఉంది. ఇక్కడ జరిగిన 54 టెస్టుల్లో 44 సార్లు టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి, నాలుగో రోజు చిరుజల్లులకు ఆస్కారముంది.

కోహ్లీ గైర్హాజరు

తొలి టెస్టు ప్రారంభానికి ఒక రోజు ముందు భారత జట్టు విశ్రాంతికే పరిమితమైంది. ప్రాక్టీస్‌ను టీమ్ మేనేజ్‌మెంట్ ఆప్షనల్‌గా ప్రకటించడంతో ఒక్కరు కూడా సెషన్‌లో పాల్గొనలేదు. ఇక సిరీస్‌కు ముందు జరిగే ప్రెస్ మీట్‌కు సైతం కెప్టెన్ కోహ్లీ డుమ్మా కొట్టడం ఆశ్చర్యపరిచింది. అతడి స్థానంలో సహాయ కోచ్ సంజయ్ బంగర్ వచ్చాడు.



కర్ణాటక-ఉత్తరాఖండ్ పోటీ దృశ్యం

రాహుల్, పర్దీప్ జట్లకు నిరాశ

సెమీస్‌లో కర్ణాటక, మహారాష్ట్ర • హరియాణా, సర్వీసెస్ కూడా..

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): జాతీయ సీనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ క్రీడాకారులు రాహుల్ చౌదరి, పర్దీప్ నర్వాల్ ప్రాతినిధ్యం వహిస్తున్న జట్లకు నిరాశే ఎదురైంది. రాహుల్ నేతృత్వంలోని ఉత్తర్‌ప్రదేశ్, పర్దీప్ సారథ్యంలోని ఉత్తరాఖండ్ క్వార్టర్స్‌లోనే వెనుదిరిగాయి. మహారాష్ట్ర, కర్ణాటక, హరియాణా, సర్వీసెస్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లాయి. గచ్చిబౌలిలో గురువారం జరిగిన పురుషుల క్వార్టర్స్‌లో మహారాష్ట్ర 44-36తో ఉత్తరప్రదేశ్‌ను ఓడించింది. ప్రథమార్థంలో 15-22తో వెనుకబడినా అద్భుతంగా పుంజుకున్న రాహుల్‌సేన 30 నిమిషాలకు 27-27తో స్కోరు సమం చేసింది. కానీ, తర్వాత తడబడి మ్యాచ్‌ను కోల్పోయింది. 13 పాయింట్లు సాధించిన రాహుల్‌ను దాదాపు పావుగంట కోర్టు బయట ఉంచిన మహారాష్ట్ర ఫలితం రాబట్టింది. మరో మ్యాచ్‌లో సుఖేష్ హెగ్డే కెప్టెన్‌గా ఉన్న కర్ణాటక 51-31తో ఉత్తరాఖండ్‌ను చిత్తు చేసింది. మరో మ్యాచ్‌లో వెటరన్ ప్లేయర్ అనూప్ కుమార్ కెప్టెన్‌గా ఉన్న హరియాణా 31-29తో రాజస్థాన్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. మరో 45 సెకన్లలో ఆట ముగుస్తుందనగా 27-28తో నిలిచిన హరియాణా ప్రత్యర్థిని ఆలౌట్ చేసి 30-28తో మ్యాచ్‌ను తారుమారు చేసింది. ఇక, ఆఖరి క్వార్టర్స్‌లో సర్వీసెస్ 51-40తో ఇండియన్ రైల్వేస్ జట్టుపై ఘన విజయం సాధించింది. ఇక, మహిళల విభాగంలో రైల్వేస్, హిమాచల్ ప్రదేశ్, హరియాణా, పంజాబ్ సెమీస్‌కు చేరుకున్నాయి. శుక్రవారం పురుషుల, మహిళల ఫైనల్స్ జరుగుతాయి.

హెచ్‌సీఏ కార్యదర్శిపై వేటు..?

- అవినీతి ఆరోపణలే కారణం!
- 7న ఎస్‌జీఎమ్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ)లో మళ్లీ అలజడి రేగుతోంది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న హెచ్‌సీఏ కార్యదర్శి శేష్ నారాయణ్ పదవి కోల్పోయే పరిస్థితి కనిపిస్తోంది. ఈ నెల 7న జరిగే ప్రత్యేక సర్వసభ్య సమావేశం (ఎస్‌జీఎమ్)లో శేష్‌పై వేటు పడనుందని సమాచారం. సంఘంలో ఒంటెత్తు పోకడలుపోతున్న శేష్... జట్టు సెలెక్షన్స్‌లో అవినీతికి పాల్పడడంతో పాటు ఏకపక్ష నిర్ణయాలతో అందరినీ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై హెచ్‌సీఏ అధ్యక్షుడు జి. వివేకానంద ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ... 'మా కార్యదర్శిపై అనేక అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. ఆయన గతంలోనూ రెండుసార్లు సస్పెండ్ అయ్యారు. తమను వేధింపులకు గురి చేస్తున్నట్టు సభ్యులు, కార్యదర్శులు ఫిర్యాదు చేస్తున్నారు. అపెక్స్ కౌన్సిల్ నిర్ణయాలను కూడా శేష్ పట్టించుకోవడం లేదు. గత ఎస్‌జీఎమ్ అయిన తర్వాత మినిట్స్‌ను సైన్ చేయకుండా నేరుగా రిజిస్ట్రార్‌కు పంపించారు. అది నేరం. ఇది పద్ధతి కాదని అపెక్స్ కౌన్సిల్‌లో రికార్డు చేశాం. మొన్న సెలెక్టర్లు కూడా తాము రాజీనామా చేసేందుకు శేష్‌నే కారణం అని చెప్పారు. అలాగే, బీసీసీఐ సమావేశానికి అధ్యక్షుడే వెళ్లాలని అపెక్స్ కౌన్సిల్ తీర్మానించింది. కానీ, శేష్ తనకు అవకాశం ఇవ్వాలని సొంతంగా బోర్డుకు లేఖ రాసి సమావేశానికి వెళ్లారు. అయితే, నిబంధనలకు వ్యతిరేకంగా ఎలా హాజరవుతారని ఆయన్ని లోపలికి కూడా రానివ్వలేదు. ఇంత జరుగుతున్నా.. నేను పరస్పర విరుద్ధ ప్రయోజనాలు (కాన్‌ఫ్లిక్ట్ ఆఫ్ ఇంటరెస్ట్) పొందుతున్నానని శేష్ ఆరోపిస్తున్నారు. కానీ, ఉప్పల్ స్టేడియం నిర్మాణంలో హెచ్‌సీఏకు విశాకకు మధ్య స్పాన్సర్‌షిప్ అగ్రిమెంట్‌ను గత అధ్యక్షుడు అర్షద్ అయూబ్ రద్దు చేసినట్టు జూలైలో జరిగిన ఎస్‌జీఎంలో స్పష్టం చేశాం. ఇంకా నాకు ప్రయోజనాలు ఎలా ఉంటాయి. ఈ విషయాలన్నీ అంబుడ్స్‌మన్‌కు వివరించాం. ఏం చేయాలో ఆయనే తేలుస్తార'ని వివేకానంద్ వివరించారు.

ధోనీ చెన్నైకే... గేల్, గంభీర్‌కు నిరాశ

- రోహిత్‌ను అట్టిపెట్టుకున్న ముంబై
- రహానె, ధవన్‌కు దక్కని చాన్స్
- ఊహించిన విధంగానే ఐపీఎల్ రిటెన్షన్

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో మహేంద్ర సింగ్ ధోనీ మళ్లీ పసుపు రంగు జెర్సీలో అలరించనున్నాడు. రెండేళ్ల నిషేధం అనంతరం ఈసారి బరిలోకి దిగనున్న చెన్నై సూపర్ కింగ్స్.. తన అత్యుత్తమ సారథి ధోనీని అట్టి పెట్టుకున్నట్టు ప్రకటించింది. ఇక, టీమిండియా సూపర్ కెప్టెన్ విరాట్ కోహ్లీని బెంగళూరు.. లీగ్‌లో మోస్ట్ సక్సెస్‌ఫుల్ సారథి రోహిత్ శర్మను ముంబై ఇండియన్స్ అట్టిపెట్టుకున్నాయి. కొత్త సీజన్‌లో ఆసక్తి రేకెత్తించిన రిటెన్షన్‌కు చివరి రోజైన గురువారం ఆయా జట్లు తాము అట్టిపెట్టుకున్న ఆటగాళ్లను ప్రకటించాయి. అన్ని జట్ల రిటెన్షన్‌లు దాదాపు ముందుగా ఊహించిన విధంగానే ఉన్నాయి. చెన్నైతో పాటు లీగ్‌లో రీఎంట్రీ ఇస్తున్న రాజస్థాన్ రాయల్స్ స్టీవ్ స్మిత్ ఒక్కడినే అట్టిపెట్టుకోగా..



ధోనీ



గేల్

సన్ రైజర్స్ జట్టు డేవిడ్ వార్నర్, భువనేశ్వర్ కుమార్‌లను ఎంచుకున్నది. అయితే, కోల్‌కతా నైట్ రైడర్స్ తమ సారథి గౌతమ్ గంభీర్‌ను విస్మరించడం విశేషం. దాంతో, అతను ఈ సారి వేలంలో నిలవాల్సిన పరిస్థితి నెలకొంది. అతణ్ణి కాదనుకున్న కోల్‌కతా.. కరీబియన్ ప్లేయర్లు సునీల్ నరైన్, ఆండ్రీ రస్సెల్‌లను రిటైన్ చేసుకుంది. కింగ్స్ లెవన్ పంజాబ్ స్పిన్నర్ అక్షర్ పటేల్‌ను మాత్రమే ఎంచుకొని ఆశ్చర్యపరచగా.. ఢిల్లీ డేర్‌డెవిల్స్ క్రిస్ మోరిస్, రిషభ్ పంత్, శ్రేయాస్ అయ్యర్‌లను తీసుకుంది. చెన్నై, ముంబై, ఢిల్లీ, బెంగళూరు మాత్రమే రిటెన్షన్‌లో గరిష్ఠంగా అనుమతించిన ముగ్గురు ప్లేయర్లను ఎం చుకున్నాయి. చెన్నై ధోనీతో పాటు సురేశ్ రైనా, రవీంద్ర జడేజాను తీసుకుంది. ఇక, బెంగళూరు ఏబీ డివిల్లీర్స్, అన్‌క్యాప్డ్ ప్లేయర్ సర్ఫ్‌రాజ్ ఖాన్‌లను రెండో, మూడో ప్రాధాన్య ఆటగాళ్లుగా ఎంపిక చేసుకొని విండీస్ డాషింగ్ ప్లేయర్ క్రిస్ గేల్‌ను పక్కనబెట్టింది. ముంబై హార్దిక్ పాండ్యా, జస్‌ప్రీత్ బుమ్రాలను తీసుకుంది. గతంలో కెప్టెన్‌గా వ్యవహరించిన అజింక్యా రహానెను రిటైన్ చేసుకుంటుందని భావించినా.. రాజస్థాన్ అతణ్ణి పట్టించుకోక పోవడం విశేషం. రిటెన్షన్ పాలసీ నిబంధనల ప్రకారం ఒక జట్టు రిటెన్షన్ లేదా రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం) కార్డు కింద గరిష్ఠంగా ఐదుగురు ఆటగాళ్లను అట్టిపెట్టుకోవచ్చు. అందువల్ల ఈ నెల 27, 28న ఐపీఎల్ వేలంలో గేల్, గంభీర్, రహానెలను పాత జట్లు ఆర్‌టీఎం చేసుకునే అవకాశం ఉంది. కాగా, ఈ రిటెన్షన్‌లో ముగ్గురు ప్లేయర్లను ఎంచుకుంటే.. తొలి ప్లేయర్‌కు 15 కోట్లు, రెండో ప్లేయర్‌కు 11 కోట్లు, మూడో ప్లేయర్‌కు ఏడు కోట్లు జీతంగా చెల్లించాలి. ఇద్దరినే ఎంపిక చేసుకుంటే 12.5 కోట్లు, 8.5 కోట్ల చొప్పున, ఒక్కరినే తీసుకుంటే 12.5 కోట్లు ఇవ్వాలి. అదే అన్‌క్యాప్డ్ ప్లేయర్‌కు గరిష్ఠ ధర 3 కోట్లుగా నిర్దేశించారు.

అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు వీరే..

చెన్నై	(ధోనీ 15 కోట్లు, రైనా 11 కోట్లు, జడేజా 7 కోట్లు; మిగిలిన మొత్తం 47 కోట్లు; ఆర్‌టీఎమ్ అవకాశం 2)
ఢిల్లీ	(మోరిస్ 15 కోట్లు, రిషభ్ 11 కోట్లు, శ్రేయాస్ 7 కోట్లు; మిగిలిన మొత్తం 47 కోట్లు; ఆర్‌టీఎమ్ అవకాశం 2)
పంజాబ్	(అక్షర్ 12.5 కోట్లు; మిగిలిన మొత్తం 67.5 కోట్లు; ఆర్‌టీఎమ్ అవకాశం 3)
కోల్‌కతా	(నరైన్ 12.5 కోట్లు, రస్సెల్ 8.5 కోట్లు; మిగిలిన మొత్తం 59 కోట్లు; ఆర్‌టీఎమ్ అవకాశం 3)
ముంబై	(రోహిత్ 15 కోట్లు, హార్దిక్ 11 కోట్లు, బుమ్రా 7 కోట్లు; మిగిలిన మొత్తం 47 కోట్లు, ఆర్‌టీఎమ్ అవకాశం 2)
రాజస్థాన్	(స్మిత్ 12.5 కోట్లు; మిగిలిన మొత్తం 67.5 కోట్లు ఆర్‌టీఎమ్ అవకాశం 3)
బెంగళూరు	(కోహ్లీ 17 కోట్లు, డివిల్లీర్స్11 కోట్లు, సర్ఫ్‌రాజ్ (అన్ క్యాప్డ్) 3 కోట్లు; మిగిలిన మొత్తం 49 కోట్లు; ఆర్‌టీఎమ్ అవకాశం 2)
హైదరాబాద్	(వార్నర్ 12.5 కోట్లు, భువనేశ్వర్ 8.5 కోట్లు; మిగిలిన మొత్తం 59 కోట్లు; ఆర్‌టీఎమ్ అవకాశం 3)

మనోళ్లు దీటుగా..!

(కృష్ణమాచారి శ్రీకాంత్)

దక్షిణాఫ్రికాలో టెస్టు సిరీస్ నెగ్గే అవకాశాలు టీమిండియాకు మెరుగ్గా ఉన్నాయి. విజయ్, కోహ్లీ, రహానె లాంటి ఆటగాళ్లతో భారత బ్యాటింగ్ పటిష్ఠంగా కనిపిస్తోంది. కేప్‌టౌన్ వికెట్ రాహుల్ ఆటకు సరిగ్గా సరిపోతుంది. సాధారణంగా బంతి బ్యాట్‌పైకి వస్తే ఆడడానికి భారత బ్యాట్స్‌మెన్ ఇష్టపడతారు. బాల్ కొంత పాతబడితే మాత్రం మనోళ్లకు పండగే. అయితే సఫారీ బౌలింగ్ అటాక్‌ను ఏమాత్రం తక్కువగా అంచనా వేయడం లేదు. కానీ కోహ్లీ అండ్ కో నుంచి మాత్రం గట్టి పోటీని ఆశించగలం. మోర్నీ మోర్కెల్, స్టెయిన్ బౌలింగ్‌లో మునుపటి వాడివేడి లేదు. రబాడ, ఫిలాండర్ నుంచి ముప్పు ఉన్నా.. మన బ్యాట్స్‌మెన్ ఎదుర్కోగలరు. నిలబడి ఆడితే పరుగులు రాబట్టడం పెద్ద కష్టం కాకపోవచ్చు. **(టీసీఎం)**

రాణించిన రూట్

ఇంగ్లండ్ 233/5

సిడ్నీ : జో రూట్ (83), డేవిడ్ మలాన్ (55 నాటౌట్) అర్ధ సెంచరీలు చేయడంతో ఆస్ట్రేలియాతో గురువారం ప్రారంభమైన యాషెస్ చివరి టెస్ట్‌లో తొలిరోజు ఇంగ్లండ్ ఐదు వికెట్లకు 233 పరుగులు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ 95 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన తరుణంలో రూట్, మలాన్ నాలుగో వికెట్‌కు 133 పరుగులు జోడించి ఇన్నింగ్స్ చక్కదిద్దారు.

సంక్షిప్తస్కోరు : ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 233/5 (కుక్ 39, రూట్ 83, మలాన్ బ్యాటింగ్ 55, హాజెల్‌వుడ్ 2/47, కమిన్స్ 2/44, స్టార్క్ 1/63)

పాక్‌పై బీఎస్ఎఫ్ ప్రతీకారం

- 2 సైనిక శిబిరాల ధ్వంసం
- 10 మంది పాక్ రేంజర్ల హతం?
- సరిహద్దులో 'ఆపరేషన్ అలర్ట్' ప్రకటన



పాక్ కాల్పుల్లో వీరమరణం పొందిన బీఎస్ఎఫ్ జవాన్ రాధా పద హజ్రాకు నివాళులర్పిస్తున్న జమ్మూకశ్మీర్ డీజీపీ, బీఎస్ఎఫ్ ఐజీ

శ్రీనగర్, జనవరి 4: జమ్మూలోని సాంబ సెక్టార్‌లో బుధవారం కాల్పులకు తెగబడి ఓ సైనికుడిని చంపిన పాకిస్థాన్‌పై గంటల వ్యవధిలోనే బీఎస్ఎఫ్ ప్రతీకారం తీర్చుకుంది. బుధవారం రాత్రి పాక్‌లోని రెండు సైనిక శిబిరాలను బీఎస్ఎఫ్ ధ్వంసం చేసింది. ఈ ప్రతీకార దాడిలో సుమారు 10 మంది పాక్ సైనికులు హతమైనట్టు మీడియాలో వార్తలు వచ్చాయి. అంతర్జాతీయ సరిహద్దు(ఐబీ) వద్ద నియమించిన బీఎస్ఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ ఆర్.పి.హజ్రా(50)పై ఏ విధమైన రెచ్చగొట్టే చర్యలు లేకుండానే పాక్ దళాలు బుధవారం దొంగచాటుగా కాల్పులు జరిపాయి. తీవ్రంగా గాయపడిన ఆయనను దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ ఆయన తుదిశ్వాస విడిచారు. బుధవారం హజ్రా పుట్టినరోజు కూడా. హజ్రాపై పాక్ దళాలు దొంగదెబ్బ తీశాయని జమ్మూలోని బీఎస్ఎఫ్ ఐజీ రామావతార్ అన్నారు. మరోవైపు గురువారం జమ్మూ జిల్లాలో చొరబాటు యత్నాన్ని బీఎస్ఎఫ్ నిర్వీర్యం చేసింది. అర్నియా సెక్టార్‌లోని నికోవాల్ సమీపంలో ఉదయం 5.45 గంటలకు పొగమంచులో ఇద్దరు-ముగ్గురి కదలికలను గుర్తించిన బీఎస్ఎఫ్ దళాలు కాల్పులు జరపగా ఒక చొరబాటుదారుడు మరణించాడు. ఉగ్రవాదుల చొరబాటు యత్నాలు పెరుగుతున్న నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌లోని 200 కిలోమీటర్ల అంతర్జాతీయ సరిహద్దు పొడవునా బీఎస్ఎఫ్ ఆపరేషన్ అలర్ట్ ప్రకటించింది.

అల్లా పేరుతో అండగా ఉండండి!

అమెరికాకు వ్యతిరేకంగా ఏకమవ్వండి.. పాకిస్థానీలకు సయీద్ విజ్ఞప్తి



లాహోర్, జనవరి 4: పాకిస్థాన్ ప్రభుత్వం, రాజకీయ పార్టీలు, ప్రజలు అమెరికాకు వ్యతిరేకంగా ఏకమవ్వాలని జమాతుద్ దవా(జేయూడీ) అధినేత, ముంబై దాడుల సూత్రధారి హఫీజ్ సయీద్ పిలుపునిచ్చాడు. అల్లా పేరిట తనకు మద్దతివ్వాలని పాకిస్థానీలను కోరాడు. పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖుర్రం దస్తగీర్ బుధవారం అనూహ్యంగా సయీద్‌పై విరుచుకుపడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పాక్ ఉగ్ర సంస్థ అధినేతకు ఆందోళన మొదలైనట్లుంది. అమెరికాకు వ్యతిరేకంగా ప్రభుత్వం, ప్రజలంతా ఒక్కటవ్వాలని.. దేవుని పేరుతో తనకు సాయం చేయాలని అభ్యర్థించాడు. ఈ మేరకు గురువారం ఓ వీడియోను విడుదల చేశాడు. మరోవైపు సయీద్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన పాక్ రక్షణ మంత్రికి లీగల్ నోటీసులు ఇవ్వనున్నట్లు జేయూడీ ప్రకటించింది. జేయూడీపై కఠిన చర్యలు తీసుకుంటామని దస్తగీర్ పేర్కొన్నారు. సయీద్ ఉగ్రవాదేనని, జేయూడీ కూడా ఉగ్ర సంస్థేనని వ్యాఖ్యానించారు. పెషావర్‌లో పాఠశాలపై జరిగిన దాడితో సయీద్‌కు సంబంధం ఉందని కూడా ప్రకటించారు. విద్యార్థులపై ఇకముందు ఎవరూ కాల్పులకు తెగబడకుండా ఉండేందుకు జేయూడీ, ఎఫ్ఐఎఫ్ సంస్థలపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. తమపై ఇంతటి ఘోరమైన వ్యాఖ్యలు చేసిన దస్తగీర్‌కు లీగల్ నోటీసులు ఇవ్వనున్నట్లు జేయూడీ ప్రతినిధి యాహ్యా ముజాహిద్ ఓ ప్రకటనలో తెలిపాడు. దస్తగీర్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ప్రధాని మోదీల భాషను వాడుతున్నారని విమర్శించారు.

ఉత్తరకొరియాపై కేరళ సీఎం ప్రశంసలు

- అమెరికాను దీటుగా ఎదుర్కొంటోందన్న పినరయి



న్యూఢిల్లీ, జనవరి 4: అంతర్జాతీయ సమాజం ఉత్తరకొరియాపై ఆంక్షలు విధిస్తుంటే.. కేరళ సీఎం పినరయి విజయన్ మాత్రం ఆ దేశంపై పొగడ్తల వర్షం కురిపించారు. ఉత్తరకొరియా అగ్రరాజ్యాన్ని సమర్థవంతంగా ఎదుర్కొంటోందని, ఒత్తిళ్లకు ఏ మాత్రం తలొగ్గకుండా అమెరికా వ్యతిరేక ఎజెండాను అమలు చేస్తోందని అన్నారు. కోజికోడ్‌లో కార్యకర్తల సమావేశంలో ఇటీవల మాట్లాడిన ఆయన.. ఉత్తర కొరియా అనుసరిస్తున్న వ్యూహాలను మెచ్చుకున్నారు. సామ్రాజ్యవాద శక్తులను ఎదుర్కోవడంలో చైనా కంటే మెరుగ్గా పనిచేస్తోందన్నారు. ప్రజల అంచనాలను చైనా అందుకోలేక పోతుందన్నారు. సామ్రాజ్యవాద శక్తులతో ఎలా పోరాడాలో ఉత్తరకొరియానే మంచి ఉదాహరణ అంటూ ప్రశంసించారు. సోషలిస్టు భావజాలంతో ముందుకువెళుతున్న ఉత్తరకొరియాను అమెరికా ధ్వంసం చేసేందుకు చూస్తోందన్నారు.

మేకిన్ ఇండియా కాదు ఫేకిన్ ఇండియా

- పెట్టుబడులు భారీగా పడిపోయాయి
- మోదీ సర్కారుపై రాహుల్ విమర్శ



న్యూఢిల్లీ, జనవరి 4: మోదీ ప్రభుత్వం ప్రారంభించిన 'మేకిన్ ఇండియా' కార్యక్రమాన్ని 'ఫేకిన్ ఇండియా' అని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. భారత్‌లో తాజా పెట్టుబడులు 13 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా పడిపోయాయన్న వార్తా కథనాన్ని ఆయన ట్విటర్‌లో పోస్ట్ చేశారు. 'ఫేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో తాజా సమాచారం చూడండ'ని రాహుల్ వ్యాఖ్యానించారు. 'డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో భారతీయ కంపెనీల కొత్త పెట్టుబడులు ప్రకటనలు రూ.77 వేల కోట్లు. ఇది గత 13 ఏళ్లలో కనిష్ఠమ'ని భారత ఆర్థిక వ్యవస్థ పర్యవేక్షణ కేంద్రం (సీఎంఐఈ) గణాంకాలను ఆ కథనం ప్రస్తావించింది.



మధ్యధరా సముద్ర తీరంలో గాల్ మొబైల్ జీపులో మోదీ, నెతన్యాహు విహారం, మోదీ, నెతన్యాహు ముచ్చట్లు (ఫైల్)

మోదీకి నెతన్యాహు ప్రత్యేక బహుమతి

- సముద్రపు నీటిని శుద్ధి చేసి గాల్-మొబైల్ జీపు
- ఇజ్రాయెల్ సాంకేతిక పరిజ్ఞానానికి నిదర్శనం

జెరూసలేం/న్యూఢిల్లీ, జనవరి 4: భారత్ పర్యటనకు వస్తున్న ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు... ప్రధాని నరేంద్ర మోదీకి ప్రత్యేకమైన బహుమతి ఇవ్వనున్నారు. గత ఏడాది జూలైలో మోదీ ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లినప్పుడు మధ్యధరా సముద్ర తీరంలో నెతన్యాహుతో కలిసి ఒక జీపులో విహరించారు. అది సముద్రపు నీటిని శుద్ధి చేసి మంచినీరుగా మలిచే ఆధునిక యంత్ర పరికరాలతో కూడిన గాల్-మొబైల్ జీపు! ఇజ్రాయెల్ స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించింది. ఓల్గా బీచ్‌లో ఆ బగ్గీ జీపులో సముద్రపు నీటి శుద్ధి ప్రక్రియను చూసి మోదీ అబ్బురపడ్డారు. ప్రకృతి విపత్తుల సమయంలో ఎంతో ఉపకరిస్తుందంటూ నెతన్యాహును అభినందించారు. ఇద్దరూ కలిసి ఆ నీటిని రుచి చూశారు కూడా! ఆ పర్యటన ఇద్దర్నీ మంచి మిత్రులను చేసింది. మోదీ ఎంతో మెచ్చుకున్న ఆ జీపునే ఇప్పుడు నెతన్యాహు నజరానాగా ఇవ్వనున్నారు. దాని విలువ అక్షరాలా రూ.70 లక్షలు! నెతన్యాహు నాలుగు రోజుల పర్యటన కోసం ఈ నెల 14న రానున్నారు.

వణికిస్తున్న సీపీయూ బగ్స్

- ఇంటెల్, ఏఎండీ, ఏఆర్ఎం చిప్‌లలో దోషాలు!
- బిలియన్ల పీసీలు, స్మార్ట్‌ఫోన్లు, క్లౌడ్ కంప్యూటింగ్‌పై ప్రభావం
- పాస్‌వర్డ్‌లు, బ్యాంకు డేటా ఈజీగా హ్యాక్!



2018 ఆరంభంలోనే కంప్యూటర్ ప్రపంచం ఒక్కసారి షాక్ అయింది. ఇంటెల్, ఏఎండీ, ఏఆర్ఎం ప్రాసెసర్లలో భద్రతాపరమైన లోపాలు ఉన్నాయన్న సమాచారం ప్రపంచ దేశాలను షేక్ చేస్తోంది. సైబర్ నిపుణుల విశ్లేషణల ప్రకారం.. ఇంటెల్‌కి చెందిన ఎక్స్86-64 హార్డ్‌వేర్ కల్గిన చిప్ డిజైన్‌లో దోషాలున్నాయి. ఆ బగ్‌లను 'మెల్ట్‌డౌన్, స్పెక్ట్రె' అని పిలుస్తున్నారు. ఇంతవరకూ బయటపడిన సీపీయూ బగ్స్‌లో ఇవి అతి ప్రమాదకరమైనవని భావిస్తున్నారు. దీనివల్ల బిలియన్ల కంప్యూటర్లపై సైబర్ ఎటాక్స్ చేయడానికి అవకాశం ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. 'ద రిజిస్టర్' అనే వెబ్‌సైట్ ఈ విషయాన్ని వెలుగులోకి తేగా, గూగుల్ 'ప్రాజెక్ట్ జీరో' బృందం సమస్య తీవ్రతను తెలియజేసింది. ఈ నేపథ్యంలో ఇంటెల్, ఏఆర్ఎం కంపెనీలు స్పందించాయి. చిప్ డిజైన్లలో లోపాలు లేవంటున్న ఈ కంపెనీలు.. సమస్య పరిష్కారానికి ఆపరేటింగ్ సిస్టమ్ అప్‌డేట్ చేసుకోవాలని సలహా ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే మైక్రోసాఫ్ట్ అత్యవసర చర్యలు చేపట్టింది. వెంటనే విండోస్ 10 అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది. అటు యాపిల్, గూగుల్ కూడా యూజర్లకు అప్‌డేట్స్ ఇస్తున్నాయి.

ఇప్పుడు ఏం చేయాలి?

- కంప్యూటర్ తయారీ దారులు, ఆపరేటింగ్ సిస్టం ప్రొవైడర్లు పంపే అప్‌డేట్స్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి.
- సెక్యూరిటీ అప్‌డేట్స్ కల్గిన ఆండ్రాయిడ్ ఫోన్లకు ఫర్వాలేదు. క్రోమ్ ఓల్డర్ వెర్షన్ వాడే వాళ్లు అప్‌డేట్ వెర్షన్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి.
- యాపిల్ ల్యాప్‌టాప్స్, డెస్క్‌టాప్‌ల భద్రత కోసం చర్యలు మొదలయ్యాయి. ఐఫోన్లు, ఐపాడ్‌లకు ముప్పుపై స్పష్టత లేదు.
- అమెజాన్ వెబ్ సర్వీసెస్, గూగుల్ క్లౌడ్ ప్లాట్‌ఫామ్, మైక్రోసాఫ్ట్ అజూర్ వంటి క్లౌడ్ సర్వీస్ కంపెనీలు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాయి.

పాస్‌వర్డ్స్, క్రెడిట్‌కార్డ్ డేటాకి ముప్పు

1995 నుంచి ఇంటెల్ కార్పొరేషన్ తయారుచేసిన ప్రాసెసర్లపై మెల్ట్‌డౌన్ బగ్ ప్రభావం ఉంటుంది. ముఖ్యంగా ఇంటెల్ ప్రాసెసర్లు కల్గిన కంప్యూటర్లు, మాక్‌లకు ముప్పు పొంచివుందని నిపుణులు భావిస్తున్నారు. లైనెక్స్, మైక్రోసాఫ్ట్ విండోస్‌తోబాటు ఇతర ఆపరేటింగ్ సిస్టమ్‌లతో నడుస్తున్న కంప్యూటర్లపై ప్రభావం ఉంటుందని చెబుతున్నారు. ఇంటెల్ ప్రాసెసర్లలోని డిజైన్ దోషాలు హ్యాకర్లకు ఆయుధంగా మారుతాయనీ.. పాస్‌వర్డ్‌లు, సెక్యూరిటీ ప్రశ్నలు, ప్రైవేట్ కీస్, క్రెడిట్‌కార్డ్ డేటా వంటి కీలక సమాచారాన్ని సులభంగా కొల్లగొట్టవచ్చని నిపుణులు అంటున్నారు. స్పెక్ట్రె బగ్‌తో అత్యధికంగా ఏఎండీ ప్రాసెసర్లు కల్గిన స్మార్ట్ ఫోన్లు, ఇంటెల్ పీసీలు, టాబ్లెట్లపై ప్రభావం ఉంటుందని చెబుతున్నారు.

సైన్యం తర్వాత ఆరెస్సెస్‌తోనే ప్రజలకు భద్రత

- సుప్రీం మాజీ న్యాయమూర్తి కేటీ థామస్



న్యూఢిల్లీ, జనవరి 4: సైన్యం తర్వాత దేశ ప్రజల భద్రతను పరిరక్షిస్తోంది ఆరెస్సెస్ అని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి కేటీ థామస్(80) పేర్కొన్నారు. భారత రాజ్యాంగం తర్వాత ప్రజాస్వామ్యం, ఆర్మీనే దేశ భద్రతకు ప్రతిబింబమన్నారు. ఆ తర్వాత దేశ ప్రజలను ఆర్ఎస్ఎస్ మాత్రమే కాపాడగలుగుతోందన్నారు. ఆదివారం కేరళలోని కొట్టాయంలో ఆర్ఎస్ఎస్ శిక్షకుల శిక్షణ సమావేశంలో పాల్గొన్న థామస్ ప్రసంగ ప్రతిని బీజేపీ నేత సంబిట్ పత్రా ట్వీట్ చేశారు. దీనికి ప్రతిగా థామస్ రీట్వీట్‌లో పై విధంగా వ్యాఖ్యానించారు. దేశానికి మాయని మచ్చలా మిగిలిన ఎమర్జెన్సీ కాలం నాటి ప్రతికూల పరిస్థితుల నుంచి బయటపడేలా ఆర్ఎస్ఎస్ గట్టి కృషి చేస్తోందన్నారు. 1996లో సుప్రీం కోర్టు జడ్జిగా నియమితులైన థామస్.. పదవీ విరమణ అనంతరం సామాజిక సేవకు అంకితమయ్యారు. ఆయన సేవలను గుర్తించిన కేంద్రం 2007లో పద్మభూషణ్‌ను ప్రదానం చేసింది.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: **K. Srinivas**, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .**Managing Director : Vemuri Radha Krishna**, Founder: K.L.N.Prasad.

ముగ్గుల్లో... చేనేత రంగుల్లో...

సంక్రాంతి సెలవులకి ఇంకా వారం పైనే టైం ఉంది. కానీ, సంక్రాంతి ఫ్యాషన్స్ సందడి మాత్రం ఎప్పుడో మొదలైపోయింది. రంగురంగుల ముగ్గుల హరివిల్లులతో వాకిళ్లు సంక్రాంతి సంబరాలకు స్వాగతం పలుకు తుంటే... ఇంద్రధనుస్సును నేల మీదకి దించేస్తున్నారు ఫ్యాషన్ డిజైనర్లు. అది కూడా చేనేత వస్త్రాలతో.. అలా ముస్తాబైన సంక్రాంతి వస్త్ర సోయగాల ఆనందహేల ఇది.

సొగసు







ఆకుపచ్చ రంగు ఇక్కత్ పోచంపల్లి చీర మీదకు డిజైన్ చేసిన బ్లౌజ్ ఇది. సంక్రాంతికి గోదాదేవిని పూజిస్తారు. అందుకని ఈ బ్లౌజ్ మీద మగ్గం వర్క్‌తో గోదాదేవిని డిజైన్ చేశారు. అమ్మవారిని పద్మంలో ఉంచారు. బ్లౌజ్ మీద విడిగా మరికొన్ని పద్మాలను మగ్గం వర్క్ చేశారు. త్రెడ్ వర్క్, జర్దోసి లను ఎంబోజ్ చేశారు. ఈ చీరను పెద్ద వాళ్లు కట్టుకుంటే చీరలో వచ్చిన బ్లౌజ్‌ను కుట్టించుకోవచ్చు. అదే యంగ్ జనరేషన్ అయితే ఇక్కడ చూపించి నట్టు బ్లౌజ్‌ను డిజైన్ చేయించుకుంటే బాగుంటుంది. ఈ చీర మీదకు ట్రెడిష నల్ బ్లౌజ్‌తో పాటు బ్రోకేడ్ బ్లౌజ్ కూడా వేసుకోవచ్చు.

చీర: 10,000 రూపాయలు
బ్లౌజ్: (బ్లౌజ్ పీస్+ స్టిచ్చింగ్ కలిపి) 6,000 రూపాయలు

బాటిల్ గ్రీన్ రంగు మీద యానిమల్ ప్యాటర్న్ వచ్చిన ఉప్పాడ పట్టు చీర ఇది. చీరంతా యానిమల్ మోటిఫ్స్ వచ్చి.. అంచుల్లో కిందా, పైనా కడ్డీ బోర్డరు వచ్చింది. చీరతో పాటు పింక్ పోల్కా బ్లౌజ్ వస్తుంది. దానికి బదులు పోల్కాస్ ఉన్న బెనారస్ ఫ్యాబ్రిక్ వాడారు. ఈ బ్లౌజ్‌కు బెంగాలి నెక్ ఇచ్చారు. నెక్ దగ్గర ఫ్రిల్స్ ఇచ్చారు. చుడీ చేతులు కుట్టి, వాటికి కూడా ఫ్రిల్స్ ఇచ్చారు. ఇలాంటి చీరలు యంగ్‌స్టర్స్ కట్టుకున్నా ఫ్యాషన్ లుక్ తెచ్చేందుకు బ్లౌజ్‌ను స్పెషల్‌గా డిజైన్ చేశారు. బ్లౌజ్ వెనక భాగాన గోల్డ్ రంగు పోట్లీ బటన్స్ కుట్టారు.

చీర: 8,500 రూపాయలు
బ్లౌజ్: 1,200 రూపాయలు

నలుపు రంగు ప్యూర్ బెనారస్ జ్యూట్ చీర. దీనికి కూడా చీరలో బ్లౌజ్ వస్తుంది. కానీ నేటి తరానికి నచ్చేలా బ్లౌజ్‌ను విడిగా డిజైన్ చేశారు. బాటిల్ గ్రీన్ రంగు చీరకు ఇచ్చిన బ్లౌజ్ లాంటిదే ఇది కూడా.

చీర: 8,000 రూపాయలు
బ్లౌజ్: రూ. 1,200

ఆకుపచ్చ, లేత నారింజ రంగుల కల యికతో ఉన్న జ్యూట్ పట్టు చీర ఇది. చీర మీద బొమ్మలు నేతతో కలిపే వస్తాయి. ఆ బొమ్మను బ్లౌజ్ వెనక భాగాన డిజైన్ చేశారు. ఇందుకు ఇన్‌స్ట్రుమెంట్ ప్యాటర్న్ వచ్చిన ఫ్యాబ్రిక్ తీసుకున్నారు. వీపు భాగంలో నెట్ ఫ్యాబ్రిక్ వాడి దాకి లేస్ ఇచ్చారు. బ్లౌజ్ చేతులకు గోల్డ్ లేస్ ఇచ్చారు. చీరతో పాటు బ్లౌజ్ వస్తుంది. అయితే ఈ చీరను టీనేజి అమ్మాయిలు కూడా కట్టుకునేందుకు వీలుగా డిజైనర్ బ్లౌజ్ కుట్టారు.

చీర : 7,500 రూపాయలు
బ్లౌజ్ : 2,000 రూపాయలు

ప్యూర్ ఉప్పాడ పట్టు చీర మీద ముగ్గుల్ని మగ్గం వర్క్‌తో వేయించారు. అవి హైలైట్ కావడం కోసం ముదురు బర్గండీ రంగు బ్రోకేడ్ బ్లౌజ్ కుట్టారు. బ్లౌజ్ వెనక భాగాన రెడీ మేడ్ టస్సెల్స్ ఇచ్చారు.


చీర : 11,000 రూపాయలు
బ్లౌజ్: 1,200 రూపాయలు

డిజైనర్: **సమతా రెడ్డి,** సైనిక్‌పురి, సికింద్రాబాద్
మోడల్: **కృతికాసింగ్ రాథోర్**

సేకరణ: **కిరణ్మయి**

కౌన్సెలింగ్ కార్నర్

నా నిర్ణయం సరైనదేనా?



నేను ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్నా. కొంతకాలం క్రితం మా అమ్మ అనారోగ్యంతో చనిపోయారు. అప్పటి నుంచీ నాన్న డల్ అయ్యారు. నాకు నాన్న చాలా క్లోజ్. మేమిద్దరం స్నేహితుల్లా ఉంటాం. కానీ... ఈ మధ్య ఏం చేసినా నాన్న విచారం పోగొట్టలేకపోతున్నా. చదువు, ఉద్యోగాలతో నేను బిజీగా ఉంటాను. కానీ నాన్న..! అందుకే నాన్నను మరో పెళ్లి చేసుకోమని చెప్పాలనుకుంటున్నా. అప్పుడు ఆయన గురించి దిగులు ఉండదు. నా నిర్ణయం సరైనదేనా?

- మనోజ్

చిన్నవారైనా పెద్ద మనసుతో ఆలోచించారు. ఈ వయస్సుకే ఇంత పరిణతి ఉండటం అరుదు. బహుశా నాన్నపై ప్రేమ ఇందుకు కారణమై ఉంటుంది. మీ ఆలో చనలో ఏ తప్పూ లేదు. కానీ మీ నాన్న అందుకు మానసికంగా సిద్ధమో, కాదో తెలుసుకోవాలి. మీ అమ్మగారితో ఆయనకు ఉన్న బంధాన్ని బట్టి ఉంటుందది. అందుకే తొందరపడకుండా మెల్లగా ప్రస్తావించండి. ఈ రోజుల్లో ఇదేమంత పెద్ద విషయం కాదు గానీ... మానసిక దృఢత్వానికి సంబంధించిన అంశం. మీరు ఆయన కోసం పడే ఆరాటం అర్థమైతే, ఆయన కూడా తప్పక ఆలోచిస్తారు. మంచి నిర్ణయం తీసుకుంటారు కూడా! అయితే మీది తొందరపాటు నిర్ణయం కాకుండా చూసుకోండి. చాలా మంది ముందు ఇలాగే అనుకొని, తర్వాత సర్దుకోలేక గొడవ పడతారు. మరి మీ నాన్న జీవితంలోకి మరో వ్యక్తిని మీరు మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తారా? అందుకు మీరు కూడా మానసికంగా సిద్ధం కావాలి మరి!

• **కె.శోభ,** ఫ్యామిలీ కౌన్సెలర్, హార్ట్ టు హార్ట్
shobhas292@gmail.com

కోటి లాభాల నూనె!

కొబ్బరి నూనె అనగానే కేవలం కేశాల అందాన్ని ఇనుమడింపజేయటానికే అనుకుంటాం. పగిలిన పెదవులకు ఉపశమనం కోసం, ఆహార పదార్థాల రుచిని ఇనుమడింపజేసే వంట నూనెగా వాడతారని కూడా మనకు తెలుసు. కానీ మనకు తెలియని మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలు కొబ్బరి నూనెలో దాగున్నాయి.

- కొబ్బరి నూనెలో ఉండే కొన్ని రకాల ఆమ్లాలు, ట్రైగ్లిసరైట్స్‌లు వల్ల అదనంగా 200 కెలోరీల శక్తి శరీరానికి లభిస్తుంది. దీనివల్ల శరీరంలో శక్తి ఉత్పాదకత ఐదుశాతం పెరుగుతుంది.
- హానికారక సూక్ష్మజీవులను, వైరస్‌లను నిర్మూలించే లారిక్ యాసిడ్, మోనోగ్లిజరైడ్‌లు కొబ్బరి నూనెలో అధిక పాళ్లలో ఉంటాయి. దీనివల్ల ఇన్‌ఫెక్షన్లు దరి చేరవు.
- కొబ్బరి నూనెలో ఉండే ట్రైగ్లిసరైట్లను కాలేయం జీర్ణం చేసుకొని కెటోన్లను ఉత్పత్తి చే స్తుంది. ఇవి మెదడుకు తక్షణ శక్తిని ఇస్తాయి. సొంతంగా తగినంత ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయలేని పరిస్థితుల్లో మెదడు ఉన్నప్పుడు అది విధులను నిర్వహించటానికి ప్రత్యామ్నాయ శక్తి వనరుగా ఉపయోగపడతాయి.
- కొబ్బరి నూనెలో నేచురల్ సాచ్యురేటెడ్ ఫాట్స్ ఉంటాయి. ఇవి గుండె జబ్బులు తగ్గటానికి దోహదం చేస్తాయి. ఆరోగ్యకరమైన కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతాయి.
- మతిమరుపుతో సతమతమయ్యేవారికి ట్రైగ్లిసరైట్స్ మరచిపోయిన విషయాలను తిరిగి గుర్తుకు తెచ్చుకునేందుకు సహాయపడతాయని పరిశోధనల్లో రుజువైంది. అంతేకాదు ట్రైగ్లిసరైట్స్‌ను మెదడు ఇన్సులిన్ లేకుండానే నేరుగా గ్రహిస్తుంది. దీనివల్ల మెదడు కణాలు మరింత చురుగ్గా పనిచేస్తాయి. కొబ్బరి నూనెలో ఉండే ట్రైగ్లిసరైట్స్ సులభంగా జీర్ణమవుతాయి. పాంక్రియాస్ ఎదుర్కొనే జీవక్రియల ఒత్తిడిని తగ్గిస్తాయి.
- ఆరోగ్యాన్ని దెబ్బతీసే హార్మోన్ల అసమతుల్యతను కొబ్బరినూనె నివారిస్తుంది. ఇందులో ఉండే లారిక్ యాసిడ్, ఈస్ట్రోజన్ హార్మోన్ల సమతుల్యతను కాపాడతాయి.
- నోట్లో కొబ్బరి నూనెను పోసుకొని పుక్కిలించటం వల్ల నోటి ఆరోగ్యం మెరుగుపడుతుంది.
- విటమిన్, క్యాల్షియం, మెగ్నీషియాలను గ్రహించటానికి కొబ్బరినూనె శరీరానికి సహకరిస్తుంది. ఒమేగా త్రీ ఫ్యాటీ యాసిడ్ల రెట్టింపు ప్రభావంతో పనిచేస్తాయి. జీర్ణాశయంలో చెడు బ్యాక్టీరియాను నిర్మూలించి, శిలీంధ్ర సంబంధిత వ్యాధులు రాకుండా చేస్తాయి.

ప్రకృతి వరం



బ్యూటీ కేర్

పార్టీలో అందంగా... ఆనందంగా...

మీ ఫ్రెండ్ బర్త్ డే పార్టీకి వెళ్లాలనుకుంటున్నారా...కానీ... వెలవెల బోతున్న మీ చర్మం, శిరోజాలు మిమ్మల్ని పార్టీకి వెళ్లడానికి సంకోచించేట్టు చేస్తున్నాయా? ఇందుకు కొన్ని టిప్స్ ఉన్నాయి. వాటిని పాటిస్తే మీరు అందంగా కనిపిస్తారు. ఆ టిప్స్ ఏమిటంటే...

- పార్టీకి వెళ్లడానికి ఒకరోజు ముందే మేనిక్యూర్, పెడిక్యూర్ చేయించుకోవాలి. గోరువెచ్చటి నీళ్లల్లో చేతులు, పాదాలు కాసేపు ఉంచి పొడి టవల్‌తో తుడుచుకోవాలి. ఆ తర్వాత చేతులకు, కాళ్లకు స్కిన్ క్రీమ్ రాయాలి. ఇలా చేస్తే చర్మం మృదువుగా తయారవుతుంది.
- చేతులు మరింత అందంగా కనిపించాలంటే నిమ్మరసంలో చక్కెర వేసి ఆ మిశ్రమాన్ని చేతులకు పట్టించాలి.
- వ్యాక్సింగ్, త్రెడింగ్ కూడా చేయించుకోవాలి.
- ఒక టీస్పూను తేనె, రోజ్ వాటర్, పాలపొడి మూడింటినీ కలిపి పేస్టులా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకుని 20 నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీళ్లతో ముఖం కడుక్కోవాలి. ఇలా చేయడం వల్ల ముఖం ఎంతో మృదువుగా తయారవుతుంది.
- కళ్లకింద ఉబ్బినట్టు ఉంటే చల్లటి కాటన్‌వూల్‌తో చేసిన ఐప్యాడ్స్‌ను రోజ్ వాటర్‌లో ముంచి కళ్ల మీద పెట్టుకోవాలి. టీ బ్యాగ్స్‌ను కూడా ఇందుకు వాడొచ్చు.
- ముఖం మీదున్న మచ్చలు, మొటిమలు కనిపించకుండా ఉండేందుకు లైట్‌గా రెండు షేడ్స్ ఫౌండేషన్ మాత్రమే వేసుకోవాలి.
- స్మోకీ ఐస్ లుక్ ఉండాలి. ఐ లాషెస్ కూడా మీ అందాన్ని ఇనుమడిస్తాయి.
- పార్టీ రాత్రిపూట కాబట్టి ఎరుపు, పగడపు రంగు లేదా ముదురుగులాబీ రంగు లిప్‌స్టిక్ పెదాలకు వేసుకుంటే అందరిలో మరింత అందంగా తళుక్కుమంటారు.
- శిరోజాలు కాంతివిహీనంగా ఉన్నాయని బాధపడకండి. షాంపుతో తల స్నానం చేసే ముందు కండిషనింగ్ చేయించుకోవాలి. ఒక స్పూను వెనిగర్, తేనెల్లో గుడ్డులోని తెల్ల, పచ్చసొన జ్యూసును కలిపి పేస్టులా తయారుచేసి మాడుకు పట్టించాలి. తలను రుద్దుకునే ముందు శిరోజాలను వేడి టవల్‌లో ముడిచి 20 నిమిషాలు అలాగే ఉంచుకోవాలి. ఇలా చేయడం వల్ల జుట్టులోని డల్‌నెస్ పోయి పట్టులా, కాంతివంతంగా శిరోజాలు తయారవుతాయి.






ధర్మ సందేహం


వామాచారం అంటే ఏమిటి?

అనాదిగా దేవతా ప్రసన్నతను పొందడానికి అనుసరిస్తున్న అనేక పద్ధతులున్నాయి. వీటిలో ప్రధానమైనది దక్షిణాచారం. వేదమార్గాన్ని అనుసరించి, మోక్షాన్ని కోరుకుంటూ, శాంతియుతమైన, నిర్వికారమైన మార్గాల్లో చేసే ఆరాధన దక్షిణాచారం. వామాచారం దీనికి పూర్తిగా విరుద్ధం. దీనిలో తంత్ర పద్ధతులకు ప్రాధాన్యం ఉంటుంది. పంచ 'మ'కారాలు వామాచారానికి కీలకమని పండితులు చెబుతారు. అవి మద్యం, మాంసం, మత్స్యం, ముద్ర, మైథునం. ఇలాంటి ఆహార విహారాలతో ఆరాధన చేస్తే దేవతలు సులువుగా ప్రసన్నమవుతారనీ, ఐహికమైన కోరికలు వేగంగా సిద్ధిస్తాయనీ ఈ మార్గాన్ని అనుసరించే సాధకుల నమ్మకం. నిజానికి వామాచార పద్ధతులు వేలాది సంవత్సరాల క్రితమే ఆచరణలో ఉండేవి. వాటిలో అనేక రకాలున్నాయి. ముఖ్యమైన రకాలు అయిదు (కౌలము, వామము, చీనము, సిద్ధాంతము, శాంబరము) అని 'మేరు తంత్రం' అనే ప్రాచీన గ్రంథం వివరిస్తోంది. [illegible]



[illegible] స్వరూపిణిగా ఉంటారనే ఉద్దేశంతో, ఆదిశంకరులు ఆ పేర్లను మార్చి వేసి, అమ్మవారికి లలితా రూపాన్ని ఇచ్చారు. అప్పటి నుంచి ఇక్కడ సాత్విక పూజలు జరుగుతున్నాయి.

అంతా ఆయనే!



నవజీవనవేదం

శ్రీకృష్ణపరమాత్మ తన విశ్వరూపాన్ని తనే వ్యాఖ్యానించాక నిర్భయంగా లేచి యుద్ధం చేయవయ్యా! నిమిత్తమాత్రంగా చేయవయ్యా! అంతా కర్మ ప్రకారం జరిగిపోతుంది. నడిపించే వాణ్ణి నేనున్నాను, నడవడానికే ఇంత భయపడితే ఎలాగయ్యా! అని అంటాడు. శ్రీకృష్ణుని మాటలు విన్నాక అర్జునుడికి కొంత ధైర్యం వచ్చింది. ఆ విశ్వరూపాన్ని చూసిన తన్మయభావంతో స్తోత్రం చేస్తున్నాడు.

త్వమాదిదేవః పురుషః పురాణః
త్వమస్య విశ్వస్య పరం నిధానమ్!
వేత్తాసి వేద్యం చ పరం చ ధామ
త్వయా తతం విశ్వమనంతరూప!!

నీవే ఆది దేవుడవు. పురాణ పురుషుడవు. ఈ విశ్వానికి మూలమైనటువంటి నిధి, కారణం, ఆధారం.. అన్నీ నువ్వే! తెలుసుకునే వాడివి నువ్వే! తెలుసుకోబడే వాడివి కూడా నువ్వే! అనంతమైన రూపములు కలిగిన ఓ మహానుభావా! నీ చేతనే ఈ విశ్వమంతా వ్యాపించి ఉన్నది.

"భగవంతుడు అనేక రూపాలు ధరిస్తాడమ్మా! ఏ రూపంలోనైనా రావచ్చు" అని అంటారు. ఇది తప్పుడు వ్యాఖ్యానం. ఉన్న రూపాలన్నీ భగవంతుడివే. నువ్వు ఎవరితో ఈ మాట అంటున్నావో వారు కూడా భగవంతుడే. ఏ రూపంలోనైనా రావచ్చని అనొద్దు. వచ్చిన [illegible]

[illegible] అనుకోవాలి. 'నువ్వేలా ఆడిస్తే అలా ఆడతాను'! అనుకోవాలి. [illegible] వచ్చినా ఏడవకూడదు. ఇదొక ఆట. జీవితాన్ని నాటకంలో పాత్రలా [illegible] నాటకంలో ఒక పాత్ర వేసినపుడు నప్పిస్తే చాలు, ఒప్పిస్తే చాలు [illegible] అలా ఉండటం లేదు. ఈ నాటకంలో మనది అనుకున్న వారు [illegible] ఎంతో మంది మన కళ్ల ముందు నుంచి వెళ్లిపోవడం చూస్తున్నాం [illegible] విశ్వామిత్రుడు ఎంత గొప్పవాడు. సీతాకల్యాణం తరువాత [illegible] 'అంతటా నిండి ఉన్న పరమాత్మా! నీకు నమస్కారం. నీకు [illegible] ఎంతైనా పరాక్రమం ఉంది' ఈ విశ్వాన్ని [illegible] మనం బాగా అలవాటు పడితే అహంకారం [illegible] అవుతుంది. అప్పుడు 'నేనెంత! నేనెంత!' [illegible] కొంత సమయం కేటాయించాలి. [illegible] ఏకాంతంగా కూర్చోవాలి. నిత్యం [illegible] గాలికి కదులుతున్న చెట్లను చూడండి. [illegible] అర్థమవుతుంది.



● డా. గరికిపాటి నరసింహారావు

స్వర నీరాజన చక్రవర్తి

రేపు త్యాగరాజస్వామి ఆరాధన



దేవతామూర్తిగా పూజలందుకొనే అరుదైన గౌరవం దక్కిన మహానుభావుడు త్యాగరాజు. త్యాగయ్య సమాధి అయిన తమిళనాడులోని తిరువయ్యారులో ఆయన విగ్రహానికి నిత్య ఆరాధనలు జరుగుతాయి. ఆయన సమాధి చెందిన రోజైన పుష్యబహుళ పంచమిని పురస్కరించుకొని తిరువయ్యారులో కర్ణాటక సంగీత సరస్వతి కొలువుతీరుతుంది. దిగ్దంతులు, వర్ధిష్ణువులు అనే బేధం లేకుండా గాయకులూ, వాద్యకారులు తిరువయ్యారు చేరుకొని స్వరార్చనతో [illegible]

[illegible] పరించి, నారదుడి ద్వారా సంగీతరహస్యాలు తెలిపే 'స్వరార్ణవం' అనే గ్రంథాన్ని అనుగ్రహంగా త్యాగయ్య పొందారని ప్రతీతి.


క్రమేణా ఆయన దృష్టి మోక్షమార్గం పట్టింది. ఇష్టదైవమైన శ్రీరాముడిని షోడశోపచారాలతో ఆరాధించేవారు. ఆ ఉపచారాలకు అనుగుణంగా ఆశువుగా వాగ్గేయ కుసుమాలను స్వామికి నివేదించేవారు. శిష్యులకు సంగీత విద్యను ఆప్యాయంగా బోధించేవారు. దైవ స్తుతే తప్ప నరస్తుతి చెయ్యడానికి ఆయన ఇష్టపడలేదు. మహారాజులు పంపిన విలువైన కానుకలను సున్నితంగా తిరస్కరించేవారు. శిష్యులతో కలిసి కీర్తనలు ఆలపిస్తూ తిరువయ్యారు వీధుల్లో ఉంఛవృత్తితో జీవిక సాగించిన నిరాడంబరుడు త్యాగయ్య. గాన, వాగ్గేయ మాధుర్యంతో సంగీత లోకాన్ని ఆయన రసరాగ రంజితం చేశారు. శ్రోతలను ఆనందడోలికల్లో పరవశింపజేశారు. శాస్త్రాలు, ఉపనిషత్తులు, పురాణాల్లోని తత్త్వ రహ[illegible]

[illegible] మైన సంగీత రహస్యాలనూ, ఆలోచనామృతాన్ని పంచే సాహిత్య మర్మాలనూ ఒక అమృతధారగా రసజ్ఞులకు అందించిన కారణజన్ముడు.



● సంగీతాచార్య డాక్టర్ వైజర్సు బాలసుబ్రహ్మణ్యం

సూరి నాగమ్మ భక్తి



(గత సంచిక తరువాయి)

శ్రీరమణ కథామృతం

నాగమ్మ 1945 నుంచి 1950లో శ్రీభగవాన్ [illegible]

కరుణా సముద్రుడు



ధర్మపథం

కత్తులు కరాళ నాట్యం చేస్తూ నెత్తుటేరులు పారించే కాలంలో, మానవ జాతికి కరుణ గురించి బోధించి, కళ్ళు తెరిపించిన కరుణామయుడు బుద్ధుడు. యజ్ఞయాగాల పేరుతో వేలాది జీవుల ప్రాణాలు అగ్నికి ఆహుతి అయ్యే [illegible]


[illegible] కరుణా సాగరమై పొంగింది. ఆ గొర్రె పిల్లను ఎత్తుకొని ఆ మంద వెంటే వెళ్ళాడు. యజ్ఞవాటిక చేరుకున్నాడు. అక్కడ గొర్రెలు, ఆవులు, దున్నలు, ఎద్దులు, గుర్రాలు మందలు మందలుగా ఉన్నాయి.

గొర్రె పిల్లను ఎత్తుకొని యాగశాలలోకి వచ్చిన బుద్ధుణ్ణి రాజు బింబిసారుడు చూశాడు. గబగబా బుద్ధుని దగ్గరకు వచ్చి నమస్కరించాడు.

"రాజా! ఇన్ని జంతువుల్ని బలి ఇస్తున్నారా?" అని అడిగాడు బుద్ధుడు.

"అవును. రాజ్య క్షేమం కోసం" అన్నాడు రాజు.

ఆ పక్కనే ఉన్న యజ్ఞ నిర్వాహకుడు, రాజ పురోహితుడు కూడదంతుడు [illegible]



సద్గురువాణి

ఆలయాలు ఎందుకు?

ఈ రోజుల్లో గుళ్ళకు వెళ్ళేవారిలో చాలామంది వాటిలోని శక్తికి ఆకర్షితులై వెళ్ళడం లేదు. భయంతోనో, ఆశతోనో వెళుతున్నారు. కాని, అసలు 'గుడి' స్థాపన వెనుకున్న విజ్ఞానమే వేరు!

ఆకాశాన్ని చూస్తే అది ఎంతో విశాలమైనదిగా గోచరిస్తుంది. కాని సూర్యుడు, నక్షత్రాలూ, మిగతా గ్రహాలే కదా మనల్ని ఆకర్షించేది? అనంతంగా వ్యాపించి ఉన్న శూన్యం మనల్ని ఆకర్షిస్తుందా? ఆ శూన్యం మనకు తెలుస్తుందా? [illegible]

[illegible] ఒకటుంది. దాన్ని తెలుసుకోవడానికే గుళ్ళు, గోపురాలూ స్థాపించబడ్డాయి. మీరు ప్రపంచాన్ని అవగాహన చేసుకోవడానికి ఉపయోగపడేవి మీ పంచేంద్రియాలే - అవే కన్ను, ముక్కు, నాలుక, చెవి, చర్మం. కాని శూన్యాన్ని తెలుసుకోవడానికి మీ పంచేంద్రియాలు సరిపోవు.

పంచేంద్రియాలతో విశ్వాన్ని అర్థం చేసుకోవాలనుకోవడం ఎలాంటిదో తెలుసా? ఒక జెన్ గురువు దగ్గరికి ఒక కోతి వచ్చింది. తనను శిష్యునిగా స్వీకరించమని అడిగింది. "వేరే వాళ్ళ దగ్గర లేని సామర్థ్యం నా దగ్గర వుంది. ఒకే గెంతుతో 100 చెట్లను దాటేస్తాను" అంది. ఆ కోతికి ఒక కత్తి ఇచ్చారు గురువు. "ఈరోజు ఎంత దూరం వెళ్ళగలవో అంత దూరం వెళ్ళి, అక్కడ ఈ కత్తితో ఒక గుర్తు పెట్టి తిరిగిరా. ఆ తర్వాత నా అభిప్రాయం చెప్తాను" అని అన్నారు.


ఆ పందెం తేలిక అనుకుంది కోతి. జెన్ గురువును అదరగొట్టాలని అనుకుంది. మామూలు కన్న ఎక్కువ వేగంతో ఎగురుతూ వెళ్ళింది. అలసట వచ్చాక, ఒక చోట ఆగి ఒక చెట్టు మీద కత్తితో గుర్తు పెట్టి తిరిగి వచ్చింది. "నేను గుర్తు పెట్టిన చెట్టును చూడాలంటే మీరు కొన్ని నెలలపాటు ప్రయాణం చేయాల్సి వస్తుంది" అంది కోతి. "అక్కర్లేదు!" అని జెన్ గురువు మందహాసం చేశాడు. తాను కూర్చొన్న చెక్క పలకను చూపించాడు. దాని మీద కోతి చెక్కిన గుర్తు కనిపించింది. ఈ విశ్వమనే బ్రహ్మాండంలో మానవుడి ప్రయాణం కూడా ఇంతే. [illegible]

ఇంకా తేలికగా చెప్పాలంటే, ఏమీ లేని శూన్యం మీద విశాలమైన ఒక తివాచీ పరిచి ఉందనుకుంటే, మీరు ఆ తివాచీ మీద ఉన్నారనుకోవచ్చు. ప్రత్యక్ష అనుభవం కలవారు శక్తిభరితమైన స్థితిలో శాస్త్రీయంగా ఆ తివాచీ మీద ఏర్పరచిన రంధ్రాలే ఈ కోవెలలు. ఆ రంధ్రాల ద్వారా ఆవల ఉన్న శూన్యాన్ని, ఆ పరిమితిలేని శూన్యాన్ని అనుభూతి చెందగలరు. ఆ అంతుచిక్కని శూన్యాన్ని 'శివ' అని అంటాము. నిరాకార శూన్యం ఒక రూపం సంతరించుకున్నప్పుడు, మొదట ఏర్పడే రూపమే లింగం. దేనినుండి ఉద్భవించామో ఆ శూన్యతత్త్వమైన 'శివ' తో ఏకమైపోవడానికే ప్రారంభంలో ఆలయాల నిర్మాణం జరిగింది. మొదట్లో నిర్మితమైన వేలాది ఆలయాలు ఏ అట్టహాసాలు లేకుండా, కేవలం లింగాలతోనే ఉండేవి. ఎవరినీ ఆకర్షించడం వాటి ధ్యేయం కాదు. కాలక్రమేణా మానవుడి ఆసక్తి మారిపోయింది. చివరకు లభించే ముక్తి కంటే వెంటనే కావలసినవి ముఖ్యంగా తోచాయి. ఆ అవసరాలకు తగినట్లు శక్తులను ప్రసాదించే రూపాలను సృష్టించడం ప్రారంభించారు.

మహా యోగులు నిర్మించిన గొప్ప శక్తిమంతమైన ఎన్నో ఆలయాలు మన దేశంలో ఆదరణలేక పాడై పోవడం, వాటి శక్తిని మనం తెలుసుకోలేక పోవడం మన దురదృష్టం.

ఆలయాలకు సంబంధించిన విజ్ఞానమెలా ఉపయోగించుకోవాలో తెలుసుకున్న మానవుడు శక్తికి ఒక దైవం, ధనానికి ఒక దైవం, చదువుకు ఒక దైవం, కాపాడి రక్షించేందుకు ఒక దైవం [illegible]

కాని ఈ రోజు గుళ్ళకు వెళ్ళే అధికశాతం ప్రజలకు అక్కడ నిక్షిప్తమైవున్న శక్తిని గ్రహించే స్థాయి లేదు కనుక, వారు ఆ శక్తిని అనుభూతి చెందలేకపోతున్నారు. శక్తిమంతమైన గుడి ఏది? ఏది మామూలు కట్టడం? అనే భేదం తెలుసుకోలేక పోతున్నారు. ఉద్వేగపరిచే ఆలయాలు కావాలనుకుంటున్నారు. కోరికలు తీర్చే స్థలంగా ఏ కోవెల గురించి ఎక్కువగా ప్రచారం చేస్తున్నారో, అవి ప్రసిద్ధి చెందుతున్నాయి. ప్రసిద్ధి చెందినంత మాత్రాన, ఒక కోవెల శక్తిమంతమైనదని చెప్పలేం. సృష్టిలో కనిపించేవన్నీ శూన్యంలో విస్ఫోటనం జరిగి, దానిలోంచి పొంగి పొరలి వచ్చినవేనని ఈనాటి వైజ్ఞానిక పరిశోధనలు నిరూపించాయి. శూన్యం నుండి పుట్టినవన్నీ తిరిగి ఆ శూన్యంలో కరిగిపోతాయనే సత్యాన్ని అర్థం చేసుకోవడానికి స్థాపింపబడినవే నిజమైన ఆలయాలు.



- సద్గురు జగ్గీవాసుదేవ్

పేదవాడే ప్రధానం!



ఫైనార్గం

[illegible]

క్రైస్తవంలో పేదవాడే ప్రధానం! పేదరికం మనిషి వైఫల్యం వల్ల ఏర్పడిన సామాజిక పరిణామమన్నది దేవుని బోధల సారాంశం. ఆకలి చావులు, అన్నదాతల ఆత్మహత్యలు విపరీతంగా పెరుగుతున్న ప్రస్తుత కాలంలో ఆర్థిక అసమానతలు కనీసం తగ్గుముఖం పట్టాలని ఈ కొత్త ఏడాదిలో కోరుకుందాం!

● సుశీల్ సందేశ్

డైలీ సుడోకు - 69

		7					3	
6		2		1	9			
4			6					
		4	3				5	
	1						8	
	7				6	9		
					5			9
			1	7		5		2
	4					7		

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 68 సమాధానం

[illegible]



మీ హృదయంలో ఒక అయస్కాంతం ఉంది. అది నిజమైన స్నేహితుల్ని ఆకర్షిస్తుంది. ఆ అయస్కాంతమే నిస్వార్థపరత్వం. అంటే ఇతరుల గురించి ఆలోచించడం. మొదట మీరు ఇతరుల కోసం జీవించడం నేర్చుకోండి... అప్పుడు వాళ్లు మీ కోసం జీవిస్తారు.

● పరమహంస యోగానంద



సందేశం

ఇహంతోనే పరం!

[illegible]

[illegible] ఇహం తరువాత పరం ఉందన్న నిజాన్ని నమ్మలేకపోవడమేననీ అంతిమ దివ్య ఖుర్‌ఆన్ స్పష్టంగా చెబుతోంది.

■ మహమ్మద్ వహీదుద్దీన్

Dwaraka

ఇస్తేనే ధన్యత!

"లక్ష్యంపై ఉండే శ్రద్ధ సాధనపైనా ఉండాలన్నదే నా జీవితంలో నేర్చుకున్న గొప్పపాఠం. ఆ ఒకే సిద్ధాంతం నుంచి నేను అనేక పాఠాలను ఎప్పుడూ నేర్చుకుంటూనే ఉన్నాను. కార్యసిద్ధికి అదే కీలకం. గమ్యంపై మనకు ఎంత శ్రద్ధ ఉంటుందో, దాని గమనంపై కూడా అంతే శ్రద్ధ ఉండాలి.

ఇతరుల పట్ల మన కర్తవ్యం... వాళ్ళకు ఉపకారం చేయడమే! అంటే... ప్రపంచానికి సహాయపడడం అన్నమాట. అసలు మనం ప్రపంచానికి ఎందుకు సహాయపడాలి? ప్రపంచానికి సహాయపడడమంటే మనకు మనం సహాయం చేసుకోవడమే! ఎత్తయిన పీఠం మీద నిలబడి, చేతిలో అయిదు పైసలు పుచ్చుకొని, "...బిచ్చగాడా! ఇదుగో..." అంటూ దర్పంగా అనవద్దు. బిచ్చగాడు అక్కడ నిలబడినందుకు అతడి పట్ల కృతజ్ఞత కలిగి ఉండు. అతడికి దానం చేయడంతో నీకు నువ్వే ఉపకారం చేసుకుంటున్నావు. ధన్యుడయ్యేది ఇచ్చేవాడే కానీ, పుచ్చుకున్నవాడు కాదు. ఆ బిచ్చగాడి కారణంగానే [illegible]


స్వామి వివేకానంద జయంతి 8వ తేదీ

సందర్భం



[illegible] ఏమిటంటే... లోకంలోని దుఃఖనివారణకు నిన్ను నువ్వు అర్పించుకోవడం!"

■ స్వామి వివేకానంద





బి.ప్రసన్న
మౌలాలి
హైదరాబాద్





సిహెచ్.కోటేశ్వరి
ఒంగోలు

18 చుక్కలు
2-2
సరిచుక్క






జె.సుశీల
పలమనేరు
చిత్తూరు జిల్లా

21 చుక్కలు
11 వచ్చేవరకు
సందు చుక్కలు






స్వరూప.బి
ఇల్లందు
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

25 చుక్కలు
3 వరుసలు
3 వచ్చే వరకు






జి.ఈశ్వరి
కొత్త మాధవరం
కడప జిల్లా



బి.శివాని
బయ్యారం
మహబూబాబాద్

21 చుక్కలు
చుక్క విడిచి చుక్క
7 వరుసలు
7 వచ్చే వరకు



గిఫ్ట్ హ్యాంపర్ విజేత

శ్రీమతి ప్రభా సుబ్బారావ్
హైదరాబాద్



26 చుక్కలు
7 వరసలు
7 వచ్చే వరకు

మా చిరునామా: నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70, హుడా హైట్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.
n a v o y ma @ a

బాలయ్య అభినయం అదిరింది



- సి.కల్యాణ్

"క్యూబ్, యుఎఫ్‌ఓ, జీఎస్‌టీతో పాటు ఇంకా పలు సమస్యలకు పరిష్కార మార్గాలను వెతికే ప్రయత్నంలో భాగంగా మార్చి 1 నుంచి సౌతX ఇండియX సినిమా ఇండస్ట్రీని షట్‌డౌX చేయబోతున్నాం" అని నిర్మాత సి.కల్యాణ్ అన్నారు. నందమూరి బాలకృష్ణ హీరోగా కె.యస్.రవికుమార్ దర్శకత్వంలో ఆయన నిర్మించిన చిత్రం 'జై సింహా'. నయనతార, హరిప్రియ, నటాషా దోషి నాయికలు. ఈ సినిమా గురించి సి.కల్యాణ్ గురువారం విలేకరులతో మాట్లాడుతూ "'జైసింహా' చిత్రాన్ని ఇప్పటికి పదిసార్లు చూసుకున్నా. బాలయ్య ఈ చిత్రంలో వేసినట్టు ఇంతకుముందు ఎక్కడా స్టెప్పులు వేయలేదు. ఆయన అభినయం అదిరింది . నయనతార, ప్రకాష్‌రాజ్ పాత్రలు సినిమాకు హైలైట్ అవుతాయి. హై ఎమోషX్స, స్ట్రాంగ్ ఫ్లాష్‌బ్యాక్, కుంభకోణం, వైజాగ్ ఎపిసోడ్స్ హైలైట్ అవుతాయి. 2వేల మంది పురోహితులతో ఓ ధర్నా ఎపిసోడ్ చేశాం. అది చూశాక బ్రాహ్మణులంతా బాలయ్య ఫ్యాX్స అవుతారు. వారి గురించి అంత గొప్పగా చెప్పారు. ప్రేక్షకులు రెండు, మూడు చోట్ల కంటతడి పెట్టుకుంటారు. కథకు తగ్గట్టుగానే బాగా ఖర్చుపెట్టి సినిమా చేశాం. హరిప్రియ, నటాషా దోషి, మురళీమోహX , బ్రహ్మానందం పాత్రలు మెప్పిస్తాయి. రత్నం చాలా మంచి కథ ఇచ్చారు. సంగీతం చాలా బాగా కుదిరింది. తెలుగుతో పాటు తమిళంలోనూ తెరకెక్కించాలనుకున్నాం కానీ అక్కడ పెద్ద హీరోతో రీమేక్ చేస్తానని రవికుమార్‌గారు మాటిచ్చారు. అందుకే చేయలేదు" అని తెలిపారు. తదుపరి చిత్రాల గురించి మాట్లాడుతూ "సాయిధరమ్‌తేజ్‌తో వి.వి.వినాయక్ దర్శకత్వంలో తెరకెక్కించబోయే సినిమాకు 'ఇంటిలిజెంట్' అని పేరు పెట్టాం. ఇకపై నన్ను అందరూ 'ఇంటలిజెంట్' కల్యాణ్ అని పిలుస్తారు. చిరంజీవికి 'ఖైదీ' వంటి సినిమాలు ఎలాగో, సాయిధరమ్‌తేజ్‌కు ఈ సినిమా అలాంటిదవుతుంది. దీని తర్వాత 1945 అని ఒక సినిమా చేస్తున్నా. రానా, రెజీనా, బ్రహ్మానందం, సప్తగిరి అందులో కీలక పాత్రధారులు. రానా హిందీ, నేను తెలుగు, తమిళ్‌లోకె ఫిలిమ్స్ తెరకెక్కిస్తున్నాం. ప్రస్తుతం 'సంఘమిత్ర' పనులు రామోజీ ఫిల్మ్‌సిటీలో జరుగుతున్నాయి. దిశాపటానిని నాయికగా అనుకుంటున్నాం. ఇంకా ఫైనలైజ్ చేయలేదు" అని తెలిపారు. మార్చిలో ఇండస్ట్రీ షట్‌డౌX గురించి మాట్లాడుతూ "మార్చి 1 నుంచి పరిశ్రమను షట్‌డౌX చేయబోతున్నాం. జీఎస్టీ అనేది కార్పొరేట్ కంపెనీలు నిర్మించే సినిమాలకు సరిపోతుందేమో కానీ, మాలాంటి ఇండివిడ్యువల్ నిర్మాతలకు సరికాదు. అలాగే క్యూబ్, యుఎఫ్‌ఓల వల్ల చాలా నష్టం కలుగుతోంది. మరీ ముఖ్యంగా చిన్న సినిమాలు చితికిపోతున్నాయి. సినిమాలను ఆపితే ముందు నష్టపోయేది వర్కర్లు, థియేటర్లవాళ్లే. అందుకే ఇన్నాళ్లూ సంయమనం పాటించాం. మాలోనే దొంగలున్నారు. ఆ వ్యాపారాలు చేస్తున్నారు. ఎవరి వ్యాపారం వాళ్లది. దాన్ని ఎవరూ ఏమీ అనలేదు. కాకపోతే అంతా న్యాయంగా ఉండాలని పోరాడబోతున్నాం" అని అన్నారు. నైజామ్ మార్కెట్ గురించి మాట్లాడుతూ "ప్రస్తుతం నైజామ్‌లో ముగ్గురు డిస్ట్రిబ్యూటర్లు తయారయ్యారు. సినిమాలు కొంటేవాళ్లే కొనాలి. లేకపోతే ఇంకెవరినీ కొననివ్వడం లేదు. మరి కొద్దిరోజుల్లోనే దాని తీవ్రత తెలుస్తుంది. ఇదిలాగే కొనసాగితే నిర్మాతలు సినిమాలు చేయలేరు. అప్పుడు ప్రాథమికంగా హీరోలు సినిమాలు తీసుకోవాల్సి ఉంటుంది. సినిమా నిర్మాణంలో ఉన్న కష్టాలు వారికీ మెల్లమెల్లగా అర్థమవుతాయి. ఆ తరువాత మాత్రం గడ్డు పరిస్థితి ఉంటుంది" అని ఆయన చెప్పారు.

అడ్డా హైదరాబాదే!



దేనికి? రజనీకాంతX '2.0' టీజర్ విడుదలకు! శంకర్ దర్శకత్వంలో లైకా ప్రొడక్షX్స సంస్థ నిర్మించిన ఈ సైX్స ఫిక్షX థ్రిల్లర్ టీజర్ ఇప్పటికే విడుదల కావాల్సింది. అయితే... సినిమా విడుదల వాయిదా పడడంతో టీజర్ విడుదల కూడా వెనక్కి వెళ్లింది. ఈలోపు మలేషియాలో జరగనున్న కోలీవుడ్ స్టార్ నైట్‌లో టీజర్ విడుదల చేస్తారనే వార్తలొచ్చాయి. వీటిని ఖండించిన చిత్రనిర్మాణ సన్నిహిత వర్గాలు "హైదరాబాద్‌లోనే ఫిబ్రవరిలో '2.0' టీజర్ విడుదల చేస్తారు. ఈ నెలాఖరున ఎప్పుడనేది (తేదీ) చెబుతారు" అని తెలిపాయి. ఏప్రిల్ 14న ప్రేక్షకుల ముందుకొస్తున్న 2.0 సుమారు 37 ఏళ్ల తర్వాత సౌదీలో విడుదల కానున్న సినిమాగా రికార్డు సృష్టించడానికి సిద్ధమవుతోంది. 1980లో సౌదీ ప్రభుత్వం థియేటర్లను మూసేస్తూ నిర్ణయం తీసుకుంది. సౌదీలో చిత్రాన్ని విడుదల చేసేందుకు వీలుగా '2.0' చిత్ర బృందం అక్కడి ప్రభుత్వంతో చర్చలు జరుపుతోందట! హిందీ నటుడు అక్షయ్‌కుమార్ యాంటీ హీరోగా, అమీ జాక్సX హీరోయిX గా నటించిన ఈ చిత్రానికి ఏఆర్ రెహమాX స్వరకర్త.

'ఎఫ్2'లో... మెహరీనోచ్



మెహరీన్

'ఎఫ్2' అంటే.. ఫX అండ్ ఫ్రస్టేషX ! వెంకటేX , వరుణ్‌తేజ్ హీరోలుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'దిల్' రాజు నిర్మించనున్న సినిమా పేరు. ఇందులో సింగిల్ ఎఫ్‌గా మెహరీX ని ఎంపిక చేశారని టాక్. ఈసారి 'ఎఫ్' అంటే ఫీమేల్ లీడ్(హీరోయిX). 'ఎఫ్2'లో ఇద్దరు హీరోయిన్లకు చోటుంది. ఒకరు వెంకీకి జోడీగా, మరొకరు వరుణ్‌కి జోడీగా! వెంకీ సరసన నటించే హీరోయిX కోసం చిత్ర బృందం అన్వేషిస్తోంది. వరుణ్‌కి జంటగా మెహరీX నటించనున్నారు. ఏప్రిల్‌లో ఈ సినిమా చిత్రీకరణ మొదలుకానుందని చిత్రనిర్మాణ సంస్థ సన్నిహిత వర్గాల సమాచారం.

ఆ నాలుగూ మా సినిమాకు స్తంభాలు

- లగడపాటి



"దేశభక్తి, ప్రేమ, కుటుంబం, సమాజం అనేవి మా 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'కి మూల స్తంభాలు. మా సినిమా 'ఫస్ట్ ఇంపాక్ట్' మోస్ట్ వ్యూవ్డ్ వీడియోల్లో మూడో స్థానంలో ఉన్నందుకు ఆనందంగా ఉంది. 29 గంటల్లో కోటి మందికి పైగా చూశారు. ప్రేక్షకుల అంచనాలకు రెట్టింపుగా ఉండేలా సినిమాను తీర్చిదిద్దుతున్నాం" అని లగడపాటి శ్రీధర్ అన్నారు. అల్లు అర్జుX హీరోగా వక్కంతం వంశీ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'. లగడపాటి శిరీషా శ్రీధర్, బన్నీ వాసు, కె.నాగబాబు నిర్మాతలు. అను ఇమ్మాన్యుయేల్ నాయిక. గురువారం హైదరాబాద్‌లో లగడపాటి శ్రీధర్ మాట్లాడుతూ "బన్నీ ఫాలోయర్స్ గురించి చాలా విన్నాను. ఇప్పుడు తొలిసారి చూసి ఆశ్చర్యపోయాను. మా చిత్రంలో కథ కొత్తగా ఉంటుంది. పాత్ర కోసం బన్నీ తనను తాను చాలా మౌల్డ్ చేసుకున్నారు. అమీర్‌ఖాX తర్వాత ఆ స్థాయి హీరో బన్నీ అని నమ్ముతాను. ఆయన పాX ఇండియా స్టార్. తెలుగు సినిమా స్థాయిని 'బాహుబలి' ఒక స్థాయికి తీసుకెళ్లింది. అదే స్థాయికి మా సినిమా చేరుతుంది. ఇంటర్వెల్‌కే సినిమా హిట్ టాక్ తెచ్చుకోవాలనే కోరిక నాకు చాలా ఉండేది. ఈ సినిమా ఫస్ట్ ఇంపాక్ట్‌కే గొప్ప పేరు తెచ్చుకోవడం ఆనందంగా ఉంది. మంచి టాప్ మోస్ట్ టెక్నీషియన్లు పనిచేస్తున్నారు. మన ఫైట్ మాస్టర్లతో పాటు బ్యాంకాక్ మాస్టర్ కిచా కూడా పనిచేశారు. వేసవి కానుకగా ఏప్రిల్ 27న చిత్రాన్ని విడుదల చేస్తాం. అన్నీ భాషల్లో డబ్బింగ్ చేద్దామని అనుకున్నాం. కానీ అల్లు అర్జుX భవిష్యతX ప్రణాళికలను దృష్టిలో ఉంచుకుని కాస్త ఆగాం. ప్రస్తుతం 70 శాతం షూటింగ్ పూర్తయింది. ఇంకో 40 రోజులు షూటింగ్ చేస్తే మొత్తం పూర్తవుతుంది" అని తెలిపారు.

కలెక్టర్‌గారి 'కర్తవ్యం'

నయనతార కలెక్టర్‌గా నటించిన తమిళ చిత్రం 'ఆరX '. తెలుగులో 'కర్తవ్యం' టైటిల్‌తో ఆర్.రవీందర్, శరతX మరార్ విడుదల చేస్తున్నారు. గోపీ నైనర్ దర్శకుడు. ఇటీవల సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని క్లీX 'యు' సర్టిఫికెట్ పొందింది. నిర్మాతలు మాట్లాడుతూ "పొలిటికల్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రంలో నయనతార కలెక్టర్‌గా కనిపిస్తారు. తమిళంలో చక్కని విజయాన్ని అందుకోవడమే కాకుండా నయనతార క్రేజ్‌ను రెట్టింపు చేసింది. శరతX మరార్‌తో కలిసి తెలుగులో ఈ చిత్రాన్ని విడుదల చెయ్యడం ఆనందంగా ఉంది. జిబ్రాX సంగీతం ఆకట్టుకుంటుంది. త్వరలో సినిమాను విడుదల చేస్తాం" అని అన్నారు.



నయనతార